


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 261

గురువారం 12-12-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'పోస్ట్' మార్టమ్


● రామ్‌ప్రసన్న

శవాలగదిలో ఉద్యోగమా?

మనుషులు వెళ్లడానికి ఇష్టపడని ప్రదేశాలలో శ్మశానం ఒకటి అని చెబుతుంటారు. అయితే అసహజ మరణాలకు సంబంధించిన శవాలు శ్మశానానికన్నా ముందు చేరుకునే ప్రదేశం మార్చురీ. అక్కడ కొద్దిసేపు గడపాలంటేనే ఇబ్బంది పడేవాళ్లు, భయపడేవాళ్లు ఉంటారు. అలాంటిది పోస్ట్‌మార్టం గదిలో రోజూ ఉద్యోగం చేయడం అంటే ఎంతో ధైర్యం కావాలి. ఆ గుండె ధైర్యం రామ్‌ప్రసన్నలో ఉంది. తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామ్‌ప్రసన్న... 'ఆడవాళ్లు ఈ ఉద్యోగం చేయడం ఏమిటి!!' అనే లింగవివక్షతతో కూడిన మాటలు... 'చేయడానికి నీకు ఈ ఉద్యోగమే దొరికిందా!'లాంటి వెక్కిరింపులు ఎదుర్కొన్నా... ఒక్క అడుగు కూడా వెనక్కి తగ్గలేదు. వృత్తిజీవితంపై గౌరవాన్ని తగ్గించుకోలేదు...

ఇచ్చోటనే...

నిండా పాతికేళ్లు కూడా నిండని యువకుడి శవం. 'బహుశా అమ్మ నా కోసం ఎదురు చూస్తూ ఉండి ఉండొచ్చు' అని ఆలోచిస్తున్నట్లుగా కనిపిస్తుంది. భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న యువతి... తన పిల్లల్ని తలుచుకొని కళ్ల నీళ్ల పర్యంతం అవుతున్నట్లు అనిపిస్తుంది. 'ఇద్దరు ఆడపిల్లల పెళ్లి చేయాలి. వారి పెళ్లి చూడకుండానే వరద నన్ను మింగేసింది'... మధ్యతరగతి తండ్రి శవం అదేపనిగా రోదిస్తున్నట్లుగా ఉంటుంది. శవాలు మౌనంగా చెప్పే కథలు ఎన్నో విన్నది రామ్‌ప్రసన్న. అలా అని శ్మశాన వైరాగ్యంలాంటిది తెచ్చుకోలేదు. వృత్తిని వృత్తిలాగే ధైర్యంగా నిర్వహిస్తోంది.

'నాకు ఉద్యోగం వచ్చింది అనగానే సంతోషించిన వాళ్లు శవాల గదిలో అని చెప్పగానే నోరు తెరిచారు. ఆడపిల్లవు...అక్కడెలా చేస్తావంటూ అడిగేవాళ్లు. ఎక్కువ రోజులు ఉండలేవు. వచ్చేస్తావు అన్నవాళ్లూ ఉన్నారు. అందుకే ఆడవాళ్లు ఎవరూ రాని ఈ వృత్తిలో కొనసాగుతున్నా' అంటుంది తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం అసిస్టెంట్ (శవపరీక్ష సహాయకురాలు)గా విధులు నిర్వర్తిస్తున్న రామ్ ప్రసన్న.

ఆసుపత్రి వెనుక వైపు కాస్తంత దూరంగా ఉండే మార్చురీలోకి నిత్యం వచ్చే శవాలతోనే తన వృత్తిజీవితం ముడిపడివుంది. ఆత్మహత్యకు పాల్పడినవాళ్లు, రోడ్డు ప్రమాదాల మృతులు, నీళ్లలో కొట్టుకు వచ్చిన మృతదేహాలు... నిత్యం ఆసుపత్రికి వస్తూనే వుంటాయి. అన్నింటికీ శవపరీక్ష నివేదిక కీలకమని తెలిసిందే. సంబంధిత వైద్యుడు శవపరీక్ష చేస్తే అందుకు తగినట్టుగా మృతదేహాన్ని సిద్ధం చేయటం, వైద్యుడికి సహాయపడటం సహాయకురాలిగా రామ్‌ప్రసన్న ఉద్యోగం.

భర్త ప్రోత్సాహంతో...

ప్రమాదాల్లో రక్తమోడుతున్న మృతదేహాలూ, నీటిలో ఉబ్బిపోయినవీ, డీ కంపోజింగ్‌కు చేరువైనవి... చూడటమే కష్టం. నెలకు పదిహేను నుంచి ఇరవై వరకు వచ్చే ఇలాంటి మృతదేహాలను శవపరీక్షకు సిద్ధం చేయాలంటే ఎంత ధైర్యం కావాలి? సన్నగా, రివటలా ఉండే రామ్‌ప్రసన్న ఆ విధులను వస్త్రాలకు అతుకులు కుట్టినంత శ్రద్ధగా, అలవోకగా చేస్తోంది.

రామ్‌ప్రసన్న దూరవిద్యలో బీఏ చేసింది. కూలి పనులకు వెళుతుండే భర్తకు తోడుగా తాను కూడా ఏదో ఒక ఉద్యోగం చేయాలనుకుంది. డీసీహెచ్‌ఎస్ నుండి వెలువడిన నోటిఫికేషన్‌లో పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్ పోస్టు కనిపించటంతో దరఖాస్తు చేసింది. ఇంటర్వ్యూ కూడా పూర్తయ్యాక తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టింగ్ ఇచ్చారు. భర్త ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా ప్రోత్సహించాడు.

భయం అనిపించలేదు... ఆసక్తిగా అనిపించింది!

తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి చరిత్రలో పోస్టుమార్టమ్ సహాయకులుగా ఇప్పటివరకు పురుషులే ఉండేవారు. శవపరీక్షకు ముందు మద్యం సేవించటం తప్పనిసరి అన్నట్టుగా ప్రవర్తించే వారు కొందరు. ఇలాంటి వారు మృతుల బంధువుల నుంచి మద్యానికి డబ్బులు వసూలు చేసేవారు. అలాంటి ఉద్యోగంలో ఇప్పుడు ఒక ఆడపిల్లను చూడడం చాలామందికి వింతగా ఉంది. ఆ ఆశ్చర్యం సంగతి ఎలా ఉన్నా మృతదేహాల రక్తసంబంధీకులకు ఇప్పుడు మద్యం కోసం పీడన లేదు.

'ఈ ఉద్యోగంలోకి వచ్చాక తొలిసారి శవపరీక్షలో పాల్గొన్నాను. మరణానికి కారణాలు తెలుసుకోవటం ఆసక్తిగా అనిపించింది. భయం అనిపించలేదు. ఉద్యోగాన్ని అంకితభావంతో చేస్తున్నాను.' అంటుంది రామ్‌ప్రసన్న.

'మహిళలు ఇలాంటి ఉద్యోగాలు మాత్రమే చేయగలరు. ఇలాంటి ఉద్యోగాలు మాత్రమే చేయాలి' అనే అప్రకటిత తీర్పులకు, పురుషాధిపత్య ధోరణులకు రామ్‌ప్రసన్న వృత్తిజీవితం, అంకితభావం చెంపపెట్టులాంటిది.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

ఈ ఉద్యోగం నాకు గర్వకారణం

నేను చేస్తున్న ఉద్యోగంపై కొందరి సందేహాలు, భయాలు వింటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. నేను వేరే లోకంలో ఉద్యోగం చేయడం లేదు. గ్రహాంతర జీవులు, ప్రమాదకర వ్యక్తుల మధ్య ఉద్యోగం చేయడం లేదు. నిన్నటి వరకు వాళ్లు మనలాంటి మనుషులే. మన మధ్య ఉన్న వాళ్లే. ప్రాణదీపం ఆరిపోగానే వారిని పరాయి వాళ్లుగా చూసి భయపడడం తగదు. నేను భయపడుతూ ఉద్యోగం చేయడం లేదు. గర్వంగా చేస్తున్నాను. అంకితభావంతో చేస్తున్నాను.

– రామ్‌ప్రసన్న



● మన(సు)లో మాట

బెట్టింగ్ పిచ్చి తగ్గేదెలా?

మా ఆయనకు 35 సంవత్సరాలు. ఫార్మా కంపెనీలో మంచి ఉద్యోగం. కంపెనీలో మంచి పేరుంది. కానీ ఇటీవల ఆన్‌లైన్‌లో గుర్రపు పందేలపై బెట్టింగ్ చేసి చాలా డబ్బు నష్టపోయారు. ఇపుడు జీతం మొత్తం బెట్టింగ్‌కి పెడుతూ, అప్పులు కూడా చాలా చేశారు. నేను అడిగితే, ఏదో ఒక రోజు పెద్ద మొత్తంలో గెలిచి, బాకీలన్నీ తీర్చేస్తానని అంటారు. ఎప్పుడూ అబద్ధాలు చెప్పని ఆయన ఇప్పుడు తన అప్పులు, బెట్టింగ్ గురించి అబద్ధాలు చెబుతున్నారు. రోజురోజుకు మాకు ఆయన మాటల పైన నమ్మకం పోతోంది. ఆయనను ఎలాగైనా ఈ వ్యసనం నుండి బయటపడేసే మార్గం చెప్పగలరు!

– గీత, సికింద్రాబాద్

మీ ఆవేదన అర్థమయింది. మద్యానికి, మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లే కొందరు ఇలా 'బెట్టింగ్' లాంటి వ్యసనాలకు బానిసలవుతున్నారు. వీటిని 'బిహేవియరల్ అడిక్షన్స్' అంటారు. ఇటీవల చాలామంది ఆన్‌లైన్ జూదం, స్టాక్ మార్కెట్, క్రికెట్ బెట్టింగ్, హార్స్ రేస్ లాంటి వాటికి బానిసలవుతున్నారు. మీ ఆయనకు ఉన్న మానసిక రుగ్మతను 'గ్యాంబ్లింగ్ డిజార్డర్' అంటారు. మొదట్లో సరదాగా ప్రారంభమై, చివరకు ఇలా పూర్తిగా బానిసలవుతారు. ఏదో ఒకరోజు గెలుస్తామనే ధీమాతో అప్పులు చేసి మరీ బెట్టింగ్స్ చేస్తారు. వీరిని మోసగాళ్ళుగా, అబద్ధాల కోరుగా చూడకుండా, ఒక వ్యసనానికి బానిసలైన వారిగా మనం పరిగణించి, మంచి సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో 'డీఅడిక్షన్ సెంటర్'లో అడ్మిట్ చేయించి, తగిన చికిత్స చేయించాలి. కొన్ని మందులు, కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ అనే మానసిక చికిత్స ద్వారా మీ ఆయనకున్న ఈ బెట్టింగ్ వ్యసనాన్ని మాన్పించవచ్చు. ప్రస్తుతానికి మనీ మేటర్స్ మీ కంట్రోల్‌లోకి తీసుకోండి. ఆయనను ఏవగించుకోకుండా, సానుభూతితో చూడండి. సమస్య పరిష్కారమయేందుకు మీ తోడ్పాటు చాలా అవసరం. నమ్మకంతో ముందుకెళ్ళండి. ఆల్ ది బెస్ట్ !



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బ్యూటిప్స్

మృదువైన చేతులు... ముచ్చటేసే ముఖం కోసం...

స్పూన్ గ్లిజరిన్, స్పూన్ ఆలివ్ ఆయిల్, స్పూన్ నిమ్మరసం తీసుకుని వాటిని బాగా కలిపి చేతులకి రాసుకుంటే చేతులు మృదువుగా ఉంటాయి.

● రాత్రి పడుకోబోయే ముందు పెట్రోలియమ్ జెల్లీలో కొద్దిగా కార్బాలిక్ యాసిడ్ కలిపి ఆ మిశ్రమాన్ని చేతులకి మర్దనా చేస్తూ ఉంటే క్రమేపీ చేతులు తెల్లగా... మృదువుగా మారతాయి.



● కొబ్బరి నూనె, ఆలివ్ ఆయిల్, నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకుని పావుగంట తర్వాత కడిగేసుకోవాలి. తర్వాత శెనగపిండితో గానీ, నలుగుపిండితో గానీ ముఖం రుద్దుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తూ ఉంటే కొద్దిరోజుల్లోనే ముఖ చర్మం మృదువుగా అవుతుంది.

● రోజూ రాత్రి పడుకునే ముందు తేనె, నిమ్మరసం కలిపి రాస్తే చర్మంపై మచ్చలు తగ్గిపోతాయి.

ఇంటి టిప్స్

● కొద్దిగా పెర్‌ఫ్యూమ్ కలిపిన నీటితో స్టీమ్ ఐరన్ చేసినట్లైతే దుస్తులు సువాసనలు వెదజల్లుతాయి.



● బంగాళదుంపలను ఉడికించిన నీటిని ఉపయోగిస్తూ కిటికీ అద్దాలను తుడిస్తే చక్కగా శుభ్రపడతాయి.

● బేకింగ్ సోడాను కొద్దిగా నీళ్లు కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని వెండి పాత్రకు రాసి, మెత్తని కాటన్ క్లాత్‌తో తుడిస్తే, మురికి జిడ్డు సులువుగా వదులుతుంది.

● క్యాబేజీ ఉడికించేటప్పుడు వాసన రాకుండా ఉండాలంటే, అందులో చిన్న అల్లం ముక్క వేయాలి.



● వేపుళ్లు చేసేటప్పుడు టీ స్పూన్ వెనిగర్ కలిపితే కూరగాయలు నూనె ఎక్కువ పీల్చుకోకుండా ఉంటాయి.



● జిగురు మరీ గట్టిగా ఉండి, సీసాలోంచి రాకుండా ఉంటే అందులో నాలుగైదు చుక్కల వెనిగర్ వేయాలి.

● న్యూస్‌మేకర్

కంటి ఉప్పెనను నవ్వుతో కప్పేసి...


● శ్రుతి

ధైర్యంగా ఉండాలి. ఆశ నిలపాలి. స్థైర్యాన్ని కూడగట్టుకోవాలి. జూలై 30న వాయనాడ్ వరదల్లో శ్రుతి చూసిన నష్టాలు అన్నీ ఇన్నీ కావు. కుటుంబ సభ్యులను పోగొట్టుకుంది. పెళ్లి కోసం దాచిన డబ్బు, బంగారం నీటి పాలయ్యాయి. ఆఖరకు చేసుకోవాల్సిన కుర్రాడు కూడా యాక్సిడెంట్‌లో మరణించాడు. అయినప్పటికీ ఎందరో ఆమెకు తోడుగా నిలిచారు. శ్రుతి విధిని ఎదిరించి నిలబడింది. మొన్నటి సోమవారం ప్రభుత్వ ఉద్యోగిగా నియమితురాలై తన సీటులో కూచుని నవ్వింది.

సోమవారం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన ఫేస్‌బుక్ పేజీలో ఇలా రాశారు– 'వాయనాడ్ వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన శ్రుతికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చాం. ఇవాళ మా మాట నెరవేర్చాం' అని ఉంది అందులో.

వాయనాడ్ కలక్టరెట్‌లోని కంప్యూటర్ డిపార్ట్‌మెంట్‌లో క్లర్క్‌గా బాధ్యతలు తీసుకుని చిరునవ్వుతో చూస్తున్న శ్రుతి ఫొటోను విజయన్ తన వ్యాఖ్యకు జత చేయడం వల్ల నెటిజన్స్ అందరూ ఆ ఫొటోలోని శ్రుతిని చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'ఈ సమయంలో మా అమ్మా నాన్నలేరు. నాకు కావలసిన భర్త కూడా లేరు. అందుకు నాకు బాధగా ఉంది. కాని జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు ధైర్యంగా ముందుకు సాగాలని తెలుసుకుని ఆ విధంగా కొనసాగినందుకు సంతోషంగా ఉన్నాను' అందామె.

24 ఏళ్ల శ్రుతి కచ్చితంగా ఒక కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. ఆమె కోసం కేరళ అంతా తోడుగా నిలిచింది. ఇకపై నిలిచే ఉంటుంది. ఒక ధైర్యం సాటి మనిషి కల్పిస్తే బాధలో ఉన్న వ్యక్తి కోలుకుంటారనడానికి ఈ సంఘటన పెద్ద ఉదాహరణ. అలాగే దు:ఖంలో ఉన్న వ్యక్తి ధైర్యం సడలనివ్వకుండా ఉంటే సమాజం తోడు నిలిచి ఆ వ్యక్తిని నిలబెట్టుకుంటుందనడానికి కూడా ఈ ఘటనే ఉదాహరణ.

వాయనాడ్‌లో ఆమె

వాయనాడ్‌లోని ఒక ప్రయివేటు సంస్థలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న శ్రుతి తనకు బాల్య స్నేహితుడైన జాన్సన్‌ను వివాహం చేసుకోవాలనుకుంది. వారివి వేరు వేరు మతాలైనా ఇరు కుటుంబాలూ అంగీకరించాయి. సెప్టెంబర్, 2024లో పెళ్లి అనుకుంటే జూన్ 1 వాళ్లు వాయనాడ్ సమీపంలోని సొంత ఇంటికి మారారు. జూన్ 2న శ్రుతికి, జాన్సన్‌కు నిశ్చితార్థం అయ్యింది. అంతా సంతోషంగా ఉంది అనుకుంటూ ఉండగా జూన్ 30న వరదలు చుట్టుముట్టాయి. కొండచరియలు విరిగి పడ్డాయి. ఆ సమయానికి శ్రుతి వాయనాడ్‌లో ఉండటం వల్ల ఆమె తప్ప కుటుంబంలోని 15 మంది మృత్యువు పాలయ్యారు. అదొక్కటే కాదు పెళ్లి కోసం తల్లిదండ్రులు దాచి పెట్టిన బంగారం, 4 లక్షల నగదు మొత్తం వరద పాలయ్యాయి. ఇల్లు కూలిపోయింది. ఈ విషాదంలో శ్రుతి స్తంభించిపోయింది. అయితే జాన్సన్ ఆ సమయంలో ఆమెకు కొండంత అండగా ఉన్నాడు. ధైర్యం చెప్పాడు. 'నీ దగ్గర రూపాయి లేకపోయినా నేను వివాహం చేసుకుంటా... నిన్ను సంతోషంగా ఉంచుతా' అని మాట ఇచ్చాడు. అందరూ పోయినా జాన్సన్ ఉన్నందుకు ఆమె కార్చే కన్నీటిలో ఒక చిన్న ఆశాకిరణాన్ని నిలబెట్టుకుంది.

కోల్పోయిన ఆ తోడు

అయితే విధి మరోసారి శ్రుతి మీద పగబట్టింది. సెప్టెంబర్ మొదటి వారంలో తన బంధువుల సమాధులను (వాయనాడ్ వరద మృతులు) చూసి వద్దామని వ్యాన్‌లో జాన్సన్ బయలుదేరి తోడుగా శ్రుతిని, బంధువులను తీసుకెళ్లాడు. ఆ సమయంలోనే ఆ వ్యాన్‌కు యాక్సిడెంట్ అయ్యింది. డ్రైవ్ చేస్తున్న జాన్సన్ దుర్మరణం పాలయ్యాడు.

కదలిన కేరళ

ఈ ఉదంతం తెలిసిన వెంటనే కేరళ మొత్తం కదిలింది. అందరూ శ్రుతి ఫొటోను తమ ఫోన్ల డీపీలుగా పెట్టుకుని 'నీకు మేమున్నాం' అని భరోసా ఇచ్చారు. వందలాది వేలాది మెసేజీలు వెల్లువెత్తాయి. ప్రభుత్వంలోని మంత్రులు, ఎంఎల్‌ఏలు వచ్చి పలుకరించి ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగాన్ని హామీ ఇచ్చారు. ఇవన్నీ శ్రుతిని నిలబెట్టాయి. ఇప్పుడు తను ప్రభుత్వ ఉద్యోగిని అయ్యింది. మర్చిపోయిన నవ్వును పెదవుల మీదకు తెచ్చుకుంది.

కాలం దయతో చూడాలి అందరినీ. అది ఇక్కట్ల పాలు చేసినా వెలుతురు తీసుకువస్తుంది.

● వెయిట్ లాస్ జర్నీ స్టోరీ

ఇంటి ఫుడ్‌తో 'బ్యూటీ'ఫుల్‌గా..!

స్లిమ్‌గా, అందంగా ఉండాలని అన్ని వయసుల వారు కోరుకుంటారు. అందుకు డైటింగ్ నుంచి జిమ్‌లో కసరత్తులు చేయడం వరకు రకరకాల పాట్లు పడుతుంటారు. ముఖ్యంగా తల్లి అయిన స్త్రీలు ఎదుర్కొనే ఈ సమస్యను చాందినీ సాధించి చూపింది. 39 ఏళ్ల వయసులో ఏకంగా 40 కిలోల బరువు తగ్గి అందాల కిరీటమూ సొంతం చేసుకుంది. ఎవరీ చాందినీ.. ఏమా కథ అనేవారికి బరువు తగ్గించే ఉపాయాలను మూటగట్టి మరీ మనముందుంచుతోంది.





● చాందినీ

అధిక బరువు తగ్గడం కంటే ఈ క్రమంలో చేసే ప్రయాణం ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. ఆరోగ్య సమస్యలను జయించేలా చేస్తుంది, ప్రసవానంతర ఇబ్బందులను దూరం చేస్తుంది. ఇందుకోసం చేసిన కృషి పట్టుదలను, అంతులేని స్ఫూర్తిని కలిగిస్తుంది. అమెరికాలో ఉంటున్న చాందినీ సింగ్‌కు 39 ఏళ్లు. పిల్లల పాదరక్షల కంపెనీకి కో ఫౌండర్. అంతే కాదు భార్య, తల్లి అయిన చాందినీ ఇటీవలే మిసెస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ యుఎస్‌ఏ– 2024 అందాల పోటీని గెలుచుకుంది. 5 అడుగుల 8 అంగుళాల పొడవుండే చాందినీ 118 కిలోల బరువుండేది. గర్భవతిగా ఉన్నప్పుడు పెరిగిన బరువు ప్రసవానంతరమూ అలాగే ఉండిపోయింది. డబుల్ ఎక్సెల్ నుంచి ట్రిపుల్ ఎక్సెల్ దుస్తులు ధరించడం వరకు శరీరం పరిమాణం పెరిగింది. ఇంట్లో వండిన ఆహారం, రోజూ చేసే వాకింగ్ అందాల కిరీటం దక్కేలా చేశాయని చాందినీ చెప్పిన విషయాలు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాయి.

భయాన్ని జయిస్తూ...

''విపరీతమైన బరువుతో ఆరోగ్య సమస్యలు వచ్చాయి. దీంతో తీవ్రమైన ఆరోగ్య భయాన్ని ఎదుర్కొన్నాను. గర్భవతిగా ఉన్నప్పుడు ఆరు నెలల పాటు వైద్యుల సలహా మేరకు బెడ్‌రెస్ట్‌లో ఉండక తప్పలేదు. దీంతో విపరీతంగా బరువు పెరిగిపోయాను. ఫలితంగా అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్‌తో పాటు ప్రీ–డయాబెటిక్ నిర్ధారణ అయ్యింది. దీంతో నియంత్రణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రహించాను. ఈ వ్యాధి నిర్ధారణ నా ఆరోగ్యంపై దృష్టి పెట్టేలా చేసింది.

బరువుతో పాటు అందానికీ ప్రాధాన్యత

బరువు తగ్గడమే కాదు, అందంగానూ కనిపించాలి. దీంతో నా దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి సారించడం మొదలపెట్టాను. ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నియంత్రణలో ఉంచేందుకు తోడ్పడింది. ఆరోగ్యంగా ఉండటం నా కుటుంబంపై కూడా మంచి ప్రభావం చూపింది. ముఖ్యంగా నా కూతురిని ఆరోగ్యంగా పెంచాలనుకున్నాను. అందుకు నన్ను నేను సెట్ చేసుకోవాలనుకున్నాను. నా కూతురిని జాగ్రత్తగా చూసుకుంటూ, నా ప్రాముఖ్యతను ఆమెకు చూపించాలని కోరుకున్నాను. నా ఆరోగ్యంలో ప్రతి చిన్న మెరుగుదల ఫిట్‌గా, చురుకుగా ఉండాలనే నా అభిరుచిని పెంచింది. పోషకాహారంపై విస్తృతమైన పరిశోధన చేశాక, నా జీవనశైలి, ఆహారపు అలవాట్లలో స్థిరమైన, దీర్ఘకాలిక మార్పులు చేయడంపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాను.

ఫలితంపై కన్నా ప్రక్రియపైనే దృష్టి

పొత్తికడుపు కొవ్వును తగ్గించడానికి వ్యాయామాన్ని దినచర్యగా చేసుకున్నాను. ఇందుకు తక్కువ–తీవ్రత, అధిక–తీవ్రత గల వ్యాయామాల మిశ్రమాన్ని పాటించాను. వ్యాయామానికి వారంలో 3–4 సార్లు కేటాయించాను. కార్డియో కోసం వాకింగ్, జాగింగ్‌ని కలిపి వెయిట్ ట్రైనింగ్ తీసుకున్నాను. సెలవులు, గాయం, అనారోగ్యం కారణాలతో ఒక వారం, రెండు వారాల పాటు వర్కవుట్‌లకు దూరమైన సందర్భాలు ఉన్నాయి. కానీ అది నా కృషిపై ప్రభావం చూపకుండా చూసుకున్నాను. వీలైనంత త్వరగా తిరిగి ట్రాక్‌లోకి వచ్చాను. ఫలితాల కంటే ప్రక్రియపై ఎక్కువ దృష్టి పెట్టాను, ఇది నాకు స్ఫూర్తిగా మారింది. స్థిరంగా ఉండటానికి సహాయపడింది. మొదటి రెండు నెలలు బరువు తగ్గక పోయినప్పటికీ, నా పనిని ఎప్పుడూ వదులుకోలేదు. వెయిటింగ్ స్కేల్‌లోని నంబర్‌లు నన్ను డిమోటివేట్ చేయడానికి ఒప్పుకోలేదు. ఫలితం మీద కాకుండా రెగ్యులర్‌గా చేసే నా పనిపైనే దృష్టిపెట్టాను.

సవాళ్లను ఎంచుకున్నాను

బరువు తగ్గిన తర్వాత శారీరకంగా, బలంగా, మరింత శక్తిమంతంగా బలోపేతమైనట్లు భావించాను. రక్తపోటు, కొలెస్ట్రాల్, డయాబెటిస్ స్థాయిలు బ్యాలెన్స్‌లో ఉన్నాయి. మిసెస్ గ్రాండ్ ఇండియా యుఎస్‌ఏ–2024 గురించి తెలిసి, అప్లై చేసుకున్నాను. ఈ అందాల పోటీలో పాల్గొనడం, గెలవడం వంటి కొత్త సవాళ్లను స్వీకరించేలా నన్ను నేను మార్చుకున్నాను. బరువు తగ్గడం నా జీవితంలోని ప్రతి అంశాన్ని – నా ఆరోగ్యం, విశ్వాసం, మనస్తత్వాన్ని మార్చింది.

బరువు తగ్గడంలో చేసే ప్రక్రియలు, ఫలితాలు వ్యక్తికీ వ్యక్తికీ మారుతుంటాయి. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ముందు తమ శరీరాన్ని అర్థం చేసుకోవాలి. దానికి అనుగుణంగా కృషి మొదలుపెట్టాలి. ఫలితం రాలేదని ఎక్కడా వెనకడుగు వేయద్దు. ప్రయత్నాన్ని వదలద్దు' అని చాందినీ సింగ్ టైటిల్ గెలుచుకున్న సందర్భంగా తన వెయిట్‌లాస్ జర్నీ విశేషాలు పంచుకున్నారు.

ఇంటి భోజనమే ఔషధం

క్రాష్ డైట్‌లను అనుసరించడం ద్వారా వేగంగా బరువు తగ్గగలనని తెలుసు. కానీ, దానిని ఎంచుకోలేదు. ఎందుకంటే ఈ డైట్ ద్వారా ఎంత వేగంగా బరువు తగ్గుతున్నానో, అంత త్వరగా తిరిగి బరువు పెరుగుతున్నాను. ఆ అనుభవం నాకు పెద్ద పాఠం. అందుకే క్రాష్ డైటింగ్‌కు బదులుగా ఆరోగ్యకరమైన, ఇంట్లో వండిన ఆహారానికి ప్రాధాన్యత ఇచ్చాను. అన్నం, రోటీ, పనీర్, చికెన్ కర్రీ వంటి నాకు ఇష్టమైన భారతీయ వంటకాలన్నీ తినడం కొనసాగించాను. ఆహార నియంత్రణ పాటించాను. నా భోజనంలో ఎక్కువ ప్రోటీన్, ఫైబర్‌ని చేర్చడం ద్వారా క్యాలరీ లోటును కొనసాగించాను. రెస్టారెంట్లలో ప్రత్యేక సందర్భాలలో తినడానికి మాత్రమే పరిమితం చేశాను. వీలైనంత వరకు జంక్, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని కట్ చేశాను. దీని వల్ల ఆహార ఎంపికల గురించి. బ్యాలెన్స్ చేసుకోవడం.. బాగా అబ్బింది.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 261

గురువారం 12-12-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




లైఫ్‌కి బీమా తప్పనిసరి

బీమాపై మైండ్‌సెట్ మారాలన్న శ్రీరామ్ లైఫ్ ఎండీ, సీఈఓ కాస్పరస్ - 13లో



స్వల్ప లాభాలతోనే సరి

సెన్సెక్స్ 16 పాయింట్లు పైకి.. నిఫ్టీ 32 పాయింట్లు అప్ - 13లో



పార్లమెంట్‌లో రచ్చ

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగే పరిస్థితి కనిపించడం లేదు. ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది.

వివరాలు 6లో ▸



ఆగని ఇజ్రాయెల్ దాడులు

గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ ప్రతీకారదాడుల పరంపర కొనసాగుతోంది. బుధవారం నాటి దాడుల్లో 29 మంది మృతిచెందారు.


వివరాలు 6లో ▸



అత్యంత ఉష్ణ ఏడాదిగా 2024

1991-2020తో పోలిస్తే ఈ ఏడాది జనవరి-నవంబర్ కాలంలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 0.72 డిగ్రీ సెల్సియస్ ఎక్కువ నమోదైంది.

వివరాలు 6లో ▸



అతిపెద్ద అధికార ప్రతినిధి ధన్‌ఖడ్

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రభుత్వానికి అతిపెద్ద అధికారి ప్రతినిధిగా ప్రవర్తిస్తున్నారని విపక్షాలు ధ్వజమెత్తాయి.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పోలీసులు అతిగా జోక్యం చేసుకోవద్దు



మోహన్‌బాబు కుటుంబ వివాదాల్లో ఎక్కువ జోక్యం వద్దని పోలీసులకు తెలంగాణ హైకోర్టు సూచించింది. సమస్యను పరిష్కరించుకునే అవకాశం వారికే ఇవ్వాలని.. ఆ తర్వాత చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. కాగా, మనోజ్, విష్ణులను రాచకొండ పోలీస్ కమిషనర్ విచారించారు.

వివరాలు 3లో ▸

బాలికపై సామూహిక లైంగిక దాడి



రాష్ట్రంలో మరో బాలికపై అఘాయిత్యం జరిగింది. బాపట్ల జిల్లా కొల్లూరు మండలానికి చెందిన 17 ఏళ్ల బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 3లో ▸

6 నెలల్లో తారుమారు

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు చంద్రబాబు తూట్లు

అన్ని వర్గాలను నమ్మించి అధికారంలోకి వచ్చాక నయవంచన

- మహిళలు, రైతులు, పిల్లలు, నిరుద్యోగులను నిలువునా ముంచిన బాబు
- ఏ ఒక్క హామీ అమలు చేయకుండా నెలకో డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలక్షేపం
- జగన్ ఇచ్చిన పథకాలన్నింటినీ నిలిపివేసి పేదలకు అన్యాయం
- రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం హామీని నెరవేర్చకుండా దగా
- ప్రతి మహిళకి ఏటా రూ.18,000 సాయం.. ఉచిత బస్సు ప్రయాణం ఊసేలేదు
- తల్లికి వందనం, యువతకు నిరుద్యోగ భృతిపై గప్‌చుప్
- లెక్కలేనన్ని హామీలిచ్చి ఒక్కటీ అమలు చేయకుండా దాటవేత వైఖరి
- వలంటీర్ల వేతనాలు పెంచకపోగా ఏకంగా వ్యవస్థను రద్దు చేసిన వైనం
- చంద్రబాబు ఆరు నెలల పాలనలో అన్నీ మోసాలే

11లో



మోసాల్లో 'సిక్సర్'

- స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఇస్తాం..!
  46 లక్షల మంది తల్లుల ఎదురు చూపులు!!
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున ఆర్థిక సహాయం..
  54 లక్షల మంది రైతన్నల పడిగాపులు!!
- 19 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలందరికీ ఏటా రూ.18 వేలు చొప్పున ఆర్థిక సహాయం!
  1.80 కోట్ల మంది అక్క చెల్లెమ్మల ఆరాటం!!
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
  దాని ఊసేలేదు
- ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు
  ఈ ఆర్థిక ఏడాది రెండు సిలిండర్లు ఎగనామం
- నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి..
  కోటిమంది ఎదురు చూపులు!



కృష్ణా జిల్లా పొట్లిపాడులో ప్రభుత్వం ధాన్యం కొనట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు శివకృష్ణ

రైతు కంట కన్నీరు

రేపు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద అన్నదాతల ఆందోళన

ఆరు నెలలుగా ఆదుకునే దిక్కు లేదు

పైసా పెట్టుబడి సాయం రాలేదు.. రబీ కరువు సాయం ఊసే పట్టదు

సున్నా వడ్డీ రాయితీ జాడ లేదు.. పంటల బీమా పరిహారం దక్కలేదు

మద్దతు ధర కల్పనలో సర్కారు విఫలం

75 కేజీల బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టం

దళారీల చేతిలో రైతులు గుల్ల.. అటకెక్కిన ఉచిత పంటల బీమా పథకం

మద్దతు ధరకు ధాన్యం కొనేవారు లేక ఆవేదన

గ్రామ స్థాయిలో తోడుగా నిలిచిన ఆర్బీకే వ్యవస్థ నిర్వీర్యం

గత ఆరు నెలల్లో 70 మంది రైతుల ఆత్మహత్యలు

రోడ్డెక్కిన అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోరుబాట

5లో



పోర్టులు ధారాదత్తం

- కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులూ ప్రైవేటుకే..
- ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పోర్టులు కూడా ప్రైవేటుకు..
- కొత్త పోర్టులతో పాటు పాత పోర్టుల్లో షిప్ బిల్డింగ్ పేరిట ప్రైవేటు వ్యక్తులనూ అనుమతిస్తాం
- అంటే.. 100 శాతం ప్రభుత్వ పోర్టు అయిన కాకినాడ యాంకరేజ్ పోర్టు కూడా ప్రైవేటుకు ఇచ్చే అవకాశం
- రాష్ట్ర ఏపీ మారిటైమ్ పాలసీ–2024 విడుదల

13లో


అధికారుల వల్లే అసంతృప్తి

ప్రజా సమస్యలను నాణ్యతగా పరిష్కరించడం లేదట!

జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నిందలు

- తన వైఫల్యాలను అధికారులపై నెడుతున్న వైనం
- విస్తుపోయిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు
- రెడ్‌బుక్ పాలన సాగిస్తూ వారు చెడ్డపేరు తెచ్చుకుంటే తామేం చేస్తామని ఆవేదన
- అక్రమ కేసులతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నది ఎవరు?
- ఇష్టానుసారం బదిలీలు, కక్షసాధింపులతో సుపరిపాలన ఎలా సాధ్యం?
- సూపర్ 6 సహా ఇతర హామీలు నెరవేర్చలేక వారు తప్పులు చేస్తూ.. తమపై నిందలేయడం దారుణమని ఆగ్రహం
- 69 శాతం నుంచి 35 శాతానికి సంతృప్తి స్థాయి పడిపోయిందట!
- రాష్ట్రంలో సమస్యలు పరిష్కారం కావట్లేదని ప్రధాని కూడా చెప్పారట!

11లో



- అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు చెప్పినట్లు పని చేయాలట!
- రాజకీయ పాలన అంటే ఇదేనని.. ఇలాగైతేనే ప్రజలు ఆనందిస్తారని సీఎం సమర్థింపు
- కలెక్టర్లు పోటీపడి పని చేయాలని, పని తీరును బేరీజు వేస్తున్నామని హెచ్చరిక
- మాఫియా రాజ్యంలో, స్కామ్‌ల పాలనలో ప్రజా సమస్యలకు చోటేదంటూ నివ్వెర పోయిన అధికారులు

ప్రజాగ్రహం వల్లే డైవర్షన్ పాలిటిక్స్

చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు



- చంద్రబాబు అబద్ధాలు మోసాలుగా మారాయి.. అవే ప్రజల్లో కోపంగా మారుతున్నాయి.. మా పథకాలెందుకు ఇవ్వట్లేదని ప్రజలు నిలదీస్తున్నారు
- ప్రజలకు సమాధానం చెప్పలేకే ప్రతి నెలా ఏదో ఒక అంశంపై గోబెల్స్ ప్రచారం
- అదే పనిగా ప్రతి నెలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు
- ఇందులో భాగంగానే తాజాగా కాకినాడ పోర్టు వద్ద హంగామా
- అధికారంలో ఉన్నది మీరా? మేమా?.. ఆర్థిక మంత్రి వియ్యంకుడు రైస్ ఎక్స్‌పోర్టర్.. ఆయన సరుకు ఎందుకు తనిఖీ చేయలేదు?
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాలన్నీ నిర్వీర్యం.. షాక్‌ల మీద షాక్‌లిస్తూ విద్యుత్ చార్జీల పెంపు.. ఇలాంటి సమయంలో ప్రజల తరఫున మనం నిలదీద్దాం

2లో

“ కాకినాడ పోర్టుకు వెళ్లి అక్కడ హంగామా చేయడం.. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 రాతలు చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. ప్రభుత్వంలో మనమున్నామా? వాళ్లున్నారా? అనిపిస్తుంది. ఈ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడిచాయి. అధికారులు, మంత్రులు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎమ్మార్వోలు, పోలీసులు అంతా వాళ్ల అధికారులే. చెక్ పోస్టులు వాళ్లవే. పోర్టులో కస్టమ్స్ అధికారులు, సీఐఎస్ఎఫ్ పోలీసులు వాళ్ల పొత్తులో ఉన్న కేంద్ర ప్రభుత్వ మనుషులే. ఇవన్నీ దాటుకుని ఏదైనా మెటీరియల్ పోర్టులోకి పోగలుగుతుందా? పవన్ కళ్యాణ్ వెళ్లి పరిశీలించిన షిప్ పక్కనే ఉన్న మరో షిప్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడు శ్రీనివాసరావుది. పట్టాభి రైస్ ఎక్స్‌పోర్ట్స్ పేరుతో అదే పోర్టు నుంచి శ్రీనివాసరావు ఎగుమతి చేస్తున్నారు. అక్కడికి మాత్రం పవన్ కళ్యాణ్ వెళ్లడు. ఆ షిప్‌ను పరిశీలించడు. ఎవరు ప్రభుత్వంలో ఉన్నారు? ఎవరు చేస్తున్నారని నాకు ఆశ్చర్యం అనిపించింది. - వైఎస్ జగన్

ఇదండీ సంగతి





ఇకపై మరింత మందిని కోల్పోనివ్వం

హెల్మెట్ ధరించక 4 నెలల్లో 667 మంది చనిపోవడం చిన్న విషయం కాదు

పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి

- ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలుంటాయనే భయం ప్రజల్లో కలిగించాలి
- చలాన్లు చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- విద్యుత్, నీటి సరఫరా ఆపడం వంటివి చేయాల్సిన అవసరముంది
- ట్రాఫిక్ పోలీసుల ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు?
- తదుపరి విచారణకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జనరల్ హాజరవ్వాలి
- నిబంధనల అమలుకు ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

3లో



టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

■ పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 17 నుంచి 31 వరకు జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాన పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఒకేషనల్ పరీక్షలు 9.30 నుంచి 11.15 గంటల వరకు జరుగుతాయి.

■ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుంచి 19 వరకు, రెండో సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగనున్నాయి.

- వివరాలు 13లో

అమరావతిలో అడ్డగోలు దోపిడీకి మళ్లీ స్కెచ్..!

2018–19 నుంచి పెద్దగా పెరగని నిర్మాణ సామగ్రి ధరలు

అయినా.. భవన నిర్మాణాల వ్యయం 55 శాతం పెంపు

- రోడ్లకు మరో 28 శాతం అధికం
- ఉద్దేశపూర్వకంగా రివర్స్ టెండర్ల రద్దుతో దోపిడీకి బరితెగింపు
- రూ.20,292 కోట్ల పనులకు అనుమతులు
- ఇందులో లెక్కచూపేవి ఎన్నో?.. ఇంతలా పెంపుదల దేశ చరిత్రలో ఎక్కడా చూడలేదంటున్న నిర్మాణరంగ నిపుణులు



సాక్షి, అమరావతి: దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెతను కూటమి నాయకులు తిరగరాస్తున్నారు. పదవిలో ఉండగానే డబ్బు దండుకోవాలన్న సూత్రంతో చెలరేగిపోతున్నారు. అందుకు అనుగుణంగానే అమరావతిని మళ్లీ బంగారు బాతులా మార్చుకున్నారు. ఇందులో భాగంగా.. సీఆర్డీఏ ప్రాంతంలో చేపట్టే నిర్మాణాల పనుల వ్యయాన్ని అడ్డగోలుగా పెంచి దోపిడీకి పెద్దస్కెచ్చే వేశారు. వ్యయాన్ని భారీగా పెంచడంతో పాటు టెండర్ల కాంట్రాక్టును కూడా

మిగతా 5వ పేజీలో ▸



2024లో నా దేశానికీ బాగాలేదు.. నా కుటుంబానికీ, నాకు కూడా బాగాలేదు.. ఎక్కువమంది ముక్తకంఠంతో చెప్పిన మాటలివి. 2025లో అన్ని రకాలుగా బాగుంటుందని అధిక శాతం ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇప్సోస్.. భారత్, అమెరికా, ఆస్ట్రేలియా సహా 33 దేశాల్లో నిర్వహించిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ 18 ఏళ్లకు పైబడిన, 74 ఏళ్ల లోపు ఉన్న వారిని ఇంటర్వ్యూ చేసింది. సగటున 65 శాతం ప్రజలు.. తమ దేశంలో 2024వ సంవత్సరం ఏమీ బాగాలేదని చెప్పారు.


	ప్రపంచ సగటు	భారత సగటు
2024వ సంవత్సరం నాకు, నాకు నా కుటుంబానికీ చెడ్డ సంవత్సరం	51%	61%
2024 కంటే 2025 బాగుంటుంది	71%	76%
ఈ ఏడాది కంటే వచ్చే ఏడాది ప్రపంచ ఆర్థిక పరిస్థితులు బాగుంటాయి	51%	73%
మా దేశంలో ప్రజల ఆదాయాల కంటే ధరలు వచ్చే ఏడాది పెరిగిపోతాయి	79%	61%
కృత్రిమ మేధ (ఏఐ) వల్ల 2025లో మా దేశంలో చాలా ఉద్యోగాలు పోతాయి	65%	65%
సోషల్ మీడియా తక్కువగా వాడతా	37%	54%

క్లుప్తంగా...

రిటర్నబుల్ ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

సాక్షి, అమరావతి/తాడికొండ: అమరావతి నిర్మాణం కోసం సీఆర్‌డీఏ పరిధిలోని భూ సమీకరణలో భూములను అప్పగించిన రైతులకు ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లకు గురువారం లాటరీ నిర్వహించనున్నట్లు కమిషనర్ కాటమనేని భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ కార్యాలయంలో అమరావతిలోని 14 గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. నవులూరు 1-2, కురగల్లు 1-2, నిడమర్రు 1-2, రాయపూడి 1-2, లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్ళూరు 1-2, వెలగపూడి, మందడం 1-2, అనంతవరం, ఐనవోలు తదితర గ్రామాల రైతులు ఈ-లాటరీకి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

16న పోలవరానికి సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనులను సీఎం చంద్రబాబు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ప్రధాన డ్యాం గ్యాప్-2లో డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం సిద్ధం చేస్తున్న ప్లాట్ ఫామ్‌ను పరిశీలించనున్నారు. అనంతరం జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి.. ప్రాజెక్టు నిర్మాణ షెడ్యూలును ప్రకటిస్తారని అధికారవర్గాలు వెల్లడించాయి. కాగా, గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా 48 గేట్లతో సహా స్పిల్ వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్, పైలట్ చానల్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే పూర్తిచేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలనూ పూర్తి చేసింది. అంతర్జాతీయ నిపుణుల కమిటీ సిఫార్సు ప్రకారం గ్యాప్-2లో దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు 6 మీటర్ల ఎగువన కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది. ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి రూ.2,348 కోట్లను కేంద్రం అడ్వాన్సుగా ఇచ్చిన నేపథ్యంలో.. గోదావరి వరదల్లోనూ ప్రధాన డ్యాం గ్యాప్-2లో కొత్త డయాఫ్రం వాల్‌ను వేగంగా పూర్తి చేయడానికి మార్గం సుగమమైందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. అత్యంత సంక్లిష్టమైన పనులు ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో కేంద్ర కేబినెట్ నిర్దేశించిన మేరకు 2026, మార్చి నాటికి ప్రాజెక్టును పూర్తి చేయవచ్చునని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

గూగుల్‌తో ఏపీ ఒప్పందం

- ఏఐతో ప్రభుత్వ సేవలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలుపంచుకునే విధంగా గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు సమక్షంలో గూగుల్ గ్లోబల్ నెట్‌వర్కింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాష్ కోలే, రాష్ట్ర పరిశ్రమలు శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. దీని ద్వారా రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)తో గూగుల్ సేవలను అనుసంధానం చేసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సాప్‌లో అనేక సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.





బుధవారం తాడేపల్లిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాగ్రహం వల్లే

డైవర్షన్ పాలిటిక్స్

చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

సాక్షి, అమరావతి: 'ప్రజలకు అబద్ధాలు చెబితే అది మోసం అవుతుంది. అది ప్రజల్లో కోపం కింద మారుతుంది. ఆ కోపమే చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఇప్పుడు విపరీతంగా కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలు ఏమైందని ప్రజలు నిలదీస్తుండటంతో సమాధానం చెప్పలేని టీడీపీ పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని దెప్పి పొడిచారు. 'జూన్‌లో రుషికొండ భవనాలు అని, జూలైలో శ్వేతపత్రాలు అని, మదనపల్లె ఫైల్స్ అని, ఆగస్టులో ముంబై నటి కాదంబరి జెత్వానీ అని, సెప్టెంబర్‌లో ప్రకాశం బ్యారేజీని బోట్లతో ఢీకొట్టి కూలగొట్టాలన్న కుట్ర చేశామని, అక్టోబర్‌లో నా కుటుంబాన్ని తెచ్చి, నవంబర్‌లో బడ్జెట్‌పై దృష్టి మరలించడానికి రూ.14 లక్షల కోట్లు అప్పు అని డైవర్షన్ చేశారు. ఇప్పుడు డిసెంబర్‌లో రేషన్ బియ్యం అక్రమ రవాణా అంటూ నానా హంగామా చేస్తూ, దుష్ప్రచారం చేస్తున్నారు' అని ఎత్తి చూపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమై.. భవిష్యత్ కార్యాచరణపై వారికి దిశా నిర్దేశం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ.. వారి పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. 'యుద్ధం గతంలోలా లేదు. మనం చంద్రబాబుతోనే యుద్ధం చేయడం లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, ఎల్లో మీడియాతోనూ పోరాటం చేస్తున్నాం. వీటికి తోడు చెడిపోయిన ఐ-టీడీపీతో యుద్ధం చేస్తున్నాం. వీరంతా నిత్యం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వీళ్లు ప్రజలకు చేసిన మంచి చెప్పుకోవడానికి ఏమీ లేదు. బురద జల్లడమే పనిగా పెట్టుకున్న వారితో మనం యుద్ధం చేస్తున్నాం. అబద్ధాలు చెప్పడం, వక్రీకరణ చేయడం, దుష్ప్రచారం చేయడాన్ని ఒక పనిగా పెట్టుకున్నారు. దీన్ని తిప్పి కొట్టాల్సిన అవసరం ఉంది' అని నేతలకు ఉద్బోధించారు. 'ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా ఎక్కౌంట్ ఉండాలి. అన్యాయం జరిగితే దాన్ని కచ్చితంగా ప్రశ్నించాలి. ఎక్కడ అన్యాయం జరిగినా ఫోటో తీసి ప్రశ్నించాలి. ఎందుకు అమ్మఒడి రావడం లేదు? మా విలేజ్ క్లినిక్ పరిస్థితి ఎందుకు ఇంత దారుణంగా ఉంది? ఇలా అన్ని సమస్యలపై ఫోటోలు తీసి అప్ లోడ్ చేయాలి. తద్వారా ప్రజలకు దగ్గర కావాలి' అంటూ నేతలకు దిశా నిర్దేశం చేశారు. 'ఎన్నికలు అయిపోయి ఆరు నెలలు దాటింది. ఈ పరిస్థితుల్లో పార్టీని మనం మళ్లీ సమాయత్తం చేసే దిశగా అడుగులు వేస్తూ ఇవాళ కలుస్తున్నాం. ఆరు నెలల్లో ఇంత వ్యతిరేకత ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం మీద లేదు. కేవలం చంద్రబాబునాయుడు పాలనలో మాత్రమే ఇలాంటి పరిస్థితి చూస్తున్నాం' అన్నారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

జనవరి నుంచి జిల్లాల పర్యటన

పార్టీని మనం మరింత బలోపేతం చేయాలి. దీన్ని వ్యవస్థీకృత విధానం (ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్)లోకి తీసుకురావాలి. ఇందులో భాగంగా పార్టీలో క్రియాశీల మార్పులు తీసుకు వచ్చాం. సంక్రాంతి తర్వాత ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో బుధ, గురువారాల్లో ఉంటాను. అవసరాన్ని బట్టి శుక్రవారం కూడా ఉండేలా ప్లాన్ చేస్తున్నాను. 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో ఈ కార్యక్రమంలో పాల్గొంటాను. నా కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు జిల్లా కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, మండల స్థాయి కమిటీలు పూర్తి చేయాలి. సంక్రాంతి లోపే అవన్నీ పూర్తి కావాలి. నా కార్యక్రమం మొదలైన తర్వాత మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు పూర్తి చేద్దాం.

అధికార పార్టీ వ్యవస్థీకృత నేరాలు

- 'వైఎస్సార్‌సీపీ కార్యకర్తల వ్యవస్థీకృత నేరాలు' అంటూ ఈనాడులో రాశారు. అసలు వ్యవస్థీకృత నేరాలు చేస్తున్నది వాళ్లు అయితే, మన మీద వేలెత్తి చూపిస్తున్నారు. ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయని చూస్తే.. బియ్యం ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ దశాబ్దాలుగా నెంబర్ వన్‌గా ఉంది. తెలంగాణా నుంచి కూడా బియ్యం మన దగ్గరకే వస్తాయి. అందులో పట్టాభి ఎక్స్ పోర్ట్స్ పేరుతో ఎగుమతి చేస్తున్న పయ్యావుల కేశవ్ వియ్యంకుడు శ్రీనివాసరావు ఆంధ్రాలో నెంబర్ వన్.
- మన ప్రభుత్వంలో తొలిసారిగా బియ్యం పంపిణీలో డీలర్ల వ్యవస్థను పక్కన పెట్టి.. ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేశాం. ఇందులో భాగంగా ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్) ఏర్పాటు చేసి ఇంటి వద్దకే సార్టెక్స్ చేసి వాళ్లు తినగలిగే బియ్యాన్ని ఇచ్చాం. వాళ్లు అమ్ముకునే పరిస్థితి లేకుండా దానికి ఫుల్ స్టాప్ పెట్టే కార్యక్రమం వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగింది. ఈ రోజు ప్రభుత్వం పథకం ప్రకారం ఇంటి వద్దకే బియ్యం ఆపేసింది. మనం సార్టెక్స్ చేసి స్వర్ణ వంటి మధ్యస్థ సన్న బియ్యం ఇస్తే.. ఇవాళ దాన్ని నిర్వీర్యం చేశారు. వీళ్లు ఇవన్నీ చేస్తుంటే.. వీళ్ల తప్పిదాలతో నాసిరకం బియ్యం సరఫరా కావడం వల్ల మళ్లీ ప్రజల దగ్గర నుంచి వివిధ రూపాల్లో ఎమ్మెల్యేల ద్వారా ఎగుమతి జరుగుతోంది.

ధాన్యం కొనుగోలు అస్తవ్యస్తం

- మన హయాంలో ఆర్బీకే ద్వారా ధాన్యం కొనుగోలు చేసి ప్రతి రైతుకు కనీస మద్దతు ధర వచ్చేటట్టు చేశాం. రైతు ఏ మిల్లుకు తాను పోవాలన్నది పూర్తిగా పక్కన బెట్టి.. రైతుకు మిల్లర్లకు సంబంధం లేకుండా చేశాం. ఆర్బీకే దగ్గరే ఎంత ధాన్యం అమ్మావు, ఎంత రేటు వస్తుందనే స్లిప్పులు ఇచ్చే కార్యక్రమం కూడా చేశాం.
- ఇవాళ రైతుల పంట చేతికొచ్చే సరికి ఈ-క్రాప్ లేదు. ఆర్బీకే వ్యవస్థ లేదు. కొనుగోలు చేసే వారు లేక.. రైతులు గత్యంతరం లేక మిల్లర్ల దగ్గరకు వెళితే వాళ్లు కనీస మద్దతు ధర చెల్లించకుండా, రూ.300 నుంచి రూ.400 వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాలుగా ధాన్యం సేకరణ వ్యవస్థను సర్వనాశనం చేశారు.

పప్పు బెల్లాల్లా బాబు అమ్మకం

- రామాయపట్నం పోర్టు దశాబ్దాల కల. దాన్ని కట్టింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమే. ఒకవైపు మనం కడుతున్న మెడికల్ కాలేజీలు, పోర్టులను చంద్రబాబు అమ్ముతానంటున్నాడు. మనం రాక ముందు నాలుగు ప్రాంతాల్లో ఆరు పోర్టులు ఉంటే మనం వచ్చిన తర్వాత నాలుగు పోర్టులు కట్టాం. ఇప్పుడు ఆ పోర్టులన్నీ శనక్కాయలకు, బెల్లాలకు అమ్ముతాడట!
- సంపద సృష్టించడమంటే పోర్టులు, మెడికల్ కాలేజీలు వంటివి నిర్మించడం. ఈ పోర్టుల నిర్మాణం పూర్తైతే ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయాలు పెరుగుతాయి. దీన్ని సంపద సృష్టి అంటారు. ఈ పోర్టు కట్టడానికి ఇవాళ రూ.4 వేల కోట్లు అవసరం అయితే పదేళ్ల తర్వాత రూ.10 వేల కోట్లు అవసరం అవుతుంది. ఈ పోర్టులన్నింటినీ చంద్రబాబు తన వాళ్లకు అమ్మే కార్యక్రమం పెట్టాడు.

చంద్రబాబు బాదుడే బాదుడు

- ఈ డైవర్షన్ పాలిటిక్స్ మధ్య ఈరోజు మనం పార్టీ బలోపేతం చేయడంతో పాటు, ప్రజల తరపున పోరాటం చేయడానికి సన్నద్ధం అయ్యాం. చంద్రబాబు చేస్తున్న పాలన చూసి ప్రజలకు తోడుగా ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వాళ్లకు మేమున్నామనే భరోసా ఇవ్వగలిగినప్పుడే ప్రజలకు మన మీద నమ్మకం కలుగుతుంది. అటువైపు ప్రజల్లో వ్యతిరేకత ప్రతి అడుగులోనూ కనిపిస్తుంది. వ్యవస్థలన్నీ పూర్తిగా నీరుగారి పోయాయి.
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలన్నీ నాశనమయ్యాయి. మరోవైపు బాదుడే బాదుడు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ లేవు. వ్యవస్థలన్నీ పూర్తిగా దిగజారి పోయాయి. కరెంటు బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. రూ.6 వేల కోట్ల బాదుడుతో మొదటి డోసు ఇది. నవంబరు, డిసెంబరు బిల్లులో ఏ ఇంటికి వెళ్లినా రూ.300 కనీసం తేడా కనిపిస్తోంది. రానున్న నెలలో మరో రూ.9 వేల కోట్ల భారం వేస్తున్నారు.
- ఊళ్లలో రోడ్డెక్కితే చాలు డబ్బు కట్టాల్సిందేనట. అది జాతీయ రహదారులపై చూశాం కానీ, గ్రామీణ రోడ్లు బాగు చేయడం కోసం వాటిపై టాక్స్ వేసే కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుడుతున్నాడు. ఆయన హయాంలో, మన హయాంలో తేడా చూస్తే.. మన హయాంలో రూ.43 వేల కోట్లు రోడ్లపై ఖర్చు చేస్తే, అంతకు ముందు చంద్రబాబు హయాంలో అది రూ.27 వేల కోట్లు మాత్రమే. అది కూడా ఇన్ని సంక్షేమ పథకాలు చేస్తూ మనమే ఎక్కువ ఖర్చు పెట్టాం. ఇవాళ చంద్రబాబు హయాంలో సంపద సృష్టి అంటే బాదుడే బాదుడు అని అర్థం.

పోరు బాట దిశగా అడుగులు

మీలో కూడా ఎవరైనా నాయకత్వ దిశగా ఎదగాలనుకుంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఎదగడానికి అవకాశం వస్తుంది. ప్రజలకు మనం దగ్గర కావాలి. ప్రజలకు దగ్గరవుతూ పోరాటంలో వాళ్లకు తోడుగా నిలబడగలిగితేనే మనకు సానుకూలంగా తయారవుతుంది. ప్రతి ఒక్కరూ అది గుర్తుపెట్టుకోండి. చంద్రబాబు మనల్ని త్వరగా రోడ్డు మీదకు వచ్చేలా చేశాడు. ప్రజల తరపున పోరాటంలో భాగంగా మనం మూడు కార్యక్రమాలు చేపట్టాం.

ఈ నెల 13న

అన్నదాతలకు అండగా సమస్యలపై కార్యక్రమం పెట్టాం. గతంలో మనం రైతు భరోసాగా రూ.13,500 ఇచ్చాం. ఇందులో ఆరు వేలు కేంద్రమే ఇస్తుందని టీడీపీ వాళ్లు అన్నారు. అంటే కేంద్రం ఇస్తున్నది కాకుండా ఏడాదికి మరో రూ.20 వేలు ప్రతి రైతుకూ ఇస్తామన్నట్టుగా భావన కల్పించారు. కానీ ఇప్పుడు ఏమీ ఇవ్వడం లేదు. దీనిపై నిలదీసే కార్యక్రమం జరగాలి. ధాన్యం కనీస మద్దతు ధర కోసం కూడా మనం డిమాండ్ చేస్తున్నాం. ఉచిత పంటల బీమాను కూడా ఎత్తివేశాడు. వీటన్నింటి మీద ప్రశ్నిస్తూ రైతుల తరపున కలెక్టర్లకు వినతి పత్రం ఇస్తాం.

ఈనెల 27న

కరెంటు చార్జీల మీద మరో కార్యక్రమం చేస్తున్నాం. కరెంటు ఛార్జీల విషయంలో కూడా చంద్రబాబు.. ఎన్నికల ప్రచారంలో నేనున్నా.. నేను తగ్గిస్తా.. అన్నాడు. తీరా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రూ.15,000 కోట్లు పెంచాడు. దీనిపై ఈనెల 27న కార్యక్రమం పెట్టాం.

జనవరి 3న

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మరో కార్యక్రమం చేస్తున్నాం. క్వార్టర్ అయిపోయిన వెంటనే నాలుగో నెలలో వెరిఫై చేసి ఐదో నెలలో పిల్లల తల్లులకు విద్యా దీవెన, వసతి దీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మనం ఇచ్చే వాళ్లం. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికి నాలుగు త్రైమాసికాల నుంచి విద్యా దీవెన అందలేదు. వసతి దీవెన డబ్బులు కూడా ఇవ్వలేదు. దీంతో పిల్లలు చదువులు మానేసి పొలం పనులు చేసుకుంటున్నారు. ఫీజులు కట్టకపోతే కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితులు. ఆ పిల్లల తరపున చంద్రబాబును ప్రశ్నిస్తూ జనవరి 3న పోరు సాగిస్తున్నాం. ఈ మూడు కార్యక్రమాలను విజయవంతం చేయడంలో మీ పాత్ర చాలా కీలకం. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించాలి.

వెలిగొండ ప్రాజెక్టును పక్కన పెట్టేశారు..

వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్లు పూర్తయ్యాయి. నల్లమల సాగర్ రిజర్వాయర్ కూడా పూర్తయింది. లక్ష ఎకరాలకు నీళ్లు అందించగలిగే ప్రధాన కాల్వల నిర్మాణం కూడా పూర్తయింది. కేవలం ఆర్ అండ్ ఆర్ పరిహారం మాత్రమే చెల్లించాలి. అది కూడా రూ.1,200 కోట్లు ఇస్తే నీళ్లు నింపవచ్చు. దాన్ని ఈ ఏడాది చేయాలనుకున్నాం. అలా పూర్తి చేసిన ప్రాజెక్టు ఈ రోజుకూ అలా ఉండిపోయింది. పూర్తైన ప్రాజెక్టుకు కూడా ఆర్ అండ్ ఆర్ డబ్బులు ఇవ్వకుండా పక్కన పెట్టారు. మార్కాపురం మెడికల్ కాలేజీ కూడా దాదాపు పూర్తి కావచ్చింది. దాన్ని అమ్మడానికి సిద్ధపడుతున్నారు. ఇలాంటి వాళ్లని చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది.

మేనిఫెస్టో అమలు చేసిన తొలి ప్రభుత్వం

2019-24 మధ్య మన పాలనలో రాష్ట్రంలో ఎప్పుడూ జరగని విధంగా, చూడని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. మన ప్రభుత్వం రానంత వరకు మేనిఫెస్టో ప్రాధాన్యత ఏమిటన్నది తెలియదు. ఎన్నికలైపోగానే మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేసిన పాలనను మన కంటే ముందు చూశాం. తొలిసారిగా ఆ చరిత్రను మార్చిన పాలన వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగింది. మొట్టమొదటిసారిగా మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ.. ఎన్నికలప్పుడు చెప్పిన ప్రతి మాటను తూచ తప్పకుండా బడ్జెట్‌తో పాటు సంక్షేమ క్యాలెండర్ కూడా ప్రకటించి.. ఏ నెలలో, ఏ పథకం అమలు చేయబోతున్నామో చెప్పాం. ఆ నెల వచ్చేసరికి బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసిన పాలన మన ప్రభుత్వ హయాంలోనే జరిగింది. మనం రానంత వరకు ప్రజలకు ప్రభుత్వ పథకాలు లంచాలు లేకుండా ఇవ్వడం సాధ్యమేనా? వివక్ష లేకుండా పథకాలు ఇవ్వడం సాధ్యమేనా? అన్న పరిస్థితి నుంచి ఔను, ఇవన్నీ సాధ్యమే.. కచ్చితంగా చేయగలం.. అని రాష్ట్రానికి, దేశానికే కాకుండా, ప్రపంచానికి కూడా చూపింది వైఎస్సార్‌సీపీ పాలన మాత్రమే.

విద్య, వైద్య రంగాల్లో గణనీయ ప్రగతి

- ఎప్పుడూ చూడని విధంగా స్కూళ్లు మారాయి. పేదవాడు పేదరికం నుంచి బయటకు వచ్చి సమాజంతో పోటీ పడేలా చదువులు కేవలం వైఎస్సార్‌సీపీ హయాంలోనే అందాయి. బడులలో ఎప్పుడూ చూడని మార్పులు తెచ్చాం. ప్రభుత్వ బడుల కన్నా ప్రైవేటు బడులు ముందుంటాయి అన్న పరిస్థితి నుంచి ప్రైవేటు బడులే ప్రభుత్వ బడులతో పోటీ పడే పరిస్థితిలోకి తెచ్చాం. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం, మూడో తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకు ప్రయాణం, నాడు-నేడుతో సమూల మార్పులు, ఆరో తరగతి నుంచి ప్రతి తరగతి డిజిటలైజ్ చేశాం. ఏటా పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చాం.
- వైద్య రంగంలో కూడా ఎప్పుడూ చూడని మార్పులు చేశాం. గ్రామంలోనే విలేజ్ క్లినిక్. ప్రతి 15 రోజులకొకసారి ప్రభుత్వ వైద్యుడు గ్రామానికే వచ్చి ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేశాం. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు విస్తరించాం. గతంలో ఆరోగ్యశ్రీలో 1000 ప్రొసీజర్లు ఉంటే వాటిని 3300కు పెంచాం. దేశమంతా ప్రభుత్వ రంగంలో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61 శాతం ఉంటే, మన వద్ద జీరో వేకెన్సీ పాలసీతో దాన్ని 4 శాతానికి లోపే తీసుకువచ్చాం. డబ్ల్యూహెచ్‌ఓ, జీఎంపీ ప్రమాణాలతో మందులు అందించాం.

సాగులో కనీవినీ ఎరగని మార్పులు

- వ్యవసాయంలో కనీవినీ ఎరగని మార్పులు తెచ్చాం. గ్రామంలో రైతును చేయి పట్టుకుని నడిపించే వ్యవస్థ గ్రామంలో కనిపిస్తుంది. అక్కడే అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ రైతులకు సలహాలు, సూచనలు అందించే పరిస్థితి. తొలిసారిగా పారదర్శకతకు పెట్టపీట వేస్తూ ఈ-క్రాపింగ్, దాని ద్వారా ఉచిత పంటల బీమా అందించాం. రైతులకు ఏ ఇబ్బంది రాకుండా పంట వేసే సమయానికే పెట్టుబడి సాయం చేశాం.
- రైతుల వద్ద నుంచి దళారీ వ్యవస్థను తీసివేయడం సాధ్యమేనా అన్న వాళ్లకు.. ఇది సాధ్యమేనని చేసి చూపించాం. ధాన్యం కొనుగోళ్లను ఆర్బీకే స్థాయి నుంచే మొదలుపెట్టి ప్రతి ఒక్క రైతుకూ కనీస మద్దతు ధర అందేటట్టు చేయడంతో పాటు, రైతులకు బోనస్‌గా జీఎల్‌టీ (గన్నీ బ్యాగులు, లేబర్, ట్రాన్స్‌పోర్టు)గా ఎకరాకు రూ.10 వేలు అందించింది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.

విలువలు, విశ్వసనీయతే మనకు శ్రీరామరక్ష

- నేను ఒక్కటే చెబుతున్నాను. ఈ క్యారెక్టర్, క్రెడిబులిటీ వల్లనే మనం మళ్లీ అధికారంలోకి వస్తాం. నా దగ్గరకు వచ్చిన మన పార్టీ నేతలు మీలో అతి మంచితనం, అతి నిజాయితీ అనే సమస్యలు ఉన్నాయని చెబుతారు. కానీ ఆ రెండు గుణాలే మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తాయి. ప్రజలకు అబద్ధాలు చెప్పినప్పుడు అది మోసం అవుతుంది. అది ప్రజల్లో కోపం కింద మారుతుంది. ఆ కోపమే చంద్రబాబు పాలనలో ప్రజల్లో ఇప్పుడు విపరీతంగా కనిపిస్తుంది. ప్రజలు నిలదీసే పరిస్థితుల్లోకి వస్తున్నారు.
- నా రూ.15 వేలు ఏమయ్యాయని చిన్నపిల్లలు, నా రూ.18 వేలు ఏమయ్యాయని వాళ్ల తల్లులు, నా రూ.48 వేలు ఏమయ్యాయని అమ్మమ్మలు, నా రూ.36 వేలు ఏమయ్యాయని యువకులు, నా రూ.20 వేలు ఏమయ్యాయని రైతులు అడుగుతున్నారు. దీనికి సమాధానం చెప్పలేని తెలుగుదేశం పార్టీ పెద్దలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు.

చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేం

- పరిపాలనను ఇంటి గడప వద్దకే తీసుకొచ్చాం. లంచాలు, వివక్షకు తావు లేకుండా అన్నీ చేయగలిగాం. అంత మంచి చేసినా ఎక్కడో పొరపాటు జరిగింది. 'జగన్ ప్రతి ఇంటికి పలావు పెట్టాడు. చంద్రబాబు ప్రతి ఒక్కరికీ బిర్యానీ పెడతానన్నాడు. తీరా ఎన్నికలయ్యాక పలావు పోయింది. బిర్యానీ కూడా పోయిందన్న'.. మాట ప్రతి ఇంట్లోనూ వినిపిస్తోంది.
- ఆరోజు చంద్రబాబు అలా ప్రచారం చేసినప్పుడు చాలా మంది నా దగ్గరకు వచ్చి.. అన్నా నువ్వు ఏం చెప్పనంటున్నావు. చంద్రబాబు మాత్రం ఇంట్లో ఎవ్వరినీ వదిలి పెట్టడం లేదు. చిన్న పిల్లల దగ్గర నుంచి ఎవరు కనిపించినా వదలడం లేదు. పిల్లలు కనిపిస్తే నీకు రూ.15 వేలు, వాళ్ల తల్లులు కనిపిస్తే నీకు రూ.18 వేలు అంటున్నాడు. వాళ్ల అత్తలు, అమ్మలు కనిపిస్తే నీకు రూ.48 వేలు అని, అదే ఇంట్లో నుంచి 20 ఏళ్ల యువకుడు బయటకు వస్తే నీకు రూ.36 వేలు అంటున్నాడు. అదే ఇంట్లో నుంచి కండువా వేసుకుని రైతు బయటకు వస్తే నీకు రూ.20 వేలు అని అంటున్నాడు. ఎవ్వరినీ వదలిపెట్టడం లేదు. మనమూ చెప్పాలని అన్నారు.
- 'ఇది మన రాష్ట్ర బడ్జెట్. మన రాష్ట్ర పరిస్థితులు ఇవి. కాబట్టి మనం చేయగలిగింది ఇది మాత్రమే. కానీ మనం చెప్పిన దానికన్నా చంద్రబాబు మూడింతలు చెబుతున్నాడు. అవి సాధ్యం కాదు' అని చెప్పాను. కానీ, మనం ఎంత చెప్పినా.. ప్రజలు అటువైపు ఆలోచన చేశారు. ప్రజలు బాధ పడకుండా ఉండాలని, వారిలో చిరునవ్వు చూడాలన్న తపనతో ఎన్ని ఇబ్బందులు ఉన్నా భరించాం. కోవిడ్ లాంటి విపత్తులు వచ్చినా కారణాలు వెతుక్కోకుండా యుద్ధం చేసి మరీ ప్రజలకు మంచి చేశాం. బాబు చెప్పిన అబద్ధాలు ఓ పది శాతం మంది అధికంగా నమ్మి ఇటువైపు నుంచి అటువైపు వెళ్లారు.


రియల్ హీరో సుబ్బయ్యకు సెల్యూట్

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



సాక్షి, అమరావతి/కంభం: తన తోటి జవాన్లు 30 మంది ప్రాణాలు కాపాడి.. ల్యాండ్‌మైన్ బారిన పడి ప్రాణాలు కోల్పోయిన జవాన్ వరికుంట్ల సుబ్బయ్య.. రియల్ హీరో అంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ కొనియాడారు. బుధవారం సుబ్బయ్యకు నివాళులర్పిస్తూ వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'రియల్ హీరో సుబ్బయ్యకు సెల్యూట్. జమ్మూలో విధి నిర్వహణలో ఉన్న ప్రకాశం జిల్లా రావిపాడుకు చెందిన ఆర్మీ జవాన్ వరికుంట్ల సుబ్బయ్య ల్యాండ్‌మైన్ ఉచ్చు నుంచి తన తోటి జవాన్లు 30 మందిని కాపాడి.. తాను మాత్రం దాని బారిన పడి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. సుబ్బయ్య కుటుంబసభ్యులకు దేవుడు ధైర్యం ప్రసాదించాలని, తన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నివాళులర్పిస్తున్నాను' అని వైఎస్ జగన్ పోస్టు చేశారు.

నాలుగు పంచాయతీలకు జాతీయ అవార్డులు




సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు జాతీయ అవార్డులు లభించాయి. 'ఆరోగ్యకర, సంతృప్తికర తాగునీరు, పచ్చదనం-పరిశుభ్రత, సామాజిక భద్రత' కేటగిరిల్లో బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డులను అందజేశారు. 'ఆరోగ్యకర' కేటగిరిలో చిత్తూరు జిల్లా బొమ్మసముద్రం గ్రామానికి, పచ్చదనం-పరిశుభ్రత కేటగిరిలో అనకాపల్లి జిల్లా తగరంపూడికి, సంతృప్తికర తాగునీరు కేటగిరిలో అనకాపల్లి జిల్లా న్యాయంపూడికి, సామాజిక భద్రత కేటగిరిలో ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్ల పంచాయతీలకు జాతీయ అవార్డులు లభించాయి. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ నేతృత్వంలో ఈ అవార్డులను ఆయా జిల్లాల, పంచాయతీలకు చెందిన అధికారులు అందుకున్నారు.



'క్యూఆర్' మోసాలకు 'కోడ్'

దేశంలో ప్రతి ఏటా డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నాయి. ఫలితంగా డిజిటల్ మోసాలూ పెరుగుతున్నాయి. ఇందులో ఇటీవల క్యూఆర్ కోడ్ మోసాలు కూడా చేరాయి. రిజర్వ్ బ్యాంకుతోపాటు జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్పీసీఐ) ఈ డిజిటల్ మోసాలు అరికట్టడానికి పిన్ నంబర్ ఆధారిత చెల్లింపులు, రోజువారీ పరిమితి విధింపు వంటి అనేక చర్యలు ఎప్పటికప్పుడు చేపడుతూనే ఉన్నాయి. 2023లో దేశవ్యాప్తంగా ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ మీద 317 అవగాహన, శిక్షణ కార్యక్రమాలను ఆర్బీఐ నిర్వహించింది. ఫలితంగా 2024లో క్యూఆర్ కోడ్ మోసాలు బాగా తగ్గాయి. 2021–22 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ ఏడాది సెప్టెంబరు వరకు లక్షకుపైగా మోసాల కేసులు నమోదయ్యాయి. లావాదేవీల మొత్తం సుమారు రూ.140 కోట్లు.



ఆధారం: కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్బీఐ

క్లుప్తంగా...

పదో తరగతి బాలికపై లైంగిక వేధింపులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పదో తరగతి చదువుతున్న ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడో యువకుడు. డిగ్రీ చదువుతున్న యువకుడు, తన ఇంటికి సమీపంలో ఉన్న ఓ బాలికను లైంగికంగా వేధిస్తుండడంతో బాధితులు బుధవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. అయితే ఘటన జరిగిన ప్రాంతం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని తెలియడంతో.. బాధితులను అక్కడికి పంపించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

హోలోగ్రామ్స్ కాంట్రాక్ట్ కేసులో ప్రతివాదిగా సీఐడీ

ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: మద్యం బాటిళ్లపై అతికించే హై సెక్యూరిటీ హోలోగ్రామ్స్‌ల తయారీ, సరఫరా కాంట్రాక్ట్ అప్పగింత విషయంలో పలు అక్రమాలు జరిగాయని, వీటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో హైకోర్టు బుధవారం సీఐడీని ప్రతివాదిగా చేర్చింది. రాష్ట్రంలో మద్యం కొనుగోళ్ల వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు చేస్తున్నందున ఈ వ్యాజ్యంలో సీఐడీని ప్రతివాదిగా చేర్చాలంటూ పిటిషనర్ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు అనుమతిచ్చింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

గౌతమ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: తనపై విజయవాడ, సత్యనారాయణపురం పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత పూనూరు గౌతమ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం తీర్పు వెలువరించారు. విజయవాడ సత్యనారాయణపురంలో ఓ స్థలం వివాదంలో ఉమామహేశ్వర శాస్త్రి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గౌతమ్‌రెడ్డిపై హత్యాయత్నంతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఎద్దుల్లా పెరిగారంటూ.. నోటికొచ్చినట్లు తిట్టాడు!

ఏపీ శాక్స్ మాజీ పీడీ వేధింపులపై విచారణ కమిటీకి ఉద్యోగుల మొర

సాక్షి, అమరావతి: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) పీడీగా పనిచేసిన రాజేంద్ర కుమార్ తమను మానసికంగా వేధింపులకు గురిచేశారని ఉద్యోగులు గోడు వెళ్లబోసుకున్నారు. 'నోరు తెరిస్తే తిట్ల దండకం.. ఎద్దుల్లా పెరిగారు.. తిని పొట్టలు పెంచారంటూ అవమానించారు. వయసుకు కూడా గౌరవం ఇవ్వకుండా స్కౌండ్రల్, రాస్కెల్ అంటూ దూషించారు. మహిళలనే గౌరవం కూడా లేకుండా అమర్యాదగా మాట్లాడి క్షోభకు గురిచేశారు.' అని విచారణ కమిటీ ముందు ఉద్యోగులు వెల్లడించినట్లు సమాచారం. రాజేంద్రకుమార్‌పై శాక్స్‌లో పనిచేసే సుమారు 40 మంది ఉద్యోగులు రాతపూర్వకంగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల హోస్మని విచారణకు ఆదేశించారు. ఫిర్యాదుదారులను బుధవారం సచివాలయానికి పిలిపించి మంజుల విచారించారు. తొలుత అందరికీ ఒక ప్రశ్నపత్రాన్ని అందించి వాటికి రాతపూర్వక సమాధానాలను తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఐదుగురు ఉద్యోగులను ఒక గ్రూప్‌గా చేసి, ప్రతి ఉద్యోగిని వ్యక్తిగతంగా విచారించినట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

ఇకపై మరింత మందిని కోల్పోనివ్వం

హెల్మెట్ ధరించక నాలుగు నెలల్లో 667 మంది చనిపోవడం చిన్న విషయం కాదు

- పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి..
- నిబంధనల అమలుకు ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: హెల్మెట్ లేకపోవడం వల్ల చోటు చేసుకుంటున్న మరణాలపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు హెల్మెట్ లేకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 667 మంది చనిపోవడం చిన్న విషయం కాదని.. నిబంధనల అమలులో పోలీసుల అలసత్వం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము ఈ విధంగా మరింత మందిని కోల్పోనివ్వబోమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్న భయాన్ని ప్రజల్లో కలిగించాలని స్పష్టం చేసింది. చలాన్లు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రాష్ట్రంలో మోటారు వాహన చట్ట నిబంధనల అమలు విషయంలో పోలీసులు, ఆర్‌టీఏ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు హాజరవ్వాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో రవాణా శాఖ కమిషనర్‌ను ప్రతివాదిగా చేర్చింది. రాష్ట్రంలో మోటారు వాహన చట్ట నిబంధనల అమలుకు ముఖ్యంగా హెల్మెట్లు ధరించని వారిపై ఏం చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఖాళీల భర్తీకి ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు?

రాష్ట్రవ్యాప్తంగా 8,770 మంది ట్రాఫిక్ పోలీసులు ఉండాలి కానీ.. కేవలం 1,994 మందే ఉన్నారని ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించింది. ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాళ్లు తెలంగాణ సరిహద్దు రాగానే సీటు బెల్టులు పెట్టుకుంటున్నారని.. ఇందుకు పోలీసులు చర్యలు తీసుకుంటారన్న భయమే కారణమని పేర్కొంది. కుటుంబానికి అండగా ఉండే వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే.. ఆ కుటుంబం పరిస్థితి ఎలా ఉంటుందన్న విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలని సూచించింది. ప్రణతి జోక్యం చేసుకుంటూ.. మొత్తం బాధ్యత పోలీసులదే అంటే సరికాదని, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ప్రజలను తప్పు పట్టొద్దని, అవగాహన కల్పించడం పోలీసుల బాధ్యత అని హితవు పలికింది. మోటారు వాహన చట్ట నిబంధనల అమలు, హెల్మెట్ ధరించడాన్ని తప్పనిసరి చేసే విషయంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

జరిమానాలు కఠినంగా వసూలు చేయాలి..

రాష్ట్రంలో కేంద్ర మోటారు వాహన సవరణ చట్ట నిబంధనలను అమలు చేయట్లేదని.. ఉల్లంఘనలకు పాల్పడిన వారికి జరిమానాలు విధించడం లేదని, దీంతో పెద్ద సంఖ్యలో వాహన ప్రమాదాలు, మరణాలు చోటుచేసుకుంటున్నాయని న్యాయవాది తాండవ యోగేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. యోగేశ్ వాదనలు వినిపిస్తూ.. హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని గత విచారణ సమయంలో ఇచ్చిన ఆదేశాల అమలుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. హెల్మెట్ ధారణ నిబంధన అమలుకు చర్యలు తీసుకోవాలని తాము జూన్‌లో ఆదేశాలిచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంత మంది చనిపోయారని ప్రశ్నించింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు 667 మంది చనిపోయారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి తెలిపారు. ఇది చిన్న విషయం కాదని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రణతి స్పందిస్తూ, జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో 5,62,492 చలాన్లు విధించామని చెప్పారు. కృష్ణా జిల్లాలో 20,824 చలాన్లు విధించి రూ.4.63 లక్షలు జరిమానా వసూలు చేశామన్నారు. ఇది చాలా తక్కువ మొత్తమన్న ధర్మాసనం.. నిబంధనలను అమలు చేసే విషయంలో ప్రభుత్వం ఎందుకు నిస్సహాయంగా ఉందని ప్రశ్నించింది. ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయన్న భయాన్ని ప్రజల్లో కలిగించాలని సూచించింది. చలాన్లు కట్టని వారి విద్యుత్ సరఫరా, నీటి సరఫరా ఆపేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. చలాన్లు చెల్లించకపోతే సదరు వాహనాన్ని ఎందుకు జప్తు చేయట్లేదని పోలీసులను, ఆర్‌టీఏ అధికారులను ప్రశ్నించింది. భారీ జరిమానాలు విధించే బదులు.. ఇప్పటికే ఉన్న జరిమానాలను కఠినంగా వసూలు చేస్తే ఫలితం ఉంటుందని అభిప్రాయపడింది.

జీవోలు రహస్యంగా ఉంచడానికి వీల్లేదు

- వరుస క్రమంలో జీవోలను అప్‌లోడ్ చేయాల్సిందే
- ఇందుకోసం ఏం చేస్తున్నారో చెప్పాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కొన్ని జీవోలు మాత్రమే అప్‌లోడ్ చేసి.. మిగిలిన వాటిని ప్రజలకు తెలియకుండా రహస్యంగా ఉంచడానికి వీల్లేదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. జీవోలన్నింటినీ ఎలా పడితే అలా కాకుండా ప్రజలకు అర్థమయ్యేందుకు వీలుగా.. ఓ వరుస క్రమంలో అప్‌లోడ్ చేయాల్సిందేనని తేల్చిచెప్పింది. ఏదైనా జీవోలో రహస్య సమాచారం ఉంటే.. ఆ విషయాన్ని కూడా జీవో ద్వారా తెలపాలని ఆదేశించింది. దీని వల్ల మొత్తం ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని.. ప్రజలకు సమాచారం తెలిసే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. అలాగే జీవోలను గతంలో మాదిరిగా వరుస క్రమంలో జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవోలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచకపోవడం సమాచార హక్కు చట్ట నిబంధనలకు విరుద్ధమంటూ నెల్లూరుకు చెందిన జీఎంఎన్ఎస్ దేవి, గుంటూరుకు చెందిన కె.శ్రీనివాసరావు, అనంతపురం జిల్లాకు చెందిన ఎస్.ఆర్.ఆంజనేయులు, బాపట్ల జిల్లాకు చెందిన సింగయ్య తదితరులు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి వాదనలు వినిపిస్తూ, జీవోలన్నీ అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు స్పందిస్తూ.. గతంలో మాదిరిగా వరుస క్రమంలో జీవోలను అప్‌లోడ్ చేయడం లేదన్నారు. దీని వల్ల జీవోల వివరాలు తెలిసే అవకాశం లేదని చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. జీవోలను ఓ వరుస క్రమంలో అప్‌లోడ్ చేయాల్సిందేనని ఆదేశించింది.

సౌర విద్యుత్ కొనుగోలు పిల్‌పై విచారణ వాయిదా



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ నుంచి యూనిట్ రూ.2.49కే 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు అనుమతినిస్తూ విద్యుత్ నియంత్రణ మండలి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీడీపీ నేత, మంత్రి పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై విచారణను హైకోర్టు జనవరి 29కి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే దాఖలు చేసిన కౌంటర్‌ను ఓసారి పరిశీలించి అవసరమైతే అదనపు వివరాలతో మరో కౌంటర్ దాఖలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఇందుకు కొంత సమయం కావాలని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టును కోరారు. దీంతో హైకోర్టు స్పందిస్తూ.. ఈ వ్యాజ్యాల్లో తదుపరి విచారణను జనవరి చివరి వారంలో జరుపుతామని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా ధర్మాసనం స్పందిస్తూ.. అసలు వివాదం ఏమిటో చెప్పాలని కోరింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. యూనిట్ రూ.2.49కి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు సెకీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ నుంచి రాష్ట్రానికి విద్యుత్ సరఫరా చేస్తారని.. దీని వల్ల పంపిణీ నష్టాలుంటాయన్నారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది.

బాలికపై సామూహిక లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- నిందితుల అరెస్టు
- బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో ఘటన


అత్యాచారం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు

కొల్లూరు: ఓ బాలికను మభ్యపెట్టి సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక కొల్లూరులోని ఓ దుస్తుల దుకాణంలో పని చేస్తుంది. గత నెల 26న రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో తన గ్రామానికి వెళ్లడానికి ఆటో కోసం వేచి ఉండగా, ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంకకు చెందిన యువకుడు విప్పర్ల ప్రేమ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద దింపుతానని నమ్మించి ఎక్కించుకున్నాడు. కొల్లూరు కరకట్ట నుంచి దారి మళ్లించి దిగువన ఉన్న ఇటుక బట్టీల్లోకి తీసుకెళ్లి బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతేకాక తన స్నేహితులకు ఫోన్ చేసి పిలవడంతో బెజ్జం శ్యామ్‌కుమార్‌తో పాటు మరో యువకుడు అక్కడకు వచ్చారు. శ్యామ్‌కుమార్ బాలికను తన ద్విచక్ర వాహనంపై దింపుతానని మభ్యపెట్టి వేరే ఇటుక బట్టీలోకి తీసుకువెళ్లి అతను కూడా లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరో యువకుడు వెంటనే వెళ్లిపోయాడు. అనంతరం బాలికను ఇటుక బట్టీలలోనే వదిలి వెళ్లడంతో రాత్రి సమయంలో కాలినడకన ఇంటికి చేరుకుంది. తల్లి లేని ఆ బాలిక జరిగిన అఘాయిత్యాన్ని తండ్రికి చెప్పుకునేందుకు భయపడింది. కొద్ది రోజులుగా బాలిక అనారోగ్యంతో ఉండడాన్ని గమనించిన తండ్రి తమ బంధువులకు చెప్పడంతో విషయం బయటపడింది. అనంతరం తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. నిందితులు విప్పర్ల ప్రేమ్‌కుమార్, బెజ్జం శ్యామ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘటన ప్రాంతాన్ని వేమూరు సీఐ రామాంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు పరిశీలించారు.

రూ.70 లక్షల అప్పుకు రూ.15 లక్షలే చెల్లింపా?

- హోంమంత్రి అనితకు ఇదెలా సాధ్యమైంది?
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ ప్రశ్న
- అప్పిచ్చిన వ్యక్తిని అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆమె బెదిరించారు



సాక్షి, అమరావతి: రూ.70 లక్షల అప్పిచ్చి, తొమ్మిదేళ్ల తర్వాత కూడా వడ్డీలేకుండా, కేవలం రూ.15 లక్షలు మాత్రమే తీసుకుని ఊర్కోవడం ఎలా సాధ్యమని.. ఇది హోంమంత్రి అనితకు ఎలా కుదిరిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్ విస్మయం వ్యక్తంచేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరైనా లక్ష రూపాయల అప్పు తీసుకుంటే తొమ్మిదేళ్ల తర్వాతైనా వడ్డీతో సహా చెల్లిస్తారని.. కానీ, రూ.21 వేలు మాత్రమే ఇస్తానంటే అప్పు ఇచ్చిన వ్యక్తి అంగీకరిస్తాడా? ఇది సాధ్యమేనా? అని ఆయన ప్రశ్నించారు. కానీ, సాక్షాత్తు మన హోంమంత్రి అనిత దీన్ని సాధ్యంచేసి చూపించారని ఎద్దేవా చేశారు. రూ.70 లక్షల అప్పు తీసుకుని, తొమ్మిదేళ్ల తర్వాత వడ్డీలేకుండా, అసలులోనూ కోతపెట్టి, కేవలం రూ.15 లక్షలు మాత్రమే ఇవ్వడం ద్వారా అనిత తనకు అప్పిచ్చిన శ్రీనివాసరావును అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెదిరించారని ఆరోపించారు. నిజానికి.. ఆమె 2015, అక్టోబరు 1న వేగి శ్రీనివాసరావు అనే వ్యక్తి వద్ద రూ.70 లక్షలు అప్పుగా తీసుకున్నారని.. మూడేళ్లయినా అప్పు తీర్చకపోవడంతో ఆయన న్యాయం చేయాలని 2018లో కోర్టును ఆశ్రయించారని కాకుమాను రాజశేఖర్ గుర్తుచేశారు. ఇప్పుడామె హోంమంత్రి అయ్యాక, కేసులో ఒక్కసారిగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. తాము రాజీ పడినట్టు ఇద్దరూ కలిసి హైకోర్టులో జాయింట్ మెమో దాఖలు చేసినట్లు పత్రికల్లో వచ్చిందని.. వడ్డీ మాత్రమే వద్దనుకున్నా ఎవరైనా నమ్ముతారు గానీ.. రూ.70 లక్షల అప్పుకు కేవలం రూ.15 లక్షలు మాత్రమే తీసుకోవడానికి ఒప్పుకోవడం వెనుక మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. తమకున్న సమాచారం ప్రకారం ఆయనపై తప్పుడు కేసులు పెడతామని, జైలుపాలు చేస్తామని హోంమంత్రి బెదిరించి, వేధించి కేవలం రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చేలా వేగి శ్రీనివాసరావుతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసిందన్నారు.

ఉదయం మనోజ్.. రాత్రి విష్ణు

రాచకొండ సీపీ ఎదుట హాజరైన మంచు మోహన్‌బాబు కుమారులు

సాక్షి, హైదరాబాద్/పహాడీషరీఫ్: మంచు మోహన్‌బాబు కుటుంబంలో మూడు రోజులుగా చోటు చేసుకున్న ఘటనలపై రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం మోహన్‌బాబు కుమారులు, సినీనటులు మనోజ్, విష్ణులను విచారించారు. ఉదయం మనోజ్, రాత్రి విష్ణు నేరేడ్‌మెట్ పోలీసు కమిషనర్ కార్యాలయానికి వచ్చారు. దాదాపు గంటన్నర చొప్పున వారిని ప్రశ్నించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఘటనలతో జల్‌పల్లిలో ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగే పరిస్థితులు ఏర్పడ్డాయని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితి మరోసారి నెలకొనకుండా ఉండాలంటే.. చట్టానికి లోబడి వ్యవహరించాలని వారికి స్పష్టం చేశారు. ఈ మేరకు మనోజ్, విష్ణు ఇద్దరూ ఏడాది పాటు అదనపు జిల్లా మెజిస్ట్రేట్, సీపీ సుధీర్‌బాబు ఆదేశాలకు కట్టుబడి ఉంటామంటూ విడివిడిగా బాండ్ రాసి ఇచ్చారు. రూ.లక్ష చొప్పున పూచీకత్తు చెల్లించారు. ఈ మేరకు మనోజ్, విష్ణులను పోలీసులు బైండోవర్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం మంచు టౌన్‌షిప్‌లోని బౌన్సర్లు, బయటి వ్యక్తులను పహాడీషరీఫ్ పోలీసులు బయటికి పంపించారు.

అంతా ఆ ఇద్దరే చేస్తున్నారు: మనోజ్

''మా నాన్న దేవుడు.. ఈ రోజు చూస్తున్న నాన్న కాదు. నాపై మా అన్న విష్ణు, అతడి అనుచరుడు విజయ్ లేనిపోనివి మా నాన్నకు నేర్పుతూ నన్ను విలన్‌గా చిత్రీకరించారు. నా వ్యక్తిగత జీవితంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. నేను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడంలో తప్పేముంది. నాన్న చెప్పిన అన్ని పనుల కోసం గొడ్డులా కష్టపడ్డాను. ఒక్క రూపాయి కూడా అడగట్లేదు..'' అని మంచు మనోజ్ బుధవారం మీడియాతో మాట్లాడారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాటన్నింటినీ సాక్ష్యాధారాలతో బయటపెడతానని పేర్కొన్నారు.

మోహన్‌బాబు ముఖంపై గాయాలు

సాక్షి, హైదరాబాద్: మంచు కుటుంబంలో కలహాలతో తీవ్ర అస్వస్థతకు గురైన నటుడు మోహన్‌బాబు ఆరోగ్య పరిస్థితిపై ఆయన చికిత్స పొందుతున్న కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు బుధవారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ గురు ఎన్.రెడ్డి మీడియాతో మాట్లాడారు. మంగళవారం సాయంత్రం మోహన్‌బాబు ఆస్పత్రిలో చేరారని.. ఆ సమయంలో ఆయనకు బీపీ ఎక్కువగా ఉందని, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారని తెలిపారు. మోహన్‌బాబు ముఖం, ఛాతీపై గాయాలు ఉన్నాయని.. కంటి కింద వాపు ఉన్నట్టు గుర్తించామని వివరించారు.

కుటుంబ సమస్యను ఎక్కువ చేసి చూపొద్దు: మంచు విష్ణు

కొందరు తమ కుటుంబ సమస్యను ఎక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని, అది సరికాదని మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు పేర్కొన్నారు. బుధవారం మోహన్‌బాబు చికిత్స పొందుతున్న కాంటినెంటల్ ఆస్పత్రి వద్ద విష్ణు మీడియాతో మాట్లాడారు. జల్‌పల్లిలోని మంచు టౌన్‌షిప్ వద్ద మీడియాపై జరిగిన దాడి ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని, అలా జరిగి ఉండాల్సింది కాదని పేర్కొన్నారు.

నాపై ఎఫ్ఐఆర్ చట్టవిరుద్ధం

- తెలంగాణ హైకోర్టులో పుష్ప–2 హీరో అల్లు అర్జున్ పిటిషన్
- దర్యాప్తు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: పుష్ప–2 ప్రీమియర్ షో ప్రదర్శన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందడం దురదృష్టకరమని, తనకు ఎలాంటి సంబంధం లేకున్నా నిందితుడిగా చేర్చడాన్ని తప్పుబడుతూ ప్రముఖ నటుడు అల్లు అర్జున్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు నమోదు చేసిన తప్పుడు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు. చిత్ర కథానాయకుడిగా యాదృచ్ఛికంగా ప్రీమియర్ షోకు హాజరయ్యానని, నిందితుడిగా చేర్చడం చట్ట విరుద్ధమంటూ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ఒక ట్రెండు రోజుల్లో న్యాయస్థానం విచారణ చేపట్టనుంది. ఈనెల 4న రాత్రి పుష్ప–2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అల్లు అర్జున్‌ను కూడా నిందితుల జాబితాలో చేర్చారు. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'సంధ్య థియేటర్ వద్ద సంభవించిన ప్రాణనష్టం విషాదకరం. తీవ్ర విచారకరం. ఎలాంటి ప్రమేయం లేకున్నా నేరపూరిత బాధ్యతను నాకు ఆపాదించారు. క్రిమినల్ చట్టం ప్రకారం ఈ ఎఫ్ఐఆర్ ఆమోదయోగ్యం కాదు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినా భారీగా వచ్చిన అభిమానులతో తొక్కిసలాటలో దురదృష్టవశాత్తు మహిళ మృతి ఘటన చోటుచేసుకుందే తప్ప ఇది హత్య కాదు. ఇది ఉద్దేశపూర్వకంగా ఎవరూ చేసింది కాదు. ఎఫ్ఐఆర్ కొట్టివేసేలా ఆదేశాలివ్వాలి. ఈ కేసులో తదుపరి విచారణ నిలిపివేసేలా పోలీసులను ఆదేశించాలి' అని విజ్ఞప్తి చేశారు.

తలశిల రఘురాంపై కేసులో పూర్తి వివరాలు సమర్పించండి

- కంచికచర్ల పోలీసులకు హైకోర్టు ఆదేశం
- విచారణ ఈ నెల 18కి వాయిదా

సాక్షి, అమరావతి: విజయవాడ, గొల్లపూడిలో టీడీపీ నేత కారంపూడి రవీంద్ర ఆత్మహత్య వ్యవహారంలో కంచికచర్ల పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు, పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కువాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. గొల్లపూడికి చెందిన తెలుగుదేశం పార్టీ నేత కారంపూడి రవీంద్ర గత నెల 17న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. రవీంద్ర ఆత్మహత్యకు తలశిల రఘురాంతో పాటు మరికొందరు కారణమంటూ మృతుని సోదరుడు కారంపూడి రాధాకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా గత నెల 18న కంచికచర్ల పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇందులో తలశిల రఘురాంను 16వ నిందితునిగా చేర్చారు. ఈ నేపథ్యంలో ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, రఘురాం తరఫు న్యాయవాది సాయి శరణ్ చోడిశెట్టి స్పందిస్తూ.. ఈ వ్యాజ్యంపై మధ్యాహ్నం అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి నిరాకరిస్తూ పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించారు.

పోలీసులు అతిగా జోక్యం చేసుకోవద్దు


- నటుడు మోహన్‌బాబు కుటుంబ వివాదంలో పోలీసులకు తెలంగాణ హైకోర్టు సూచన
- మొదట పరిష్కరించుకునే అవకాశం ఇవ్వండి
- అవసరమైతే చట్ట ప్రకారం ముందుకు వెళ్లొచ్చు
- కుటుంబ వివాదంలో మీడియా ఇంత హంగామా ఎందుకన్న జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి
- సీపీ విచారణకు హాజరునుంచి మోహన్‌బాబు, విష్ణుకు మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబ వివాదాల్లో ఎక్కువ జోక్యం వద్దని పోలీసులకు హైకోర్టు సూచించింది. మొదట సమస్యను పరిష్కరించుకునే అవకాశం వారికి ఇవ్వాలని... అది సాధ్యం కాకుంటే చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. మోహన్‌బాబు ఇంటి వద్ద పోలీస్ పికెట్ సాధ్యం కాకుంటే.. ప్రతి రెండు గంటలకోసారి భద్రత పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని స్పష్టం చేసింది. అలాగే మోహన్‌బాబు, విష్ణులకు రాచకొండ పోలీసులు జారీ చేసిన నోటీసులను నిలిపివేసింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

మోహన్‌బాబు పిటిషన్‌తో..

తనపై దాడి చేశారంటూ మోహన్‌బాబు కుమారుడు మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పహడీ షరీఫ్ పోలీసులు.. బుధవారం ఉదయం 10.30 గంటలకు విచారణకు హాజరు కావాలని మోహన్‌బాబు, విష్ణు, మనోజ్‌లకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నోటీసులను సవాల్ చేస్తూ మోహన్‌బాబు బుధవారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, ఆస్పత్రిలో ఉన్నానని.. ఈ పరిస్థితుల్లో విచారణకు హాజరుకాలేనని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున హోంశాఖ జీపీ మహేశ్‌రాజే వాదనలు వినిపిస్తూ.. పరస్పర ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసులు నమోదయ్యాయని వివరించారు. అలాగే జర్నలిస్టుపై దాడి చేసినందుకు మోహన్‌బాబుపై మరో క్రిమినల్ కేసు నమోదైందని తెలిపారు. ఇక మనోజ్ బౌన్సర్లను తీసుకొచ్చి మోహన్‌బాబు ఇంట్లో తగాదా సృష్టిస్తున్నారని మోహన్‌బాబు తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. బీఎన్ఎస్ఎస్, సెక్షన్ 126 ప్రకారం రాచకొండ పోలీస్ కమిషనర్ జారీ చేసిన నోటీసులను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రాచకొండ పోలీసుల ఎదుట మోహన్‌బాబు, విష్ణు హాజరుకావాలన్న నోటీసులను నిలిపివేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా మోహన్‌బాబు ఇంటి చుట్టూ నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు. ఇక కుటుంబ వివాదంలో మీడియా ఎందుకింత హంగామా సృష్టిస్తోందని న్యాయమూర్తి ప్రశ్నించారు.



గొప్ప మనిషి ఎవరంటే, ఎవరి మీదా అధికారం చూపనివాడు; ఎవరికీ లొంగనివాడు.
– ఖలీల్ జిబ్రాన్

సాక్షి
గురువారం, 12 డిసెంబర్ 2024

సరైన దిశలో ఒక ప్రయత్నం

ఎట్టకేలకు ఒక అడుగు ముందుకు పడింది. బంగ్లాదేశ్‌లోని పరిస్థితి పట్ల తన మనోభావాలను భారత్ స్పష్టంగా పంచుకోగలిగింది. బంగ్లాదేశ్‌లోని మధ్యంతర సర్కారుకు ప్రధాన సలహాదారైన మహమ్మద్ యూనస్, బంగ్లా విదేశాంగ కార్యదర్శి మహమ్మద్ జషీముద్దీన్ తదితరులతో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఢాకాలో సమావేశమవడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఆగస్టులో షేక్ హసీనా ప్రభుత్వం పడిపోయాక రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న వేళ భారత్ నుంచి తొలిసారిగా ఓ ఉన్నతాధికారి బంగ్లా వెళ్ళడం, దౌత్య భేటీ జరపడం విశేషమే. ఇటు హసీనాకు భారత్ ఆశ్రయం కల్పించడం, అటు బంగ్లాలో అల్పసంఖ్యాక హిందువులపై దాడులతో ద్వైపాక్షిక సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పరిస్థితుల్లో తాజా భేటీలో ఇరుపక్షాలూ నిర్మొహమాటంగా పరస్పరం అభిప్రాయాలు పంచుకోవడం సరైన దిశలో పడిన అడుగు. హసీనా హయాంతో పోలిస్తే, భారత్ పట్ల పెద్ద సానుకూలత లేని సర్కారు బంగ్లాలో ప్రస్తుతం నెలకొన్నందున తాజా దౌత్యయత్నాలు కీలకం. చారిత్రకంగా మిత్రత్వం, పరస్పర ప్రయోజనాలున్న పొరుగు దేశాలు అపోహలు, అనుమానాలు దూరం చేసుకోవడానికి ఇవి ఏ మేరకు ఉపకరిస్తాయో చూడాలి.

బయట ఉద్రిక్త వాతావరణం ఉన్న సమయంలో జరిగిన ఈ చర్చలు మైనారిటీలపైన, హిందూ ఆలయాలపైన దాడులు, రాజద్రోహ నేరంపై హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు సహా అనేక వివాదాస్పద అంశాలపై దృష్టి సారించాయి. రెండు కోట్ల పైగా హిందువులున్న ముస్లిమ్ మెజారిటీ దేశంలో మైనారిటీల భద్రతపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తే, ఆ ఘటనలు రాజకీయమైనవంటూ బంగ్లా వాదించింది. ప్రజల భావోద్వేగాలు, రాజకీయ ప్రయోజనాలు కలగలిసినప్పుడు పరస్పర భిన్న వాదనల మధ్య రాజీ కుదర్చడం కష్టమే. కానీ, విదేశాంగ శాఖ కార్యదర్శుల భేటీతో చిరు ప్రయత్నమైనా సాగడం విశేషం. బంగ్లాదేశ్ సైతం ఇప్పటికైనా కళ్ళు తెరిచి, జరుగుతున్నదేమిటో గ్రహించి, అసలంటూ సమస్య ఉన్నదని గుర్తించడానికి ఈ భేటీ ప్రేరేపిస్తే మంచిదే.

1971 నాటి బంగ్లాదేశ్ విముక్తి పోరులో భారత్ పాత్ర మరపురానిది. అదే సమయంలో స్వాతంత్ర్యం ముందు నుంచి చారిత్రకంగా ఉన్న అనుబంధం రీత్యా సాహిత్య, ఆర్థిక, ఆధ్యాత్మిక, రాజకీయ పరంగా ఆధునిక భారతావని రూపుదిద్దుకోవడంలో బంగాళ ప్రాంతపు భాగ స్వామ్యం అవిస్మరణీయమే. బ్రిటీషు కాలం నుంచి భౌగోళిక రాజకీయాలు, సామాజిక సాంస్కృతిక కారణాలతో ముడిపడిన భారత – బంగ్లా బంధం ఇటీవలి ఉద్రిక్తతల నడుమ నలిగిపోతోంది. ఇరుదేశాల మధ్య 4,096 కి.మీల ఉమ్మడి సరిహద్దుంది. ప్రపంచంలోనే సుదీర్ఘమైన అయిదో సరిహద్దు ఇది. పైగా, చాలా ప్రాంతంలో పూర్తిస్థాయిలో సరిహద్దుల గుర్తింపు జరగనేలేదు. సరిహద్దులో నెలకొన్న పశ్చిమ బెంగాల్‌లోని ఒక్క పెట్రాపోల్ వద్దనే రెండు దేశాల మధ్య భూమార్గ వాణిజ్యంలో 30 శాతం జరుగుతుంది. ఏటా సుమారు 23 లక్షల మంది సరిహద్దులు దాటి, భారత్‌కు వైద్య చికిత్సకు వస్తుంటారు. కాబట్టి, ఇటీవలి ఉద్రిక్తతల్ని దాటి వాణిజ్యం, ఇంధనం, సహకారం, సామర్థ్యాల పెంపుదలను బంగ్లా చూడగలగాలి. ఇరుదేశాలూ చేతులు కలిపి అడుగులు వేస్తేనే అభివృద్ధి సాధ్యం.

ఉల్లిపాయలు, బంగాళదుంపలు, వెల్లుల్లి లాంటి నిత్యావసర వస్తువుల విషయంలో ఢిల్లీ పైనే ఢాకా ఆధారపడి ఉంది. కానీ, తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశం దేశీయ ఉత్పత్తిని పెంచుకొని, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తోంది. ఇక, బంగ్లా రోగులకు శస్త్రచికిత్స చేసేది లేదంటూ కొన్ని భారతీయ ఆస్పత్రులు అమానవీయంగా, మూర్ఖంగా వ్యవహరించడం సమర్థనీయం కాదు. ఈ చర్యల వల్ల బంగ్లా దేశీయులు ఇప్పుడు మలేసియాను ఆశ్రయిస్తున్నట్టు వార్త. ఇలాంటివన్నీ దీర్ఘకాలంలో భారత ప్రయోజనాలకే దెబ్బ. అసలు మిగతా ప్రపంచంతో భారత వాణిజ్యంతో పోలిస్తే, సరుకుల్లో భారత – బంగ్లాల ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా వృద్ధి చెందింది. అనేక అంశాలు ముడిపడి ఉన్నందున తెగేదాకా లాగడం ఇరుపక్షాలకూ మంచిది కాదు. కొత్త వాస్తవాలను గుర్తించక ఒకవేళ మనం ఇదే వైఖరితో ముందుకు సాగితే చివరకు నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్, మాల్దీవులు, మయన్మార్ వరుసలోనే బంగ్లాదేశ్ సైతం ఢిల్లీకి దూరమవుతుంది. పొరుగున మిత్రులెవరూ లేని దుఃస్థితి భారత్‌కు దాపురిస్తుంది.

యూనస్ సారథ్యంలోని ప్రస్తుత బంగ్లా సర్కార్ పాక్‌కు చేరువవుతోంది. ఇటీవల రెండు దేశాల మధ్య వీసాల ఎత్తివేత, రక్షణ ఒప్పందాలు, కరాచీ నుంచి పాకిస్తానీ సరుకుల రవాణా నౌకను చిట్టగాంగ్ వద్ద లంగరేసుకునేందుకు అనుమతించడం లాంటివి చూస్తే అదే అనిపిస్తోంది. దాదాపు 47 ఏళ్ళ తర్వాత రెండు దేశాల మధ్య నేరుగా సముద్ర నౌకాయాన సంబంధాల పునరుద్ధరణకు ఇది ఒక సూచన. వ్యూహాత్మకంగా సుస్థిర దక్షిణాసియాకు కట్టుబడ్డ భారత్ జాగ్రత్తగా అడుగులు వేయాలి. బంగ్లా అంతర్గత రాజకీయాల్లోకి అతిగా జొరబడి, ప్రస్తుత హయాం నమ్మకాన్ని పోగొట్టుకోరాదు. ఈ పరిస్థితుల్లో భారత విదేశాంగ కార్యదర్శి ఢాకా పర్యటన ఇరుగుపొరుగు బాంధవ్యం, భాగస్వామ్యాల ప్రాధాన్యాన్ని గుర్తించినట్టే అనిపిస్తోంది. బంగ్లా సైతం ముందుగా తన అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుకోవాలి. ఆ దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొంటే, మైనారిటీలు సురక్షితంగా ఉంటే, పాత బంధం మళ్ళీ మెరుగవుతుంది. వెరసి, భారత్ – బంగ్లాలు ప్రస్తుతం నాలుగురోడ్ల కూడలిలో నిలిచాయి. మనసు విప్పి మాట్లాడుకొని, పరస్పర ప్రయోజనాల్ని కాపాడుకుంటే మేలు. అలాకాక సహకార మార్గం బదులు సంఘర్షణ పథాన్ని ఎంచుకుంటే ఇరువురికీ చిక్కే!

సుప్రీమ్ కదిపిన తేనెతుట్టె

విశ్లేషణ



బర్ఖా దత్

ప్రతి మసీదు కింద శివలింగాన్ని వెతికే పని పెట్టుకోవద్దని స్వయంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. అయినా సంభల్ మసీదు, అజ్మీర్ దర్గాలను భౌతిక సర్వే చేయాలంటూ కేసులు నమోదయ్యాయి. అంటే, ప్రార్థనా స్థలాల చట్టం ఇప్పుడు పనికిరాకుండా పోయిందా? ఇది కాగితాలకే పరిమితమైన చట్టమా? 1947 ఆగస్ట్ 15 నాటికి ఉన్నవి ఉన్నట్టుగా ప్రార్థనాలయాల స్వభావాన్ని కాపాడటం కోసం తెచ్చిన ఈ చట్టంలో, కేవలం అయోధ్యనే మినహాయించారు. అయినప్పటికీ జ్ఞానవాపి మసీదు సర్వేకు అనుమతించడం ద్వారా అత్యున్నత న్యాయస్థానం దిగువ కోర్టులకు పూర్తి మిశ్రమ సందేశం పంపింది. నిర్దిష్ట ప్రార్థనా స్థలాల స్వభావాన్ని పునర్నిర్ణయించాలంటూ వచ్చే కాపీ కేసులతో ఇప్పుడు అసలు ప్రమాదం దాగివుంది.

ప్రతి మసీదు కింద శివలింగాన్ని వెతకడాన్ని వ్యతిరేకించినవారు ఎవరో కాదు, సాక్షాత్తూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్. అయినా మనం ఈ పరిస్థితికి చేరుకున్నాం.

సంభల్‌లోని మసీదు సర్వేకు ట్రయల్ కోర్టు అనుమతించిన తర్వాత పోలీసులకూ, నిరసనకారులకూ మధ్య ఘర్షణలు చెలరేగడంతో నలుగురు వ్యక్తులు ఎలా మరణించారు అనే దానిపై ఉత్తరప్రదేశ్‌లోని జ్యుడీషియల్ ప్యానెల్ దర్యాప్తు చేస్తోంది. రాజస్థాన్‌లో ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీకి చెందిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అజ్మీర్ దర్గా ఒకప్పుడు శివాలయంగా ఉండేదని వాదిస్తూ తనముందుకు వచ్చిన పిటిషన్‌ను స్వీకరించిన తర్వాత స్థానిక కోర్టు పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది. దర్గాను భౌతిక సర్వే చేయాలని పిటిషనర్ కోరారు.



అయోధ్యకే మినహాయింపు

ఇది ఎక్కడ ముగుస్తుంది? ప్రార్థనా స్థలాల చట్టం ఇప్పుడు నిరర్థకంగా మారిందా? ఇది కేవలం కాగితాలకే పరిమితమైన చట్టమా? దిగువ కోర్టులకు ఇలా పరస్పర విరుద్ధమైన సందేశం పంపడానికి సుప్రీంకోర్టు బాధ్యత వహిస్తుందా?

అసలు నేటి రాజకీయ–మత చర్చకు కేంద్రంగా ఉన్న ఈ చట్టం ఏమిటి? 1991 సెప్టెంబరులో, పీవీ నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు, '1947 ఆగస్టు 15న ఉన్న ఏ ప్రార్థనా స్థలంలోనైనా యథాతథ మతపరమైన స్వభావాన్ని కొనసాగించడం కోసం' పార్లమెంటు చట్టం చేసింది.

అయోధ్య కోసం మాత్రం చట్టంలోనే దీనికి మినహాయింపు ప్రత్యేకంగా ఇచ్చారు. 'ఈ చట్టంలో ఉన్న ఏదీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో ఉన్న రామజన్మభూమి–బాబ్రీ మసీదుగా సాధారణంగా పిలవబడే ప్రార్థనా స్థలానికి వర్తించదు. ఇక్కడ పేర్కొన్న స్థలం లేదా ప్రార్థనా స్థలానికి సంబంధించిన దావా, అప్పీల్ లేదా ఇతర విచారణ వర్తించబడదు' అని అందులో పేర్కొన్నారు. ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం అయోధ్య తీర్పును ప్రకటించినప్పుడు బెంచ్‌లో ఇద్దరు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ధనంజయ వై. చంద్రచూడ్ కూడా ఉన్నారు. ఈ చట్టం ఉద్దేశ్యం 'రాజ్యాంగ ప్రాథమిక విలువలను రక్షించడం, భద్రపరచడం' అని నొక్కిచెప్పడానికి ఈ ప్రత్యేక చట్టాన్ని అమలు చేసినట్లు వీరు చెప్పారు. కీలకమైన విషయం ఏమిటంటే, సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రార్థనా స్థలాల చట్టాన్ని, అది రక్షించే విలువలను రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో ఉంచింది. ఇది కేవలం విద్యాపరమైన లేదా రహస్య వివరాలకు చెందినది మాత్రమే కాదు. ఇది ముఖ్యమైనది. ఎందుకంటే, కేశవానంద భారతి కేసు తీర్పులో, రాజ్యాంగ మౌలిక స్వరూపం మారరాదు అని స్పష్టం చేసింది. ఏదైనా చట్టాన్ని రూపొందించడానికి/సవరించడానికి మాత్రమే పార్లమెంటుకు స్వేచ్ఛ ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది.

బాధ్యతాయుత చట్టం

పార్టీలకు అతీతంగా విస్తృతంగా ప్రశంసలు పొందిన అయోధ్య తీర్పు ఈ చట్టం గురించి ఇలా పేర్కొంది: 'భారత రాజ్యాంగం ప్రకారం లౌకికవాదం పట్ల మన నిబద్ధతను అమలు చేసే దిశగా ప్రార్థనా స్థలాల చట్టం ఒక కించపరచని బాధ్యతను విధిస్తుంది. అందువల్ల చట్టం రూపొందించిన శాసన సాధనం రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలలో ఒకటైన భారత రాజకీయాల లౌకిక లక్షణాలను రక్షించడానికే ఉంది. తిరోగమించకపోవడం అనేది ప్రాథమిక రాజ్యాంగ సూత్రాల మౌలిక లక్షణం. దీనిలో లౌకికవాదం ప్రధాన అంశం. ఆ విధంగా ప్రార్థనా స్థలాల చట్టం అనేది మన లౌకిక విలువల నుంచి తిరోగమించకుండా కాపాడే శాసనపరమైన జోక్యం'.

అయితే, అయోధ్య తీర్పు రచయితలలో ఒకరైన జస్టిస్ ధనంజయ వై. చంద్రచూడ్ 2023 ఆగస్టులో జ్ఞానవాపి మసీదు 17వ శతాబ్దపు నిర్మాణాన్ని ముందుగా ఉన్న ఆలయంపై నిర్మించారా లేదా అని నిర్ధారించడానికి సర్వేను అనుమతించారు. సర్వేను అనుమతించిన హైకోర్టు ఉత్తర్వులపై ఏదైనా స్టే విధించడానికి నిరాకరించారు. ఈ నిర్ణయం ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఉల్లంఘించడమేనన్న వాదనను జస్టిస్ చంద్రచూడ్ తిరస్కరించారు. 'మేము నిర్మాణాన్ని పరిరక్షిస్తాం. మేము మీ ప్రయోజనాలను కాపాడుతాం' అని పేర్కొన్నారు.

వెనక్కి వెళ్లగలమా?

ఇప్పుడు నేను జ్ఞానవాపిపై చారిత్రక, మతపరమైన చర్చకు చెందిన యోగ్యత లేదా లోపాల జోలికి వెళ్లడం లేదు. ఫైజాన్ ముస్తఫా వంటి పండితులు జ్ఞానవాపి కేసు ముస్లిం సమాజానికి అయోధ్య కంటే బలహీనమైన కేసు అని పేర్కొన్నారు. ఇదే మసీదు ఆవరణలో హిందూ భక్తులకు నిశ్శబ్దంగా ప్రార్థన చేసుకొనే వీలు కల్పించాలని గతంలో ముస్లిం సంఘాల నేతలను ఆయన కోరారు. ప్రతీ వివాదంపై న్యాయవ్యవస్థను ఆశ్రయించడంలోని పరిమితులను ఆయన ఎత్తిచూపారు. అయితే ఇవన్నీ మత పెద్దలు, పౌర సమాజంలోని సభ్యుల నేతృత్వంలో జరగాల్సిన చర్చలు.

నిర్దిష్ట ప్రార్థనా స్థలాల స్వభావాన్ని పునర్నిర్ణయించాలంటూ పేరుతో వచ్చే కాపీ కేసులతోనే ఇప్పుడు అసలు ప్రమాదం దాగివుంది. అయితే, సంభల్ మసీదు కమిటీ వేసిన పిటిషన్ విషయంలో, చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు, ట్రయల్ కోర్టు ఎలాంటి చర్యా తీసుకోకుండా నిలుపుదల చేసింది. ఆ సర్వేను అనుమతించిన స్థానిక కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా పై కోర్టును సంప్రదించాలని పిటిషనర్లకు సూచించింది. సర్వేకు సంబంధించిన కమిషనర్ నివేదికను గోప్యంగా ఉంచాలని కూడా ఆదేశించింది.

ఏమైనా, తేనె తుట్టెను ఇప్పటికే సుప్రీంకోర్టు కదిపి ఉండొచ్చు. ఇప్పుడు, మళ్లీ యథాతథ స్థితిని నెలకొల్పడం అనుకున్నదానికంటే కష్టం కావచ్చు.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయురాలు, రచయిత్రి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెడ్డపేరు



పార్లమెంటులో ప్రతిపక్షాలకు సంఖ్యాబలం లేనందున జగదీప్ ధన్‌కడ్‌ను తొలగించలేకపోవచ్చు. కానీ ప్రతిపక్ష పార్టీల విశ్వాసాన్ని కోల్పోయిన మొదటి ఉపరాష్ట్రపతిగా ఆయన ఇప్పుడు చట్టబద్ధత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఆయన పక్షపాత ధోరణి వల్ల ఆయన నిర్వహిస్తున్న ఉన్నత పదవికి చెడ్డపేరు వచ్చింది. – సంజయ్ కె. ఝా, జర్నలిస్ట్

విఫలం



పెద్ద నోట్ల రద్దు పథక రచన, అమలులో శక్తికాంత దాస్ కీలక అధికారి. తర్వాత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా పెద్దనోట్ల రద్దు, కోవిడ్ కలయిక వల్ల ఏర్పడిన దారుణ ఆదాయ అసమానతలతో ఆయన సతమతమయ్యారు. ఇది వినియోగం, వృద్ధి మీద ప్రభావం చూపింది. ఇప్పుడు ఆయన పదవీ విరమణ చేస్తున్నప్పుడు, ఆహార ద్రవ్యోల్బణం 11 శాతం దగ్గరుంది. ఇది ఎలాంటి పనితీరు!
– ఎం.కె. వేణు, సంపాదకుడు

శాంతి నెలకొనేనా?



1950 భూసంస్కరణల తర్వాత, 20 శాతం మంది కశ్మీరీ హిందువులు(పండిట్స్)– ఇందులో అత్యధికులు భూస్వాములు – లోయను వదిలేశారు. 1981లో హిందువులు 5 శాతం ఉండేవారు. 1990ల్లో లౌకిక బృందాలు అణిచివేతకు గురై, ఇస్లామిస్టు తీవ్రవాదం పెరిగాక, ఆ ఉన్న కొద్దిమంది హిందువులు కూడా కశ్మీర్‌ను వదిలేశారు. వీళ్లందరూ తిరిగి కశ్మీర్‌కు చేరినప్పుడే న్యాయం జరిగినట్టు అవుతుంది.
– చేతన్ కుమార్ అహింస, నటుడు – యాక్టివిస్ట్

శాంతి నెలకొనేనా?



అసద్ పోయినందుకు సంతోషిస్తున్నాను. కానీ ఆయన తర్వాత వచ్చిన ఇస్లాంవాదులు మరింత ప్రమాదకరంగా మారవచ్చు. సిరియాలోని మంచివాళ్లు ఈ నేరస్థులను అన్నిటినీ హైజాక్ చేయనివ్వరని ఆశిస్తాను. సిరియా ఇప్పటికే చాలా బాధలు పడింది. దానికి నిజమైన శాంతి, ప్రజాస్వామ్యాలు అవసరం.
– హబీబ్ ఖాన్, యాక్టివిస్ట్

నాయకులే సమస్య



ఆఫ్రికా పేదగా ఉండటం అనేది సమస్య కాదు. ఆఫ్రికా నాయకులు పూర్వ వలసదారుల ప్రయోజనాల కోసం పని చేస్తుండటమే అసలు సమస్య.
– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

తప్పించుకుంటున్నామా?



ప్రపంచ ఆకలి సూచీ, అధిక పోషకాహార లోప గణాంకాలలో హీనమైన ర్యాంకింగ్‌ను భారతదేశం తిరస్కరిస్తూనే ఉంది. ఇలాగైతే సహజంగానే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సంభవిస్తున్న ఆకలి చావులను ఆపడానికి ఏమీ చేయనక్కర్లేదన్నమాట! దేశంలో ప్రజలు ఆకలితో చనిపోవడం అనేది జాతికి ఎంత సిగ్గుచేటు!
– సిల్వియా కర్పగం, వైద్యురాలు

ఇన్ బాక్స్

పట్టు వీడని నెతన్యాహు

ఇజ్రాయెల్ గాజాపై దాడులు చేస్తూనే ఉంది. హమాస్, హెజ్‌బొల్లాలను నామరూపాలు లేకుండా చేయాలనే తలంపుతో ఉన్నాడు ఆ దేశ ప్రధాని నెతన్యాహు. ఈ దిశలో అమెరికా, ఫ్రాన్స్ నెరపిన దౌత్యం ఫలించినట్లే అనుకున్న తరుణంలో ఇజ్రాయెల్ ప్రకటన మరో విధంగా ఉంది. 'హమాస్‌తో కాల్పుల విరమణ అంటే ఉగ్రవాదానికి తల వంచినట్లే. మాకు దేశ పౌరుల ప్రయోజనాలు ముఖ్యం. మా పౌరులకూ, మా దేశానికీ... హమాస్, హెజ్‌బొల్లాలు శత్రువులు. వాళ్ల వినాశనమే మాకు ముఖ్యం. హమాస్‌తో రాజీ ఎట్టి పరిస్థితులలోనూ ఉండదు, కాల్పుల విరమణ జరుగదు' అని తేల్చి చెప్పారు.

ప్రస్తుతం సిరియా సరిహద్దులలో ఉండే తమ పౌరుల క్షేమం చూడవలసిన బాధ్యత తమపై ఉందనీ, హమాస్‌కు లొంగితే అది మళ్ళీ ఎప్పుడైనా పేట్రేగి



కొత్త రూపాన్ని సంతరించుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుందనీ నెతన్యాహు అన్నారు. 'యుద్ధాన్ని ఆపాలని అమెరికా, ఫ్రాన్స్ చర్చలు జరిపి నప్పటికీ మాకు హమాస్‌పై నమ్మకం కుదరలేదు. మేము పరిమిత దాడులు మాత్రమే చేస్తున్నామని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి కూడా తెలియ పరచా'మని నెతన్యాహు చెప్పడం గమనార్హం.

అమెరికా ఒక పక్క రాజీ చర్చలు అంటూనే మరో పక్క నెతన్యాహుకు సహాయ సహకారాలు అందిస్తూ ఉంది. ఇప్పటికైనా హమాస్ కళ్ళు తెరిస్తే మంచిది. లేకపోతే ఇజ్రాయెల్ అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకుంటుంది. ఈ విషయంలో భారత్ 'ఉగ్ర సంస్థలను నిర్మూలించాల్సిందే' అనే దృక్పథంతో ఉంది. అయితే దాడులు, కాల్పులు హమాస్ పైనే ఉండాలి కాని, సాధారణ పౌరుల పై, ఆశ్రయం పొందుతున్న వారిపై కాదు అనేది భారత్ తలంపు.

మొత్తానికి ఇజ్రాయెల్ నేత హమాస్ వినాశనానికే కంకణం కట్టుకున్నట్లు తెలుస్తోంది. రష్యా– ఉక్రెయిన్ యుద్ధం కంటే హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం భీతావహంగా మారింది. పశ్చిమ ఆసియా ఈ యుద్ధం నుంచి ఎప్పటికి తేరుకుంటుందో కాలమే సమాధానం చెప్పాలి.

– కనుమ ఎల్లారెడ్డి, తాడిపత్రి

ఈ తిరుగుబాట్లు ఎందుకు జరిగాయంటే...

అభిప్రాయం



రెహానా బేగం

సరిగ్గా నాలుగు నెలల కిందట బంగ్లాదేశ్ ప్రధాని నివాసంలో కనిపించిన దృశ్యాలే ఇవాళ సిరియా అధ్యక్ష భవనంలో కనిపిస్తున్నాయి. ప్రజా ఆగ్రహానికి గురై షేక్ హసీనా దేశాన్ని వీడిన వెంటనే ఆమె ప్రధానమంత్రి అధికారిక నివాసంలో తిరుగుబాటుదారులు దాడిచేసి ఇంటిని లూటీ చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఇదే సీన్ సిరియా అధ్యక్ష భవనంలో రిపీట్ అయ్యింది. ఆ దేశ నియంత బషర్ అల్ అసద్ తిరుగుబాటుదారుల దాడికి దేశాన్ని వీడారు. ఆ వెంటనే అధ్యక్ష భవనంలోకి తిరుగుబాటుదారులు జొరబడి కనిపించిన వస్తువులను ఎత్తుకెళ్లటం చూస్తున్నాం. సిరియా అధ్యక్షుడిగా రెండున్నర దశాబ్దాల పాటు ఆ దేశాన్ని ఏలిన బషర్ అల్ అసద్ దేశాన్ని విడిచి పారిపోవాల్సిన పరిస్థితి వచ్చింది.

సిరియా దాదాపు 13 ఏళ్లుగా అంతర్యుద్ధంతో సతమతం అవుతూనే ఉంది. దీనిలో 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్లు రష్యా, అమెరికా వంటి దేశాల పాత్రను కూడా మరిచిపోకూడదు. అసద్ తండ్రి హాఫీజ్ 1970లో తిరుగుబాటు ద్వారా అధికారం చేజిక్కించుకున్నారు. ఆయన మరణానంతరం అసద్ అధికారంలోకి వచ్చారు. అంటే ఏకంగా 54 ఏళ్ళుగా అసద్ కుటుంబ నియంతృత్వ పాలనలోనే సిరియా మగ్గిపోయింది. ఉగ్రవాదాన్ని, అంతర్యుద్ధాన్ని కట్టడి చేయలేక పోవటం ప్రజాస్వామిక విధానాలను దరిదాపుల్లోకి రానీయకపోయిన ఫలితాన్ని అసద్ ఇవాళ చవి చూస్తున్నారు. దేశాన్ని వదిలి రష్యా నీడన ఆశ్రయం పొందుతున్నారు. తిరుగుబాటుకు నేతృత్వం వహించిన హయాత్ తహరీర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్) సంస్థను ఐక్యరాజ్య సమితి గతంలోనే ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఈ సంస్థకు నాయకత్వం వహిస్తున్న అబూ మహమ్మద్ అల్–జులానీ ఒకప్పుడు అల్ ఖైదా ఉగ్రవాది. అంటే సిరియా దేశంలో నియంతృత్వం అంతరించే సూచనలు కనుచూపు మేరలో కనిపించకపోగా... ఆ దేశ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

సిరియా, బంగ్లాదేశ్ పరిస్థితులను ఒకే గాటన కట్టలేకపోవచ్చు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళనలు రేగి అవి హింసాత్మకంగా మారటంతో పరిస్థితి చేయి దాటిపోయింది బంగ్లాదేశ్ లో. హసీనా ప్రభుత్వం



కూడా రిజర్వేషన్లకు వ్యతిరేకంగానే నిర్ణయం తీసుకున్నా... అప్పటికే ఆమె నిరంకుశ వ్యవహార శైలి పట్ల ప్రజల్లో పేరుకుపోయిన వ్యతిరేకత ఒక్కసారిగా ఎగిసిపడింది. ఆమె దేశాన్ని వదిలి పారిపోవాల్సిన పరిస్థితిని తెచ్చింది. ఈ పరిణామాల తర్వాత బంగ్లాదేశ్ మత ఛాందస దిశగా అడుగులు వేయటం ఆందోళనకరమైన అంశం. నోబెల్ బహుమతి గ్రహీత యూనస్ నేతృత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో అక్కడి హిందూ మైనార్టీలపై దాడులు, చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్, ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటించాలన్న డిమాండ్లు వీటికి సంకేతాలు.

కాస్త వెనక్కి వెళితే...

రెండేళ్లు వెనక్కి వెళితే 2022 జూలైలో అప్పటి శ్రీలంక అధ్యక్షుడు గొటబయ రాజపక్సా కూడా ఇదే విధంగా పెట్టేబేడా సర్దుకుని ఉన్నఫళంగా దేశాన్ని వదిలి పారిపోవాల్సి వచ్చింది. ఆ దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేనంత ఆర్థిక సంక్షోభ పరిస్థితులు తలెత్తటంతో తిరుగుబాటుదారులు అధ్యక్ష భవనంపై దాడి చేశారు. అదే సమయంలో ప్రధాని రణిల్ విక్రమ సింఘే నివాసానికి కూడా నిప్పు పెట్టారు. ప్రజాగ్రహానికి తలొంచి రణిల్ సైతం ఆ రోజు రాజీనామా చేయక తప్పలేదు. ఇక సిరియా లాంటి తిరుగుబాటును 2021 ఆగష్టులో అఫ్గానిస్తాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ చవి చూశారు. దశాబ్దాలుగా తీవ్ర సంక్షోభం, ఉగ్రవాదం, అంతర్యుద్ధాలకు కేంద్రంగా మారిన అఫ్గానిస్తాన్‌లో అష్రఫ్ ఘనీ నియంతలా పాలన చేశారు. చివరకు తాలిబాన్ల దాడిని ఎదుర్కోలేక దేశం విడిచి పారిపోయారు. ఆ దేశాన్ని హస్తగతం చేసుకున్న తాలిబన్లు ఇస్లాం చట్టాల పేరుతో ఏ విధంగా మానవ హక్కులను కాలరాస్తున్నారో యావత్ ప్రపంచం చూస్తూనే ఉంది.

ఈ నాలుగు దేశాల్లో సంక్షోభాలకు కారణాలు వేర్వేరు కావచ్చు, తీవ్రతల్లో తేడాలు ఉండొచ్చు. కాని ఫలితం మాత్రం ఒకటే. అంతే కాదు, పర్యవసానాల్లోనూ సారూప్యత కనిపిస్తోంది. శ్రీలంక మినహాయిస్తే అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్, సిరియాల్లో మత ఛాందసవాదమే రాజ్యమేలేటట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు ఆ యా దేశాల ప్రజలకే కాదు ప్రపంచానికి సైతం ప్రమాదకరం.

వ్యాసకర్త రాష్ట్ర సమాచార కమిషనర్, ఏపీ

ప్రాయశ్చిత్తం

చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం అనుభవించడం భారతీయ సంస్కృతిలో ఒక భాగం. ఈ కథ అదే చెబుతుంది. శంఖుడు, లిఖితుడు అనే అన్నదమ్ములు మునులు. వాళ్ళ ఆశ్రమాలు పచ్చగా చెట్టు చేమలతో అలరారుతూ ఉంటాయి. ఒకసారి శంఖుడు ఇంట్లో లేనప్పుడు లిఖితుడు ఒక చెట్టుకి ఉన్న పళ్ళను కోసి తింటున్నాడు. ఆ చెట్టు శంఖుడిది. అప్పుడే అక్కడికి వచ్చిన శంఖుడు 'ఆ పళ్ళెక్కడివి' ని అడిగాడు. లిఖితుడు వినయంగా ఆ చెట్టును చూపించాడు. 'అనుమతి లేకుండా కోశావు. అది దొంగతనం అవుతుంది. నువ్వు పాపం చేసినట్లు నిర్ధారణ అయింది. రాజు దగ్గరికి వెళ్లి తప్పు ఒప్పుకుని శిక్ష పొందిరా' అన్నాడు శంఖుడు. రాజ్యంలో ఎవరు ఏ తప్పు చేసినా శిక్ష రాజే వెయ్యాలి అన్నది నియమం.

జ్యోతిర్మయం

లిఖితుడు వెంటనే రాజు వద్దకు వెళ్లి, 'నా అన్న అనుమతి లేకుండా అతని చెట్టు పళ్ళు కోసి తిన్నాను. తప్పు చేశాను. రాజ దండన పొందినవారికి యమ దండన ఉండదు. అందుకని నాకు తగిన శిక్ష వెయ్య'మన్నాడు. రాజు తానా పని చెయ్యలేనని భక్తితో చెప్పినా లిఖితుడు శిక్ష వేయమని పట్టు బడతాడు.

తుదకు రాజు లిఖితుని రెండు చేతులు ఖండించి శిక్షిస్తాడు. లిఖితుడు రాజుని దీవించి, అన్న దగ్గరికి వెళ్ళి రాజ దండన అనుభవించానని చెపుతాడు. శంఖుడు సంతోషించి 'ధర్మ మార్గాన్ని ఎవరూ తప్పకూడదు. ఏ తప్పుకైనా ప్రాయశ్చిత్తం అవసరం. నీ వల్ల మన వంశం ప్రసిద్ధి కెక్కుతుంది. నువ్వు వెళ్లి బాహుదా నదిలో మునిగి దేవతలకు, మునులకు నమస్కరించు' అని చెబుతాడు.

లిఖితుడు నదిలో మునగగానే రెండు చేతులూ యథా ప్రకారం వచ్చేస్తాయి. లిఖితుడు ఆనందంతో అన్న దగ్గరికి వచ్చి చేతులు చూపించగా శంఖుడు 'ఇది దైవం చేసిన అద్భుతం. నువ్వు పరిశుద్ధుడవని దేవుడు ఒప్పుకున్నాడ'ని అన్నాడు.

తప్పు చేసినప్పుడు దాన్ని తమ ఆత్మసాక్షి ముందైనా ఒప్పుకుని మళ్ళీ అటువంటివి పునరావృత్తం కాకుండా చూసుకోవడం నేటి తరం కనీస కర్తవ్యం.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.8.25 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** అశ్విని ఉ.8.24 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.5.21 నుండి 6.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.04 నుండి 10.46 వరకు, తదుపరి ప.2.26 నుండి 3.10 వరకు, **అమృతఘడియలు:** రా.2.17 నుండి 3.47 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 5.23.

మహా 'షెల్' రాష్ట్ర



దేశంలో గత 5 ఏళ్లలో చూస్తే.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక షెల్ కంపెనీలను గుర్తించి, చర్యలు తీసుకుంది కేంద్ర ప్రభుత్వం. నిజానికి కంపెనీల చట్టంలో షెల్ కంపెనీ అనే పదానికి నిర్వచనమేదీ లేదు. వరుసగా రెండేళ్లుగా ఎలాంటి వ్యాపార నిర్వహణ, లావాదేవీలు లేని, వార్షిక రిటర్నులు సమర్పించని కంపెనీలను షెల్ కంపెనీలుగా వ్యవహరిస్తారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇలాంటి వాటిని గుర్తించి, వాటిని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ జాబితా నుంచి తొలగిస్తుంటుంది. ఇలా 2019-20 నుంచి 2023-24 వరకు మొత్తంగా 2,33,566 కంపెనీలను తొలగించారు. ఒక్క 2022-23లోనే 82,125 కంపెనీలు గుర్తించారు. అత్యధిక షెల్ కంపెనీలు ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. ఆ తరవాతి స్థానంలో ఢిల్లీ ఉంది. దేశంలోని టాప్ - 5 రాష్ట్రాల్లోనే సుమారు 58 శాతం షెల్ కంపెనీలు ఉన్నాయి. ఏపీలో మొత్తం కంపెనీలు 5,091, తెలంగాణలో 13,764.

5 ఏళ్లలో గుర్తించిన షెల్ కంపెనీలు

మహారాష్ట్ర	36,856
ఢిల్లీ	35,637
ఉత్తరప్రదేశ్	22,644
పశ్చిమబెంగాల్	20,304
కర్ణాటక	19,242

ఆధారం: కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ

క్లుప్తంగా...

వాయు'గండం' లేనట్లే.!

- రాష్ట్రానికి తప్పిన తీవ్ర అల్పపీడనం ముప్పు
- నేడు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: ఇటీవల ఫెంగల్ తుపాన్‌తో వణికిన దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలు.. మరోసారి అదే వైపుగా అల్పపీడనం వస్తుండటంతో ఆందోళనకు గురవుతుండగా.. ఆ భయం వద్దని వాతావరణశాఖ ధైర్యం చెప్పింది. దీని ప్రభావం రాష్ట్రంపై అంతగా ఉండదని స్పష్టం చేసింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది వాయుగుండంగా బలపడిన తర్వాత.. శ్రీలంక, తమిళనాడు తీరాలవైపుగా పయనించి అక్కడే తీరం దాటే సూచనలున్నాయని వెల్లడించారు. ఈ తీవ్ర అల్పపీడనం ప్రభావంతో నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలతో పాటు దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. గురువారం కోస్తా జిల్లాల్లో వాతావరణం మేఘావృతంగా ఉంటుందని పేర్కొన్నారు.

దేశానికే ఆదర్శం కేరళ

భారతీయ కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్

సాక్షి, అమరావతి: ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు మించి ఇస్తోన్న ఏకైక రాష్ట్రం కేరళలోని వామపక్ష ప్రభుత్వమేనని భారతీయ కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్ అన్నారు. క్వింటా ఎమ్మెస్పీ రూ.2,300 అయితే, కేరళ రాష్ట్రం క్వింటాకు రూ.2,820 చొప్పున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తూ..దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.సీఐటీయూ, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ఎంబీవీకే బాలోత్సవ భవన్‌లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు అధ్యక్షతన బుధవారం జరిగిన కేరళ సంఘీభావ సభలో విజూకృష్ణన్ మాట్లాడుతూ కేరళ వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్ర బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత విధానాలకు పాల్పడడం సరికాదన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు మాట్లాడారు.

పేర్ని నాని కుటుంబంపై కక్ష సాధింపు

సతీమణిపై కేసు నమోదు



చిలకలపూడి (మచిలీపట్నం): మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) సతీమణి పేర్ని జయసుధపై బుధవారం కేసు నమోదైంది. కృష్ణాజిల్లా, మచిలీపట్నం మండలంలోని పొట్లపాలెంలో పేర్ని నానికి సంబంధించిన గోడౌన్ నుంచి పౌర సరఫరాల శాఖ సంబంధించిన పీడీఎస్ బియ్యం ఎన్నికలకు ముందు తరలించారని వచ్చిన సమాచారం మేరకు పౌర సరఫరాలు, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా ఉండాల్సిన స్టాక్ కన్నా తక్కువ స్టాక్ ఉన్నట్లు గుర్తించారు. 3,700 బస్తాలు తగ్గాయని నిర్ధయించారు. పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పౌరసరఫరాల సంస్థ జిల్లా కార్యాలయంలో అసిస్టెంట్‌మేనేజర్‌గా పనిచేస్తున్న చింతం కోటిరెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పేర్ని నాని సతీమణి జయసుధ, గోడౌన్ మేనేజర్ మానసతేజపై కేసు నమోదు చేశారు.



కృష్ణా జిల్లా నెప్పల్లిలో ఆరబోసిన ధాన్యానికి మొలకలు వచ్చాయని వాపోతున్న అన్నదాతలు



కోనసీమ జిల్లా లో మొలకలు వచ్చిన ధాన్యంతో రైతు సాయిబాబా నిర్వేదం



మొలకెత్తిన ధాన్యంతో దిగాలుగా కృష్ణాజిల్లా చలివేంద్రపాలెం కౌలు రైతు దుర్గాభవాని



బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చినపులివర్రులో ఇటీవల తుపానుకు తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

రైతు కంట కన్నీరు!

రేపు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద అన్నదాతల ఆందోళన

సాక్షి, అమరావతి: అన్నదాత కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పడరాని పాట్లు పడుతున్నారు. ఏటా సీజన్‌కు ముందే అందే పెట్టుబడి సాయం లేదు. ఉచిత పంటల బీమా అటకెక్కింది. పంటల బీమా పరిహారం జాడలేదు. కరువు సాయం ఊసే లేదు. సున్నా వడ్డీ రాయితీ లేదు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందడం లేదు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలకు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కనీస మద్దతు ధర దక్కక రైతులు ఆత్మహత్యలకు ఒడిగట్టే దుస్థితి నెలకొంది. ప్రభుత్వ తీరుపై అన్నదాతలు కన్నెర్ర చేస్తున్నారు. ఓవైపు విత్తనాలు, ఎరువుల కోసం ధర్నాలు చేస్తున్నారు. మరోవైపు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆందోళన బాటపట్టారు. ఇటీవలే ధాన్యం రాశులతో మండల కేంద్రాల ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు డిమాండ్‌తో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగడం రాష్ట్రంలో రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో ఆర్నెల్ల కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షోభంలో కూరుకుపోయిన రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఆందోళన బాటపట్టింది. ఈ నెల 13వ తేదీన జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట వైఎస్సార్ సీపీ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన వ్యక్తం చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.



కృష్ణాజిల్లా అంగలూరులో ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని రైతు వెంకటేశ్వరరావు ఆవేదన

అన్నదాతా.. ఎక్కడ సుఖీభవ?

అధికారంలోకి రాగానే ప్రతీ రైతుకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తామంటూ సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీని చంద్రబాబు అటకెక్కించేశారు. గత ఐదేళ్లుగా వైఎస్సార్ రైతు భరోసా కింద లబ్ధి పొందిన 53.58 లక్షల మంది రైతులకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించాలంటే ఏటా రూ.10,718 కోట్లు అవసరం. కానీ బడ్జెట్‌లో కేవలం రూ.వెయ్యి కోట్లు మాత్రమే విదిలించి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ ప్రారంభమై 40 రోజులు దాటింది. కేంద్రం రెండు విడతల్లో పీఎం కిసాన్ సాయం అందించినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్క విడత కూడా పెట్టుబడి సాయాన్ని జమ చేసిన పాపాన పోలేదు. అన్నదాత సుఖీభవ కోసం విధివిధానాల రూపకల్పన కూడా జరగలేదు. పెట్టుబడిసాయం అందక, సకాలంలో రుణాలు దొరక్క గత రెండు సీజన్లలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

పంటల బీమాకు దూరం

రైతులపై పైసాభారం పడకుండా ఐదేళ్ల పాటు నోటిఫై పంటలకు యూనివర్సల్ కవరేజ్ కల్పిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించేసింది. 2023-24 సీజన్‌కు సంబంధించి రైతులతో సహా రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి రూ.930 కోట్ల ప్రీమియం మొత్తాన్ని జమ చేయకపోవడం వల్ల ఆ సీజన్‌లో కరువు వల్ల పంటలు దెబ్బతిన్న దాదాపు 15 లక్షల మంది రైతులకు రూ.1,385 కోట్ల బీమా పరిహారం అందకుండా పోయింది. రబీ సీజన్ నుంచి స్వచ్ఛంద నమోదు పద్ధతిలో పంటల బీమా అమలు చేస్తుండడంతో ప్రీమియం భరించలేక రైతులు పంటల బీమాకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. రబీలో ఇప్పటి వరకు 16.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగైతే బీమా కవరేజ్ పొందిన విస్తీర్ణం కేవలం 65 వేల ఎకరాలు మాత్రమే. ప్రీమియం భారం రైతుల నెత్తిన వేయడంతో ఈ సీజన్‌లో రూ.350 కోట్లకుపైగా భారం భరించలేక పంటల బీమాకు దూరమవుతున్నారు.



కృష్ణా జిల్లా కంకిపాడు మండలం దావులూరులో వర్షానికి తడిచిపోయిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

కరువు సాయం అందక అగచాట్లు

వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్-2023 సీజన్‌లో పంటలు నష్టపోయిన 8.89 లక్షల మంది రైతులకు రూ.1,126.31 కోట్లు జమ చేశారు. సాంకేతిక కారణాల వల్ల 1.54 లక్షల మందికి రూ.163.12 కోట్లు జమ కాలేదు. రబీ-2023-24 సీజన్‌లో కరువు ప్రభావం వల్ల 2.52 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలకు గాను 2.32 లక్షల మంది రైతులకు రూ.164.05 కోట్ల కరువు సాయం చెల్లించాల్సి ఉంది. ఈ రెండు బకాయిలు కలిపి 3.91 లక్షల మంది రైతులకు రూ.327.71 కోట్ల కరువు సాయం ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతోంది. ఇక ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాల వల్ల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల తొలుత 16 జిల్లాల్లో 1.65 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, చివరికి నాలుగు జిల్లాల్లో 54 వేల ఎకరాలకు పరిమితం చేశారు. 29,944 మంది రైతులకు రూ.37.33 కోట్లు పరిహారం చెల్లించాలని లెక్కతేల్చగా ఆచరణకు వచ్చేసరికి కేవలం 23వేల మందికి రూ.25.75 కోట్లకు కుదించేశారు. ఆ పరిహారం నేటికీ జమ చేయలేదు. సెప్టెంబర్‌లో కురిసిన భారీవర్షాలు, వరదలకు తొలుత 6 లక్షల ఎకరాల్లో పంటలతో పాటు పెద్ద ఎత్తున పాడి రైతులకు జరిగిన నష్టానికి సంబంధించి రూ.557 కోట్ల పరిహారం ఇవ్వాలని అంచనా వేయగా చివరికి 2.15 లక్షల మందికి రూ.319.59 కోట్లకు కుదించేశారు. సాంకేతిక కారణాలతో లక్షలాది మందికి నేటికీ పరిహారం అందక పడరాని పాట్లు పడుతున్నారు. మరొక పక్క వర్షాభావ పరిస్థితుల వల్ల కరువుతో అల్లాడుతున్న రాయలసీమ జిల్లాల్లో కంటి తుడుపుగా కరువు మండలాల ప్రకటన చేసిన ప్రభుత్వం ఆయా జిల్లాల రైతులను ఆదుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తోంది.

కలిసిరాని సాగు.. ఆదుకోని ప్రభుత్వం

ప్రభుత్వ నిర్వాకానికి తోడు వైపరీత్యాల ప్రభావంతో ఖరీఫ్‌తో పాటు రబీ సాగు కూడా రైతులకు కలిసిరావడం లేదు. పెట్టుబడుల కోసం పడరాని పాట్లు పడ్డారు. రూ.3-5 వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ సాగు చేసినా వైపరీత్యాల ప్రభావంతో పంటలు దెబ్బతినడంతో పాటు ఆశించిన దిగుబడులు రాక లక్షలాది మంది రైతులు నష్టాలపాలయ్యారు. చేతికొచ్చిన పంటలు అమ్ముకునే సమయంలో మార్కెట్‌లో ధరలేక ధాన్యం రైతులతో పాటు పత్తి తదితర పంటల రైతులకు పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది. ఓ వైపు ముమ్మరంగా కోతలు జరుగుతున్న దశలో విరుచుకుపడిన ఫెంగల్ తుపాన్ ప్రభావంతో చేతికొచ్చిన పంట దెబ్బతిని మరింత నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో తమ రెక్కల కష్టార్జితాన్ని దళారీల పాల్జేయాల్సిన దుస్థితి రైతులకు దాపురించింది.

తేమ శాతం సాకుతో దోపిడీ..

కేంద్ర ప్రభుత్వం ధాన్యం సాధారణ రకానికి క్వింటా రూ.2300, ఏ-గ్రేడ్‌కు రూ.2320గా మద్దతు ధర ప్రకటించింది. అంటే 75 కేజీల బస్తాకు సాధారణ రకానికి రూ.1725, ఏ-గ్రేడ్‌కు రూ.1740 గిట్టుబాటు ధర చెల్లించాలి. కానీ కూటమి ప్రభుత్వ పాలనలో 75 కేజీల బస్తాకు రూ.400 నుంచి రూ.500 వరకు రైతు నష్టపోతున్నారు. రైతు సేవా కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని తేమ శాతాన్ని బట్టి ధర నిర్ణయించాల్సిన అధికారులు మిల్లర్లు చెప్పిన ధరకు అమ్ముకోమంటూ సలహాలిస్తున్నారు. మరోవైపు మార్కెట్‌లో మద్దతు ధరకు మించి రేటు పలికే ఎంటీయూ 1262, ఎంటీయూ 1318, బీపీటీ 5204 వంటి ఫైన్ వెరైటీస్‌కు కూడా ఈసారి మద్దతు ధర కూడా దక్కడం కష్టంగా ఉంది. 75 కేజీల బస్తా రూ.1300-1500 మధ్య కొనే పరిస్థితి నెలకొంది. కోసిన ధాన్యాన్ని కొనే నాధుడు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. గోనె సంచుల కొరత తీవ్రంగా ఉంది. ఆరబోతకు కూలీల కొరత వేధిస్తోంది. కూలీల ఖర్చులు, పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్స్‌కు ఎకరాకు రూ.వెయ్యి వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న రైతు ఆత్మహత్యలు

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్న రైతులు పెద్ద సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కేవలం ఆర్నెల్ల వ్యవధిలోనే సుమారు 70 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు ఒడిగట్టడం రాష్ట్రంలో రైతుల దయనీయ పరిస్థితులకు నిదర్శనంగా నిలుస్తోంది. అత్యధికంగా ఒక్క కర్నూలు జిల్లాలోనే 30 మందికి పైగా బలవన్మరణం చెందారు. రాయలసీమ జిల్లాలతో పాటు కోస్తాంధ్ర, గోదావరి జిల్లాల్లో కూడా రైతు ఆత్మహత్యలకు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క రైతు కుటుంబానికీ కూటమి సర్కారు పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవు.

జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే..

అదే వైఎస్ జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే.. జూన్‌లో అన్నదాతకు తొలి విడత వైఎస్సార్ రైతు భరోసా సాయం అందేది. గడిచిన సీజన్ మాదిరిగానే ఈ ఏడాది కూడా 53.58 లక్షల మందికి మేలో రూ.7,500, అక్టోబర్‌లో రూ.4,000 చొప్పున పెట్టుబడి సాయాన్ని జమ చేసేవారు. ఖరీఫ్-2023 సీజన్‌కు సంబంధించి రూ.1,385 కోట్ల బీమా పరిహారం అందేది. కరువు సాయం బకాయిలు రూ.327.71 కోట్ల కూడా జమ చేసేవారు. సున్నా వడ్డీ రాయితీ కింద సుమారు రూ.130 కోట్ల వరకు జమయ్యేది. ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన ప్రతీ రైతుకు పూర్తి స్థాయిలో పరిహారం జమయ్యేది.

కేవీ రావు చౌదరిపై చర్యలు తీసుకోవాలి

సీఎం చంద్రబాబుకు యనమల రాసిన లేఖపై స్పందించిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: కోనప్రాంతంలో 22 ఏళ్ల క్రితం కేఎస్‌ఈజెడ్ పేరుతో రైతుల నుంచి భూములు కాజేసిన కేవీరావు చౌదరిపై ప్రభుత్వం కేసులు పెట్టి, దోచేసిన సొమ్మును రికవరీ చేసి బాధిత రైతులకు పంచాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ తుని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం వేమవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉండి కీలక పదవులు నిర్వహించిన ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు బీసీలకు అన్యాయం జరిగిందంటూ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖపై ఆయన స్పందించారు. కాకినాడ సెజ్‌లో భూసేకరణలో కేవీ రావు చౌదరి రైతులను దోచుకున్న సంగతిని ఆ లేఖలో యనమల పేర్కొన్నారన్నారు. కాకినాడ సెజ్‌కు భూసేకరణ జరిగి దాదాపుగా 22 ఏళ్లు గడచిందని 2002లో అధికారంలోకి ఉండి అనంతరం ఓటమి చెంది, మళ్లీ 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న కాలంలో పరిశ్రమలకు భూముల కేటాయింపుపై కేబినెట్‌లో తీర్మానం చేశారని గుర్తు చేశారు. దీర్ఘకాలంపాటు అధికారంలో ఉన్న యనమల రామకృష్ణుడికి ఇప్పుడు కనువిప్పు కలిగి రైతులు, బీసీలు, ఎస్సీలు గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా గుర్తురావడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం అధికారంలో సీఎం చంద్రబాబే ఉన్నారని, ఆయనతో యనమల మాట్లాడి రైతుల నుంచి భూములు కాజేసిన కేవీరావు చౌదరిపై కేసులు పెట్టి, దోచేసిన వేల కోట్ల రూపాయలను రికవరీ చేసి రైతులకు నష్టపరిహారంగా అందించాలన్నారు. 2014లో యనమల ఆర్థికమంత్రిగా ఉండగా తీర ప్రాంతంలో పరిశ్రమలకు భూములు కేటాయించారన్నారు. రూ.కోట్ల విలువ చేసే ఆ భూములకు ప్రభుత్వం, కంపెనీలు ప్రకటించిన రూ.మూడు లక్షలు నచ్చక పోవడంతో రైతులు ఆ పరిహారం తీసుకోకుండా కోర్టులను ఆశ్రయించారని తెలిపారు. కంపెనీలు ఆ భూముల్లో ప్రహరీలు నిర్మించి వ్యవసాయం చేయనివ్వకుండా ఆక్రమించుకున్నాయన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం, యనమల రామకృష్ణుడు ఆ రైతులకు కూడా న్యాయం చేయాలన్నారు. కేఎస్‌ఈజెడ్ తీర ప్రాంత రైతులకు న్యాయం చేసేందుకు హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో పిటిషన్ వేసి, సమష్టిగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. దీనికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడిశెట్టి రాజా

ఇది రైతుల పక్షాన నిలబడాల్సిన సమయం

జిల్లా కేంద్రాల్లో 13న తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- అనుమతులివ్వకుండా ఇబ్బందిపెడితే న్యాయపరంగా ఎదుర్కొందాం
- వైఎస్సార్‌సీపీ ఈ కార్యక్రమం శాంతియుతంగా చేపడుతోంది
- జిల్లా పార్టీ అధ్యక్షులు, శ్రేణులు క్రియాశీలకంగా దీనిలో పాల్గొనాలి
- పార్టీ రాష్ట్ర సమన్వయకర్త 'సజ్జల' పిలుపు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని.. ఇలాంటి సమయంలో మనం రైతులకు అండగా నిలబడాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ధాన్యం సేకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, రైతులకు న్యాయం జరిగేలా పోరాటం చేయాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని సజ్జల తెలిపారు. ఇందులో భాగంగా.. ఈనెల 13న అన్ని జిల్లా కేంద్రాల్లో తలపెట్టిన ర్యాలీలు, మెమోరాండం సమర్పించే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో బుధవారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేసేవారు లేక, గిట్టుబాటు ధర అందక రైతులు అల్లాడుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఈ ఆందోళనకు పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్రంలో రైతు సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు వైఎస్ జగన్ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారని.. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు కలిసి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి, అధికారులకు మెమోరాండం సమర్పించాలని ఆయన కోరారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు మొత్తం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు.

అనుమతులు నిరాకరిస్తే న్యాయపోరాటం..

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, రైతులకు న్యాయం జరిగేలా ఒత్తిడి చేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. శాంతియుతంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుమతులు నిరాకరించి, కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తే, దానిని న్యాయపరంగా ఎదుర్కొంటామని సజ్జల చెప్పారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ, రైతులకు అండగా నిలుస్తూ, అన్ని జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ఈ కార్యక్రమంపై జాతీయ స్థాయిలోనూ ఆసక్తి వ్యక్తమవుతోందని.. వైఎస్సార్‌సీపీ ఎంత బలంగా ఉందో, ప్రజాసమస్యలపై ఎంత దృఢంగా ఉందో ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమవుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో.. జిల్లా పార్టీ అధ్యక్షులు అందరినీ సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు.. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించిందని.. పార్టీ శ్రేణులు సైతం భారీగా ఈ కార్యక్రమాల్లో పాల్గొని, రైతుల గొంతుకగా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు కృషిచేయాలని సజ్జల చెప్పారు.

అమరావతిలో అడ్డగోలు దోపిడీకి మళ్లీ స్కెచ్..!

మొదటి పేజీ తరువాయి

పనుల ప్రకారం కాకుండా ఏకమొత్తంగా ఇచ్చేందుకు నిర్ణయించి ఆ మేరకు జీఓ కూడా విడుదల చేశారు. ఇటీవల జరిగిన రెండు సీఆర్డీఏ అథారిటీ సమావేశాల్లో మొత్తం రూ.20,292.46 కోట్ల పనులకు అనుమతులిచ్చిన ప్రభుత్వం.. పనులను బట్టి వీటి విలువను ఏకంగా 28 నుంచి 55 శాతం మేర పెంచింది. అంటే.. అనుమతులిచ్చిన పనుల్లో సరాసరి రూ.10 వేల కోట్ల మేర పెంపు చూపడంపై నిర్మాణరంగ నిపుణులే నోరెళ్లబెడుతున్నారు. ఐదేళ్లలో పనుల విలువ ఇంత భారీగా పెంచడం దేశ చరిత్రలో ఎక్కడా చూడలేదంటున్నారు.


ధరలు పెద్దగా పెరగకపోయినా..

గత టీడీపీ ప్రభుత్వం సీఆర్డీఏలో 2017-18 మధ్య ఈ ప్రాంతంలో నిర్మాణ పనులు చేపట్టింది. అప్పటికి ఇప్పటికీ నిర్మాణ సామాగ్రి ధరలు పెద్దగా పెరగకపోయినా పనుల వ్యయాన్ని మాత్రం అమాంతం పెంచడం ఆలోచించాల్సిన విషయమేనని వారంటున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వం పనుల్లో పారదర్శకత, వ్యయం తగ్గింపుపై ప్రత్యేక దృష్టిపెట్టి రివర్స్ టెండర్ల విధానం అమల్లోకి తెచ్చింది. అయితే, ఈ విధానం కొనసాగితే తాము అనుకున్నట్లు సాగదని.. పైగా తమ లక్ష్యం నెరవేరదని భావించిన కూటమి సర్కారులోని పెద్దలు ఆ విధానాన్ని ఏకంగా రద్దుచేసి పారేశారు. అలాగే, గతంలో కాంట్రాక్టర్లకు ఇచ్చిన టెండర్లను సైతం రద్దుచేసి, ఇప్పుడు కొత్తగా తమ వారికి చెప్పిన రేటుకు కట్టబెట్టేందుకు వీలుగా లంప్సమ్ విధానం అనుసరించడం గమనార్హం. రాజధాని ప్రాంతంలో 2014-19 మధ్య రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచి రూ.5వేల కోట్ల మేర పనులు పూర్తిచేసినట్లు ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. తాజాగా.. 41, 42 సీఆర్డీఏ అథారిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయం మేరకు కొత్తగా రూ.20,292.46 కోట్ల పనులకు అనుమతులిచ్చారు. ఇందులో రూ.11,467.27 కోట్లతో పనులకు అనుమతినిస్తూ జీఓ సైతం జారీచేశారు. తాజాగా.. మరో రూ.8,821.44 కోట్ల మేర ట్రంక్ రోడ్లు, లేఅవుట్లలో వేసే రోడ్లకు అనుమతిచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అమరావతి ప్రాంతంలో రోడ్ల నిర్మాణ వ్యయాన్ని 28 శాతం వరకు పెంచగా, భవన నిర్మాణాల ఖర్చును ఏకంగా 35 నుంచి 55 శాతం పెంచడం విశేషం.




గుర్తింపులేని అమరావతికి రూ.వేలకోట్ల వ్యయం అవసరమా?

ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధంగా ఎటువంటి గుర్తింపులేని అమరావతికి ప్రారంభదశలో రూ.50 వేల కోట్లు వ్యయం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడాన్ని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి. ఆర్.కృష్ణంరాజు తప్పుబట్టారు. నిర్దిష్టమైన సరిహద్దులు, విస్తీర్ణంతో అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ ఇప్పటిదాకా కేంద్రంగానీ రాష్ట్ర ప్రభుత్వంగానీ గెజిట్ నోటిఫికేషన్లు జారీచేయలేదని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతి రాజధానికి 33 వేల ఎకరాలు సమీకరించామని చెబుతున్న సీఎం ఈ ఏడాది జూన్ 29న జారీచేసిన గెజిట్‌లో కేవలం 1,575 ఎకరాల పరిధిలో మాత్రమే పరిపాలన నగరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. దీనికి కూడా కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ లేదని తెలిపారు. చట్టబద్ధంగా ఏర్పాటు కాని రాజధాని నగరానికి ఏ విధంగా వేలకోట్ల రూపాయలు వ్యయం చేస్తారని నిలదీశారు. ల్యాండ్ పూలింగ్ అంశంలోనూ చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, ఇప్పటికీ సీఆర్డీఏ పరిధిలో భూ సమీకరణ ప్రక్రియ పూర్తికాలేదని గుర్తు చేశారు. ప్రభుత్వంపై అనుమానాలుండడంతో వందలాదిమంది రైతులు ఇప్పటికీ భూములు ఇవ్వడం లేదని, సీఆర్డీఏ ఇస్తామన్న రిటర్నబుల్ ప్లాట్స్ కూడా తీసుకోవడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం కారణంగా సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోతున్నామని చంద్రబాబు.. ఉద్యోగులకు జీతాలకు కూడా ఇవ్వలేకపోతున్నామని, ప్రజలు తిరుగుబాటు చేసే ప్రమాదముందని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చెబుతున్నారని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో అప్పులు చేసి రూ.50 వేల కోట్లు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

అత్యంత ఉష్ణ ఏడాదిగా 2024



భూగోళాన్ని ఈ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్న హీట్‌వేవ్, వాతావరణ మార్పులు

జీవకోటికి ప్రాణాధారం సూర్యుడు. సూర్య కిరణాల ప్రసరణతో పుడమి పులకిస్తుంది. అదే పుడమి నేడు భానుడి భగభగలతో అల్లాడుతుంది. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ వంటి విపరిణామాలే భూమిపై విపరీత ఉష్ణోగ్రతలకు ముఖ్య కారణాలు. గత కొన్ని నెలలుగా హీట్‌వేవ్‌లు, వాతావరణ మార్పుల కారణంగా ప్రతినెలా ఉష్ణోగ్రతలు అమాంతం పెరుగుతూ పోతున్నాయి. వరుసగా గత 17 నెలల్లో చూస్తే 16 నెలల్లో సగటు ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదవుతూ రావడం ఆందోళనకరం. ఇలా నెలల తరబడి సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవడంతో రాబోయే నెలల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు పెచ్చరిల్లే ప్రమాదకర ధోరణి కొనసాగనుందని స్పష్టమవుతోంది. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూతాపంలో పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్‌లోపునకు పరిమితం చేయాలన్న ప్రపంచ దేశాల ప్రతిజ్ఞ ఇప్పుడు నీరుగారిపోతోంది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీ సెల్సియస్ దాటి నమోదైన తొలి ఏడాదిగా 2024 నిలవనుందని కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్(సీ3ఎస్) తాజాగా ప్రకటించింది. 1991–2020 సగటుతో పోలిస్తే ఈ ఏడాది జనవరి– నవంబర్ కాలంలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 0.72 డిగ్రీ సెల్సియస్ ఎక్కువ నమోదైంది. నవంబర్‌లో సైతం గతంలో ఎన్నడూలేనంతటి ఉష్ణోగ్రత నమోదైంది. పారిశ్రామిక విప్లవం ముందునాటితో పోలిస్తే ఈ నవంబర్‌లో 1.62 డిగ్రీ సెల్సియస్ అధిక ఉష్ణోగ్రత నమోదైంది.

2024 ఏడాది ఎందుకింత వేడి ?

హరితవాయు ఉద్గారాలు అత్యధికంగా వెలువడటంతోపాటు ఎన్నో కారణాలు ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలకు కారణాలుగా నిలుస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. అత్యధిక వేడిమిని సముద్రాల ఉపరితల జలాలు పీల్చుకోవడమూ దీనికి మరో కారణం. విచ్చలవిడి మానవ కార్యకలాపాలు, అడవుల నరికివేత, ఎడారీకరణ తదితరాలు ఈ పరిస్థితిని మరింత ఉష్ణ మంటల్లోకి నెట్టేస్తున్నాయి. వాతావరణంలో కలుస్తున్న మీథేన్ స్థాయిలు సైతం గతంలో ఎన్నడూలేనంతగా పెరిగాయి. పారిశ్రామికీకరణ ముందునాటి కాలంతో పోలిస్తే 2023 చివరినాటికి వాతావరణంలో మీథేన్ గాఢత స్థాయి ఏకంగా 165 శాతం పైకెగసిందని, అధిక ఉష్ణోగ్రతకు ఇదీ ఒక కారణమని అధ్యయనకారులు విశ్లేషణ చేశారు. పారిశ్రామికీకరణ ముందునాటి కాలంతో పోలిస్తే ఉపరితల గాలి ఉష్ణోగ్రత ఈ ఏడాది జనవరి–నవంబర్ కాలంలో 1.54 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా ఉంది. ''మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల కోసం సహజ ఎల్–నినో పరిస్థితులూ ఉష్ణోగ్రతల విజృంభణకు మరో కారణం'' అని సస్టేన్ ల్యాబ్ పారిస్ సీఈఓ డాక్టర్ మినియా ఛటర్జీ వ్యాఖ్యానించారు.

పరిస్థితి ఇలాగే ఉంటే ఏమౌతుంది?

అధిక ఉష్ణోగ్రత భరించలేని కష్టాలను మోసుకొస్తాయి. పారిశ్రామికీకరణకు ముందునాటితో పోలిస్తే భూ తాపోన్నతిలో పెరుగుదల 1.5 డిగ్రీ సెల్సియస్ దాటితే కరువు, అతి భారీ వర్షాలు, వరదలు సాధారణమవుతాయి. ఇది పర్యావరణానికి, మానవునికి హానికరం. మితిమీరిన వేడి కారణంగా పంటకు నష్టం వాటిల్లుతుంది. దిగుబడి దారుణంగా పడిపోతుంది. జీవజాతులకూ నష్టమే. సాధారణ ఉష్ణోగ్రతల్లో బతికే జీవులు మనుగడ సాధించడం కష్టం. చిన్న జీవుల ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. వన్యప్రాణుల సంఖ్య తగ్గుతుంది. హీట్‌వేవ్‌ల కారణంగా హౌలర్ కోతులు, చిన్న పక్షులు అంతరించిపోతాయి. ఉష్ణోగ్రతల్లో వైరుధ్యం కారణంగా జీవవైవిధ్యం దెబ్బతింటుంది. పక్షుల ఎదుగుదల తగ్గుతుంది. ''ఉభయచర జీవులు పొదిగే క్రమంతోపాటు ఎండా, వానా, చలికాలాల మధ్య ఉన్న సరిహద్దు రేఖలు చెరిగిపోతాయి. అధిక వేడిమికి పాలిచ్చే జంతువుల మనుగడా కష్టమవుతుంది'' అని ది హ్యాబిటెంట్స్ ట్రస్ట్ సారథి రిషికేశ్ చవాన్ చెప్పారు.

సముద్ర ఉష్ణోగ్రతలూ పైపైకి..

ఈ ఏడాది సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గతంతో పోలిస్తే పెరిగాయి. ఎక్కువ రోజుల పాటు సముద్ర ఉష్ణోగ్రతలు అధిక స్థాయిల్లో కొనసాగితే పగడపు దిబ్బల ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. వేడి పెరిగితే సముద్ర జీవావరణానికి సంబంధించిన ఆహారవలయంలో కీలక పాత్రపోషించే ఈ పగడపు దీవులు కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా అంతర్థానమవడం ఖాయం. అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లోని 77 శాతం పగడపు దిబ్బల వద్ద అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతల్లో పెరుగుదల ధోరణికి అడ్డుకట్టవేయకపోతే మళ్లీ పూడ్చలేని నష్టం జరుగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించింది.

-సాక్షి, నేషనల్ డెస్క్


సిరియా ఆపద్ధర్మ ప్రధానిగా బషీర్



దమాస్కస్: అసద్ నిరంకుశ పాలనకు తెరదించిన హయత్ తహ్రీర్ అల్ షామ్, ఇతర తిరుగుబాటుదారుల గ్రూప్‌లు ఆపద్ధర్మ ప్రధానిగా మొహమ్మద్ అల్ బషీర్‌ను నియమించారు. 2025 మార్చి ఒకటో తేదీదాకా ఈయన తాత్కాలిక ప్రధానమంత్రిగా కొనసాగుతారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. సిరియాలో శాంతిభద్రతలు నెలకొనడానికి ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. కొత్త ప్రభుత్వంలో సభ్యులతో కలిసి మంగళవారం డమాస్కస్‌లో సమావేశం నిర్వహించిన ఆయన... తిరుగుబాటు అనంతరం శాఖలు, సంస్థల బదిలీలపై చర్చించారు. రాబోయే రెండు నెలలు సిరియా ప్రజలకు సేవలందించడానికి, సంస్థలను పునఃప్రారంభించడానికి సమావేశాలు నిర్వహించామని బషీర్ వెల్లడించారు. మైనారిటీలను గౌరవిస్తూ ప్రజాస్వామిక రీతిలో నడిచినంత కాలం సిరియా ప్రభుత్వానికి అమెరికా పూర్తి మద్దతు ఇస్తుందని ఆదేశ విదేశాంగ మంత్రి చెప్పారు.

అతిపెద్ద అధికార ప్రతినిధి ధన్‌ఖడ్!

- సీనియర్ సభ్యులకు స్కూల్ హెడ్‌మాస్టర్‌లా క్లాసులు పీకుతున్నారు
- ఆయన పక్షపాత ధోరణి వల్లే అవిశ్వాస నోటీస్ ఇచ్చాం
- మీడియా సమావేశంలో విపక్ష నేతల విసుర్లు



న్యూఢిల్లీ: పార్లమెంట్ ఎగువ సభ నిర్వహణలో రాజ్యసభ చైర్మన్ హోదాలో హుందాగా వ్యవహరించాల్సిన జగదీప్ ధన్‌ఖడ్ పూర్తి పక్షపాత ధోరణిలో వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వానికి అతిపెద్ద అధికారి ప్రతినిధిగా ప్రవర్తిస్తున్నారని విపక్షాలు ధ్వజమెత్తాయి. ధన్‌ఖడ్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం నోటీసును మంగళవారం రాజ్యసభలో విపక్ష సభ్యులు అందజేయడం తెల్సిందే. దీనిపై బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే తోటి విపక్షాల 'ఇండియా' కూటమి ఎంపీలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ''ధన్‌ఖడ్ ఒక ప్రభుత్వ అధికారి ప్రతినిధిలా ప్రవర్తిస్తున్నారు. సీనియర్ పార్లమెంటేరియన్లకూ పాఠశాల ప్రధానోధ్యాయునిలా ధన్‌ఖడ్ క్లాసులు పీకుతున్నారు. సభలో విపక్ష సభ్యులకు మాట్లాడే స్వేచ్ఛనివ్వట్లేదు. సభ సజావుగా సాగకుండా అడ్డు తగిలే అతిపెద్ద అవరోధం ధన్‌ఖడ్. ఆయన చూపే వివక్ష చూసి విసుగెత్తిపోయాం. ఆయన వైఖరి, ధోరణి సైతం విపక్షాలకు అనుకూలంగా లేదు. అందుకే ఆయనను తొలగించాలని నోటీస్ ఇచ్చాం. రాజ్యసభ నియమ నిబంధనావళిని తుంగలో తొక్కి రాజకీయాలు ముందంజలోకి వచ్చాయి'' అని ఖర్గే వ్యాఖ్యానించారు. ''రాజ్యాంగం, రాజ్యాంగబద్ధ సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ ధన్‌ఖడ్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. తర్వాత మరేదో పదోన్నతి వస్తుందన్న ఆశతో పనిచేస్తున్న అతిపెద్ద అధికార ప్రతినిధిలా ఆయన వాలకం ఉంది. ఆయన తన వైఖరితో రాజ్యసభకు ఉన్న ప్రతిష్టను, పరువును దెబ్బతీస్తున్నారు. మాకు ఆయనపై ఎలాంటి వ్యక్తిగత కక్ష, కోపాలు లేవు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మేం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు పట్టుబడుతున్నాం'' అని ఖర్గే అన్నారు.

ప్రజాస్వామ్యంపై దాడి: డీఎంకే

''చైర్మన్ ద్వారా బీజేపీ ప్రదర్శిస్తున్న ఈ వైఖరి స్పష్టంగా ప్రజాస్వామ్యంపై దాడే'' అని డీఎంకే నేత తిరుచ్చి శివ వ్యాఖ్యానించారు. ''రాజ్యసభలో విపక్ష సభ్యుల గొంతుక వినిపించే అవకాశం చిక్కట్లేదు'' అని తృణమూల్ కాంగ్రెస్ నేత నదీముల్ హక్ అన్నారు. ''చైర్మన్ రాజ్యసభను నడుపుతున్నట్లు లేదు ఒక సర్కస్‌ను నడుపుతున్నట్లు ఉంది. ఉన్న సమయమంతా ఆయన తన సొంత విషయాలు మాట్లాడటానికే సరిపోతోంది. ఉన్న కాస్తంత సమయాన్ని ఆయనే వృథాచేస్తారు'' అని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ అన్నారు. టీఎంసీ నేత సాగరికా ఘోష్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా తదితరులు ఈ మీడియా సమావేశంలో మాట్లాడారు.

వీసా లేకున్నా 60 రోజుల అనుమతి

భారతీయులకు థాయిలాండ్ ఆఫర్

న్యూఢిల్లీ: భారతీయ పర్యాటకులను ఆకర్షించే నిమిత్తం థాయిలాండ్ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. వీసాలేకున్నా థాయిలాండ్‌లో గరిష్టంగా 60 రోజులపాటు ఉండేందుకు అనుమతి మంజూరుచేసింది. పర్యాటకం, చిన్నపాటి వ్యాపారాల నిమిత్తం థాయిలాండ్‌ను సందర్శించే భారతీయులకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని థాయిలాండ్ పేర్కొంది. ఇందుకోసం 2025 జనవరి ఒకటో తేదీ నుంచి భారత్‌లో ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ (ఈటీఏ)(ఈ–వీసా) విధానం అమల్లోకి తెస్తామని పేర్కొంది. థాయిలాండ్‌యేతర జాతీయులు https://www. thaievisa. go. th వెబ్‌సైట్‌లో సంబంధిత దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని థాయిలాండ్ ఎంబసీ బుధవారం ప్రకటించింది. ఆఫ్‌లైన్ మోడ్‌లోనూ దరఖాస్తులను స్వీకరిస్తామని ఢిల్లీలోని థాయిలాండ్ రాయబార కార్యాలయం పేర్కొంది. ఈ విషయంలో ఎంబసీ, కాన్సులేట్ జనరల్స్ నుంచి పూర్తి సహాయసహకారాలు అందుతాయని వెల్లడించింది. దరఖాస్తు ఒకవేళ తిరస్కరణకు గురైనా వీసా దరఖాస్తు ఫీజు అనేది తిరిగి ఇవ్వరు. వీసా ఫీజు చెల్లించిన 14 రోజుల్లోపు ఈ–వీసా దరఖాస్తు పరిశీలన ప్రక్రియ మొత్తం పూర్తిచేస్తారు. సాధారణ వీసా కోసం డిసెంబర్ 16లోపు దరఖాస్తు చేసుకోవాలి. దౌత్య, అధికారిక వీసా కోసం డిసెంబర్ 24లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈటీఏలో పలు ప్రయోజనాలున్నాయి. ఒకసారి ఈ–వీసా తీసుకుంటే గరిష్టంగా 60 రోజులపాటు అక్కడే ఉండొచ్చు. అత్యయిక, అవసరమైన సందర్భాల్లో సందర్శకులు మరో 30 రోజులు అక్కడే ఉండొచ్చు. ఈటీఏ అనుమతులు సాధించిన ప్రయాణికులు చెక్‌పాయిట్ల వద్ద ఇమిగ్రేషన్ అధికారుల తనిఖీ తదితర సోదా తంతు అత్యంత వేగంగా పూర్తవుతుంది. ఈటీఏపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు పూర్తి వివరాలు అక్కడే అధికారులకు త్వరగా అందుబాటులోకి వచ్చి ప్రయాణికుడికీ సమయం చాలా కలసి వస్తుంది. వీసా మినహాయింపు పొందిన విదేశీయులు తమ దేశంలో ఎన్నాళ్ల నుంచి సక్రమంగా, అక్రమంగా ఉంటున్నారనే వివరాలు ఎప్పటికప్పుడు థాయ్ ప్రభుత్వానికి అందుతాయి. గడువు దాటి అక్కడే ఉంటే రోజుల లెక్కన జరిమానా విధిస్తారు.

పార్లమెంట్‌లో రచ్చ

ఉభయ సభల్లో అధికార, విపక్షాల మధ్య రగడ

- జార్జి సోరోస్–కాంగ్రెస్ బంధంపై చర్చించాలని బీజేపీ పట్టు
- రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌పై నోటీసు ఇవ్వడంపై ఆగ్రహం
- అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగే పరిస్థితి కనిపించడం లేదు. అధికార, విపక్షాల ధోరణితో ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతూనే ఉంది. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభలు వాయిదా పడుతున్నాయి. బుధవారం సైతం ఇదే పరిస్థితి పునరావృతమైంది. లోక్‌సభ పలుమార్లు వాయిదా పడింది. తొలుత డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చట్ట సవరణపై జరిగిన చర్చలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ మాట్లాడారు. కోవిడ్ విపత్తు సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సహకరించలేదని ఆరోపించారు. బెనర్జీ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తప్పుపట్టారు. ఆయనపై బెనర్జీ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ చెప్పారు. ఈ సమయంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరగడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత అధికార, విపక్షాల మధ్య అరుపులు కేకలు చోటుచేసుకోవడంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. పునఃప్రారంభమైన తర్వాత జార్జిసోరోస్–కాంగ్రెస్ బంధంపై రగడ జరగడంతో సభ సాయంత్రం 5 గంటల వరకు వాయిదాపడింది. సభ ప్రారంభమైనా గొడవ సద్దుమణగలేదు. దీంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ చెప్పారు. మణిపూర్‌లో హింసాకాండ యథేచ్ఛగా కొనసాగుతోందని, మానవతా సంక్షోభం నెలకొందని లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగోయ్ జీరో అవర్‌లో పేర్కొన్నారు. మణిపూర్ అంశంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

రైల్వే సవరణ బిల్లుకు ఆమోదం

రైల్వే చట్టాలను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైల్వే సవరణ బిల్లు–2024ను లోక్‌సభలో ఆమోదించారు. ఈ బిల్లుపై జరిగిన చర్చకు రైల్వే మంత్రి వైష్ణవ్ సమాధానమిచ్చారు. ఈ బిల్లుతో రైల్వే శాఖను ప్రైవేటీకరిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు.

రాజ్యసభలో నిరసనలు, నినాదాలు

ధన్‌ఖడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వడంతోపాటు సోరోస్ వ్యవహారంపై పార్లమెంట్ ఎగువ సభలో బుధవారం దుమారం రేగింది. ఉదయం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు ప్రారంభించారు. చైర్మన్ ధన్‌ఖడ్‌పై తాము ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసుపై చర్చించాలని పట్టుబట్టారు. దాంతో ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రి నడ్డా మాట్లాడారు. దేశాన్ని అస్థిరపర్చడానికి కాంగ్రెస్ పార్టీ జార్జి సోరోస్‌తో చేతులు కలిపిందని ఆరోపించారు. సోరోస్‌తో కాంగ్రెస్ పెద్దల సంబంధాలపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. విపక్షాలు చర్చకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు విదేశీ శక్తుల చేతుల్లో పావులుగా మారారని ధ్వజమెత్తారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ధన్‌ఖడ్‌పై రాజకీయ విమర్శలు చేయడం ఏమిటని ప్రతిపక్షాలపై నడ్డా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లో నిల్చొని నడ్డాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికార పక్ష ఎంపీలు కాంగ్రెస్ తీరుపై మండిపడుతూ నినాదాలు చేశారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ధన్‌ఖడ్ ప్రకటించారు.



బుధవారం లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు

వినూత్న నిరసన

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగకపోవడం, తాము లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం చర్చించకపోవడంపై విపక్ష ఎంపీలు వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేశారు. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో బీజేపీ ఎంపీలకు జాతీయ జెండాలు, గులాబీలు అందజేసి స్వాగతం పలికారు. తమ డిమాండ్లపై దృష్టి పెట్టాలని, కీలకమైన అంశాలపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చ జరిగేలా సహకరించాలని అధికార పక్ష సభ్యులకు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో విపక్షనేత అయిన రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో అటుగా వస్తున్న రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు కార్డు రూపంలోని జాతీయ జెండాను స్వయంగా అందజేశారు. రాహుల్, ప్రియాంకా గాంధీ తోపాటు డీఎంకే, జేఎంఎం, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల ఎంపీలు పార్లమెంట్ మకర ద్వారం మెట్ల వద్ద జెండాలు, గులాబీలు చేతబూని నిరసన తెలిపారు. 'దేశాన్ని అమ్మేయకండి' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. అదానీ గ్రూప్ అక్రమాలపై పార్లమెంట్‌లో చర్చించాలని విపక్షాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతిపక్ష సభ్యులు నిత్యం పార్లమెంట్ ప్రాంగణంలో వినూత్న రీతుల్లో నిరసన వ్యక్తం చేస్తుండటం తెల్సిందే.

ఓట్లను తొలగిస్తున్నారు

ఈసీకి ఆప్ ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను పెద్ద సంఖ్యలో తొలగిస్తోందని అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలో ఆప్ ప్రతినిధి బృందం బుధవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దళితులు, ఎస్సీలు, పూర్వాంచల్‌కు చెందిన బలహీనవర్గాల ఓట్లను బీజేపీ పనిగట్టుకొని తొలగించేలా చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. 'భారత పౌరులుగా ప్రజలకు ఉన్న ఓటు హక్కును బీజేపీ లాగేసుకుంటోంది. ఓటర్లను తొలగించడానికి బీజేపీ కార్యకర్తలకు దరఖాస్తు ఫారాలను అందించింది. చాలా నియోజకవర్గాల్లో ఇది జరుగుతోంది' అని కేజ్రీవాల్ అన్నారు. భారత పౌరులుగా ప్రజలకున్న హక్కులను బీజేపీ లాగేస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో చాలా నియోజకవర్గాల్లో ఈ విధంగా ఓట్లను తొలగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి ఈసీకి మూడు వేల పేజీల ఆధారాలను సమర్పించామని కేజ్రీవాల్ తెలిపారు. భారీస్థాయిలో ఓట్ల తొలగింపు జరుగుతోందన్నారు. దీన్ని అడ్డుకోవాలని, ఓట్ల తొలగింపునకు దరఖాస్తు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. షాహ్‌దారా నియోజకవర్గంలో ఒక బీజేపీ నాయకుడు ఏకంగా 11,008 ఓట్లను తొలగించాలని ఈసీకి ఒక జాబితాను సమర్పించారని, ఈసీ రహస్యంగా వీటిని తొలగించే పనిలో ఉందని ఆరోపించారు. పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు ఉండదని ఈసీ తమకు హామీ ఇచ్చిందని వెల్లడించారు. ఇప్పటివరకు తొలగించిన ఓట్లపై దృష్టి పెడతామని, బూత్‌స్థాయి అధికారితో విచారణ జరిపిస్తామని తెలిపిందన్నారు. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

బాంబు దాడిలో అఫ్గాన్ మంత్రి మృతి

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో బుధవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో శరణార్థుల శాఖ మంత్రితో పాటు మరో ఇద్దరు మరణించారు. మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది. ఇందులో మంత్రి ఖలీల్ హక్కానీ మృతి చెందినట్లు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. మూడేళ్ల కిందట తాలిబన్లు అధికారంలోకి వచ్చాక మంత్రిస్థాయి వ్యక్తిపై దాడి జరగడం ఇదే తొలిసారి. ఈ బాంబుదాడికి తామే బాధ్యులమని ఇప్పటిదాకా ఏ సంస్థ ప్రకటించలేదు. తాలిబన్ నెట్‌వర్క్‌లో అత్యంత బలమైన శాఖకు నేతృత్వం వహించే అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి సిరాజుద్దీన్ హక్కానీకి ఖలీల్ బంధువు. ఈ ఏడాది సెప్టెంబరులో కాలా భక్తియార్‌లో ఐసిస్ ఉగ్రసంస్థ జరిపిన దాడిలో ఆరుగురు మృతి చెందగా, 13 మంది గాయపడ్డారు.

గిన్నిస్ రికార్డుకెక్కిన భగవద్గీత పారాయణం

భోపాల్: భగవద్గీత పారాయణం గిన్నిస్‌బుక్ ప్రపంచ రికార్డుకెక్కింది. గీతా జయంతి సందర్భంగా బుధవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని లాల్ పరేడ్ గ్రౌండ్‌లో ఒకేసారి 5 వేల మందికిపైగా ఆచార్యులు, భక్తులు భగవద్గీత పారాయణం చేశారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ హాజరయ్యారు. 5 వేల మందికి పైగా జనం ఒకేచోట గీతా పారాయణం చేయడం ఇదే మొదటిసారి. భగవద్గీతలోని కర్మయోగి అనే అధ్యాయాన్ని పఠించారు. ఈ అరుదైన ఘట్టాన్ని గిన్నిస్ బుక్ ప్రతినిధులు ప్రపంచ రికార్డుల్లో నమోదు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కేవలం మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు భగవద్గీత బోధనలు పాటిస్తున్నారని సీఎం మోహన్ యాదవ్ ఈ సందర్భంగా చెప్పారు.

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

ఒక మావో మృతి.. ఇద్దరు జవాన్లకు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందగా ఇద్దరు డిస్ట్రిక్ట్ రిజర్వు గార్డ్ (డీఆర్‌జీ) జవాన్లకు గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా ముంగా గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో బుధవారం ఈ ఘటన జరిగింది. సుమారు 40 మంది మావోయిస్టులు గంగులూరు – ముంగా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నారనే సమాచారంతో బుధవారం తెల్లవారుజాము నుంచి డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమాన బలగాల రాకను పసిగట్టిన మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. దీంతో పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. ఈ క్రమాన బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించగా పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు సమాచారం. గాయపడిన ఇద్దరు జవాన్లను బీజాపూర్ ఆస్పత్రికి తరలించారు.

అవరోధాలు తొలగిస్తూ సంస్కరణలు

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: భారత యువత అభివృద్ధి పథంలో ఎదురవుతున్న అవరోధాలను తొలగించేందుకు కేంద్రప్రభుత్వం సంస్కరణలు తెచ్చిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దైనందిన జీవితంలో ఎదురవుతున్న సవాళ్లకు యువత సరైన పరిష్కారాలు చూపుతూ సాగే 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్(ఎస్‌ఐహెచ్)' కార్యక్రమం అంతిమ పోరు సందర్భంగా ప్రధాని మోదీ తుది పోటీదారులతో వర్చువల్‌గా మాట్లాడారు. ''దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలు చూపే బాధ్యత తమపై ఉందని నేటి యువత బాధ్యతాయుతంగా ఆలోచిస్తోంది. వినూత్న ఆవిష్కరణలు సాధించగల, సాంకేతికత సత్తా ఉన్న యువత భారత్ సొంతం. శాస్త్రీయ దృక్పథాన్ని మరింతగా పెంచేందుకు వీలుగా కేంద్రప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. సంస్కరణలు తెస్తూ భారత యువత అభివృద్ధి పథంలో ఉన్న అవరోధాలను ప్రభుత్వం తొలగిస్తోంది'' అని మోదీ అన్నారు. ఏడో దఫా ఎస్‌ఐహెచ్‌లో దేశవ్యాప్తంగా 51 నోడల్ కేంద్రాల్లో 1,300కుపైగా విద్యార్థి బృందాలు ఫైనల్‌లో పోటీపడుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఎడిషన్ పోటీ 36 గంటల్లో ముగుస్తుండగా హార్డ్‌వేర్ ఎడిషన్‌లో పోటీ 15వ తేదీదాకా కొనసాగనుంది. హ్యాకథాన్‌లో భాగంగా జాతీయ ప్రాధాన్యత గల 17 అంశాలకు సంబంధించి కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, పరిశ్రమలు ఇచ్చి సమస్యలకు అత్యంత ఆమోదయోగ్యమైన పరిష్కారాలు చూపుతూ విద్యార్థి బృందాలు తమ ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తిచేసి సమర్పించాల్సి ఉంటుంది. పలు రంగాలకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారాలు చూపాల్సి ఉంటుంది.

గాజాపై ఆగని ఇజ్రాయెల్ దాడులు

29 మంది దుర్మరణం

డెయిర్ అల్–బాలాహ్(గాజా స్ట్రిప్): గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ ప్రతీకారదాడుల పరంపర ఇంకా కొనసాగుతోంది. బుధవారం జరిపిన వైమానిక దాడుల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దాడుల భయంతో ఒకే ఇంట్లో శరణార్థులుగా తలదాచుకుంటున్న వారిపైనా బాంబు దాడులు జరగడంతో 19 మంది చనిపోయారు. బెయిట్ లాహియా ప్రాంతంలో ఈ దాడి ఘటన జరిగింది. ఘటనాస్థలి నుంచి తమకు మృతదేహాలు వస్తూనే ఉన్నాయని ఇజ్రాయెల్ సరిహద్దుల్లోని కమల్ అద్వాన్ ఆస్పత్రి తెలిపింది. ఈ 19 మంది మృతుల్లో ఎనిమిది మంది ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు ఉన్నారు. ఆస్పత్రి ముఖద్వారం వద్ద జరిగిన దాడిలో ఒక మహిళ, ఆమె ఇద్దరు చిన్నారులు చనిపోయారు. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థతో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న ఇజ్రాయెల్ గాజాస్ట్రిప్‌లో మాత్రం హమాస్ సాయుధసంస్థతో ఈ దిశలో ముందడుగు వేయట్లేదు.

మారిటల్ రేప్ నేరం కాదు: కేంద్రం

న్యూఢిల్లీ: భార్యతో ఆమె ఇష్టానికి విరుద్ధంగా భర్త సంభోగంలో పాల్గొనడాన్ని(మారిటల్ రేప్) నేరంగా పరిగణించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. భార్య వయసు 18 ఏళ్ల దాటి ఉంటే ఆమెతో భర్త బలవంతంగా లైంగిక కార్యం జరిపినా నేరం కాదని వెల్లడించింది. ఒకవేళ ఆమె వయసు 18 ఏళ్లలోపు ఉంటే ఆ లైంగిక కార్యం నేరమేనని ఉద్ఘాటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం రాజ్యసభలో సమాధానమిచ్చారు. భారతీయ న్యాయ సంహిత–2023లోని సెక్షన్ 74, 75, 76, 85తోపాటు గృహహింస నుంచి మహిళలకు రక్షణ కల్పించే చట్టం–2005 వివాహిత మహిళలకు పలు హక్కులు, రక్షణలు, గౌరవం కల్పిస్తున్నాయని వెల్లడించారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 12 । డిసెంబర్ । 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ కృష్ణలంకకు చెందిన ఉమ్మడిశెట్టి లక్ష్మీవైష్ణవి కుటుంబం రూ.లక్ష విరాళం సమర్పించింది.



హుండీ ఆదాయం రూ.23.92 లక్షలు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న యోగానంద లక్ష్మీనరసింహస్వామికి హుండీల ద్వారా రూ.23.92 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ సురేష్‌బాబు తెలిపారు.



ఉత్సాహ తరంగం

కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణాతరంగ్–24 ఉత్సాహంగా కొనసాగుతోంది. రెండో రోజు విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా జరిగింది. ▶8లో

బైపాస్‌కు హైటెన్షన్ అడ్డంకి

- దాదాపు 95 శాతం మేర రోడ్డు నిర్మాణ పనులు పూర్తి
- సమస్యగా మారిన ల్యాంకో సంస్థ టవర్ల మార్పిడి
- తమ పొలాల్లో లైన్లు వేయొద్దని అడ్డుకొంటున్న రైతులు
- గత ఏడాది డిసెంబర్ నాటికే పూర్తికావాల్సిన పనులు

2021లో రూ.1,148 కోట్లతో వెస్ట్ బైపాస్ పనులు ప్రారంభం



బైపాస్‌కు అడ్డంకిగా ఉన్న విద్యుత్ టవర్లు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ వెస్ట్ బైపాస్ పనులకు హైటెన్షన్ విద్యుత్ లైన్లు అడ్డంకిగా మారాయి. గత ఏడాది డిసెంబర్ నాటికే పూర్తి చేయాలనే లక్ష్యంతో శరవేగంగా పనులు సాగాయి. ఈ ఏడాది జనవరిలోనే వెస్ట్ బైపాస్‌ను ప్రారంభించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే బైపాస్ నిర్మాణానికి కృష్ణా జిల్లాలో ఒకచోట, ఎన్టీఆర్ జిల్లాలో 12 చోట్ల ఏపీ ట్రాన్స్‌కో, ల్యాంకో, పవర్‌గ్రిడ్‌కు సంబంధించిన హైటెన్షన్ విద్యుత్ లైన్లు ఆటంకంగా మారాయి. రోడ్డు పూర్తయితే అప్పటి వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే భావనతో కొంత మంది రైతులు కోర్టుకు వెళ్లి విద్యుత్ టవర్ల మార్పిడి జరగాల్సిన ప్రాంతంలో పనులు పూర్తి కాకుండా అడ్డుకున్నారు.

గతంలోనే 95 శాతానికి పైగా పనులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు తుది దశకు చేరాయి. అప్పట్లోనే దాదాపు 95 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. హైటెన్షన్ విద్యుత్ లైన్లు మార్చాల్సిన ప్రాంతం, గొల్లపూడిలో మూడు చోట్ల తప్ప మిగతా పనులు అన్ని పూర్తయ్యాయి. ప్యాకేజీ–3 కింద చినఅవుటుపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కిలోమీటర్ల మేర బైపాస్ పనులు సాగుతున్నాయి. ఈ పని విలువ రూ.1,148 కోట్లు. ఈ పనులను మెగా సంస్థ ఫిబ్రవరి 2021లో చేపట్టింది. ఈ రహదారి కోసం 14 గ్రామాల్లో భూమి సేకరించారు. కృష్ణా జిల్లాలో వెదురుపావులూరు, రామచంద్రాపురం, కొండపావులూరు, బీబీ గూడెం, గన్నవరం, చిన్నఅవుటుపల్లి, ఎన్టీఆర్ జిల్లాలో గొల్లపల్లి, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, కె.వి.కండ్రిక, నున్న గ్రామాల పరిధిలో మొత్తం 188.92 హెక్టార్ల భూమిని సేకరించారు. ఈ భూ సేకరణకు రూ.416.60 కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో రోడ్డు పనులు శరవేగంగా సాగాయి. విజయవాడ నగర ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలనే కృత నిశ్చయంతో పనులను పరుగు పెట్టించారు.

అడ్డంకిగా మారిన విద్యుత్ లైన్లు

బైపాస్ రోడ్డుకు మధ్యలో హై ఓల్టేజీ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. కృష్ణా జిల్లాలో ఒకచోట, ఎన్టీఆర్ జిల్లాలో 12 చోట్ల ఏపీ ట్రాన్స్‌కో, ల్యాంకో, పవర్ గ్రిడ్‌కు సంబంధించిన హైటెన్షన్ విద్యుత్ లైన్లను మార్చాల్సి ఉంది. ఇవి గొల్లపూడి, అంబాపురం, నున్న ప్రాంతంలో ఉన్నాయి. వీటికి సంబంధించి పరిహార నిమిత్తం విజయవాడ సబ్ కలెక్టర్ భూమి కోల్పోయే రైతులతో చర్చించారు. ప్రభుత్వం సైతం రైతులకు మేలు కలిగే విధంగా ప్రత్యేక జీఓ ద్వారా పరిహారాన్ని సైతం మంజూరు చేసింది. సాధారణంగా టవర్ బేస్ ప్రాంతంలో మార్కెట్ విలువ కంటే 100 శాతం అదనంగా పరిహారం ఇస్తారు. విద్యుత్ తీగలు వెళ్లే ప్రాంతంలో పది శాతం పరిహారం ఇస్తారు. అయితే ప్రభుత్వం ఈ పనులకు అడ్డంకి కాకుండా ఉండేందుకు రైతులకు మేలు కలిగే విధంగా ప్రత్యేక జీఓ ద్వారా పరిహారం మంజూరు చేసింది. ఈ జీఓ ప్రకారం ప్రభుత్వం టవర్ బేస్ ఏరియాలో మార్కెట్ విలువ కంటే అదనంగా 250 శాతం అంటే 2.5 రెట్లు, వైర్లు వెళ్లే ప్రాంతంలో మార్కెట్ విలువలో పది శాతం, పంట నష్టం జరిగి ఉంటే దానికి పరిహారం సైతం నేషనల్ హైవే అధికారులు జిల్లా కలెక్టర్ వద్ద డిపాజిట్ చేశారు. ఈ మేరకు కృష్ణా జిల్లా కలెక్టర్ పేరుతో రూ.1.1కోట్లు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ పేరుతో రూ.21.85 కోట్లు డిపాజిట్ చేశారు. ఈ విద్యుత్ లైన్లు బైపాస్ ప్రాంతంలో 1.49 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. అయితే విద్యుత్ లైన్లు వెళ్లే ఆరు ప్రాంతాల్లో రైతులు కోర్టుకు వెళ్లారు. మిగిలిన ప్రాంతాల్లో వైర్లను మార్పిడి చేసేందుకు రెవెన్యూ అధికారులు సంబంధిత రైతులతో చర్చించారు. ఆ ప్రాంతాల్లో పనులను పూర్తిచేసేందుకు సన్నాహాలు చేపట్టారు. కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో మార్గం సుగమం అయ్యింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని చోట్ల పనులను ప్రారంభించారు.

ల్యాంకో లైన్లతో సమస్య

ప్రస్తుతం 30 కిలోమీటర్ల వెస్ట్ బైపాస్ రహదారికి సంబంధించి 28.740 కిలోమీటర్లు అంటే 96 శాతం మేర పనులు పూర్తయ్యాయి. కేవలం 1.260 కిలోమీటర్ల మేర రోడ్డు పనులను మాత్రమే చేయాల్సింది. ప్యాకేజీ–3కు సంబంధించి హైవేకు పూర్వం ఉన్న రోడ్లకు అనుసంధానం చేసే విధంగా 11.2 కిలో మీటర్ల స్లిప్ రోడ్లు వేశారు. అండర్ పాసులు, ప్రధాన వంతెనలు, బాక్సు కల్వర్టులు, పైపు కల్వర్టులు, చిన్న వంతెనలు, ట్రక్ బేలు, టోల్‌ప్లాజా ఇలా అన్ని పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ల్యాంకోలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి నిలిచి, ఆ కర్మాగారం నడవటం లేదు. అలాంటి కర్మాగానికి విద్యుత్ టవర్లు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. ల్యాంకోకు సంబంధించి 16 హెచ్‌టీ టవర్లు బైపాస్‌కు అడ్డుగా ఉన్నాయి. ఏడు టవర్ల మార్పిడి విషయంలో జక్కంపూడి, అంబాపురం రైతులు అభ్యంతరం తెలుపుతున్నారు. మళ్లీ రైతులు కోర్టు మెట్లు ఎక్కడంతో వెస్ట్ బైపాస్ పనులకు అడ్డంకిగా మారుతోంది.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కానుకగా బంగారు నత్తు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయనగరం జిల్లాకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విలువైన బంగారు నత్తును కానుకగా సమర్పించారు. చీపురుపల్లికి చెందిన వేలూరి అమోఘ్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు 10.5 గ్రాముల బంగారం, ఎరుపు, పచ్చ రాళ్లు పొదిగిన నత్తును దేవస్థాన అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ డీఈఓ రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు ప్రారంభం



గుడివాడ టౌన్: కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల ఖోఖో పోటీలు స్థానిక ఏఎన్నార్ కళాశాల ప్రాంగణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. పామర్రు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ఈ పోటీలను ప్రారంభించారు. ఏఎన్నార్ కళాశాల, వికాస్ కళాశాల (నున్న), ఎల్‌హెచ్‌ఆర్‌జీ డిగ్రీ కళాశాల (మైలవరం), టీఎస్ఆర్ అండ్ ఈఆర్ఆర్ డిగ్రీ కళాశాల (పామర్రు), పీబీ సిద్ధార్థ కళాశాల (విజయవాడ) జట్లు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు, ఆయా కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్తికేయుడికి రూ.96.77 లక్షల ఆదాయం



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 96 లక్షల 77 వేల 636 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కృష్ణాజిల్లా దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. 96 రోజులకు రూ.96.77 లక్షల నగదుతో పాటు 1.560 కిలోల వెండి, బంగారం 33.300 గ్రాముల, 37 అమెరికా డాలర్లు వచ్చాయని ఈఓ తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

51,004 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 51,004 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 49,509 బస్తాలు విక్రయించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల క్వింటా సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాలకు రూ.7,500 నుంచి 16,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి ధర రూ.7,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకం రూ.7,500 నుంచి రూ.16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు ధర లభించింది. విక్రయాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,119 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

కేరళ ప్రభుత్వ ప్రత్యామ్నాయ విధానాలను బలపరచండి

కేరళ సంఘీభావ సభలో విజూ కృష్ణన్ పిలుపు



మాట్లాడుతున్న విజూ కృష్ణన్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేరళ వామ పక్ష ప్రభుత్వ ప్రత్యామ్నాయ విధానాలకు మద్దతుగా ప్రజలందరూ నిలబడాలని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రశ్నించి ప్రతిఘటించాలని సూచించారు. కేరళపై బీజేపీ ప్రభుత్వ కక్షపూరిత విధానాలను వ్యతిరేకించాలన్నారు. విజయవాడ రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ్ భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అధ్యక్షతన కేరళ సంఘీభావ సభ జరిగింది. ముఖ్య అతిథి విజూ కృష్ణన్ మాట్లాడుతూ.. కేరళ వామ పక్ష ప్రభుత్వం అన్ని రంగాల్లో అనుసరిస్తున్న ప్రజానుకూల ప్రత్యామ్నాయ విధానాలల్లో ఆ రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. అటువంటి వామపక్ష ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డగిస్తూ, సహాయ నిరాకరణ, కక్షపూరిత విధానాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో ఉన్న పాలక పార్టీలు నరేంద్ర మోదీ మోజులో పడ్డాయని విమర్శించారు. ఈ సభలో సీఐటీయూ నాయకులు పి.అజయ్‌కుమార్, సీహెచ్ శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు వి.కృష్ణయ్య, వై.కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, ఆంజనేయులు, జొన్న శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘంనాయకులు కళ్యాణ్, కోటేశ్వరి, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

వారి రూటే సపరేటు

- ఉపాధ్యాయులను పట్టి పీడిస్తున్న కొందరు ఎంఈఓలు
- రెండేళ్ల నుంచి టీచర్ల సర్వీస్ రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయని వైనం
- ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకూ జీతాల బిల్లుల తయారీ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరంలో పని చేస్తున్న కొంతమంది ఎంఈఓల రూటే సప'రేట్'గా ఉందంటూ ఉపాధ్యాయులు బెంబేలెత్తుతున్నారు. నగర పరిధిలో మునిసిపల్, ఎయిడెడ్‌తో పాటు వివిధ ప్రభుత్వ యాజమాన్యాల కింద సుమారు 150 పాఠశాలలు పనిచేస్తున్నాయి. ఆయా విద్యాసంస్థల ఉపాధ్యాయులను కొందరు ఎంఈఓలు పట్టి పీడిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి పనికీ రేటు కట్టి వసూలు చేస్తున్నారని సమాచారం. పదేపదే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆ ఎంఈఓల తీరు మారడంలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో ఎనిమిది మంది ఎంఈఓలు

విజయవాడలో తూర్పు, పశ్చిమం, ఉత్తరం, దక్షిణం డివిజన్లు కొనసాగుతున్నాయి. ఒక్కొక్క డివిజన్‌కు ఎంఈఓ–1, ఎంఈఓ–2 చొప్పున నాలుగు డివిజన్లకు ఎనిమిది మంది పని చేస్తున్నారు. ఎంఈఓ–1 తన పరిధిలోని పాఠశాలలు, ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలను పరిశీలిస్తుంటారు. జీతభత్యాలు, సెలవులు, ఇతర సర్వీస్ రిజిస్టర్లు తదితరాలకు సంబంధించిన బిల్లులు తయారు చేసి మంజూరు చేయిస్తుంటారు. ఎంఈఓ–2 హోదాలో పని చేసే వారు పాఠశాలల అకడమిక్ అంశాలు, మధ్యాహ్న భోజనం ఇతర సదుపాయాలు, పాఠశాలల పరిశీలన తదితర విషయాలను పర్యవేక్షిస్తుంటారు.

ప్రతి బిల్లుకు ముడుపులు చెల్లించాల్సిందే..

ఎంఈఓ–1 హోదాలో ఆర్థిక విషయాలను పర్యవేక్షించే అధికారులు కొందరు ప్రతి బిల్లుకూ ముడుపులు వసూలు చేస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. జీతభత్యాలతో పాటుగా ఇంక్రిమెంట్లు, ఎర్న్‌డ్ లీవ్‌లు, ఇతర సర్వీస్ అంశాలు ఇలా ప్రతిదానికి మామూలు ఇస్తేనే బిల్లు తయారు చేస్తారని పేర్కొంటున్నారు. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి వారు ఎక్కువగా వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. ఎవరైనా గట్టిగా అడిగితే వారి బిల్లుకు సంబంధించి ఏదో ఒక మెలిక పెట్టి తిప్పుకొంటారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

సొంత మనుషులతో బిల్లుల తయారీ

ప్రతి డివిజన్‌కు విద్యాశాఖ ఆయా ఎంఈఓల కింద పని చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించింది. అయితే కొందరు ఎంఈఓలు డేటా ఎంట్రీ ఆపరేటర్లను పక్కన పెట్టి తమ సొంత మనుషులతో పనులు చేయించుకుంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఎంఈఓలకు ఇష్టమైన కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాల విధులను వదిలేసి ఎంఈఓ కార్యాలయంలో కూర్చుని బిల్లుల తయారీలో నిమగ్నమవుతున్నారని, వారికి నచ్చిన వారికి నచ్చినట్లుగా బిల్లులు చేస్తారని ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లు, ఇతర ముఖ్యమైన ఫైల్స్ ఉన్న బీరువాల తాళాలు సైతం తమ కార్యాలయాలకు సంబంధం లేని సొంత మనుషులకు ఇచ్చి ఎంఈఓలు పనులను కొనసాగిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ ఎంఈఓ కొంత నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా, ముగ్గురు ఎంఈఓలు మాత్రం తమను పీడిస్తున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

రెండేళ్ల నుంచి నమోదవని టీచర్ల వివరాలు

సాధారణంగా ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లలో వారి జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు, సెలవులు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎంఈఓలు నమోదు చేయాలి. కొంతమంది ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్‌లో రెండేళ్లుగా ఎటువంటి వివరాలను నమోదు చేయలేదని సమాచారం. బిల్లుల తయారీ, వసూళ్లకు తప్ప మిగిలిన పనులపై ఆ ఎంఈఓలు ఆసక్తి చూపటంలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఒక ఉపాధ్యాయిని ఉద్యోగ విరమణ చేసిన తరువాత రెండు మాసాల జీతానికి బిల్లులు రూపొందించి ఆ డబ్బును డిమాండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆమె ఆ మొత్తాన్ని చలానా తీసి ప్రభుత్వానికి వెనుకకు చెల్లించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్న ఎంఈఓలను సరైన దారిలో నడిపించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటూ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

266 పరుగులకు రాజస్థాన్ ఆలౌట్

మంగళగిరి: స్థానిక అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన విజయ్ మర్చంట్ ట్రోఫీ (అండర్ 16 మెన్) క్రికెట్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు 266 పరుగులకు ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు 82.01 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌటైంది. రాజస్థాన్ బ్యాట్స్‌మెన్లు యశ్వంత్ భరద్వాజ్ 8 ఫోర్లతో 50 పరుగులు సాధించాడు. ఎస్.ఖాన్ 48 పరుగులు చేశాడు. ఉత్తరాఖండ్ బౌలర్లు అభిమన్యు, ఎండీ షాహిద్ రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 5 ఓవర్లలో 8 పరుగులు సాధించింది.

రైతులను నిండా ముంచిన కూటమి

- ధాన్యానికి మద్దతు ధర దక్కని వైనం
- రైతులకు పెట్టుబడి సాయం ఊసే లేదు
- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అవినాష్
- 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దేవినేని అవినాష్, భాగ్యలక్ష్మి, తన్నీరు, బెల్లం దుర్గ, ఆసిఫ్, తిరుపతిరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ముంచేసిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ దుయ్యబట్టారు. రైతు పండించిన ధాన్యానికి కనీసం మద్దతు ధర కూడా దక్కకుండా తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. అన్ని రకాలుగా నష్టపోయిన రైతులకు భరోసా ఇస్తూ ఈ నెల 13న 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గుణదలలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని రకాలుగా మేలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని, రైతులకు పెట్టుబడి సాయం అందించారని గుర్తుచేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్బీకే సెంటర్లు లేకుండా పోయాయని, రైతుల కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. సూపర్ సిక్స్‌లో చెప్పినట్లు రైతుకు పెట్టుబడి సాయంపై కూటమి నేతలు మాట్లాడటం లేదన్నారు. రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నెల 13న మ్యూజియం రోడ్డులోని రమా క్లాత్ షోరూమ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు రైతులకు అండగా నిలిచేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

గోనె సంచులు ఇవ్వడం లేదు

రైతులకు కనీసం గోనే సంచులు కూడా అందించడం లేదని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. గతంలో సబ్సిడీపై రైతులకు టార్పలిన్ పట్టాలు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం వాటిని కూడా ఇవ్వలేని స్థితికి దిగజారిందని పేర్కొన్నారు. రైతులు దయనీయ స్థితిలో దళారులకు ధాన్యం తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. రైతులంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపేనని విమర్శించారు. ధాన్యం రంగుమారిపోతే కొనడం లేదన్నారు. రైతులను మోసం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు సర్నాల తిరుపతిరావు, షేక్ ఆసీఫ్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, నాయకులు రవిచంద్ర, అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చెల్లారావు తదితరులు పాల్గొన్నారు.



నింగి.. నేల.. ప్రయాణ వేళ

ఒకే సమయంలో గగనయానం.. రోడ్డు ప్రయాణ దృశ్యం చూపరులకు కనువిందు చేసింది. ఎయిర్‌పోర్టుకు విమానం వస్తున్న సమయంలో చెన్నయ్ - కోల్‌కతా జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాలు, కార్లు ప్రయాణిస్తున్న ఈ దృశ్యం గన్నవరం విమానాశ్రయ సమీపంలో బుధవారం కెమెరాకు చిక్కింది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దళిత సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం దళిత సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో హైదరాబాద్‌లో జరగనున్న ఆలిండియా దళిత్ రైట్స్ మూమెంట్ రెండో మహాసభలు, డీహెచ్‌పీఎస్ బలోపేతం, కమిటీల నియామకంపై చర్చించారు. చిత్తూరు జిల్లా దాసారాపల్లిలో ప్రభుత్వ భూమిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నిర్ణయించారని, దానిని కొందరు అడ్డుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వ అడ్డంకులు తొలగించి విగ్రహ నిర్మాణం చేపట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు దళితులకు 27 సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. అధికారం చేపట్టి ఆర్నెల్లు కావస్తున్న వాటి ఊసేత్తడం లేదన్నారు. డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితులకు తగిన కేటాయింపులు జరపకుండా మోసపూరిత విధానాలు అవలంబిస్తోందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, నాయకులు తాటిపాక మధు, ఎస్.నాగరాజు, ఆర్.గురుదాస్, కళింగ లక్ష్మణరావు, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు 13వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాధరపురం రోటరీ నగర్‌లోని కబేళా దగ్గర ఉన్న బీసీ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ ఆవరణలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో ఈ జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. నవతా ట్రాన్స్‌పోర్ట్, ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్, ఆర్ఆర్ ట్రేడర్స్ అండ్ మ్యానుఫ్యాక్చర్స్, ఎస్‌బీఐ పేమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మొదలైన కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 38 ఏళ్ల లోపు వయస్సు వారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాల్సిందిగా ఆయన తెలిపారు. వివరాలకు 9700025833లో సంప్రదించాల్సిందిగా కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

గన్నవరంరూరల్: వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాల్లో రాణించాలని ఆశించే యువతీ యువకులకు అగ్రి క్లినిక్‌లు ఏర్పాటు చేసుకునేందుకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎలీప్ సీఈడీ (మహిళా పారిశ్రామికవాడ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్) అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ సెంటర్ స్కీమ్ నోడల్ ఆఫీసర్ పోలవరపు శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు ఎలీప్, జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం సంయుక్త భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మండలంలోని సూరంపల్లిలో నిర్వహిస్తున్నామన్నారు. అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరీ కల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయో టెక్నాలజీ, అగ్రి ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రీషన్, బీజెడ్‌సీ హోం సైన్స్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ వంటి కోర్సుల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా చదివిన పట్టభద్రులు దరఖాస్తుకు అర్హులని చెప్పారు. 23వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. వివరాలకు 94412 66769లో సంప్రదించాలన్నారు.

భవానీ దీక్ష విరమణలకు పక్కా ఏర్పాట్లు

- భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలి
- సమీక్షలో దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు


మాట్లాడుతున్న ఈవో రామరావు, చిత్రంలో డీఈవో రత్నరాజు, ఇంజినీరింగ్ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ఈ నెల 21వ తేదీ నుంచి 25 వరకు జరగనున్న భవానీ దీక్ష విరమణ మహోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు అన్నారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని మహా మండపం ఆరో అంతస్తులో దీక్ష విరమణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈవో రామరావు అధ్యక్షతన ఆలయ ఇంజినీరింగ్, అర్చకులతో పాటు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

14న కలశజ్యోతుల మహోత్సవం

14న జరిగే కలశజ్యోతుల ఉత్సవంతో పాటు భవానీ దీక్ష విరమణలకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భవానీలు తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని 14వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని సత్యనారాయణపురం శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి భవానీలు, అమ్మవారి భక్తులు జ్యోతులను పట్టుకుని ఇంద్రకీలాద్రికి చేరుకుంటారన్నారు. అమ్మవారికి కలశ జ్యోతులను ఉభయ కృష్ణా జిల్లాతో పాటు విజయవాడకు సమీపంలో ఉన్న గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భవానీలు అమ్మవారికి కలశజ్యోతులను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి తరలిరానున్న నేపథ్యంలో వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించే వాహనంపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులు అధిష్టిస్తారని, ప్రత్యేక వాహనంతో పాటు దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన భవానీలు సత్యనారాయణపురానికి చేరుకుని దేవస్థాన ఊరేగింపులో పాల్గొంటారని, మరి కొంత మంది భవానీలు తమ గురు భవానీల సారథ్యంలో అమ్మవారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగిస్తూ ఇంద్రకీలాద్రికి తరలివస్తారన్నారు. కలశజ్యోతుల మహోత్సవం నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గనగర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే భవానీలు తమ కలశజ్యోతులను కనకదుర్గ నగర్‌లో సమర్పించడంతో పాటు మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకులా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ప్రారంభమై గాంధీనగర్, లెనిన్‌సెంటర్, అప్సరా థియేటర్, పాత బస్టాండ్, కంట్రోల్ రూమ్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదగా కనకదుర్గనగర్‌కు చేరుకుంటుందని అమ్మవారి ప్రచార రథంతో పాటు ప్రత్యేక వాహనానికి అవసరమైన విద్యుత్ లైట్లు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతో పాటు జ్యోతుల మార్గంలో ఉచిత ప్రసాదాల పంపిణీ చేయాలని సూచించారు. అమ్మవారి దర్శనంలో ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

ఎలాంటి ఇబ్బందీ లేకుండా..

దీక్ష విరమణలకు సంబంధించి క్యూలైన్లతో పాటు స్నానఘాట్లలో జల్లు స్నానాలకు ఏర్పాట్లు, క్లోక్‌రూమ్‌లు, మైక్ ప్రచారంతో పాటు కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశాలు, గిరి ప్రదక్షిణ మార్గంలో సూచిక బోర్డులు టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని ఈవో సూచించారు. అమ్మవారి దర్శనం తర్వాత ఇరుముడి సమర్పించేందుకు కౌంటర్లు, హోమ గుండాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇరుముడి సమర్పణ అనంతరం భవానీలకు అమ్మవారి అన్న ప్రసాదంతో పాటు కోరినన్ని లడ్డూలను అందించేలా సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని ఆర్జిత సేవలను నిలిపి వేయాలని, అదే విధంగా అన్ని క్యూలైన్లలో ఉచిత దర్శనానికి భవానీలను అనుమతించాలని ఆదేశించారు. 21వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు 22 నుంచి 25వ తేదీ వరకు తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భవానీలను అమ్మవారి దర్శనం కలిగించేలా చూడాలన్నారు. డీఈవో రత్నరాజు, ఈఈ కోటేశ్వరరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

హక్కులు అడిగేవారు.. విధులు గుర్తెరగాలి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ సువర్ణ


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సువర్ణ

కోనేరుసెంటర్: మహిళలు, యువతులు హక్కుల కోసం ప్రయత్నిస్తున్నప్పుడు తాము పాటించాల్సిన విధులు గురించి కూడా తెలుసుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సువర్ణ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో బుధవారం అంతర్గత ఫిర్యాదుల కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనిషి తన సహజ సిద్ధమైన స్వభావాన్ని కోల్పోతుండటం వల్ల సమాజంలో విపరీత ధోరణులు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయ రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు మానసిక స్వాతంత్ర్యం పొందినప్పుడే నిజమైన స్వేచ్ఛ లభించినట్లు అవుతుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె. శోభన్ బాబు మాట్లాడుతూ సెల్‌ఫోన్లు వాడకం ఎక్కువ కావటం వల్ల కుటుంబ వ్యవస్థ దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ సూయిజ్ రావూరి పోష్ చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఎస్. ఉష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథులను ఘనంగా సత్కరించారు. మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రావణి, మహిళా సాధికారిత విభాగం సమన్వయకర్త ఎల్. సుశీల పాల్గొన్నారు.

దళిత జాతిని ముక్కలు చేసేందుకు చంద్రబాబు కుట్ర

రాష్ట్ర మాలనాడు ప్రధాన కార్యదర్శి డీజేపీ కెనడీ


మాలల మహా గర్జన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కెనడీ, చంటిబాబు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాల జాతిపై మంద కృష్ణ మాదిగను గత 25 సంవత్సరాలుగా పావుగా వాడి వర్గీకరణ ద్వారా మాలలపై సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నారని రాష్ట్ర మాలనాడు ప్రధాన కార్యదర్శి దాసి జయ ప్రకాష్ (డీజేపీ) కెనడీ ధ్వజమెత్తారు. మాల జాతికి వ్యతిరేకంగా నాడు చంద్రబాబు నాటిన వర్గీకరణ అనే విష బీజం నేడు మహా వృక్షమై మాల జాతి ఎదుగుదలను నాశనం చేసే దిశగా తీవ్ర యత్నాలు చేస్తోందని విమర్శించారు. విజయవాడ విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15వ తేదీన గుంటూరు నల్లపాడు రోడ్‌లో మాలల మహా గర్జన సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దళిత నాయకులు పొదిలి చంటిబాబు, లేళ్లపూడి లాజర్, గోమతోటి వినోద్, మంటి రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలల మహా గర్జన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ బుధవారం గన్నవరం విమానాశ్రయానికి విచ్చేశారు. విజయవాడలో జరగనున్న ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో సాయంత్రం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు పలువురు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు.

వాతావరణం.. పూతకు ప్రతికూలం

- ఈ ఏడాది కూడా మామిడి పూత ఆలస్యం
- తెగుళ్లతో వచ్చిన పూత కూడా రాలిపోతున్న వైనం
- డీలా పడుతున్న మామిడి రైతులు


పూత లేక ఎండిపోతున్న మామిడి కొమ్మలు

పెనుగంచిప్రోలు: ఫలాల్లో రారాజుగా పేరుగాంచిన మామిడిని సాగు చేసే రైతు డీలా పడుతున్నాడు. కొన్నేళ్లుగా మామిడి రైతులపై ప్రకృతి పగబట్టింది. ప్రతికూల వాతావరణంతో ఇబ్బందులు కలుగజేస్తోంది. ఈ ఏడాది కూడా పూతలు రావటం ఆలస్యం అవుతోంది. చీడపీడలు అధికంగా ఉండటంతో వచ్చిన పూత కూడా పిందెగా మారకుండానే రాలి పోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా నవంబరు మొదటి వారంలో రావాల్సిన పూతలు డిసెంబర్‌లో సగం రోజులు గడిచిపోతున్నా రాలేదు. దీంతో చెట్లు వెలవెల పోతున్నాయి.

మామిడి సాగు ఇలా..

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 53,000 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ముఖ్యంగా జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో ఎక్కువగా మామిడి సాగవుతోంది.

జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో దాదాపు 1606 ఎకరాల్లో మామిడి తోటలు కృష్ణా, పాలేరు, మునేరు పరీవాహక ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. మునేరు ఒడ్డున పెనుగంచిప్రోలు మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, కొణకంచి, శనగపాడు, గుమ్మడిదుర్రు, ముచ్చింతాల, సుబ్బాయిగూడెం, కొల్లికూళ్ల, వత్సవాయి మండలంలోని మక్కపేట, వత్సవాయి, లింగాల, చిట్యాల, పోలంపల్లి, జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, రామచంద్రాపురం, గండ్రాయి, మల్కాపురం, తక్కెళ్లపాడు గ్రామాల్లో మామిడి తోటలు ఉన్నాయి. చాలా వరకు చెట్లకు పూత కనపడటం లేదు. కొన్ని చెట్ల కొమ్మలు అయితే తెగుళ్లతో ఎండి పోతున్నాయి. పొగమంచు, పగటి ఉష్ణోగ్రతలు తగ్గటం కూడా పూతలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. పూమొగ్గ దశలో రైతులు రెండుసార్లు మందులు పిచికారీ చేశారు. రైతులు తేలికపాటి తడులు వేస్తున్నారు. అయినా పూత కనిపించటం లేదు. జనవరి తరువాత పూతలొచ్చినా పిందెలు అంతగా ఏర్పడవని రైతులు అంటున్నారు. ఈ ఏడాది పూతలు ఆలస్యం కారణంగా నష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు.

అనుకూలించడం లేదు..



మామిడి రైతులకు వాతావరణం అనుకూలించటం లేదు. డిసెంబర్ నెల సగం రోజులు గడుస్తున్నా పూత కనిపించటం లేదు. అలాగే తెగుళ్లు కూడా వీడటం లేదు. వాతావరణంలో తేమ కారణంగా పూత రావటం లేదని అధికారులు చెబుతున్నారు. మందులు పిచికారీ చేస్తున్నాం. పూత ఇప్పుడు రాకపోతే తరువాత వచ్చినా కాపు అంతగా ఉండదు.
– పొన్నం కోటేశ్వరరావు, రైతు, గుమ్మడిదుర్రు

వాతావరణ మార్పులతోనే ఆలస్యం..



వాతావరణ మార్పులతోనే మామిడి పూతలు ఆలస్యంగా వస్తున్నాయి. పగటి సమయంలో చల్లటి వాతావరణం వల్ల పూతలపై ప్రభావం చూపుతోంది. రెండు మూడు సార్లు దుక్కి దున్నటం ద్వారా అధిక తేమశాతం ఆవిరి రూపంలో పోతుంది. మల్టీ–కె 10 గ్రాములు, ఫార్ములా–4(సూక్ష్మధాతువులు) 2.5 గ్రాములు, బోరాన్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు తోటలో పిచికారీ చేయాలి. అలాగే తెగుళ్ల సోకకుండా ఉద్యాన శాఖ వారి సూచనల మేరకు మందులు వాడాలి. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం.
–వర్ధిని, ఉద్యాన శాఖ అధికారి

ఉత్సాహ తరంగం

విజయవాడలో కొనసాగుతున్న కృష్ణా తరంగ్–24


రంగోలి పోటీల్లో విద్యార్థులు వేసిన రంగవల్లులను పరిశీలిస్తున్న అధ్యాపకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణా విశ్వవిద్యాల యం ఆధ్వర్యంలో జరుగుతున్న కృష్ణాతరంగ్–24 నగరంలో ఉత్సాహంగా జరుగుతోంది. నగరంలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న కృష్ణాతరంగ్ కార్యక్రమం రెండో రోజు విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ప్రతిభను చక్కగా ప్రదర్శించి పోటీల్లో పాల్గొంటున్నారు. బుధవారం వక్తృత్వం, దేశభక్తి బృందగానం, రంగోలి, డిబేట్, స్పాట్ పెయింటింగ్ వంటి పోటీలలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. గురువారం కార్యక్రమానికి ముగింపు పలకనున్నారు. విజేతలను ప్రకటించి వారికి బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. కృష్ణవేణి తెలిపారు. బుధవారం కార్యక్రమాలను హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి. నారాయణరావు తదితరులు పర్యవేక్షించారు.

బండ రాళ్లు పడి ట్రాక్టర్ ధ్వంసం



కంచికచర్ల: ఓ రాతి క్వారీలో బ్లాస్టింగ్ సమయంలో పెద్ద బండరాళ్లు ట్రాక్టర్‌పై పడటంతో అది పూర్తిగా ధ్వంసం అయిన సంఘటన కంచికచర్ల మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని పరిటాల శివారు దొనబండ శంకరరావుకు చెందిన రాతి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్నారు. అదే సమయంలో క్వారీ యజమానికి సంబంధించిన ట్రాక్టర్ క్వారీలో ఉండటంతో పెద్ద పెద్ద బండరాళ్లు ట్రాక్టర్‌పై పడిపోయాయి. పెద్ద శబ్దం వచ్చి ట్రాక్టర్ పూర్తిగా దెబ్బతింది. అయితే ఆ సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ కాని, ప్రజలు ఎవ్వరూ సమీపంలో లేకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టుకు జిల్లా క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: రాష్ట్ర బాడీ బిల్డింగ్ జట్టుకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారని బాడీబిల్డింగ్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ బుధవారం వివరాలు తెలుపుతూ ఇటీవల గుంటూరులో రాష్ట్ర జట్టు ఎంపికలో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు సత్తాచాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెలలో తమిళనాడు రాష్ట్రంలో జరిగే సౌత్‌జోన్ పోటీలు, హరియాణా రాష్ట్రంలో జరిగే జాతీయ పోటీలు, జనవరిలో కర్ణాటకలో జరగనున్న స్పోర్ట్స్ ఫిజిక్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు ప్రకటించారు. ఎంపికైన వారిలో 59 కేజీల విభాగంలో ఎం.దినేష్, 64 కేజీల విభాగంలో సీహెచ్.దుర్గాప్రసాద్, 65 కేజీల విభాగంలో పి.రాము, కె.ఉదయ్‌కిరణ్, 75 కేజీల విభాగంలో ఆర్.గోపీకృష్ణ, కె.కొండల్ ఉన్నారని తెలిపారు. స్పోర్ట్స్ ఫిజిక్ పోటీల్లో ఎం.దినేష్, సీహెచ్ దుర్గాప్రసాద్ ఉన్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులకు కానూరు అశోక్ జిమ్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. పోరంకిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవి, అసోసియేషన్ అధ్యక్షుడు బి.మనోహర్, క్రీడాకారులు, పలు జిమ్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రయాణికులను ఏమార్చి చోరీలు

సినీ ఫక్కీలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

విజయవాడస్పోర్ట్స్: రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికులను ఏమార్చి వారి జేబుల్లో నగదును దొంగిలిస్తున్న ముఠాను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు బుధవారం వెల్లడించారు. విశాఖపట్నం, గోపాలపట్నంకు చెందిన బుర్రి సురేష్, అరిటాకుల తారకేశ్వరరావు, కైలాసపురానికి చెందిన కంబాల శ్రీను, కొబ్బరితోటకు చెందిన బుడుమూరి రాజు స్నేహితులని, గతంలో వీరు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి జైలు జీవితం అనుభవించారని చెప్పారు. రద్దీ ప్రదేశాలలో తిరుగుతూ అమాయక ప్రజల సొమ్మును ఈ ముఠా దొంగిలిస్తోందన్నారు. ఈ నలుగురు రద్దీ ప్రదేశాలను ఎంచుకుని అక్కడ ఎవరి వద్ద డబ్బులు ఎక్కువ ఉన్నాయో గ్రహించి, అక్కడి ప్రజల జేబుల్లో నగదును ఈ ముఠాలోని ఒక వ్యక్తి దొంగిలించే సమయంలో మిగిలిన ముగ్గురు వ్యక్తులు తోపులాట జరుగుతున్నట్లు, రద్దీ ఎక్కువగా ఉన్నట్లు అక్కడ వాతావరణాన్ని సృష్టిస్తారని తెలిపారు. ఈ తరహా చోరీలకు పాల్పడటంతో ఈ ముఠా ఆరితేరిందన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ ముఠా చోరీలకు పాల్పడుతుందన్నారు. ఈ నెల ఆరో తేదీన చల్లపల్లికి చెందిన ఓ వ్యక్తిని ఇదే మాదిరిగా ఏమార్చి అతని వద్ద ఉన్న డబ్బులు కాజేసినట్లు చెప్పారు. ఆసుపత్రిలో ఉన్న తన బావమరిది చికిత్స నిమిత్తం తీసుకొచ్చిన నగదును పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఈ ముఠా దొంగిలించిందన్నారు. కృష్ణలంక పోలీసులకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము దర్యాప్తు చేశామన్నారు. పక్కా సమాచారంతో బస్టాండ్ సమీపంలోని పద్మావతి ఘాట్ వద్ద బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని వారి వద్ద నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సీసీఎస్ సీఐలు అబ్దుల్‌సల్లా, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్క్ చేసి ఉన్న కార్లే టార్గెట్

అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

విజయవాడస్పోర్ట్స్: పార్క్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు క్రైం ఏసీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద ఏసీపీ బుధవారం వెల్లడించారు. గుడివాడకు చెందిన ఓ వ్యక్తి ఈ నెల ఆరో తేదీన దుర్గమ్మ దర్శనానికి వచ్చారని, తన కారును రథం సెంటర్‌లో పార్క్ చేసి దర్శనానికి వెళ్లాడని ఏసీపీ చెప్పారు. దర్శనం అనంతరం వచ్చి చూస్తే.. కారు అద్దాలు పగులగొట్టి ఉన్నాయని, అందులోని బ్యాగ్ పోయినట్లు గ్రహించి వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసును సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేశారని, పక్కా సమాచారంతో చోరీకి పాల్పడిన గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామానికి చెందిన ముల్పూరి ఫణీంద్రరెడ్డిగా గుర్తించామన్నారు. అతనిని విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. క్యాటరింగ్ పనులు చేసుకుని జీవించే ఫణీంద్ర జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. అదే రోజు నిందితుడు మరో కారు అద్దాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డాడని వెల్లడించారు. నిందితుడి నుంచి రూ.2 లక్షలు ఖరీదు చేసే బంగారు ఆభరణాలు, రెండు సెల్ ఫోన్‌లు, ఒక కెమెరాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సీసీఎస్ సీఐలు రామ్‌కుమార్, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి పి. శ్రీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామన్నారు. 2,317 ప్రాదేశిక నియోజకవర్గాలు, 209 నీటి వినియోగదారుల సంఘాలు, 26 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. 14వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు నిర్వహించటం, అదే రోజు నీటి వినియోగదారుల సంఘాల ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకోవటం కోసం అదనపు సాధారణ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తారన్నారు. 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీకి సంబంధించి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకోవటం కోసం అదనపు సాధారణ జనరల్ బాడీ సమావేశం ఉంటుందన్నారు. ఈ ఎన్నికల నిర్వహణలో మొత్తం 3,11,180 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉందన్నారు.

'స్వర్ణాంధ్ర-2047' ఆవిష్కరణను విజయవంతం చేయండి

రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఎ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 13న జరిగే స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఏ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బాబు ఎ. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి స్వర్ణాంధ్ర –2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని.. పకడ్బందీ ఏర్పాట్లతో కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జె.నివాస్, శాప్ వీసీ అండ్ ఎండీ గిరీశ పీఎస్, జాయింట్ కలెక్టర్ నిధి మీనా, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బందరు రోడ్డు విస్తరణపై దోబూచులాట

- టీడీపీ నేతల ఒత్తిడితో నిలిచిన ప్రక్రియ
- టీడీఆర్ బాండ్లు ఇచ్చినా కదలని భవన యజమానులు
- నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు


విజయవాడలో బందరు రోడ్డు

పటమట(విజయవాడతూర్పు): నానాటికీ పెరుగుతున్న వాహనాలు.. జఠిలమవుతున్న ట్రాఫిక్‌తో సతమతమవుతున్న మచిలీపట్నం–పూణే జాతీయ రహదారి నం 65 (బందరురోడ్డు) విస్తరణ ఇప్పుడు ప్రహసనంగా మారింది. ఇటీవల ఈ రోడ్డు విస్తరణకు విజయవాడ నగర పాలక సంస్థ హడావిడి చేసింది. కూటమి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేకు పడింది. రోడ్డు విస్తరణలో నిర్వాసితులకు అందించాల్సిన టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్)ను అందించినప్పటికీ భవన యజమానులు ఖాళీ చేయకపోవటంతో విస్తరణ నిలిచిపోయింది. దీంతో ఈ రోడ్డుకు పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణ కఠినంగా మారింది. మరోవైపు ఉదయం సాయంత్రం వేళల్లో విద్యాసంస్థల బస్సులు అధికంగా ఉండటంతో బెంజిసర్కిల్ నుంచి నిర్మలా కాన్వెంట్ జంక్షన్ మీదగా పంటకాల్వరోడ్డు మీదగా ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు ట్రాఫిక్ మళ్లింపు చేయటం, ఇటు నేరుగా బెంజిసర్కిల్ నుంచి వచ్చే వాహనాలు కూడా ఎన్టీఆర్ సర్కిల్ వద్దే కలవటంతో ఈ జంక్షన్ మరింత జఠిలంగా మారటంతోపాటు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్టీఆర్ సర్కిల్, పటమట సెంటర్, పోస్టల్‌కాలనీ, హైస్కూల్‌రోడ్డు, ఆటోనగర్ గేటు, ఆటోనగర్ బస్టాండ్ వరకు ట్రాఫిక్ వద్ద నియంత్రించలేనంతగా ట్రాఫిక్ రద్దీ పెరుగుతుంది. త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాటి నుంచి నేటి వరకు...

2018లో ఈ తంతుకు ప్రారంభోత్సవం చేయగా స్థానికుల నుంచి ఎదురైనా సమస్యలు, టీడీఆర్ బాండ్ల పంపిణీ, కోర్టు కేసులు తదితరాలతో విస్తరణ పనులు నిలిచిపోయాయి. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ చెక్‌పోస్టు వరకు సుమారు 3.5 కిలో మీటర్ల దూరం వరకు మాస్టర్ ప్లాన్‌లో 120 అడుగులకు విస్తరించాలని ప్రతిపాదించారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు జాతీయ రహదారి విభాగం అధికారులపై ఒత్తిళ్లు చేయగా చెక్‌పోస్టు నుంచి బెంజిసర్కిల్ వరకు సర్వీస్ రోడ్డు లేకుండా రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలతో కలిపి 100 అడుగులకు మాత్రమే విస్తరించేలా మాస్టర్‌ప్లాన్‌ను మార్పు చేశారు. ఈ వ్యవహారంలో రోడ్డుకు ఇరువైపులా 168 ఆస్తులు నష్టపోతుండగా వాటిలో 151 ప్రాపర్టీలకు వీఎంసీ టీడీఆర్ బాండ్లను, అందులో 54 ప్రాపర్టీల్లో ఉన్న భవనాలకు నష్టపరిహారం కూడా వీఎంసీ 2018–24 మధ్యలో ఇచ్చింది. మిగిలిన వాటిని కోర్టు కేసులు ఉండటం, భూములు, భవనాలకు సరైన ధ్రువీకరణ సమర్పించకపోవటంతో కొంతమందికి బాండ్లు నిలిపివేశారు.

అడ్డుకున్న కూటమి ప్రభుత్వ పెద్దలు

రోడ్డు విస్తరణ పనులను ఈ ఏడాది అక్టోబర్‌లో పునఃప్రారంభించిన వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం టీడీఆర్ బాండ్లు అందుకున్న ప్రాపర్టీల్లో ఉన్న భవనాలు కూల్చే చర్యలు చేపట్టగా కూటమి నాయకులు రంగ ప్రవేశం చేశారు. రోడ్డు వెంబడి ఉన్న భవనాల్లో వ్యాపారాలు నష్టపోతాయని ప్రణాళిక విభాగం అధికారులను హెచ్చరించి విస్తరణకు తాత్కాలికంగా బ్రేకు వేశారు.

మరోవైపు మచిలీపట్నం నుంచి పూణే వరకు విస్తరించిన జాతీయ రహదారి 65ను రోడ్డు పనులు ఈ ప్రాంతంలో ఆగిపోవటంతో నిధులు నిలిచిపోతాయని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ముందుగా డ్రైనేజీ నిర్మించాలని, అనంతరం రోడ్డు పనులు చేపట్టాలని వీఎంసీ అధికారులకు తాఖీదు ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా జంక్షన్లు అభివృద్ధి చేయటం, ట్రాఫిక్ ఎలైన్‌మెంట్లు చేయటం, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పైపులైన్లు పునర్నిర్మించేందుకు, జీబ్రా క్రాసింగ్‌లు వేసేందుకు, సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు వీఎంసీకి నిధులు కూడా కేటాయింపులు చేయాలని అందుకు అంచనాలు పంపాలని ఎన్‌హెచ్‌ఏఐ వీఎంసీకి సర్క్యులర్ సైతం పంపింది. దీనిపై రాజకీయ ఒత్తిడి ఉండటంతో ఎన్‌హెచ్‌ఏఐకి జవాబు కూడా ఇవ్వలేదని ఆరోపణలు ఉన్నాయి.

నెలాఖరులోగా అక్కినేని విగ్రహావిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి పురస్కరించుకుని తుమ్మలపల్లి వారి కళాక్షేత్రం ప్రాంగణంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యాన ఈనెలాఖరులోగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు తెలిపారు. దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్‌సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్ నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహం తీసుకురావటం జరిగిందన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ అక్కినేని విగ్రహావిష్కరణకు సహకరిస్తున్న ఎక్స్‌రే సంస్థ అధ్యక్షులు కొల్లూరికి కృతజ్ఞతలు తెలిపారు. తాము ఇప్పటికే పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇప్పుడు అక్కినేని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తెలుగు చిత్రపరిశ్రమంలో తనదైన ముద్రను వేసిన అక్కినేని విగ్రహావిష్కరణ కార్యక్రమంకు అక్కినేని అభిమానులు తరలిరావాలని కోరారు. సొసైటీ కార్యదర్శి రాము, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన వసతులు కల్పించండి


క్వారీ వద్ద పరిస్థితులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజలకు అవసరమైన వసతులన్నీ కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. 52వ డివిజన్లోని మల్లికార్జునపేట, ఉపరవాగు సెంటర్, పరిసర ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. సైడ్‌కాలువలు, కమ్యూనిటీ టాయిలెట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులు లీకేజ్ గుర్తిసే వెంటనే మరమ్మతులు చేయాలని, పైపులైన్ ద్వారా గృహాలకు వెళ్లే తాగునీటి సరఫరాలో నీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆ ప్రాంతంలో ఉన్న మెట్లను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. సైడ్ డ్రైనేజీల్లో ఉన్న వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, స్థానికులు తమ ఇళ్లలోని వ్యర్థాలను సైడు డ్రెయిన్లలో వేయకుండా సచివాలయ సిబ్బందితో అవగాహన కల్పించాలని తెలిపారు. ఉప్పరవాగులోని మగవారిక్వారీ సమీపంలో ప్రజలకు అవసరమైన సంపు, వాహనాలు నిలుపుదకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. అవసరమైన చోట కాల్వలపై ఐరన్‌మెష్‌లు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. ఈ పర్యటనలో 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వర రావు, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్ వర్క్స్ పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన బాలచంద్రరావు



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడ తూర్పు నియోజకవర్గం పటమటకు చెందిన ఎస్సీ నాయకుడు, పూర్వపు రైల్వే అడ్వైజరీ సభ్యులు వై.బాలచంద్రరావు (బాలు) బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌తో కలసి వైఎస్ జగన్‌ను కలిశామని ఆయన తెలిపారు.

–పటమట(విజయవాడతూర్పు)

వక్ఫ్ కమిటీని రద్దు చేయాలి

నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ జలీల్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ కూటమి ప్రభుత్వం నియమించిన వక్ఫ్ కమిటీని తక్షణమే రద్దు చేయాలని నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్ డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన కమిటీని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. వక్ఫ్ కమిటీ ఎన్నికలు నిర్వహించకుండా అధ్యక్షుడుని ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మైనార్టీల్లోని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డులో పనిచేస్తున్న అధికారులను ప్రక్షాళన చేయాలన్నారు. ఎన్నికల ముందు ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో షాదీఖానాలకు స్థలాలు కేటాయించి ప్రభుత్వమే నిర్మాణం చేయాలని తెలిపారు. దుల్హన్ పథకాన్ని అమలు చేసి రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జాకీర్ హుస్సేన్, సయ్యద్ సైదా, గుర్రం రామారావు పాల్గొన్నారు.

అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తాం

ఆటోనగర్(విజయవాడతూర్పు): హెవీఎర్త్ మూవర్స్ డీలర్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఎండీ అక్రమ్ అన్నారు. ఆటోనగర్‌లోని అటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాల్లో బుధవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అక్రమ్ మాట్లాడుతూ గత కొంత కాలం నుంచి అసోసియేషన్ పలు సేవా కార్యక్రమాలతో పాటు సభ్యులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు. 2016 లో అసోసియేషన్ స్థాపించినప్పటి నుంచి సభ్యుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నట్టు చెప్పారు. 200 మంది పైగా సభ్యులు ఉన్నారన్నారు. గత మూడు నెలల క్రితం విజయవాడలో వచ్చిన వరదలో కూడా బాధితులకు ఆర్థిక సహాయ సహకారాలు అందించినట్టు చెప్పారు. అంతే కాకుండా అసోసియేషన్ అభివృద్ధికి భవిష్యత్‌లోనూ మరిన్ని సేవలు అందిస్తామన్నారు. సభ్యులందరి సహకారంతో ముందుకు పోతామన్నారు.


అక్రమ్ విజయం సాధించడంతో అభినందనలు తెలుపుతున్న సభ్యులు

అసోసియేషన్ సభ్యులు ఎవరైనా అనుకోకుండా ప్రమాదాలు.. సాధారణంగా మరణిస్తే ఆ సభ్యుని మట్టి ఖర్చులకు నిమిత్తం రూ.20 వేలు తక్షణ సహాయం అందిస్తామన్నారు. ప్రతి సభ్యునికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి అబ్దుల్ కాళిక్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు షేక్ మునీర్. కొండా, ఎస్‌కె ట్రేడర్స్ సలీం కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఒంగోలుకు చెందిన లిటిల్ చాంప్స్ ఎడ్యుకేషన్ సొసైటీ కళానిలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై 17 మంది కళాకారులు కూచిపూడి నృత్యంలో పలు అంశాలను ప్రదర్శించారు. అందులో నరసింహస్వామి వారి అవతారంపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులందరినీ అలరించింది. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన చిన్నారులను ఆలయ ఈవో కె.ఎస్.రామరావు అభినందించి ప్రశంసా ప్రతాలను అందజేశారు. అనంతరం కళాబృందంలోని సభ్యులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

ఉపనిషత్తుల సారాంశమే గీతా యజ్ఞం

డాక్టర్ యుగంధరాచార్య గురూజీ


విద్యార్థులతో యుగంధరాచార్య గురూజీ, దేవస్థాన కమిటీ సభ్యులు, అతిథులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భగవాన్ శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన ఉపనిషత్తుల సారాంశమే గీతా యజ్ఞమని, అది సర్వ మానవాళికి వర్తిస్తుందని డాక్టర్ గానుగుల యుగంధరాచార్య గురూజీ అన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని శ్రీకృష్ణ దేవస్థానంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులతో గీతా పారాయణం జరిగింది. విద్యార్థులందరూ భక్తి, జ్ఞాన, కర్మ, పురుషోత్తమ, మోక్ష సన్యాస యోగంలోని శ్లోకాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా యుగంధరాచార్య గురూజీ మాట్లాడుతూ రాగ, ద్వేష, క్రోధ, భయాలను విడిచి శ్రీకృష్ణుని ధ్యానించిన వారు ఆయన అనుగ్రహాన్ని పొందుతారని తెలిపారు. బుద్ధిమంతుడు, కోరికలు లేనివారు, జయాపజయాల పట్ల సమబుద్ధి కలిగినవారు, ఈర్ష్యా రహితులు బంధాలలో చిక్కుకోరని అన్నారు. ఎటువంటి వారైనా జ్ఞానంతో సంస్కరింపబడతారని చెప్పారు. కురుక్షేత్ర సంగ్రామం ఆరంభంలో కృష్ణ భగవానుడు అర్జునునికి బోధించిన జ్ఞానమే గీతా సారాంశమని అన్నారు. భగవద్గీతలో భగవంతుని తత్వం, ఆత్మ తత్వం, జీవన గమ్యం, గమ్య సాధనా విధానాలు బోధించారని వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, లాకా తిరుపతయ్య యాదవ్, చెవుల ఆంజనేయులు యాదవ్, ఎం.రాజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చెన్నయ్య యాదవ్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి చిత్రాన్న ప్రసాదం, స్వీట్లు పంచిపెట్టారు.

సిద్ధార్థలో గీతా జయంతి వేడుకలు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఆవరణలో గీతా జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులు భగవద్గీతలోని శ్లోకాలను చక్కగా ఉచ్చరణ చేసి అకట్టుకున్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత పఠనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంశాపత్రాలను సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీ తారామయ్య అందచేశారు. భగవద్గీత శ్లోకాల భావాలను తెలుసుకోవడం వల్ల జీవితంలోని సమస్యలకు పరిష్కారం మార్గం లభిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా మానసిక ప్రశాంతత కూడా భగవద్గీత వినడం వల్ల లభిస్తోందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం


రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభిస్తున్న కమర్షియల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ బాబు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకిలో రామ్‌రాజ్ షోరూమ్‌ను బుధవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ కమిషనర్ బాబు.ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి రామ్‌రాజ్ దుస్తులు అద్దం పడతాయని, అన్ని వర్గాలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దుస్తులు నాణ్యమైన కాటన్‌తో తయారైనందున యాంటీ బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్‌లను నివారిస్తాయని, షర్టులు, ధోతీలు, బనియన్లు తదితరాలతో దక్షిణాదితో పాటు ఉత్తర భారతదేశంలో కూడా మంచి గుర్తింపు సాధించిందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు, విజయ పికిల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాటూరి రాము, రామ్‌రాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన ఆపాత మధురాలు

విజయవాడ కల్చరల్: సురభి కళావేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా కొత్తా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు కామినేని ఉదయ శంకర్ పర్యవేక్షణలో గాయనీ గాయకులు కుసుమాంజలి, దయామణి, శ్రావణి, రహీమాలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కళా సంస్థలు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాలన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చంద్రశేఖర్, జాస్తి కృష్ణ సింధూ, కృష్ణకుమారి పాల్గొన్నారు.



చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చదువుతో మాత్రమే మన ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతుందని... ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కృపా మినిస్ట్రీస్ అధినేత డాక్టర్ రవీంద్ర అన్నారు. ఆ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాయకాపురం ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అనే ఆయుధం మన స్థాయిని.. జీవితాన్ని మార్చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణ, పట్టుదలతో చదివితే తప్పకుండా విజయం సాధించవచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కూడా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఆకాంక్షతో ఇలా ప్రతి ఏడాది అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రధాన ప్రశ్నలు–జవాబులతో కూడిన ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. స్కూల్‌లోని 145 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు సునంద, రాధిక, సత్యవతి, శ్రీనివాసరావు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రవీంద్ర, హెచ్‌ఎం హుస్సేన్ తదతరులు

దివ్యాంగులకు సైకిళ్లు పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం ఎల్‌బీఎస్ నగర్ ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహంలో మూగ, చెవిటి విద్యార్థులకు అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు గుండు దిలీప్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన మూగ, చెవిటి విద్యార్థులు కాలేజీకి వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని హాస్టల్ వార్డెన్ నాగస్వర్ణ తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో తాము ట్రస్ట్ సభ్యుల సహకారంతో ఐదుగురికి సైకిళ్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ సేవలు సద్వినియోగం చేసుకుని చక్కగా చదివి నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ శాశ్వత సభ్యులు జూలూరు శోభనాచలపతి గుప్తా, చిట్టూరి నందగోపాల్ మాట్లాడుతూ అవసరమైనప్పుడు మరిన్ని సైకిళ్లు అందించటానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. తాము అడిగిన వెంటనే ఐదు సైకిళ్లు అందజేసిన ట్రస్ట్ సభ్యులకు హాస్టల్ వార్డెన్ నాగస్వర్ణ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

హార్టికల్చర్ ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): భవిష్యత్ తరాలు పర్యావరణ సహిత సాగు పద్ధతులు అవలంభించాల్సిన అవసరం ఉందని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ అన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఈ నెల 18,19 తేదీల్లో కళాశాలలో హార్టికల్చర్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. పూలు, పండ్లు, మొక్కలు ప్రదర్శనతో పాటు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ ఎక్స్‌పోను నిర్వహిసుతన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎక్సపో బ్రోచర్‌ను ఆమె విడదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సి ఇన్నసియా, డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ ఉషాకుమారి, అగ్రికల్చర్ విభాగం అధిపతి డాక్టర్ లక్ష్మణ స్వామి, అధ్యాపకులు మనోజ్, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వేడుకగా బైబిల్ మిషన్ చర్చి ప్రారంభోత్సవం




లబ్బీపేట(విజయవాడతూర్పు): నెహ్రూనగర్ శిఖామణి సెంటర్ సమీపంలో ఐదు దశాబ్దాలుగా ఉన్న బైబిల్ మిషన్ చర్చిని బుధవారం పునఃప్రారంభోత్సవం చేశారు. ఈ వేడుకలో బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ జాన్ దేవదాసు, కార్యదర్శి సుధాకర్ పాల్గొని చర్చిని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం దైవ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బైబిల్ మిషన్ గవర్నింగ్ కమిటీ సభ్యులు రెవరెండ్ నత్తా దాసుబాబుతో పాటు, నత్తా శ్యామ్‌బాబుతో పాటు ఆ చర్చి ఫాస్టర్ రెవరెండ్ బాలస్వామి, స్థానికులు యోనారాజు, చర్చి పెద్దలు, పలువురు ఫాస్టర్స్ పాల్గొన్నారు.

ఏఐతో భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య సంబంధిత అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రతి ఒక్కరికీ ఉత్తమ వైద్య సేవలు అందించడంలో కీలక భూమిక పోషిస్తున్నట్లు అమెరికాలోని బయోఫార్మాస్యుటికల్ కంపెనీ వ్యవస్థాపకులు బొబ్బా వెంకటాద్రి అన్నారు. నగరంలోని కెవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఆరోగ్య సంబంధిత రంగాల్లో ఏఐతో వస్తున్న కీలక మార్పులను వివరించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటాద్రి మాట్లాడుతూ ఏఐలో ఉత్తమ సేవలు అందించేందుకు వివిధ సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నందున ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. విద్యార్థులు ఏఐపై అవగాహన పెంచుకోవడం ద్వారా వచ్చే ఉద్యోగ అవకాశాలు గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ సునీత, లయోలా ఇంప్లెక్స్ సీఈఓ కృష్ణమరాజు, ఆ కళాశాల ప్రొఫెసర్ జి రమణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): భవానీపురం 41వ డివిజన్ పరిధిలోని ప్రెసిడెంట్ వీధిలో ఓ పాడుబడిన భవనంలో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్‌లెస్ట్ అధికారులు పట్టుకున్నారు. బియ్యం అక్రమ రవాణా జరుగుతోందంటూ స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్‌లెస్ట్ అధికారులు బుధవారం ఆ ఇంటిపై దాడి చేశారు. ఇంటిలో 41 తెల్ల సంచుల్లో నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. భవానీపురానికి చెందిన కొల్లి తిరుపతమ్మ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఆమె కార్డుదారుల నుంచి బియ్యం కిలో రూ.12 చొప్పున కొనుగోలు చేసి తరలించేందుకు సిద్ధం చేయగా అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న కొల్లి తిరుపతమ్మపై కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ వెంకట్ తెలిపారు.


భక్తిశ్రద్ధలతో సామూహిక హారతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో బుధవారం సాయంత్రం గీతా జయంతి, జనవరి 5న జరగబోయే హైందవ శంఖారావం కార్యక్రమంలో భాగంగా సామూహిక హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాజయంతి విశిష్టతను భక్తులకు వివరించారు. హైందవ శంఖారావంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐటీ హార్డ్‌వేర్.. ఉత్పత్తిలో సూపర్



గడచిన 5 ఏళ్లలో దేశీయంగా ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి ఏటా 16 శాతం చొప్పున గణనీయంగా పెరిగింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ గణాంకాల ప్రకారం 2019-20లో రూ.5.33 లక్షల కోట్ల నుంచి 2023-24లో రూ.9.52 లక్షల కోట్లకు పెరిగింది. అలాగే ఐటీ హార్డ్‌వేర్ ఉత్పత్తులు కూడా భారీగా పెరిగాయి. 2019తో పోలిస్తే ఎగుమతుల విలువ 2023-24లో మూడున్నర రెట్లకుపైగా పెరిగింది.



లండన్‌లో ఒంగోలు యువకుడి దుర్మరణం


చిరంజీవి(ఫైల్)

ఒంగోలు టౌన్: చదువు కోసం లండన్ వెళ్లిన పంగులూరి చిరంజీవి (33) అక్కడ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం బూదవాడ గ్రామానికి చెందిన పంగులూరి సుబ్బారావు ఒంగోలులో స్థిరపడ్డారు. ఆయన కుమారుడు చిరంజీవి ఎంఎస్ చదివేందుకు 14 నెలల కిందట లండన్ వెళ్లాడు. చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం ఏపీకి చెందిన స్నేహితులతో కలిసి కారులో డ్యూటీకి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిరంజీవి అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలినవారు గాయాలతో బయటపడ్డారు.

భారతీయుల దుబాయ్ విహారానికి బ్రేక్

కఠిన నిబంధనలతో వీసాల నిరాకరణ

గతంలో వీసా దరఖాస్తుల్లో 99 శాతానికి అనుమతి
తాజాగా 94-95 శాతానికి పడిపోయిన వైనం
5-6 శాతం తిరస్కరణ



సాక్షి, అమరావతి: ప్రముఖ పర్యాటక నగరమైన దుబాయ్‌లో విహరించాలనుకునే భారతీయులకు ఎదురుదెబ్బ తగులుతోంది. హాలీడే ట్రిప్పులు, కుటుంబ సభ్యులతో వెకేషన్ కోసం దుబాయ్ టికెట్లు బుక్ చేసుకున్న వారికి నిరాశే మిగులుతోంది. ఒకప్పుడు దరఖాస్తు చేసుకున్న వెంటనే దుబాయ్ వీసా మంజూరయ్యేది. కానీ, ఇటీవల కాలంలో అమల్లోకి వచ్చిన దుబాయ్ ఇమ్మిగ్రేషన్ నిబంధనలు భారతీయ పర్యాటకులకు చుక్కలు చూపిస్తున్నాయి. కొన్ని వారాలుగా వీసాల తిరస్కరణ రేటు గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు వీసా దరఖాస్తుల్లో 99 శాతం ఆమోదం పొందేవి. కానీ ఇప్పుడు 94-95 శాతానికి పడిపోయింది.

ప్రతి వంద దరఖాస్తుల్లో 5-6 శాతం తిరస్కరణ..

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కఠిన పర్యాటక వీసా నిబంధనలను అమలు చేస్తోంది. దుబాయ్‌లో పర్యటించాలనుకునేవారు తమ వీసా దరఖాస్తుతో పాటు ఏ హోటల్‌లో బస చేస్తారో.. ఆ హోటల్ బుకింగ్ డాక్యుమెంట్స్, విమాన రిటర్న్ టికెట్లను జత చేయాల్సి ఉంటుంది. ఒకవేళ హోటల్‌లో కాకుండా బంధువుల ఇంట్లో ఉండాలనుకుంటే.. సంబంధిత నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. హోస్ట్ రెంటల్ ఒప్పందం, ఎమిరేట్స్ ఐడీ, కాంటాక్ట్ వివరాలు తప్పనిసరి చేసింది. ఈ పత్రాలన్నీ ముందుగా జత చేస్తేనే వీసాకు ఆమోదం లభిస్తుంది. అలాగే అదనంగా దుబాయ్‌లో ఉండటానికి తగినంత బ్యాంక్ బ్యాలెన్స్ ఉందని రుజువు చేయాల్సి ఉంటుంది. హోటల్‌లో బస చేయాలనుకుంటే కనీస బ్యాలెన్స్ రూ.50 వేలు చూపిస్తూ చివరి మూడు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్, పాన్ కార్డును సమర్పించాలి. వీటిలో ఏది లేకున్నా వీసా మంజూరుకు అవరోధం ఏర్పడినట్టే. తాజాగా ప్రతి వంద దరఖాస్తుల్లో 5-6 శాతం తిరస్కరణకు గురవుతున్నాయి. డాక్యుమెంటేషన్ పక్కాగా ఉన్నా.. వీసా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని ట్రావెల్ ఏజెన్సీలు వాపోతున్నాయి.

ఆర్థికంగానూ నష్టమే..

వీసా దరఖాస్తుల తిరస్కరణ పర్యాటకులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతోంది. వీసా దరఖాస్తు రుసుమును కోల్పోవడంతో పాటు ముందుగా బుక్ చేసుకున్న విమాన, హోటల్ టికెట్ల కోసం చెల్లించిన డబ్బును కూడా నష్టపోతున్నారు. అలాగే ఒక కుటుంబ సభ్యుడి వీసా తిరస్కరణకు గురైతే.. కుటుంబంలోని మిగిలిన సభ్యులు కూడా తమ ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వస్తోంది. సెలవులు సీజన్ రాబోతుండటంతో పాటు డిసెంబర్, జనవరిలో దుబాయ్‌లో షాపింగ్ ఫెస్ట్ జరగబోతున్న సమయంలో పెద్ద ఎత్తున వీసాలు తిరస్కరణకు గురవుతుండటం భారతీయ పర్యాటకులతో పాటు ట్రావెల్ ఏజెన్సీలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ప్రపంచ దేశాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో.. వారి సంఖ్యను కాస్త తగ్గించేందుకే కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.


రూ.165.7 కోట్లతో వెస్ట్ క్యూ-6 టెర్మినల్ ఆధునికీకరణ

ఇంటిగ్రేటెడ్ కార్గో టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో విశాఖ పోర్టు అథారిటీ ఒప్పందం


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

విశాఖ సిటీ: విశాఖ పోర్టులో వెస్ట్ క్యూ-6 (డబ్ల్యూక్యూ-6) టెర్మినల్ ఆధునికీకరణ, డ్రై బల్క్ కార్గో నిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ కార్గో టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్ ఎస్పీవీ) కంపెనీతో విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) ఒప్పందం కుదుర్చుకుంది. దీన్లో భాగంగా బెర్త్‌ను 255 మీటర్ల పొడవు, 14 మీటర్ల లోతు పెంచనున్నారు. దీంతో 230 మీటర్ల పొడవు కలిగిన పానమాక్స్ వెసెల్స్ నిర్వహణకు అనుకూలంగా ఉండనుంది. బెర్త్‌పై 1500 టీపీహెచ్ సామర్థ్యం గల రెండు కొత్త హార్బర్ మొబైల్ క్రేన్లు (హెచ్ఎంసీ), 2 మొబైల్ హాపర్లు, క్రేన్లు, లోడర్లు, ట్రక్కులు, ఫోర్క్ లిఫ్టులు వంటి ఆధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం రూ.165.70 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఇందులో రూ.77.20 కోట్లు ముందస్తు చెల్లింపుగా వసూలు చేశారు. ఈ టెర్మినల్ 5.18 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక నిర్వహణ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఒప్పందంలో భాగంగా టెర్మినల్ వద్ద తాత్కాలిక నిల్వ కోసం 2.3 ఎకరాల బ్యాక్-అప్ ప్రాంతం, 1 కి.మీ. దూరంలో 12.2 ఎకరాల స్టాక్ యార్డ్ అందుబాటులోకి రానుంది. 58 వేల నుంచి 60 వేల డెడ్ వెయిట్ టన్నేజ్, 230 మీటర్ల పొడవు, 32.5 మీటర్ల వెడల్పు కలిగిన నౌకలను నిర్వహించేందుకు అనువుగా ఉంటుంది. 18 నెలల్లో అన్ని నిర్మాణ పనులు, కొత్త క్రేన్లు, ఇతర పరికరాల ఏర్పాటు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారు. 30 ఏళ్ల పాటు బల్క్ కార్గో నిర్వహణకు సంబంధించి ఒప్పందం చేసుకున్నారు. నిర్మాణ దశలోనే కార్యకలాపాలను ప్రారంభించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 100 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనున్నది.

నేటి నుంచి రాజమహేంద్రవరం-ఢిల్లీ విమాన సర్వీసులు



మధురపూడి: రాజమహేంద్రవరం-ఢిల్లీకి గురువారం నుంచి విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే ముంబైకి సర్వీసులు నడుస్తుండటంతో ఉభయగోదావరి జిల్లాల్లోని ప్రయాణికుల్లో సంతోషం నెలకొంది. ఈ రెండు సర్వీసుల ద్వారా ఢిల్లీ, ముంబై నుంచి రాజమహేంద్రవరానికి 744 మంది ప్రయాణికుల రాకపోకలు జరగనున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు నిర్వహిస్తున్న సాధారణ సర్వీసుల ద్వారా 1,400 మంది ప్రయాణికులు ఇప్పటికే రాకపోకలు సాగిస్తుండగా, ముంబై, ఢిల్లీ ఎయిర్‌బస్సుల రాకతో ప్రయాణికుల సంఖ్య 1,800 మందికి చేరనుంది.

నేడు తొలి సర్వీసు: 6 ఈ 364 ఇండిగో విమాన సర్వీసు గురువారం నుంచి రోజూ రాకపోకలు సాగించనుంది. ఈ విమానం ఢిల్లీలో గురువారం ఉదయం 6-30 గంటలకు బయలుదేరి, 8-45 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుని, తిరిగి ఉదయం 9-30 గంటలకు బయలుదేరి ఢిల్లీ వెళుతుంది. ఈనెల 13న ఢిల్లీలో ఉదయం 7-30 గంటలకు బయలుదేరి, రాజమహేంద్రవరం విమానాశ్రయానికి 9-45 గంటలకు చేరుతుంది. ఉదయం 10-30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు ఢిల్లీ చేరుతుంది. గురువారం ఉదయం ఢిల్లీలో విమాన సర్వీసును ప్రారంభించి, అదే ఎయిర్‌బస్సులో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ రాజమహేంద్రవరం విమానాశ్రయానికి రానున్నారు.

వెయ్యి కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్టు, నలుగురు పరారీ

కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఒడిశాలోని కలిమెల నుంచి హరియాణాకు గంజాయి రవాణా చేస్తున్న లారీని అల్లూరి జిల్లా కూనవరం పోలీసులు పట్టుకున్నారు. ఎటపాక సీఐ కన్నపరాజు బుధవారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన లారీ అదే ప్రాంతం నుంచి బియ్యం లోడుతో కాకినాడ వచ్చింది. అక్కడ అన్‌లోడ్ చేసిన అనంతరం డ్రైవర్లు షహలామ్ షేక్, అక్తర్ షేక్ ఒడిశాలోని కలిమెల వెళ్లారు. అక్కడ రూ.50 లక్షల విలువైన గంజాయిని కొనుగోలు చేసి 25 బస్తాల్లో నింపారు. అక్కడినుంచి వారు శామలాల్ దేవ్, మరో నలుగురితో లారీలో కూనవరం, చట్టి మార్గంలో హరియాణాకు బయల్దేరారు. ముందస్తు సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసులు జగ్గవరం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. గంజాయితో వస్తున్న లారీని గుర్తించి అందులోని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు షహలామ్ షేక్, అక్తర్ షేక్, శామలాల్ దేవ్ పట్టుబడగా మిగతా నలుగురు పరారయ్యారని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అప్పు తీర్చమన్నందుకు తుపాకీతో దాడి

ఓ వ్యక్తి తలపై మోదడంతో గాయాలు


గాయపడిన నాగిరెడ్డి

పులివెందుల రూరల్ : తీసుకున్న అప్పు తీర్చాలని అడిగినందుకు తుపాకీతో దాడి చేయడంతో ఓ వ్యక్తికి గాయాలయిన ఘటన వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని ఆటోనగర్ సమీపంలో తీవ్ర కలకలం సృష్టించింది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కొర్రా నాగిరెడ్డి కొన్నేళ్ల క్రితం శివప్రసాద్ అనే వ్యక్తికి డబ్బు, బంగారం అప్పుగా ఇచ్చాడు. శివప్రసాద్ కొద్ది మొత్తం తప్ప అంతా చెల్లించాడు. ఈ నేపథ్యంలో కొన్ని నెలల క్రితం నాగిరెడ్డి శివప్రసాద్‌ను అప్పు మొత్తం తీర్చమని అడిగాడు. అది మనసులో పెట్టుకున్న శివప్రసాద్, గజ్జెల చక్రిధర్‌రెడ్డి (బబ్లు)తో కలిసి బుధవారం మద్యం సేవించి నాగిరెడ్డితో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో చక్రిధర్ రెడ్డి తన వద్ద ఉన్న తుపాకీతో నాగిరెడ్డి తలపై మోదడంతో అతడి తలపై తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం చక్రిధర్‌రెడ్డి తుపాకీతో ఒక రౌండ్ గాల్లోకి కాల్పులు జరిపాడు. స్థానికులు నాగిరెడ్డిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ విష్ణు నారాయణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్ కస్టడీకి రిటైర్డ్ ఏఎస్పీ

నగరంపాలెం: సీఐడీ రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కొద్దినెలల కిందట ఇచ్చిన ఫిర్యాదుతో నమోదైన కేసులో ఇటీవల విజయ్‌పాల్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ప్రస్తుతం జైల్లో ఉన్న ఆయన్ని తమ కస్టడీకి అప్పగించాలని జిల్లా ప్రత్యేక కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.


6 నెలల్లో తారుమారు

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు చంద్రబాబు తూట్లు

ఓ నాయకుడు మాట ఇస్తే... ఆరు నూరైనా నూరు ఆరైనా కట్టుబడి ఉండాలంటారు!

కానీ సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ఏరు దాటాక తెప్ప తగలేశారు!

ఆర్నెళ్ల పాలనలో కనిపించేదంతా ఉత్త 'గ్యాసే'!



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకపోగా ఇసుకలో దోపిడీ.. మద్యంలో దోపిడీ.. రూ.15 వేల కోట్లకుపైగా విద్యుత్తు చార్జీల బాదుడుతో ప్రజలను గుల్ల చేస్తున్నారు. మరోవైపు కొత్త పథకాలు లేకపోగా ఉన్నవాటినే రద్దు చేస్తూ రెడ్‌బుక్ పాలనతో ప్రశ్నించే గళాలపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు నిర్వీర్యమయ్యాయి. రెడ్‌బుక్, మాఫియా రాజ్యంతో స్కామ్‌ల పాలన సాగుతోంది. ఎన్నికలు జరిగిన ఏడు నెలలు తరువాత.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఆర్నెళ్లు గడిచాక ఇదీ పరిస్థితి!!

సాక్షి, అమరావతి: అలవి మాలిన హామీలతో అన్ని వర్గాలను మోసం చేసిన సీఎం చంద్రబాబు అభూత కల్పనలతో కాలక్షేపం చేస్తున్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా గత ఐదేళ్లు అమలైన పథకాలు, వ్యవస్థలన్నింటినీ రద్దు చేసి పేద వర్గాలకు తీరని ద్రోహం తలపెట్టారు. ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పిన 'తల్లికి వందనం' ఊసే లేదు. దీనికోసం 46 లక్షల మంది తల్లులు ఎదురు చూస్తున్నారు. ఏటా రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తామన్న 'అన్నదాత సుఖీభవ' పథకం ఎటు పోయిందో తెలియక 54 లక్షల మంది అన్నదాతలు ఉసూరుమంటున్నారు. కోటి మందికిపైగా యువత నిరుద్యోగ భృతి లేదంటే ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇక చంద్రబాబు ప్రకటించిన పేదలను ధనికులుగా మార్చే 'పూర్ టు రిచ్' కాన్సెప్ట్ కాగితాలకే పరిమితం! 'యువగళం', 'ఆడబిడ్డ నిధి' పథకాలు కనుచూపు మేరలో లేవు. 'ఆడబిడ్డ నిధి' కోసం 1.80 కోట్ల మంది మహిళలు ఆశగా పడిగాపులు కాస్తున్నారు. అయితే కనీసం వాటిని అమలు చేసే ఉద్దేశం కూడా ప్రభుత్వ పెద్దల్లో కానరాక పోవడంతో మోసపోయామని ప్రజలు గ్రహిస్తున్నారు. ఇవాళ రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత అంతా అదే జగన్ అధికారంలో ఉండి ఉంటే ఈ సమయానికి ఏ పథకాల కింద, ఎంత లబ్ధి చేకూరేదో బేరీజు వేసుకుంటున్నారు. గత ఐదేళ్లు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పారదర్శక పాలనతో వ్యవస్థలు, పథకాలను ప్రజల ఇంటి వద్దకే వైఎస్ జగన్ చేరవేశారు.

> వైఎస్ జగన్ హయాంలో ఏటా ఏప్రిల్‌లో విద్యార్థులకు వసతి దీవెన, పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు.. మేలో విద్యా దీవెన, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, రైతు భరోసా, మత్స్యకార భరోసా.. జూన్‌లో అమ్మ ఒడి.. జూలైలో విద్యా కానుక, వాహన మిత్ర, కాపు నేస్తం, చిరు వ్యాపారులకు జగనన్న తోడు.. ఆగస్టులో విద్యా దీవెన, నేతన్న నేస్తం.. సెప్టెంబర్‌లో చేయూత.. అక్టోబర్‌లో రైతు భరోసా.. నవంబర్‌లో విద్యా దీవెన, రైతులకు సున్నా వడ్డీ రుణాలు.. డిసెంబర్‌లో ఈబీసీ నేస్తం, లా నేస్తం, మిగిలిపోయిన అర్హులకు సైతం పిలిచి మరీ పథకాలు అందించే కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టారు.

రాజకీయ వేదికలుగా ప్రభుత్వ విద్యా సంస్థలు..

అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలో 16 వేలకుపైగా పోస్టులతో మెగా డీఎస్సీని పూర్తి చేస్తామంటూ సీఎం చంద్రబాబు చేసిన తొలి సంతకం మురిగిపోయింది! వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అన్ని విద్యా సంస్కరణలను రద్దు చేయడమే పనిగా పెట్టుకున్న కూటమి సర్కారు ఆర్నెళ్లుగా ప్రభుత్వ పాఠశాలలపై అనేక ప్రయోగాలు చేసి ఒక్క హామీనీ అమలు చేయలేదు. ఐబీ, సీబీఎస్ఈ, టోఫెల్‌ను రద్దు చేసి.. తల్లికి వందనం పథకం అమలుపై మాత్రం చేతులెత్తేసింది. ఇంగ్లిష్ మీడియం చదువులు, డిజిటల్ తరగతి గదులు, పిల్లలకు ట్యాబ్‌లపై చేతులెత్తేసింది. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి ప్రైవేట్‌కు లబ్ధి చేకూరుస్తోంది. రాష్ట్రంలో స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఓ కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ ఇస్తామన్న హామీ గాలికి ఎగిరిపోయింది. స్కూళ్లల్లో అమలు చేస్తున్న పథకాలకు పేర్లు మార్చిందే గానీ ఒక్క విద్యా సంస్కరణను అమలు చేసింది లేదు. మెగా పీటీఎం పేరుతో ఉపాధ్యాయులను ఉరుకులు పెట్టించి ప్రభుత్వ విద్యా సంస్థలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చేశారు. రాష్ట్రానికి రావాల్సిన 700 ఎంబీబీఎస్ సీట్లకు మోకాలడ్డిన కూటమి ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు మన విద్యార్థులకు తీరని అన్యాయం చేసింది.

అన్ని విధాలా దగా పడిన రైతన్న

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండు వ్యవసాయ సీజన్లు గడుస్తున్నా అందించలేదు. అన్నదాతా సుఖీభవ కోసం 54 లక్షల మంది అన్నదాతలకు రూ.10 వేల కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో రూ.1000 కోట్లు మాత్రమే విదిలించడం గమనార్హం. ఇంతవరకు పథకం విధివిధానాలే ఖరారు చేయలేదు. ఇక ఖరీఫ్ 2023 సీజన్‌కు సంబంధించి రైతుల తరపున చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రూ.1,358 కోట్ల పంటల బీమా పరిహారం అందకుండా పోయింది. సున్నా వడ్డీ రాయితీ ఊసే లేదు. రబీ సీజన్‌లో కరువు సాయానికి సంబంధించి రూ.328 కోట్లకు ఎగనామం పెట్టారు. ఐదేళ్లుగా విత్తు నుంచి విక్రయం వరకు గ్రామ స్థాయిలో రైతులను చేయిపట్టి నడిపించిన రైతు సేవా కేంద్రాలను (ఆర్బీకేలు) చంద్రబాబు నిర్వీర్యం చేశారు. విత్తనాలు, ఎరువులు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఆర్బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తనాల పంపిణీని నిలిపివేశారు. గత ఆర్నెళ్లలో 70 మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడడం రాష్ట్రంలో రైతుల దయనీయ పరిస్థితులకు నిదర్శనంగా నిలుస్తోంది.

జాడలేని ఆడబిడ్డ నిధి..

19 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలందరికీ ఏటా రూ.18 వేలు చొప్పున ఆడబిడ్డ నిధి కింద ఆర్థిక సహాయం అందచేస్తామని సూపర్ సిక్స్ హామీల్లో చంద్రబాబు పేర్కొన్నారు. 1.80 కోట్ల మంది మహిళలు దీనికోసం ఎదురు చూస్తున్నారు.

నిరుద్యోగికి నయవంచన..

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు హామీ నీటిలో కలిసిపోయింది. రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలు ఉండగా ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున నెలకు రూ.4,800 కోట్లు అవసరం. అంటే ఏడాదికి రూ.57,600 కోట్లు ఖర్చవుతుంది. బడ్జెట్‌లో ఇందుకు ఒక్కపైసా విదల్చక పోవటాన్ని బట్టి నిరుద్యోగ భృతి లేదని తేలిపోయింది.

సూపర్ సిక్స్ + మేనిఫెస్టోలో ఇచ్చిన ఇతర ముఖ్యమైన హామీలు

- పూర్ టు రిచ్.. పీ-4 పథకాలు అంటూ ఇంతవరకు ఏ ఒక్కటీ ప్రకటించలేదు
- ఏటా జాబ్ క్యాలెండర్ జాడే లేదు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే రూ.4 వేల పింఛను హామీ మేనిఫెస్టోకే పరిమితం.
- రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ అమలు చేయలేదు
- ఉద్యోగుల సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షిస్తామని చెప్పి కనీసం చర్చ కూడా జరపలేదు
- అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఐఆర్, డీఏ ప్రకటిస్తామనే హామీని విస్మరించారు
- వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచకపోగా ఏకంగా ఆ వ్యవస్థకే మంగళం పాడారు
- కాపుల సంక్షేమ కోసం ఐదేళ్లలో రూ.15 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి బడ్జెట్‌లో అందుకు తగ్గట్టు నిధులు ఇవ్వలేదు
- విద్యుత్ బిల్లుల భారం తగ్గించకపోగా ఆర్నెళ్లలోనే రూ.15 వేల కోట్లకుపైగా చార్జీల భారం మోపారు.
- ఉచితంగా ఇసుక అంటూ దోపిడీ విధానాన్ని తీసుకొచ్చారు.

ఆసరా, చేయూత అసలే లేవు

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా పేద మహిళలను ఆర్థికంగా నిలబెట్టిన చేయూత, సున్నా వడ్డీ, ఆసరా లాంటి పథకాలు చంద్రబాబు హయాంలో ఒక్కటంటే ఒక్కటీ లేకపోవడంతో అక్క చెల్లెమ్మల పరిస్థితి దయనీయంగా ఉంది. ఇప్పటికే అందాల్సిన మత్స్యకార భరోసాగానీ, వాహనమిత్ర లాంటి పథకాలుగానీ అందలేదని ఆయా వర్గాలు వాపోతున్నాయి. 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామన్న హామీ బూటకంగా మారింది.

కొత్తవి లేవు.. అన్నీ రద్దులే

తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగించడంతోపాటు వారి గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతానంటూ ఉగాది పండుగ సందర్భంగా ఇచ్చిన హామీని చంద్రబాబు బుట్టదాఖలు చేశారు. ఏకంగా ఆ వ్యవస్థకే మంగళం పలికి 2.66 లక్షల మందిని రోడ్డున పడేశారు.

ఉచిత గ్యాస్‌లోనూ మాయ

ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి ఇప్పుడు జిమ్మిక్కులతో మహిళలను మోసం చేస్తున్నారు. రాష్ట్రంలో 1.54 కోట్ల కుటుంబాలకు ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలంటే రూ.4 వేల కోట్లు అవసరం. కానీ ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.895 కోట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. దీంతో కేవలం కోటి మందికి మాత్రమే ఒక్క సిలిండర్ ఇచ్చే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఈ ఏడాది రెండు సిలిండర్లకు కోత పెట్టారు.

రూ.15,485.36 కోట్ల విద్యుత్ చార్జీల భారం

అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని.. ఇంకా తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు మాట తప్పి రాష్ట్ర ప్రజలకు వరుసగా విద్యుత్ షాక్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే రూ.6,072.86 కోట్ల విద్యుత్తు చార్జీల భారాన్ని వినియోగదారులపై మోపిన కూటమి ప్రభుత్వం మరో రూ.9,412 కోట్ల భారం కూడా మోపేందుకు సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్నెళ్లలో వేసిన మొత్తం విద్యుత్ చార్జీల భారం రూ.15,485.36 కోట్లకు చేరింది.

మద్యం సిండికేట్లతో లూటీ

ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేసిన సీఎం చంద్రబాబు టీడీపీ సిండికేట్ దోపిడీకి రాచబాట పరిచారు. ప్రైవేటు మద్యం దుకాణాలను నెలకొల్పారు. టెండర్ల ప్రక్రియను ఏకపక్షంగా నిర్వహించి టీడీపీ సిండికేట్‌కే అన్ని మద్యం దుకాణాల లైసెన్సులు దక్కేలా చేశారు. ఇతరులు ఎవరూ టెండర్లు దాఖలు చేయకుండా పోలీసు యంత్రాంగంతో బెదిరించి అడ్డుకున్నారు. మాట వినకుంటే దాడులకు పురిగొల్పారు. తద్వారా రాష్ట్రంలోని 3,396 మద్యం దుకాణాలన్నీ టీడీపీ సిండికేట్ గుప్పిట పట్టింది. ప్రతి మద్యం దుకాణం పరిధిలో 4 నుంచి పది వరకు బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ఊరూవాడా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే రూ.15, బెల్ట్ దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే రూ.25 చొప్పున అధిక ధరలకు విక్రయిస్తూ అడ్డగోలుగా దోపిడీకి తెర తీశారు. మద్యం విక్రయాల ద్వారా టీడీపీ సిండికేట్ ఏటా రూ.41,850 కోట్ల చొప్పున ఐదేళ్లలో 2.09 లక్షల కోట్ల దోపిడీకి పన్నాగం పన్నింది.

పాలనా వైఫల్యాలు.. డైవర్షన్ రాజకీయాలు



ఆర్నెళ్ల పాలన అంతా వైఫల్యాల మయంగా మారడంతో డైవర్షన్ రాజకీయాలకే చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తున్నారు. జూన్‌లో రుషికొండ భవనాల పేరుతో బురద చల్లి మభ్యపుచ్చేందుకు యత్నించారు. ఆగస్టులో కాదంబరి జెత్వానీ కేసు వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు. సెప్టెంబర్‌లో ప్రకాశం బ్యారేజీని వైఎస్సార్‌సీపీ నేతలు బోట్లతో ఢీకొట్టి ధ్వంసం చేయడానికి కుట్ర పన్నారంటూ ఏమార్చే కుతంత్రాన్ని రచించారు. ఆ తర్వాత తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ వెంకన్న భక్తుల మనోభావాలు దెబ్బతీయడమే కాకుండా తిరుమలను రాజకీయాలకు వాడుకున్న వ్యక్తిగా మిగిలిపోయారు. అక్టోబర్‌లో వైఎస్సార్ కుటుంబ వ్యవహారాలను వక్రీకరించి అబద్ధాలు ప్రచారం చేశారు. నవంబర్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కుప్పలు తెప్పలుగా సోషల్ మీడియా కేసులు పెట్టారు. అమెరికాలో అదానీపై కేసుల వ్యవహారాన్ని వైఎస్ జగన్‌కు ముడిపెట్టి దుష్ప్రచారానికి కుట్ర పన్నారు. కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతుల వ్యవహారాన్ని రాజకీయం చేసి తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విఫల యత్నాలు చేస్తున్నారు.

ఇది అప్పుల కుప్ప ప్రభుత్వం

సంపద సృష్టిస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని నిరంతరం అప్పుల ఊబిలోకి దించుతున్నారు. ఇప్పటివరకు రూ.67,237 వేల కోట్ల మేర కొత్త అప్పులు చేసి రికార్డు సృష్టించారు. అతి తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ అప్పులు చేశారు. ఇన్ని అప్పులు చేసి కూడా హామీలను నెరవేర్చలేదు.

ఉచితం అంటూ.. ఇసుక దోపిడీ

ఉచిత ఇసుక విధానం ముసుగులో టీడీపీ నేతలు దోపిడీకి పాల్పడుతున్నారు. వర్షాకాలంలో ఇసుక కొరత తలెత్తకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యార్డుల్లో 80 లక్షల టన్నులను నిల్వ చేయగా కూటమి అధికారంలోకి రాగానే టీడీపీ ప్రజాప్రతినిధులు మాయం చేశారు. 108 రీచ్‌లకు షార్ట్ టెండర్లు పిలిచి ఆగమేఘాల మీద అయిన వారికి అప్పగించేశారు. ఇసుక లేక నిర్మాణ రంగం స్తంభించి లక్షలాది మంది నిర్మాణ రంగ కార్మికులు అల్లాడుతున్నారు.

భూ సమస్యలు మళ్లీ మొదటికి

ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా భూ వివాదరహితంగా మార్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్షలాది ఎకరాల భూములపై ఆంక్షలు తొలగిస్తే ఇప్పుడు టీడీపీ మళ్లీ ఆంక్షలు పెట్టి రైతులను కష్టాల్లోకి నెడుతోంది.

అధికారుల వల్లే అసంతృప్తి

ప్రజా సమస్యలను నాణ్యతగా పరిష్కరించడం లేదు.. కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులను అధికారులు నాణ్యతతో పరిష్కరించడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిందలేయడం చూస్తుంటే ఆడలేక మద్దెల ఓడు (తాను సరిగా పాట పాడలేక డోలు బాగా వాయించలేదన్నట్లు) అనే సామెత గుర్తుకొస్తోందని పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు వాపోతున్నారు. కేవలం ఆరు నెలల్లోనే ప్రజల్లో ఇంత అసంతృప్తి వచ్చిందంటే సమస్యల పరిష్కారం సరిగా జరగడం లేదని స్పష్టం అవుతోందని సీఎం చంద్రబాబు బుధవారం సచివాలయంలో రెండు రోజుల జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు) సదస్సు ప్రారంభ కార్యక్రమంలో, వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రజల్లో సంతృప్తి స్థాయి నెల నెలా తగ్గుతూ 69 శాతం నుంచి ఏకంగా 35 శాతానికి పడిపోయిందన్నారు. ఇదే విషయమై ప్రధాని మోదీ కూడా ఇటీవల తనతో అన్నారని చెప్పారు. ఇందుకు కలెక్టర్లు బాధ్యత వహించాలని సీఎం చెప్పడంపై అధికార వర్గాలు నివ్వెరపోయాయి. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిందెవరని వారు ప్రశ్నిస్తున్నారు. వరుస పెట్టి అక్రమంగా కేసులు పెడుతుంటే ప్రజల్లో ప్రభుత్వం పట్ల మంచి అభిప్రాయం ఎలా ఉంటుందని, వ్యవస్థలను అందరి కళ్లెదుటే నిర్వీర్యం చేస్తుంటే ఏ రీతిన ప్రభుత్వాన్ని అభినందిస్తారని చర్చించుకుంటున్నారు. తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి తమపై ఇంత దారుణంగా నిందలేయడం ఇదివరకెన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నేతలు తీసుకు వచ్చే సమస్యలను పరిష్కరించాలని.. రాజకీయ పాలన అంటే ఇదేనని, లేదంటే ప్రభుత్వంపై అసంతృప్తి ప్రజల్లో మరింత పెరుగుతుందని సీఎం చెప్పడం దేనికి నిదర్శనం అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇష్టానుసారం బదిలీలు, పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధించడం, ఏమాత్రం స్వేచ్ఛ ఇవ్వకుండా.. గౌరవం లేకుండా వ్యవహరిస్తుంటే నూరు శాతం నాణ్యతతో సమస్యల పరిష్కారం ఎలా సాధ్యమవుతుందని నివ్వెరపోతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలు అమలు చేయలేక ప్రజల్లో అసంతృప్తి వెల్లువెత్తుతుంటే ఏం చేయాలో తెలియక ఇలా తమపై నిందలేసి ప్రజల్లో దోషులుగా చూపడం తగదని వ్యాఖ్యానిస్తున్నారు.


సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, సీఎస్ నీరబ్ కుమార్, డీజీపీ

ఎవరి తప్పుకు ఎవరు బాధ్యత?

'ఇప్పటి వరకు 1.29 లక్షల వినతులు వచ్చాయి. గతంలో వచ్చిన సమస్యలే మళ్లీ మళ్లీ వస్తున్నాయంటే పరిష్కారానికి సరిగా చర్యలు తీసుకోవడం లేదు. ర్యాండమ్‌గా తనిఖీలు చేయాలి. ఇందుకు కలెక్టర్లను జవాబుదారీ చేస్తున్నాం. డబ్బుల్లేవని అభివృద్ధి ఆపేయొద్దు. వినూత్నంగా ఆలోచించి పనులు చేయాలి. మంచి పనులు చేస్తున్నా ప్రజలు ఎందుకు అభినందించడం లేదో ఆలోచించాలి. మేము పాలసీలు ఇస్తాం. వాటిని క్షేత్ర స్థాయిలో కలెక్టర్లే అమలు చేయాలి. శాంతి భద్రతలు, అభివృద్ధి, సంక్షేమం కలెక్టర్లపైనే ఆధారపడి ఉంటుంది. వార్షిక పనితీరు నివేదికలో ప్రజా సమస్యల పరిష్కార అంశాన్ని చేర్చుతున్నాం. అందుకోసం మీరు పోటీ పడి పనిచేయాలి. రెండు మూడు నెలల్లో సమస్యలన్నీ పరిష్కరించాలి. ఏ కలెక్టర్ పనితీరు ఎలా ఉందో బేరీజు వేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు హెచ్చరిక ధోరణిలో చెప్పడం పట్ల అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అందుబాటులో లేకుండా చేసిందెవరని, ఓ వైపు హైకోర్టు హెచ్చరిస్తున్నా వినిపించుకోకుండా సోషల్ మీడియా యాక్టివిస్టులను వేధిస్తున్నదెవరని ఈ సందర్భంగా అధికారులు లేవనెత్తుతున్నారు. మాఫియా రాజ్యంలో, స్కామ్‌ల పాలనలో ప్రజా సమస్యలకు చోటేదంటూ అధికారులు నివ్వెరపోతున్నారు.

అమరావతి, విజన్ 2047..

'అమరావతికి కేంద్రం ఇప్పటికే 15 వేల కోట్లు సమకూర్చింది. ఇంకో రూ.16 వేల కోట్లతో కలిపి రూ.31 వేల కోట్లు మొబలైజ్ చేశాం. మొత్తం రూ.50 వేల కోట్లు అవసరం. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తాం. వచ్చే ఏడాది స్కూల్స్ తెరిచే నాటికి 16,340 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేస్తాం. విజన్ 2047 నాటికి 50 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకు సాగాలి. ఈ నెల 13న స్వర్ణాంధ్ర -2047 డాక్యుమెంట్ విడుదల చేస్తాం. వివిధ అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తూ విశ్లేషిస్తున్నాం. అందుకు అనుగుణంగా మంత్రులు, సంబంధిత శాఖాధికారులు, కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి' అని చంద్రబాబు మరోమారు వల్లెవేశారు. ప్రస్తుతం 3,000 డాలర్ల లోపే ఉన్న జీడీపీఎస్ 23 ఏళ్లలో 15 రెట్లు అభివృద్ధి చెందేలా అందరూ పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆర్థిక మంత్రి కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడారు. కాగా, తొలిరోజు కలెక్టర్ల సదస్సు అనంతరం సీఎం చంద్రబాబు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో కలిసి సచివాలయంలో డిన్నర్ చేశారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సచివాలయాల సిబ్బందే కీలకం

- సిబ్బందిలో ఉన్నత విద్యావంతుల సేవలను వినియోగించుకుందాం
- జనాభా ఆధారంగా సచివాలయాల హేతుబద్ధీకరణ
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం 1,23,866 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వాళ్లను ఎలా సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్న దానిపై కలెక్టర్లకు ప్రణాళికలు ఉండాలని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం లక్ష్యాలు సాధించాలంటే సచివాలయాల సిబ్బందే అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఈ సిబ్బందిలో ఉన్నత విద్యావంతులు, ఇంజనీరింగ్ వంటి వివిధ రకాల వృత్తి నిపుణులు ఎక్కువ మంది ఉన్నారని, వారి సేవలను వీలైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రేషనలైజ్ (హేతుబద్ధీకరణ) చేస్తున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం ఆయన కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్న పంచాయతీల్లో కూడ సచివాలయాలు పెట్టారని, వీలైనంత వరకు జనాభా ఆధారంగా ఈ రేషనలైజ్ ప్రక్రియ కొనసాగిద్దామని అధికారులకు సూచించారు. రెండు, మూడు పంచాయతీలకు ఒక సచివాలయమా.. లేక ఒక పంచాయతీలో ఒకటా అన్నదానిపై జిల్లా కలెక్టర్లు కసరత్తు చేయాలన్నారు. రేషనలైజ్ ప్రక్రియ తర్వాత సచివాలయాల్లో మిగిలిపోయిన ఉద్యోగులను కీలక అవసరాలకు వాడుకోవాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య, వ్యవసాయ తదితర శాఖల తరుపున సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులకు వారి వారి మాతృ శాఖలతో సంబంధం ఉండటంతో పాటు గ్రామ పంచాయతీ పర్యవేక్షణ కూడా ఉండేలా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటాలో మిస్ అయిన వారిని తిరిగి నమోదు చేసే ప్రక్రియ వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో ఎవరెవరు సొంత ఇళ్లలో, అద్దె ఇళ్లలో ఉంటున్నారనేది ప్రధానంగా నమోదు చేయాలని సూచించారు.


కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు

ఏదైనా ఉంటే వచ్చే సీజన్‌లో చూద్దాం

ధాన్యం కొనుగోళ్లపై రైతుల కష్టాలపై చర్చించేందుకు సీఎం చంద్రబాబు విముఖత వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న ఇబ్బందులు, మద్దతు ధర దక్కక నష్టపోతున్న వైనంపై మంత్రులను మాట్లాడనివ్వలేదు. ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రెజెంటేషన్ ఇవ్వగా సీఎం స్పందిస్తూ 'ప్రభుత్వానికి గుడ్‌విల్ క్రియేట్ చేయాలి. లేనిపోని సమస్యలు తేవద్దు. అందరూ తేమ సమస్య గురించే చెబుతున్నారు. దీనిపై వర్కవుట్ చేయనివ్వండి. మన దగ్గర అంత మెకానిజం లేదు. రైసు మిల్లర్లు అన్ని చోట్లకు వస్తారో రారో తెలీదు. ఏదైనా ఉంటే వచ్చే సీజన్‌లో చూద్దాం. మనిషికో సలహా ఇస్తే గందరగోళం వస్తుంది' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సగటు ధరలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయని సీఎం చంద్రబాబు అంగీకరించారు. ఇప్పటికిప్పుడు ఏమీ చేయలేమన్నారు. రాష్ట్రంలోని కాకినాడ, విశాఖ పోర్టులకు ఇతర రాష్ట్రాల నుంచి సాధారణ బియ్యంతో పాటు పీడీఎస్ బియ్యం వస్తున్నాయని మంత్రులు, అధికారులు ప్రస్తావించగా, సీఎం స్పందిస్తూ బియ్యం రీసైక్లింగ్‌ను అడ్డుకోవాలన్నారు. ఈ సమస్య అన్ని రాష్ట్రాల్లో ఉన్నదేనని మంత్రి పయ్యావుల చెప్పారు. కాకినాడ పోర్టు దగ్గర మూడు చెక్ పోస్టులను దాటి పీడీఎస్ బియ్యం లోనికి ఎలా వెళ్లాయని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్‌ను ప్రశ్నించగా, ఆయన సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు.

ఎత్తిపోతల పథకాల నిర్వహణ ప్రైవేటుకు

ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ) పరిధిలోని ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యతను పీపీపీ (ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) పద్ధతిలో ప్రైవేటు వారికి అప్పగించడానికి టెండర్లు పిలవాలని జల వనరుల శాఖ అధికారులను సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఆ ఎత్తిపోతల పథకాల కింద పది లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని.. కొన్ని ఎత్తిపోతల పథకాలు పని చేయకపోవడం వల్ల నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లందడం లేదన్నారు. నిర్వహణ బాధ్యతలను ప్రైవేటువారికి అప్పగించడం ద్వారా సమస్యను అధిగమించే ప్రయత్నం చేద్దామన్నారు. ఇంకుడు గుంతలు, ఊటకుంటలు వంటి నీటి సంరక్షణ పనులను చేపట్టడం ద్వారా భూగర్భాన్ని ఒక రిజర్వాయర్‌గా మలుచుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోగా గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధానాన్ని చేపట్టి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. పోలవరం కుడి కాలువ నుంచి రోజుకు రెండు టీఎంసీలను కృష్ణా నదికి తరలించి.. అక్కడి నుంచి బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే రిజర్వాయర్‌లకు ఎత్తిపోసి.. అక్కడి నుంచి నల్లమల పర్వతాల్లో 31.5 కి.మీల పొడవున తవ్వే సొరంగం ద్వారా నీటిని బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌లోకి ఎత్తిపోసేలా పనులు చేపడతామన్నారు. పోలవరం, హంద్రీ-నీవా, వెలిగొండ, చింతలపూడి, వంశధార స్టేజ్-2 ఫేజ్-2, వంశధార-నాగావళి అనుసంధానం పనులు ప్రాధాన్యతగా చేపట్టామని వివరించారు.



గుకేశ్, డింగ్ లిరెన్ 13వ గేమ్ 'డ్రా'... నేడు చివరిదైన 14వ గేమ్

సింగపూర్ సిటీ: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో తొమ్మిదో 'డ్రా' నమోదైంది. భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్ మధ్య బుధవారం జరిగిన 13వ గేమ్ 68 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. తెల్ల పావులతో ఆడిన గుకేశ్ 'కింగ్ పాన్' ఓపెనింగ్ తో గేమ్‌ను ప్రారంభించగా... ప్రస్తుత ప్రపంచ చాంపియన్ లిరెన్ ఫ్రెంచ్ డిఫెన్స్‌తో జవాబు ఇచ్చాడు. గుకేశ్ కొత్త వ్యూహాలతో చైనా ప్లేయర్‌ను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. 68 ఎత్తులు ముగిశాక ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ 'డ్రా'కు అంగీకరించారు. నిర్ణీత 14 గేముల్లో 13 గేమ్‌లు ముగిశాక ఇద్దరూ 6.5-6.5తో సమఉజ్జీగా ఉన్నారు. నేడు చివరిదైన 14వ గేమ్ జరుగుతుంది. ఒకవేళ చివరిదైన 14వ గేమ్ కూడా 'డ్రా' అయితే ఇద్దరూ 7-7తో సమంగా నిలుస్తారు. శుక్రవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు.



స్మృతి మంధాన

స్మృతి 'శత'క్కొట్టినా...

మూడో వన్డేలోనూ భారత్ పరాజయం ● 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఆస్ట్రేలియా

పెర్త్: ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టుకు మరోసారి నిరాశ తప్పలేదు. వరుసగా రెండు వన్డేల్లో ఓడి సిరీస్ కోల్పోయిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు నామమాత్రమైన చివరి మ్యాచ్‌లోనూ ఓడిపోయింది. 83 పరుగుల తేడాతో గెలిచిన ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 299 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన టీమిండియా 45.1 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌటైంది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (109 బంతుల్లో 105; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో పోరాడినా.... మరోవైపు నుంచి ఆమెకు సరైన సహకారం లభించలేదు. హర్లీన్ డియోల్ (39; 4 ఫోర్లు) మినహా మిగతా వాళ్లు విఫలమయ్యారు. స్మృతి-హర్లీన్ రెండో వికెట్‌కు 118 పరుగులు జోడించి జట్టుకు బలమైన పునాది వేసినా... తర్వాత వచ్చిన వాళ్లు దాన్ని కొనసాగించలేకపోయారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (12), రిచా ఘోష్ (2), జెమీమా రోడ్రిగ్స్ (16), దీప్తి శర్మ (0), మిన్ను మణి (8) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డ్‌నర్ 5 వికెట్లు తీయగా... మేగన్ షుట్, అలానా కింగ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనాబెల్ సదర్లాండ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'తోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.



అరుంధతి

78/4 నుంచి...

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. అనాబెల్ సదర్లాండ్ (95 బంతుల్లో 110; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కగా... కెప్టెన్ తాలియా మెక్‌గ్రాత్ (56 నాటౌట్; 5 ఫోర్లు), ఆష్లే గార్డ్‌నర్ (50; 5 ఫోర్లు) అర్ధశతకాలతో మెరిశారు. ఒకదశలో 78 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆసీస్‌ను అనాబెల్ ఆదుకుంది. మొదట గార్డ్‌నర్‌తో ఐదో వికెట్‌కు 96 పరుగులు జోడించిన అనాబెల్... ఆ తర్వాత తాలియాతో ఆరో వికెట్‌కు 95 బంతుల్లో 122 పరుగులు జతచేసి జట్టుకు భారీ స్కోరు అందించింది. భారత బౌలర్లలో హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి 4 వికెట్లు పడగొట్టగా... దీప్తి శర్మ ఒక వికెట్ తీసింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: లిచ్‌ఫీల్డ్ (సి) రిచా (బి) అరుంధతి 25; జార్జియా (బి) అరుంధతి 26; పెరీ (బి) అరుంధతి 4; బెత్ మూనీ (సి) రిచా (బి) అరుంధతి 10; అనాబెల్ సదర్లాండ్ (రనౌట్) 110; ఆష్లే గార్డ్‌నర్ (సి) మిన్ను (బి) దీప్తి 50; తాలియా మెక్‌గ్రాత్ (నాటౌట్) 56; సోఫియా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (50 ఓవర్లలో 6 వికెట్లకు) 298. **వికెట్ల పతనం:** 1-58, 2-60, 3-72, 4-78, 5-174, 6-296. **బౌలింగ్:** రేణుక సింగ్ 10-0-54-0; సైమా ఠాకూర్ 6-0-40-0, టిటాస్ సాధు 10-0-65-0; అరుంధతి రెడ్డి 10-2-26-4; దీప్తి శర్మ 9-0-77-1; మిన్ను మణి 5-0-36-0.

భారత్ ఇన్నింగ్స్: స్మృతి మంధాన (బి) గార్డ్‌నర్ 105; రిచా (బి) మేగన్ 2; హర్లీన్ (సి అండ్ బి) అలానా 39; హర్మన్‌ప్రీత్ (సి) గార్త్ (బి) సదర్లాండ్ 12; జెమీమా (సి అండ్ బి) మేగన్ 16; దీప్తి (సి) మూనీ (బి) గార్డ్‌నర్ 0; మిన్ను మణి (సి) లిచ్‌ఫీల్డ్ (బి) గార్డ్‌నర్ 8; అరుంధతి (ఎల్బీ) (బి) గార్డ్‌నర్ 5; సైమా (సి) గార్త్ (బి) గార్డ్‌నర్ 0; టిటాస్ సాధు (సి) తాలియా (బి) అలానా 3; రేణుక సింగ్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం** (45.1 ఓవర్లలో ఆలౌట్) 215. **వికెట్ల పతనం:** 1-16, 2-134, 3-165, 4-189, 5-189, 6-189, 7-201, 8-201, 9-203, 10-215. **బౌలింగ్:** మేగన్ షుట్ 7-0-26-2; గార్త్ 4-0-22-0; ఎలీస్ పెరీ 4-0-30-0; అనాబెల్ సదర్లాండ్ 9-0-34-1; ఆష్లే గార్డ్‌నర్ 10-1-30-5; సోఫియా 5-0-28-0; తాలియా 2-0-15-0; అలానా కింగ్ 4.1-0-27-2.

7 ఇప్పటి వరకు ఆస్ట్రేలియాతో మూడు లేదా అంతకంటే ఎక్కువ వన్డేలతో కూడిన ద్వైపాక్షిక సిరీస్‌లలో భారత జట్టు ఏడు సార్లు (1984లో 0-4తో; 2006లో 0-3తో; 2008లో 0-5తో; 2012లో 0-3తో; 2018లో 0-3తో; 2023లో 0-3తో; 2024లో 0-3తో) క్లీన్‌స్వీప్ అయింది.



పోరాడి ఓడిన గాయత్రి-ట్రెసా జోడీ

హాంగ్జౌ (చైనా): బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో తొలిసారి పోటీపడుతున్న భారత జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ తొలి మ్యాచ్‌లోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రపంచ నంబర్‌వన్ జంట లియు షెంగ్ షు-టాన్ నింగ్ (చైనా)తో జరిగిన గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 22-20, 20-22, 14-21తో పోరాడి ఓడిపోయింది. 82 నిమిషాల సుదీర్ఘ పోరులో గాయత్రి-ట్రెసా వరల్డ్ నంబర్‌వన్ జోడీకి గట్టిపోటీనే ఇచ్చారు. తొలి గేమ్‌ను సొంతం చేసుకున్న భారత జంట రెండో గేమ్‌లో 14-18తో వెనుకబడింది. ఈ దశలో వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి స్కోరును 18-18తో సమం చేసింది. ఆ తర్వాత చైనా జోడీ రెండు పాయింట్లు గెలవగా... ఆ వెంటనే భారత జంట కూడా రెండు పాయింట్లు సాధించింది. దాంతో స్కోరు మళ్లీ 20-20తో సమమైంది. ఈ దశలో చైనా జోడీ రెండు పాయింట్లు గెలిచి గేమ్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో చైనా జోడీ తమ అనుభవాన్నంతా రంగరించి పోరాడి గట్టెక్కింది. నేడు జరిగే గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో పియర్లీ టాన్-థీనా మురళీధరన్ (మలేసియా)లతో గాయత్రి-ట్రెసా తలపడతారు. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే గాయత్రి-ట్రెసా జోడీకి సెమీఫైనల్ చేరుకునే అవకాశాలు సజీవంగా ఉంటాయి.

భారత్‌కు తొలి పరాజయం

మస్కట్: జూనియర్ మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. చైనా జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మూడో లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. చైనా తరఫున టాన్ జిన్‌జువాంగ్ (32వ నిమిషంలో), వాంగ్ లిహాంగ్ (42వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. భారత జట్టుకు దీపిక (56వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది. భారత జట్టుకు మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించగా ఒక్క దానిని కూడా సద్వినియోగం చేసుకోలేకపోయింది. గ్రూప్ 'ఎ'లో ప్రస్తుతం చైనా 9 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత్, మలేసియా జట్లు 6 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. థాయ్‌లాండ్‌తో నేడు జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్ చేరుకుంటుంది.

ట్రిపుల్ జంప్‌లో ప్రణయ్‌కు కాంస్య పతకం



భువనేశ్వర్: జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చివరి రోజు తెలంగాణకు పతకం లభించింది. అండర్-20 పురుషుల ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో కొత్తూరి ప్రణయ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ప్రణయ్ 15.07 మీటర్ల దూరం దూకి మూడో స్థానంలో నిలిచాడు. మొహమ్మద్ ముహసిన్ (కేరళ; 15.78 మీటర్లు) స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా... వివేక్ గుప్తా (మహారాష్ట్ర; 15.58 మీటర్లు) రజత పతకాన్ని దక్కించుకున్నాడు.

సౌదీ అరేబియాకే ఆతిథ్య హక్కులు

2034లో ఫుట్‌బాల్ వరల్డ్ కప్ నిర్వహణకు 'ఫిఫా' ఆమోద ముద్ర

జ్యూరిచ్: పుష్కర కాలం వ్యవధిలో ఆసియాలోని మరో అరబ్ దేశం ఫుట్‌బాల్ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వడం ఖాయమైంది. 2022లో ఖతర్‌లో ఈ మెగా ఈవెంట్ జరగ్గా... ఇప్పుడు సౌదీ అరేబియా ఆ అవకాశం దక్కించుకుంది. 2034లో జరిగే ప్రపంచ కప్‌ను సౌదీ అరేబియాలో నిర్వహించనున్నట్లు ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) అధికారికంగా ప్రకటించింది. 2034 వరల్డ్ కప్ కోసం ఒక్క సౌదీ మాత్రమే బిడ్ వేసింది. గత 15 నెలలుగా బిడ్డింగ్ ప్రక్రియ కొనసాగింది. మరే దేశం నుంచి పోటీ లేకపోవడంతో ఆ దేశానికే ఆతిథ్య హక్కులు గతంలోనే ఖాయమయ్యాయి. అయితే 'ఫిఫా' అధ్యక్షుడు గియానీ ఇన్‌ఫాంటినో నేతృత్వంలో బుధవారం 200 మంది 'ఫిఫా' సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దీనికి ఆమోద ముద్ర వేశారు. ఖతర్ తరహాలోనే ఈ దేశంలోనూ మానవ హక్కుల ఉల్లంఘన సాగుతోందని, వరల్డ్ కప్ అవకాశం ఇవ్వరాదని విమర్శలు వచ్చినా... 'ఫిఫా' వీటిని లెక్క చేయకుండా ముందుకు సాగింది. దేశ రాజధాని రియాద్‌తో పాటు ఇంకా ఇప్పటికీ నిర్మాణం ప్రారంభించని కొత్త నగరం 'నియోమ్'లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.



మూడు దేశాల్లో 2030 టోర్నీ...

'ఫిఫా' సమావేశంలో 2030 వరల్డ్ కప్ ఆతిథ్య హక్కులను కూడా ఖాయం చేశారు. ఈ టోర్నీని యూరోప్ దేశాలు స్పెయిన్, పోర్చుగల్‌తో పాటు ఆఫ్రికా దేశం మొరాకో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తాయి. దీంతో పాటు 1930లో జరిగిన తొలి వరల్డ్ కప్‌కు వందేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని దక్షిణ అమెరికాలోని మూడు దేశాల్లో తొలి మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. 1930 విజేత ఉరుగ్వే, రన్నరప్ అర్జెంటీనాతో పాటు ప్రపంచంలోనే అతి పురాతనమైన 'దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్య' ప్రధాన కేంద్రం ఉన్న పరాగ్వేలో కూడా ఒక మ్యాచ్ జరుగుతుంది. టోర్నీలోని మొత్తం 104 మ్యాచ్‌లను మూడు వేర్వేరు ఖండాల్లో నిర్వహించనుండటం విశేషం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

ఈ నేల ఈశ్వరుడిది



● బాలకృష్ణ

'ఈ నేల అసురుడిది కాదు రా... ఈశ్వరుడిది... పరమేశ్వరుడిది, కాదని తాకితే జరిగేది తాండవం... అఖండ తాండవం' అంటున్నారు బాలకృష్ణ. 'సింహా, లెజెండ్, అఖండ' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో బాలకృష్ణ-డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ని ఫైట్ సీక్వెన్స్‌తో ఆరంభించారు. బాలకృష్ణ పాల్గొంటున్న ఈ సీక్వెన్స్‌ని స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ సూపర్‌వైజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన ఒక వీడియోలో బాలకృష్ణ చెప్పిన పై డైలాగులు ఉన్నాయి. 2025 సెప్టెంబర్ 25న దసరాకి 'అఖండ 2: తాండవం' సినిమాని రిలీజ్ చేయనున్నట్లు ఈ వీడియోలో స్పష్టం చేశారు.



● నాగ్ అశ్విన్, అనుదీప్ కేవీ

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ షురూ

విశ్వక్ సేన్ హీరోగా 'ఫంకీ' అనే కొత్త సినిమా షురూ అయింది. 'జాతి రత్నాలు'(2021) చిత్రంతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన అనుదీప్ కేవీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. దర్శకుడు కల్యాణ్ శంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. నిర్మాత నాగవంశీ స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు. ఈ సందర్భంగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య మాట్లాడుతూ– ''పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న చిత్రం 'ఫంకీ'. ప్రేమ, వినోదంతో కూడిన ఓ మంచి కుటుంబ కథా చిత్రంగా ఉంటుంది. విశ్వక్ సేన్, అనుదీప్ కాంబినేషన్‌పై ఉండే అంచనాలకు తగ్గట్టుగా ఈ సినిమా అన్ని వయసుల ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకునేలా ఉంటుంది. 2025 సంక్రాంతి తర్వాత 'ఫంకీ' షూటింగ్‌ని ప్రారంభిస్తాం'' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సురేష్ సారంగం, సహ నిర్మాత: వెంకట్ ఉప్పుటూరి.



● అల్లు అర్జున్

వసూళ్ల జాతర

● ఆరు రోజుల్లోనే రూ. 1002 కోట్లు సాధించిన పుష్ప 2


బాక్సాఫీస్ వసూళ్ల వేటలో పుష్పరాజ్ (అల్లు అర్జున్ పాత్ర పేరు) ఏ మాత్రం తగ్గడం లేదు. సరికొత్త రికార్డులను సృష్టించడంలో అస్సలు తగ్గేదే లే అంటున్నాడు. సినిమా విడుదలైన ఆరు రోజుల్లోనే రూ. 1002 కోట్ల వసూళ్లు సాధించి, రికార్డుల మోత మోగిస్తున్నాడు. అల్లు అర్జున్ హీరోగా, రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల ప్రత్యేక పాటలో నటించారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్‌లలో ఈ చిత్రం రిలీజైంది. ఈ సినిమా ప్రీమియర్స్ నుంచే సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ టాక్ అందుకుంది. మంచి వసూళ్లతో దూసుకెళుతోంది. ఈ సినిమా విడుదలైన ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 1002 కోట్లు వసూలు చేసి, భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత వేగంగా రూ. 1000 కోట్లు కలెక్ట్ చేసిన తొలి చిత్రంగా సరికొత్త రికార్డును నెలకొల్పినట్లు చిత్రయూనిట్ పేర్కొంది. ఈ మేరకు 1002 కోట్ల గ్రాస్ వసూళ్ల పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''ప్రతి భాషలో సునామీలా దూసుకుపోతున్న 'పుష్ప 2' ప్రత్యేకించి బాలీవుడ్‌లో జైత్రయాత్ర కొనసాగిస్తోంది. ఆరు రోజులకు రూ. 375 కోట్లు కలెక్ట్ చేసిన తొలి హిందీ చిత్రంగా నిలిచింది'' అని మేకర్స్ తెలిపారు.

అలాంటి భాగస్వామి దొరుకుతాడు!

''2025 మొత్తం బిజీగా ఉంటారు. ప్రతి క్రాఫ్టులో అభివృద్ధి పథంలోనే ముందుకు సాగుతారు''... ఇదంతా సమంత గురించే. వచ్చే ఏడాది నా జీవితం ఇలా ఉంటుంది? అనేట్లు సోషల్ మీడియా వేదికగా సమంత ఓ పోస్ట్‌ని షేర్ చేశారు. కొత్త సంవత్సరం 2025లో వృషభ, కన్య, మకర రాశి ఫలాల గురించి ఓ పోస్ట్ చేశారామె. తన రాశి ఫలం ఎలా ఉంటుందోననే విషయాలను పంచుకున్నారు. ''2025 మొత్తం బిజీగా ఉంటారు. ప్రతి క్రాఫ్టులో అభివృద్ధి పథంలోనే ముందుకు సాగుతారు. డబ్బులు ఎక్కువగా సంపాదిస్తారు. ఆర్థికంగా బలంగా ఉంటారు. విధేయత, ప్రేమను చూపించే భాగస్వామి దొరుకుతాడు. పాత లక్ష్యాలను పూర్తి చేస్తారు. ఆదాయం వచ్చే మార్గాలను పెంచుకుంటారు. మరిన్ని అవకాశాలను సొంతం చేసుకుంటారు. మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుంది. పిల్లల్ని కనాలనే ఉద్దేశం ఉంటే సంతానం వస్తుంది'' అంటూ ఆ పోస్టులో ఉంది. సమంత చేసిన ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్ ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు సమంత.



● సమంత







తొలి స్థానంలో స్త్రీ2... రెండో స్థానంలో కల్కి 2898 ఏడీ

గూగుల్ టాప్ ట్రెండింగ్ సెర్చెస్-2024 టాప్ టెన్‌లో మూడు తెలుగు సినిమాలు

ప్రతి ఏడాది ప్రేక్షకులను ఆకర్షించే, చర్చించుకునేలా చేసే సినిమాలు కొన్ని ఉంటాయి. అలా ఈ ఏడాది కూడా పలు ఇండియన్ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించాయి.... అలరించాయి. కాగా ఇండియాలో గూగుల్ టాప్ ట్రెండింగ్ సెర్చెస్ ఫర్ మూవీస్ జాబితాలోని మొదటి పది చిత్రాల్లో మూడు తెలుగు చిత్రాలు నిలిచాయి. తొలి స్థానంలో రాజ్‌కుమార్ రావు- శ్రద్ధా కపూర్ నటించిన హిందీ చిత్రం 'స్త్రీ 2', ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ లీడ్ రోల్స్‌లో నటించిన 'కల్కి 2898 ఏడీ' రెండో స్థానంలో నిలిచాయి. అలాగే ప్రభాస్ హీరోగా నటించిన మరో చిత్రం 'సలార్'కు తొమ్మిదో స్థానం లభించింది. 3, 4, 5, 6, 7, 8 స్థానాల్లో వరుసగా హిందీ చిత్రాలు 'ట్వల్త్ ఫెయిల్, లాపతా లేడీస్', తెలుగు చిత్రం 'హను-మాన్', తమిళ చిత్రం 'మహారాజా', మలయాళ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్', తమిళ చిత్రం 'గోట్: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' చిత్రాలు నిలిచాయి. మలయాళంలో ఫాహద్ ఫాజిల్ చేసిన 'ఆవేశం' సినిమా చివరి స్థానంలో నిలిచింది. అలాగే గూగుల్ టాప్ ట్రెండింగ్ సెర్చెస్ షోల జాబితాలో తొలి స్థానంలో 'హీరామండి' వెబ్ సిరీస్ నిలిచింది. 'మిర్జాపూర్, పంచాయత్, కోట ఫ్యాక్టరీ' వంటి సిరీస్‌లకు చోటు దక్కింది.

2040లో ఏం జరుగుతుంది?



● ఉపేంద్ర

కన్నడ స్టార్ ఉపేంద్ర హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'యుఐ: ది మూవీ'. రీష్మా నానయ్య, మురళీ శర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య, సాధు కోకిల, మురళీ కృష్ణ, ఇంద్రజిత్ లంకేష్ ముఖ్య పాత్రలు పోషించారు. లహరి ఫిల్మ్స్, జి. మనోహరన్ – వీనస్ ఎంటర్‌టైనర్స్ కేపీ శ్రీకాంత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేయనున్నారు. ''ప్రపంచంలో 2040లో ఏం జరుగుతుంది? అనే నేపథ్యంలో 'యుఐ: ది మూవీ' కథ ఉంటుంది. చాలా విరామం తర్వాత ఉపేంద్ర దర్శకత్వం వహించిన ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



డైరెక్టర్ ఏమీ చెప్పొద్దన్నారు

- అమృతా అయ్యర్

''నటిగా నాకు అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంది. అవకాశం వస్తే యాక్షన్ ఫిల్మ్ కూడా చేయాలని ఉంది. అయితే 'పొన్నియిన్ సెల్వన్' సినిమా చూశాక ప్రిన్సెస్ రోల్ చేసే అవకాశం వస్తే బాగుంటుందనిపించింది'' అని అన్నారు హీరోయిన్ అమృతా అయ్యర్. 'అల్లరి' నరేశ్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'బచ్చల మల్లి'. ఈ చిత్రంలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటించారు. సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో అమృతా అయ్యర్ మాట్లాడుతూ– ''ఓ మనిషికి కోపం వస్తే, ఆ కోపాన్ని అతను కంట్రోల్ చేసుకోలేనప్పుడు ఏం జరుగుతుంది? అతని జీవితం ఎలా ప్రభావితమవుతుంది? అన్నదే 'బచ్చల మల్లి' కథ. మంచి ఎమోషనల్ డ్రామా. 'హను-మాన్' సినిమా చిత్రీకరణ సమయంలోనే 'బచ్చల మల్లి' సినిమా కథ విని, ఓకే చేశాను. 1980 బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఇందులో సిటీ కల్చర్‌ని ఇష్టపడే టౌన్ అమ్మాయి క్యారెక్టర్ చేశాను. సెన్సిటివ్ అండ్ ఎమోషనల్ అమ్మాయి. నరేష్‌గారు ఎలాంటి ఎమోషన్ అయినా పండించగలరు. ఈ సినిమాలో స్క్రీన్‌పై ఆయన క్యారెక్టర్ అగ్రెసివ్‌గా కనిపిస్తుంది. కానీ ఆఫ్ స్క్రీన్‌లో ఆయన సాఫ్ట్. సుబ్బుగారు మంచి విజన్ ఉన్న దర్శకుడు. ఎమోషనల్ సీన్స్‌ను బాగా తీశారు. రాజేష్ గారితో గతంలోనే ఓ సినిమా చేయాల్సింది. కానీ కుదర్లేదు. 'బచ్చల మల్లి'తో కుదిరింది. ప్రస్తుతం కన్నడ, తమిళ సినిమాలు చేస్తున్నాను. 'హను-మాన్' సీక్వెల్‌లో నా రోల్ గురించి దర్శకుడు ఏమీ చెప్పొద్దని చెప్పారు. నా పాత్ర ఉంటుందా? లేదా అనే విషయమూ చెప్పొద్దన్నారు'' అని తెలిపారు.

తెలంగాణ దండోరా



● రవికృష్ణ, శివాజీ, నవదీప్

శివాజీ, నవదీప్, రాహుల్ రామకృష్ణ, రవికృష్ణ, మనీక చిక్కాల, అనూష ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'దండోరా'. మురళీ కాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి నిర్మాత ఎస్‌కేఎన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సాహు గారపాటి క్లాప్ ఇచ్చారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ గౌరవ దర్శకత్వం వహించారు. ''తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో 'దండోరా' రూపొందుతోంది. మన పురాతన ఆచారాలు, సంప్రదాయాలు, హాస్యం, వ్యంగ్యం, హృదయాలను హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో ఈ సినిమా తెరకెక్కుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: వెంకట్ ఆర్. శాఖమూరి, సహ-నిర్మాత: అనీష్ మరిశెట్టి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	16	81,526
నిఫ్టీ ▲	32	24,642

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	20,028	▲ 341
డోజోన్స్	44,282	▲ 11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,302	▲ 21
డాక్స్	20,414	▲ 84
హాంగ్‌సెంగ్	3,432	▲ 10
నికాయ్	39,372	▲ 5

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారెట్)	77,666 ▲	491
బంగారం (22 క్యారెట్)	77,355 ▲	489
వెండి (కేజీ)	92,700 ▽	110

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		84.45	85.47
£	బ్రిటన్ పౌండ్		107.10	109.97
€	యూరో		88.17	90.77
¥	జపాన్ ఎన్ (100)		55.34	56.75
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.13	55.25
S$	సింగపూర్ డాలర్		60.82	65.54
SAR	సౌదీ రియాల్		21.72	23.28
UAE D	యూఏఈ దిర్హామ్		22.21	23.99
¥	చైనా యువాన్		10.81	12.63



ఆర్థికమంత్రికి జ్ఞాపికను అందిస్తున్న సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ

మీ ప్రాధాన్యతలు ఆర్థికాభివృద్ధికి అనుసంధానమవ్వాలి

భారత్ కార్పొరేట్ రంగానికి నిర్మలా సీతారామన్ సూచన

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రాధాన్యతలు, వ్యూహాత్మక అవసరాలతో భారత్ కార్పొరేట్ వాణిజ్యపరమైన అంశాలు మిళితం కావాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. సీఐఐ గ్లోబల్ ఎకనమిక్ పాలసీ ఫోరమ్ 2024 సదస్సులో ఆమె మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా నేర్చుకున్న పాఠాల ఆధారంగా పరిశ్రమ ''రీఎలైన్–రీసెట్'' (ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలచడం) కావాలని సీతారామన్ కోరారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల వల్ల ఎటువంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తకుండా సరఫరాల వ్యవస్థలను విస్తృతం చేయాలని ఆమె సూచించారు. రాబోయే దశాబ్దంలో ఆర్థిక వ్యవస్థ ప్రాధాన్యతలను వివరిస్తూ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో కలిసి పెద్ద యూనిట్లకు ఎలా మద్దతు ఇవ్వాలన్న అంశాన్ని పరిశ్రమ ఆలోచించాలని అన్నారు. ఇది ఉపాధి కల్పనకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఆర్‌బీఐ..



కొత్త గవర్నర్ మల్హోత్రా

ముంబై: ద్రవ్య పరపతి విధాన స్థిరత్వాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొనసాగిస్తుందని కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రపంచ ఆర్థిక, రాజకీయ వాతావరణం నేపథ్యంలో ''అప్రమత్తత, ఎప్పటికప్పుడు చురుగ్గా వ్యవహరించడం''కీలకమన్నారు. అంతకుముందు ఆయన ఆర్‌బీఐ 26వ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీ కాలం మూడేళ్లు. మూడేళ్ల పొడిగింపుతో ఆరేళ్ల ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించిన శక్తికాంతదాస్ మంగళవారం పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. తాజా బాధ్యతలు చేపట్టిన అనంతరం గవర్నర్ హోదాలో మల్హోత్రా మీడియాతో మాట్లాడుతూ, రిజర్వ్ బ్యాంక్ మహోన్నత వారసత్వాన్ని కొనసాగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఫైనాన్షియల్ నియంత్రణ సంస్థలుసహా అన్ని విభాగాలతో ఆర్‌బీఐ పరస్పర సహకారంతో పనిచేస్తుందని అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

12-12-2024	
విశాఖ	620–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	630–00
విజయవాడ	630–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620–00
వరంగల్	622–00
రిటైల్ ధర	6.80

స్వల్ప లాభాలతోనే సరి



ముంబై: అమెరికా రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 16 పాయింట్లు పెరిగి 81,526 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32 పాయింట్లు బలపడి 24,642 వద్ద నిలిచింది. అయితే మూడురోజుల నష్టాల నుంచి గట్టెక్కడం విశేషం. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 359 పాయింట్ల పరిధిలో 81,383 – 81,742 శ్రేణిలో ట్రేడైంది. నిఫ్టీ 24,584 వద్ద కనిష్టాన్ని, 24,691 గరిష్టాన్ని తాకింది. కన్జూమర్ డ్యూరబుల్స్, ఇండస్ట్రియల్స్, ఐటీ, టెక్, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.35%, 0.25 శాతం చొప్పున లాభపడ్డాయి. వినిమయ, బ్యాంకులు, విద్యుత్, సర్వీసెస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

బిగ్‌'సి' 22వ వార్షికోత్సవ ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్‌'సి' 22వ వార్షికోత్సవం సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువైన స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువైన ఇయర్‌బడ్స్‌ను రూ.22 లకే అందిస్తుంది. ఒప్పో, వివో, రియల్‌మి, ఎంఐ మొబైళ్ల కొనుగోలుపై 10% వరకు, శాంసంగ్ మొబైళ్ల కొనుగోలుపై రూ.20,000 వరకు, ఐ ఫోన్ మొబైళ్ల కొనుగోలుపై రూ.7,000 వరకు తక్షణ క్యాష్ బ్యాక్ ఇస్తుంది. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51% వరకు డిస్కౌంట్ అందిస్తుంది. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేయవచ్చని కంపెనీ వ్యవస్థాపకులు బాలు చౌదరి తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
కార్పొరేట్ బాండ్ మార్కెట్ విస్తరించాలి: సీఎస్ శెట్టి
భారత్ వృద్ధి రేటు 7 నుంచి 6.5 శాతానికి కోత: ఏడీబీ

సొంత నిధులతోనే కొలంబో పోర్టు ప్రాజెక్టు

ఏపీసెజ్ వెల్లడి



న్యూఢిల్లీ: హిందూ మహాసముద్రంలో కీలకమైన కొలంబో పోర్టు ప్రాజెక్టు పనులను సొంత నిధులతోనే పూర్తి చేయాలని అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీసెజ్) నిర్ణయించుకుంది. ఈ ప్రాజెక్టు గురించి రుణం కోసం అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి (డీఎఫ్‌సీ) దాఖలు చేసిన అభ్యర్థనను ఉపసంహరించుకుంది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ ఈ మేరకు సమాచారమిచ్చింది. ప్రాజెక్టు తొలి దశ వచ్చే ఏడాది తొలి నాళ్లలో అందుబాటులోకి రాగలదని తెలిపింది. కొలంబో వెస్ట్ ఇంటర్నేషనల్ టెర్మినల్‌ను (సీడబ్ల్యూఐటీ) అభివృద్ధి చేసేందుకు శ్రీలంక పోర్ట్స్ అథారిటీతో (ఎస్‌ఎల్‌పీఏ) అదానీ పోర్ట్స్, జాన్ కీల్స్ హోల్డింగ్స్ కన్సార్షియం 2021లో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాంతీయంగా పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని కట్టడి చేసే దిశగా, ఈ ప్రాజెక్టుకు 553 మిలియన్ డాలర్ల రుణం అందించేందుకు డీఎఫ్‌సీ గతేడాది నవంబర్‌లో అంగీకరించింది. అయితే, ఒప్పందంలో తాము కోరుతున్న మార్పులు చేయాలని షరతులు విధించడంతో రుణ మంజూరు ప్రక్రియ నిల్చిపోయింది. ఇటీవల అదానీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్‌లపై వచ్చిన లంచం ఆరోపణల ప్రభావాలను కూడా పరిశీలిస్తున్నట్లు డీఎఫ్‌సీ ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో డీఎఫ్‌సీ నుంచి రుణం తీసుకోకుండా అంతర్గత వనరులతోనే ప్రాజెక్టును పూర్తి చేయాలని ఏపీసెజ్ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 30 నాటికి అదానీ పోర్ట్స్ వద్ద సుమారు రూ. 8,893 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి.

లైఫ్‌కి బీమా తప్పనిసరి



జీవిత బీమా అవసరంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ ముందుకెళుతున్నామని, తక్కువ ప్రీమియంతోనైనా ప్రతి కుటుంబం ఎంతో కొంత బీమాను కలిగి ఉండాలన్నదే తమ ఉద్దేశమని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సీఈఓ, ఎండీ కాస్పరస్ జేహెచ్ క్రామ్‌హూట్ చెప్పారు. ఈ వైఖరి వల్లే వ్యాపార పరిమాణం పరంగా తాము దేశంలో 13వ స్థానంలో ఉన్నప్పటికీ పాలసీదారుల సంఖ్యను బట్టి చూస్తే 7వ స్థానంలో ఉన్నామని స్పష్టంచేశారు. పాలసీదారుల అవసరాలు తెలుసుకోవటానికి, క్లెయిమ్‌ల పరిష్కారానికి టెక్నాలజీని సమర్థంగా వినియోగించుకుంటున్నామని, అందుకే తమ సంస్థ లాభదాయకతలోనూ ముందుందని వివరించారు. మంగళవారం 'సాక్షి' బిజినెస్ ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు వెల్లడించారు. ఆ వివరాలివీ...

- బీమాపై మైండ్‌సెట్ మారాల్సిన అవసరముంది
- దాన్నో ఇన్వెస్ట్‌మెంట్‌గా చూడటం వల్లే 'మిస్ సెల్లింగ్'
- ఉన్నత స్థాయి వర్గాలే 'ప్యూర్ టర్మ్' తీసుకుంటున్నారు
- ఎంతోకొంత రక్షణ ఉండేలా చిన్న పాలసీలను విక్రయిస్తున్నాం
- అందుకే పాలసీదారుల సంఖ్యలో 7వ స్థానానికి చేరాం
- క్లెయిమ్ డాక్యుమెంట్లన్నీ ఇస్తే 24 గంటల్లోనే పరిష్కరిస్తున్నాం
- 'సాక్షి'తో శ్రీరామ్ లైఫ్ ఎండీ, సీఈఓ కాస్పరస్

(సాక్షి, బిజినెస్ ప్రతినిధి)

కుటుంబంలో ఆర్జించే వ్యక్తికి బీమా ఇచ్చి, ఆ కుటుంబానికి రక్షణ కల్పించటమే జీవిత బీమా లక్ష్యం. కానీ కంపెనీలు టర్మ్ ఇన్సూరెన్స్‌కు ప్రాధాన్యమివ్వటం లేదు. మరి ఆశించిన లక్ష్యం నెరవేరుతోందా?

నిజమే! దేశంలో 4 శాతం మందికే జీవిత బీమా కవరేజీ ఉందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాకపోతే టర్మ్ ఇన్సూరెన్స్‌ను చాలామంది అవసరం లేనిదిగా భావిస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. తెలంగాణలో లీడ్ ఇన్సూరర్‌గా ఉన్నాం కనక మేం రకరకాల అవగాహన కార్యక్రమాలు పెడుతున్నాం. గ్రామీణ ప్రాంతాలపై ఫోకస్ పెట్టాం. అందుకే 2025 ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో బీమా పరిశ్రమ 24 శాతం పెరిగితే మేం 57 శాతం వృద్ధి సాధించాం. మా వ్యాపారంలో గ్రామీణుల వాటా 40 శాతానికిపైగా ఉండటమే మా నిబద్ధతకు నిదర్శనం.

బీమా కంపెనీలు 'టర్మ్'పై కాకుండా ఇన్వెస్ట్‌మెంట్‌తో ముడిపడిన ఎండోమెంట్, యులిప్ పాలసీలపై ఫోకస్ పెడుతున్నాయెందుకు? 30 ఏళ్ల వ్యక్తికీ 10 ఏళ్ల కాలపరిమితితో జీవితబీమా పాలసీ అమ్మటం మోసం కాదా?

నిజమే! ఇలాంటి మిస్ సెల్లింగ్ జరగకూడదు. కాకపోతే తక్కువ ప్రీమియమే అయినా కొన్నేళ్ల పాటు కట్టి... చివరకు పాలసీ గడువు ముగిశాక ఏమీ తిరిగి రాని టర్మ్ పాలసీలపై కస్టమర్లు ఆసక్తి చూపించరు. అలాంటి వాళ్లను ఆకర్షించటానికే కంపెనీలు ఇన్వెస్ట్‌మెంట్లు, రాబడులతో ముడిపడ్డ ఎండోమెంట్ పాలసీలను తెచ్చాయి. లాభదాయకత కూడా ముఖ్యమే కనక ఈ పాలసీలను విక్రయిస్తున్నాయి.

మరి 30 ఏళ్ల వ్యక్తికి 10 ఏళ్ల కాలపరిమితి ఉన్న జీవిత బీమా పాలసీ విక్రయిస్తే... గడువు తీరాక తనకు కవరేజీ ఉండదు కదా? లేటు వయసులో కవరేజీ కావాలంటే భారీ ప్రీమియం చెల్లించాలి కదా?

నిజమే. సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్నవారే ప్యూర్ టర్మ్ పాలసీలు తీసుకుంటున్నారు. ఇది అట్టడుగు స్థాయికి వెళ్లటం లేదు. ముమ్ముందు ఈ పరిస్థితి మారుతుందన్న విశ్వాసం నాకుంది.

మీరూ ఇదే దార్లో వెళుతున్నారా... లేక?

అలాంటిదేమీ లేదు. మేం ప్రధానంగా ఏడాదికి 4–15 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారిని లక్ష్యిస్తున్నాం. వారికి ఎంతోకొంత కవరేజీ ఉండేలా పాలసీలను తెచ్చాం. కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో 98 శాతానికిపైనే ఉంది. పైపెచ్చు ఎక్కువ శాతం చిన్న పాలసీలే కనక... సెటిల్‌మెంట్‌కు డాక్యుమెంట్లన్నీ అందజేస్తే 24 నుంచి 48 గంటల్లో పరిష్కరిస్తున్నాం. దీనికి టెక్నాలజీని వాడుతున్నాం.

మీ వ్యాపారంలో ఆన్‌లైన్ శాతమెంత?

మాకు దేశవ్యాప్తంగా విస్తరించిన శ్రీరామ్ గ్రూప్ కంపెనీల ఔట్‌లెట్ల నుంచే 40 శాతం వరకూ వ్యాపారం వస్తోంది. ఏజెన్సీల నుంచి మరో 40 శాతం వస్తోంది. మిగిలినది ఆన్‌లైన్, పాత కస్టమర్ల రిఫరెన్సులు సహా ఇతర చానళ్ల ద్వారా వస్తోంది. ఆన్‌లైన్లో ఎంక్వయిరీలొచ్చినా అవి వాస్తవరూపం దాల్చటం తక్కువ. ఆన్‌లైన్ ప్రచారానికి ఖర్చు కూడా ఎక్కువే. మాకు అంతర్జాతీయ బీమా దిగ్గజం 'సన్ లామ్'తో శ్రీరామ్‌కు భాగస్వామ్యం ఉంది కనక ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలని అందుబాటులోకి తేగలుగుతున్నాం. విస్తరణకు చాలా అవకాశాలు ఉన్నాయి కనక దేశంలోని 15 రాష్ట్రాలపై ఫోకస్ పెట్టి అడుగులు వేస్తున్నాం.

మీ భవిష్యత్తు లక్ష్యాలేంటి?

వ్యాపార విలువ పరంగా ప్రస్తుతం దేశంలో 13వ స్థానంలో ఉన్నాం. వచ్చే ఏడాది నాటికి 12వ స్థానానికి... మూడేళ్లలో టాప్–1లోకి రావాలనేది లక్ష్యం. ఇక పాలసీదార్ల సంఖ్య పరంగా 7వ స్థానంలో ఉన్నాం. వచ్చే మూడేళ్లలో టాప్–3లోకి రావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం.

కొత్త మెడికల్ కాలేజీల్లో వైద్యుల బదిలీ

సాక్షి, అమరావతి: ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభమవ్వకుండా నిలిచిపోయిన ఆదోని, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలల్లోని నలుగురు ప్రొఫెసర్‌లు, ఇద్దరు అసోసియేట్‌లు, 12 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను ప్రభుత్వం పాత వైద్య కళాశాలలకు బదిలీ చేసింది. ఈ మేరకు బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు ఉత్తర్వులు ఇచ్చారు. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్వహించడం కోసం ఈ కళాశాలలకు అనుమతులు రాబట్టకుండా బాబు ప్రభుత్వం చేతులెత్తేసింది. కళాశాలలను ఎలాగో ప్రైవేట్‌కు కట్టబెట్టే ఉద్దేశంలో ప్రభుత్వం ఉండటంతో గతంలో ఇక్కడ నియమించిన క్లినికల్, నాన్‌క్లినికల్ ఫ్యాకల్టీని పాత కళాశాలలకు సర్దుబాటు చేశారు. ఆయా బోధనాస్పత్రులను తిరిగి ఏపీవీవీపీకి అప్పగించాలని డీఎంఈ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు.

దమ్ముంటే ప్రమాణానికి రా

సోమిరెడ్డికి మాజీ మంత్రి కాకాణి సవాల్



నెల్లూరు (బారకాసు): 'దమ్ము, ధైర్యం ఉంటే నీ నిజాయితీని నిరూపించుకునేందుకు కాణిపాకం వినాయకుడి వద్దకు వచ్చి ప్రమాణం చెయ్యి' అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం నెల్లూరులో ఆయన మాట్లాడారు. సోమిరెడ్డి తరచూ ప్రెస్‌మీట్లు నిర్వహిస్తూ అరబిందో సంస్థతో పాటు ఎంపీ విజయసాయిరెడ్డి గురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది ఎంతమాత్రం మంచిది కాదన్నారు. ఎన్నికలకు ముందు అరబిందో కంపెనీకి సోమిరెడ్డి ఫోన్ చేసి రూ.5 కోట్లు డబ్బులు అడిగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అందుకు వారు నిరాకరించడంతో ఆ తరువాత నుంచి సోమిరెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి అరబిందో కంపెనీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను చెప్పిన ఈ విషయాలన్నీ అవాస్తవమని సోమిరెడ్డి భావిస్తే కాణిపాకం వినాయకుడి ఎదుట ప్రమాణం చేసేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కంపెనీలను బెదిరించి అడిగినంత మొత్తం ఇవ్వకపోతే దండయాత్ర చేయడం సోమిరెడ్డికి అలవాటైందన్నారు. పొదలకూరు మండలంలో తన బినామీలు లేఅవుట్లు వేశారని సోమిరెడ్డి గతంలో అనేకమార్లు ఆరోపించారని కాకాణి చెప్పారు. లేఅవుట్లపై ప్రారంభమైన విచారణ ఎందుకు అర్ధాంతరంగా ఆగిపోయిందన్నారు. సదరు లేఅవుట్ల యజమానులు సోమిరెడ్డి కుమారుడికి రూ.2.50 కోట్లు సమర్పించారని అందువల్లే విచారణ జరగకుండా అడ్డుకున్నారన్నారు.

మార్చి 17 నుంచి 31 వరకు 'పది' పరీక్షలు

అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు జరుగుతాయని బుధవారం ప్రభుత్వం టైమ్‌టేబుల్‌ను ప్రకటించింది. ప్రధాన పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఒకేషనల్ పరీక్షలు 9.30 నుంచి 11.15 గంటల వరకు జరుగుతాయి.



ఇదీ షెడ్యూల్

తేదీ	పేపర్
17-3-2025	ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఏ)
	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్)
19-3-2025	సెకండ్ లాంగ్వేజ్
21-3-2025	ఇంగ్లిష్
22-3-2025	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్)
	ఓరియంటల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1
24-3-2025	మ్యాథమెటిక్స్
26-3-2025	ఫిజికల్ సైన్స్
28-3-2025	బయలాజికల్ సైన్స్
29-3-2025	ఓరియంటల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2
	ఎస్సెస్సీ ఒకేషనల్ (థియరీ)
31-3-2025	సోషల్ స్టడీస్

మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు

సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి ఒకటి నుంచి 19 వరకు మొదటి సంవత్సరం, 3 నుంచి 20వ తేదీ వరకు రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ విద్య కార్యదర్శి కృతికా శుక్లా పేర్కొన్నారు. పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే, ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు ఉంటాయని వివరించారు.



ఇంటర్ పరీక్షల షెడ్యూల్

మొదటి సంవత్సరం (పేపర్-1)

1-3-2025	సెకండ్ లాంగ్వేజ్
4-3-2025	ఇంగ్లిష్
6-3-2025	మ్యాథమెటిక్స్-1ఏ, బోటనీ, సివిక్స్
8-3-2025	మ్యాథమెటిక్స్-1బీ, జువాలజీ, హిస్టరీ
11-3-2025	ఫిజిక్స్, ఎకనామిక్స్
13-3-2025	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్
17-3-2025	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు మ్యాథమెటిక్స్
19-3-2025	మోడ్రన్ లాంగ్వేజ్, జియోగ్రఫీ

రెండో సంవత్సరం (పేపర్-2)

3-3-2025	సెకండ్ లాంగ్వేజ్
5-3-2025	ఇంగ్లిష్
7-3-2025	మ్యాథమెటిక్స్-2ఏ, బోటనీ, సివిక్స్
10-3-2025	మ్యాథమెటిక్స్-2బీ, జువాలజీ, సివిక్స్
12-3-2025	ఫిజిక్స్, ఎకనామిక్స్
15-3-2025	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్
18-3-2025	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు మ్యాథమెటిక్స్
20-3-2025	మోడ్రన్ లాంగ్వేజ్, జియోగ్రఫీ

పోర్టులు ధారాదత్తం

కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులూ ప్రైవేటుకే..



- ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పోర్టులు కూడా ప్రైవేటుకు..
- కొత్త పోర్టులతో పాటు పాత పోర్టుల్లో షిప్ బిల్డింగ్ పేరిట ప్రైవేటు వ్యక్తులనూ అనుమతిస్తాం
- అంటే.. 100 శాతం ప్రభుత్వ పోర్టు అయిన కాకినాడ యాంకరేజ్ పోర్టు కూడా ప్రైవేటుచేసే అవకాశం
- ఏపీ మారిటైమ్ పాలసీ–2024 విడుదల

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రభుత్వరంగ పోర్టు కాకినాడ యాంకరేజ్ పోర్టుతో పాటు ల్యాండ్ లార్డ్ విధానంలో గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులతో పాటు ఫిషింగ్ హార్బర్లను కూడా ప్రైవేటుపరం చేయడాన్ని ప్రోత్సహించే విధంగా రూపొందించిన ఏపీ మారిటైమ్ పాలసీ–2024ను టీడీపీ కూటమి ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మైనర్ పోర్టులు, నిర్మాణంలో ఉన్న పోర్టులు, కొత్తగా నిర్మాణం చేపట్టే పోర్టులన్నింటిలో పబ్లిక్–ప్రైవేటు–పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి మారుస్తామని పాలసీలో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఇప్పటికే ప్రైవేటు రంగంలో నడుస్తున్న పోర్టుల్లో కూడా షిప్ బిల్డింగ్, షిప్ రిపేరింగ్, మారిటైమ్ టూరిజం పేరిట కొత్త ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించనున్నట్లు సర్కారు ప్రకటించింది. రాష్ట్రంలో ల్యాండ్ లార్డ్ మోడల్‌లో అభివృద్ధి చేస్తున్న పోర్టులను పీపీపీ విధానంలో మార్చడానికి ఫ్రేమ్‌వర్క్ తయారుచేస్తున్నట్లు కూడా పాలసీలో స్పష్టంగా పేర్కొన్నారు. నిజానికి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకు అధికాదాయం వచ్చేలా ల్యాండ్ లార్డ్ మోడల్‌లో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణం చేపట్టారు. కొత్త పాలసీ ప్రకారం ప్రభుత్వం ఈ మూడు పోర్టులను ప్రైవేటుపరం చేయనుంది. అంతేకాక.. ప్రస్తుత పోర్టులన్నీ పరిశీలించి పోర్టు అభివృద్ధి పేరుతో పోర్టు ఆధారంగా టైలర్‌మేడ్ పీపీపీ విధానం అమలుచేస్తామని కూడా పేర్కొంది. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు విధానాన్ని అనుసరించి రోడ్‌మ్యాప్‌ను సిద్ధంచేయనుంది. అలాగే, సొంత అవసరాల కోసం ప్రైవేటు విధానంలో క్యాప్టివ్ పోర్టులనూ ప్రోత్సహించనుంది. ఇప్పటికే ఉన్న పాత నాన్ మేజర్ పోర్టుల్లో అభివృద్ధి పేరిట వాణిజ్య, వ్యాపార అభివృద్ధి కోసం ప్రైవేటు వ్యక్తులకు లైసెన్సులు జారీచేయనున్నట్లు ఆ పాలసీలో పేర్కొంది. దీని ప్రకారం.. పూర్తి 100 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న కాకినాడ యాంకరేజ్ పోర్టు కూడా క్రమంగా ప్రైవేటు పరంచేసే కార్యక్రమం చేపట్టిందని అధికారులు స్పష్టంచేస్తున్నారు. ఇవికాక.. మౌలిక వసతులు, లాజిస్టిక్స్, మారిటైమ్ పర్యాటకం, పారిశ్రామిక పార్కులు, గ్రీన్ ఎనర్జీ, షిప్ బిల్డింగ్ పేరిట పెద్దఎత్తున ప్రైవేటు పెట్టుబడులను పోర్టుల్లో ప్రోత్సహించనున్నట్లు ఏపీ మారిటైమ్ పాలసీ–2024 తెలిపింది.

గత పాలనలో పోర్టుల ప్రగతి భేష్..

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పోర్టుల ప్రగతి అద్భుతంగా జరిగిందని పాలసీలో ప్రముఖంగా పేర్కొన్నారు. 1,053.7 కి.మీ సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న ఏపీలో.. విశాఖలోని మేజర్ పోర్టులతో పాటు ఐదు మైనర్ పోర్టుల పనితీరు అద్భుతంగా ఉందంటూ కితాబునిచ్చింది. 2022–23 ఎగుమతులు–దిగుమతులకు సంబంధించి నాన్ మేజర్ పోర్టుల రంగంలో రాష్ట్రం 117.62 మిలియన్ టన్నులు నిర్వహించడం ద్వారా దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని.. అదే విధంగా పోర్టు సామర్థ్య వినియోగంలో 66 శాతం సాధించిందని పేర్కొన్నారు. వీటితో పాటు కొత్తగా మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల నిర్మాణం చేపట్టిందని ప్రభుత్వం ఆ పాలసీలో తెలిపింది. ఇక 2023–24లో రూ.60,523 కోట్ల మత్స్య సంపదను ఎగుమతులు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని.. ఎగుమతుల సన్నద్ధత ర్యాంకులు 2022లో ఏపీ 8వ స్థానానికి ఎగబాకడంతో పాటు ఎగుమతుల విలువపరంగా ఐదవ స్థానానికి చేరిందని అందులో వివరించారు. దీంతోపాటు.. పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన విషయాన్ని కూడా పాలసీలో పేర్కొన్నారు.

2030 నాటికి మారిటైమ్ గేట్‌వే లక్ష్యంగా..

ఇక 2030 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను మారిటైమ్ గేట్‌వే చేయాలని లక్ష్యంగా ఈ కొత్త పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. ముఖ్యంగా.. పోర్టు టెర్మినల్స్ అభివృద్ధితోపాటు పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కులు, షిప్ బిల్డింగ్, ఇతర మెరైన్ కార్యకలాపాల పేరిట నాలుగు రంగాలపై ప్రధానంగా దృష్టిసారించినట్లు పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. రాష్ట్రంలోని మేజర్ పోర్టును అంతర్జాతీయంగా పేరెన్నికగన్న 20 పోర్టుల్లో ఒకటిగా చేర్చడంతో పాటు, 2030 నాటికి పోర్టుల వినియోగ శాతాన్ని ప్రస్తుతమున్న 66 శాతం నుంచి 2030 నాటికి 75 శాతానికి పెంచాలని.. అలాగే, 2047 నాటికి దేశీయ వాణిజ్య ఎగుమతుల్లో 20 శాతం వాటా సాధించడంతో పాటు టర్న్ ఎరౌండ్ సమయాన్ని 15 గంటలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, 2028 నాటికి మారిటైమ్ అవసరాల కోసం 5,000 మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వాలని కూడా నిర్ణయించింది. మరోవైపు.. వేగంగా అనుమతులిచ్చేందుకు వివిధ శాఖల నుంచి 13 మందితో ప్రత్యేకంగా ఇన్వెస్ట్‌మెంట్ సెల్‌ను ఏర్పాటుచేసింది. అదే విధంగా.. పోర్టు నిర్మాణానికి, పారిశ్రామిక పాలసీలకు అనుగుణంగా విద్యుత్ టారిఫ్‌లు, ఏడేళ్ల మైనర్ మినరల్స్‌పై రాయల్టీ, పోర్టు డ్యూ, వ్యవసాయ భూమి బదలాయింపు చార్జీలపై మినహాయింపు ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎల్‌ఐ ప్రోత్సాహకాలకు అదనంగా 10 శాతం రాయితీలతోపాటు అనేక ఇతర రాయితీలను పాలసీలో పొందుపరిచారు.

ఏపీ ఇన్ పార్లమెంట్


టోల్‌ప్లాజాల వద్ద అడ్డంకుల్లేని ప్రయాణం

వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం




సాక్షి, న్యూఢిల్లీ: ఫాస్టాగ్‌తో పాటు ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ (ఈటీసీ) వ్యవస్థను ఉపయోగించి టోల్‌ప్లాజాల వద్ద ఏవిధమైన అడ్డంకుల్లేని ప్రయాణానికి నాంది పలికినట్లు కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే అమలు, గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్, రుసుం వసూలు వ్యవస్థ జాతీయ రహదారులపై ఎక్కడా పనిచేయడం లేదన్నారు. హరియాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వాహనదారుల నుంచి రుసుం సేకరించేందుకు 140 వాహనాలపై లొకేషన్ ట్రాకింగ్ కోసం ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్(ఏఐఎస్)ను పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యూపీఎస్సీకి 477 మంది సిఫార్సు..



సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్–2019 నుంచి 2023 వరకు ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద యూపీఎస్సీ ద్వారా 477 మంది అభ్యర్థులను సిఫార్సు చేశారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

1.64 లక్షల పోస్టాఫీసులు..



దేశంలో 1,64,987 పోస్టాఫీసులున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

మార్చిలో ఎఫ్ఆర్వో స్క్రీనింగ్ టెస్ట్

సాక్షి, అమరావతి: ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు వచ్చే మార్చిలో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు అదే నెలలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మార్చి 16న ఎఫ్ఆర్వో టెస్ట్, మార్చి 17న హెల్త్ వర్సిటీ జూనియర్ అసిస్టెంట్ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం ఉంటుందని ప్రకటించారు. షెడ్యూల్‌ను కమిషన్ వెబ్‌సైట్ http://psc.ap.gov.inలో ఉంచినట్లు తెలిపారు.

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఫినాలే పోటీలు ప్రారంభం

వర్చువల్ విధానంలో పాల్గొన్న ప్రధాని మోదీ

రేణిగుంట: తిరుపతి ఐఐటీలో బుధవారం 7వ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2024 గ్రాండ్ ఫినాలే ఈవెంట్ ప్రారంభమైంది. ఏర్పేడు సమీపంలోని ఐఐటీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ హ్యాకథాన్ ఫినాలే పోటీలను ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 51 నోడల్ కేంద్రాల్లో 1,300కుపైగా యువ ఆవిష్కర్తలు ఈ పోటీలో పాల్గొంటుండగా, తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో 21 బృందాలకు సంబంధించి మొత్తం 126 మంది యువ ఆవిష్కర్తలు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకల్లో భారత ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో పాల్గొని యువ ఆవిష్కర్తలతో సంభాషించారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో భారతావని ప్రపంచదేశాలలో అగ్రగామిగా నిలిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ పేర్కొన్నారు.




హ్యాకథాన్ ఫినాలే పోటీల్లో పాల్గొన్న యువశాస్త్రవేత్తలతో వర్చువల్‌గా సంభాషిస్తున్న భారత ప్రధాని మోదీ

18 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

సాక్షి, అమరావతి: ఈనెల 18 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం ఆరు రోజుల పాటు జరిగే ఈ పరీక్షలు రాసేందుకు 37,965 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. హాల్ టికెట్లను నేటి (గురువారం) నుంచి సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



తీరానికి గాయం

విశాఖ సముద్ర తీరానికి తీరని గాయం ఏర్పడుతోంది. సముద్రంలో వస్తున్న మార్పుల కారణంగా తీరంలోని పలు ప్రాంతాలు కోతకు గురవుతున్నాయి. గతంతో పోల్చితే ఈ సమస్య ఇటీవల కాలంలో తీవ్రమవుతోంది. ప్రధానంగా విక్టరీ ఎట్ సీ వద్ద సముద్ర కెరటాలు ఉధృతంగా తీరాన్ని తాకుతున్నాయి. దీంతో దాదాపు మూడు అడుగుల లోతులో ఇసుక కోతకు గురయింది. ఈ ప్రాంతంలో పర్యాటకులు బీచ్‌లోకి వెళ్లలేని పరిస్థితి. కోస్టల్ బ్యాటరీ ప్రాంతంలో భారీ కెరటాలు బలంగా రాళ్లను తాకుతున్నాయి. ఆర్‌కే బీచ్, నోవాటెల్ హోటల్ ఎదురుగా ఉన్న పార్క్ దగ్గర సముద్ర తీరం భారీగా కోతకు గురవుతోంది. దీంతో నోవాటెల్ ఎదురుగా ఉన్న పార్క్ రక్షణ గోడ సైతం కూలడానికి సిద్ధంగా ఉంది. ఇంత ప్రమాదకరంగా సముద్ర తీరంలో పరిస్థితులు ఉన్నప్పటికీ పలువురు పర్యాటకులు లోతుగా ఉన్న ప్రాంతంలో సముద్రంలోకి దిగడం, స్నానాలు చేయడం కనిపిస్తోంది. మరికొందరు కూలడానికి సిద్ధంగా ఉన్న గోడపై కూర్చుని ఫొటోలు తీసుకునేందుకు సాహసిస్తున్నారు. సముద్రం కోతపై దృష్టిసారించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– ఏయూక్యాంపస్



మిరాశీదారు వసుదేవాచార్య గుండెపోటుతో కన్నుమూత



తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి సన్నిధి వీధిలోని శ్రీవేదాంత దేశికుల వారి ఆలయ మిరాశీదారుడు కళత్తూరు వాసుదేవాచార్య బుధవారం సాయంత్రం స్విమ్స్ ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. టీటీడీ ఆలయ సంప్రదాయ ఆచార వ్యవహారాలు క్షుణ్ణంగా తెలిసిన ఈయన సుమారు 25 ఏళ్లు శ్రీదేశికులవారి సన్నిధిలో కైంకర్యం చేసి తరించారు. ఆచార్యుని కై ంకర్యం కోసం వివాహం కూడా చేసుకోకుండా తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కట్టెల పొయ్యిలోనే ప్రసాదాలు తయారు చేసి, ఆచార్యునికి నైవేద్యం సమర్పించి ఆరాధన చేసేవారు. వీరి మరణం శ్రీవైష్ణవ సంప్రదాయానికి తీరని లోటు అని స్థానిక అర్చకులు, జీయంగార్లు, ఆచార్య పురుషులు తెలిపారు. ఆయనకు ఇద్దరు అన్నలు, ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు .గురువారం ఉదయం గంగుండ్ర మండపం వీధిలోని ఆయన స్వగృహంలో భౌతిక కాయం ఉంచి అటు పిమ్మట అక్కారాంపల్లి మార్గంలోని హరిశ్చంద్ర శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించనున్నట్లు ఆయన బంధుమిత్రులు తెలిపారు.

పోలీసుల కళ్లుగప్పి ఖైదీ పరారీ

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో కలకలం

సాక్షి, పుట్టపర్తి: పోలీసుల కళ్లుగప్పి రిమాండ్ ఖైదీ పరారైన సంఘటన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఓ ఇంటి స్థలం వివాదంలో రిమాండ్‌లో ఉన్న రవీంద్రనాయక్‌ను కోర్టుకు హాజరు పరిచేందుకు పెనుకొండకు తీసుకురాగా.. మూత్ర విసర్జనకు వెళ్లొస్తానని పత్తా లేకుండా పోయాడు. పెనుకొండ మండలం అడదాకులపల్లి గ్రామంలో మూడు నెలల క్రితం ఓ ఇంటి స్థలం విషయంలో రవీంద్రనాయక్, శంకర్‌నాయక్ గొడవపడ్డారు. ఘటనలో శంకర్‌నాయక్‌కు బలమైన గాయాలు తగలడంతో అతని ఫిర్యాదు మేరకు రవీంద్రనాయక్, అతని కుమారుడు పృథ్వీనాయక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం పెనుకొండ కోర్టుకు హాజరు పరిచారు. తర్వాత మూత్ర విసర్జనకు వెళ్లొస్తానన్న రవీంద్రనాయక్ అటు నుంచి అటే పరారయ్యాడు. పృథ్వీనాయక్ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు.

'మెర్క్' ఎండీగా డాక్టర్ సిరి

సాక్షి, అమరావతి: ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ కార్పొరేషన్ (మెర్క్) ఎండీగా సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరికి ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) ఇచ్చింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

10న ద్వారకాతిరుమలలో ఉత్తర ద్వారదర్శనం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 10న శ్రీవారి ఉత్తరద్వార దర్శనాన్ని కల్పించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీఎస్ఎన్ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు ఈ దర్శన భాగ్యాన్ని కల్పిస్తామన్నారు. ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేక టికెట్ రుసుంను రూ.500గా నిర్ణయించామన్నారు.

గత రెండేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టపోయిన స్ట్రాబెర్రీ రైతులకు ఈ ఏడాది పరిస్థితులు అనుకూలించాయి. దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో అన్నిఖర్చులు పోనూ ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. సేంద్రియ విధానంలో పండించడం వల్ల కొనుగోలు చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

లాభాల సిరి స్ట్రాబెర్రీ



అరకు, లంబసింగిలో 15 ఎకరాల్లో సాగు

గత రెండేళ్లుగా నష్టాలు ఈ ఏడాది మంచి దిగుబడి

ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం

సాక్షి,పాడేరు: అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో స్ట్రాబెర్రీ పండ్ల సీజన్ ప్రారంభమైంది. పర్యాటక సీజన్ కావడంతో మంచి ఆదరణ నెలకొంది. అరకులోయ, లంబసింగి ప్రాంతాల్లో 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేస్తున్నారు. కొంతమంది మైదాన ప్రాంత రైతులు గిరిజనుల వద్ద భూములు లీజుకు తీసుకుని చింతపల్లి మండలం లంబసింగి ప్రాంతంలో పండిస్తున్నారు. అరకులోయలోని పెదబల్లుగుడ సమీపంలో ఎకరా విస్తీర్ణంలో గిరిజన రైతులే స్వయంగా స్ట్రాబెర్రీని పండిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పండ్ల దిగుబడి ఆశాజనకంగా ఉంది. అరకులోయ, లంబసింగి, రాజుపాకల ప్రాంతాల్లో స్ట్రాబెర్రీ పండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా పండించడం వల్ల పండ్లకు మంచి డిమాండ్ ఉంది.

200 గ్రాములు రూ.100

అరకులోయ, లంబసింగి ప్రాంతాల్లో రైతులు, వ్యాపారులు 200 గ్రాముల పండ్లను రూ.100కు విక్రయిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో పండ్ల వ్యాపారులకు వారు ఇదే పండ్లను రూ.90కు అమ్ముతున్నారు. విశాఖపట్నం, విజయనగరం, రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు లంబసింగి ప్రాంతం నుంచి ప్రతిరోజు ఎగుమతి అవుతోంది.

ఎకరానికి రూ.2లక్షల ఆదాయం

ఎకరాకు మూడు వేల కిలోల వరకు దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు. అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందని వారు వివరించారు. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉందని రాజుపాకలు ప్రాంతానికి చెందిన రైతు సత్యనారాయణ తెలిపారు.

అనుకూలించిన వాతావరణం



స్ట్రాబెర్రీ సాగుకు ఈఏడాది వాతావరణం అనుకూలంగా ఉంది. గత రెండేళ్ల అధిక వర్షాల కారణంగా పంటకు నష్టం వాటిల్లింది. ఈసారి మాత్రం పూత బాగుంది. పండ్ల సైజు కూడా పెద్దదిగా ఉండడంతో మరింత ఇష్టంగా తింటున్నారు. గిరిజన రైతులు సాగు చేపట్టేందుకు ముందుకు వస్తే ప్రోత్సహిస్తాం. హెక్టార్‌కు రూ.50వేల వరకు ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందజేస్తోంది.

– రమేష్‌కుమార్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, పాడేరు



అరకులోయలోని బల్లుగుడ సమీపంలో సాగవుతున్న స్ట్రాబెర్రీ



రాజుపాకలులో కౌలు రైతు సత్యనారాయణ వద్ద పండ్లను కొనుగోలు చేస్తున్న పర్యాటకులు

పంచాయతీరాజ్ టీచర్లపై వివక్ష తగదు

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్



సాక్షి, అమరావతి: అపరిష్కృతంగా ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సమస్యలపై ఆ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టి పరిష్కరించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తమను ప్రభుత్వంలో విలీనం చేసినా ప్రభుత్వ టీచర్లకున్న సదుపాయలు తమకు లేవని అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

30శాతం ఐఆర్ ప్రకటించాలి: బీటీఏ

కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికలలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోలేదని బహుజన టీచర్స్ అసోసియేషన్ విచారం వ్యక్తం చేసింది. కూటమి పక్షాన ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు శాతం ఇంటీరియం రిలీఫ్‌ను వెంటనే ప్రకటించి జనవరి జీతంతో చెల్లించాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శరత్‌చంద్ర, ఎస్.రవికుమార్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి: టీచర్స్ గిల్డ్

ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ మరణించిన ఉపాధ్యాయ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆయా కుటుంబాల్లో అర్హులైనవారికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న రాఘవరెడ్డి విచారణ

సోషల్ మీడియా యాక్టివిస్టులు సునీత రెడ్డితో పాటు, పలువురి విచారణ

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి మంగళవారం రెండో రోజు కడపలోని సైబర్ క్రైమ్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి దాకా కొనసాగింది. రాఘవరెడ్డిని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ తమ సిబ్బందితో కలిసి విచారించారు. రాఘవరెడ్డిని ఈనెల 13న కడపలోని సైబర్‌క్రైమ్ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని బుధవారం నోటీసులు జారీ చేశారు. కాగా, సోషల్ మీడియా యాక్టివిస్టులు సునీత రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వరకుమార్, శరత్‌కుమార్‌ను కూడా కడప సైబర్ క్రైమ్ పోలీసులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విచారించారు. వీరిని ఈ నెల నాలుగో తేదీ కూడా విచారించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా.. తమ కక్షిదారుడు రాఘవరెడ్డిపై కొందరు మీడియా ప్రతినిధులు అనవసర విషయాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వదంతులను ఎవరూ ప్రచారం చేయవద్దని న్యాయవాది ఓబుళరెడ్డి కోరారు.



విచారణకు హాజరైన రాఘవరెడ్డి

'హ్యాకథాన్' విజేతలకు బహుమతులు

సాక్షి, విశాఖపట్నం: స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు ఆ–హబ్, ఈపీడీసీఎల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన 'హాక్ ఏపీ హ్యాకథాన్'లో సృజనాత్మక ఆవిష్కరణలకు విద్యుత్ పంపిణీ సంస్థ బహుమతులు అందజేసింది. ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా బుధవారం జరిగిన 13వ ఎడిషన్ 'హాక్ ఏపీ హ్యాకథాన్'కార్యక్రమంలో స్టార్టప్ సంస్థలతో పాటు విద్యార్థులు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సహా 72 బృందాలు పాల్గొన్నాయి. పోటీల్లో భాగంగా.. విద్యుత్ పంపిణీ వ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలను పలు స్టార్టప్ సంస్థల ప్రతినిధులు ప్రదర్శించారు. విజేతలుగా 7 బృందాల్ని ఎంపిక చేసి.. రూ.6 లక్షల విలువైన బహుమతులు అందించారు. హ్యాకథాన్‌లో వచ్చిన పరిష్కారాలను అమలుచేయడం ద్వారా సంస్థ సుమారు రూ.2 కోట్లు ఆదా చేయగలుగుతుందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. స్టార్టప్ సంస్థలు అందించిన పరిష్కారాలు సంస్థలో మెరుగైన ఫలితాలకు, విద్యుదాఘాతాల నిరోధం, ఫీడర్ మీటర్ల కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగు, ముందస్తుగా నిర్వహణ వైఫల్యాల గుర్తింపు, సులభతరమైన బిల్లింగ్, నిరంతర విద్యుత్ సరఫరాకు దోహదపడతాయన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ మాట్లాడుతూ విద్య, పారిశ్రామిక రంగాలను అనుసంధానించే దిశగా ఈ తరహా హ్యాకథాన్ల నిర్వహణ ఎంతో అవసరమన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణను విజయవంతం చేయండి

రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఎ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 13న జరిగే స్వర్ణాంధ్ర – 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఏ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బాబు ఎ. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి స్వర్ణాంధ్ర –2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరవుతారని.. పకడ్బందీ ఏర్పాట్లతో కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల పార్కింగ్ నుంచి ఎగ్జిబిషన్, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు వరకు ప్రతి విషయంపై సూచనలు చేశారు. అన్నదాతలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎంఎస్ఎంఈల ప్రతినిధులు తదితరులు కూడా హాజరుకానున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, అదనపు కార్యదర్శి జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దళిత సంక్షేమ పథకాలన్నింటిని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడ హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో హైదరాబాద్‌లో జరగనున్న ఆలిండియా దళిత్ రైట్స్ మూమెంట్ రెండో మహాసభలు, డీహెచ్‌పీఎస్ బలోపేతం, కమిటీల నియామకంపై చర్చించారు. అలాగే చిత్తూరు జిల్లా దాసారాపల్లిలో ప్రభుత్వ భూమిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నిర్ణయించారని, దానిని కొందరు అడ్డుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వ అడ్డంకులు తొలగించి విగ్రహ నిర్మాణం చేపట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు దళితులకు 27 సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టి ఆర్నెల్లు కావస్తున్న వాటి ఊసే త్తడం లేదన్నారు. తక్షణమే 27 సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'తూర్పు కోస్తా' విభజనపై నిరసన

భువనేశ్వర్: దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటులో భాగంగా తూర్పు కోస్తా రైల్వేను విభజించడం పట్ల ఒడిశా రాష్ట్రంలో అసంతృప్తి సెగలు రేగుతున్నాయి. తూర్పుకోస్తా రైల్వే నుంచి వాల్తేరు మండలాన్ని తొలగించి కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో విలీనం చేయడం రాజకీయ లబ్ధి కోసమేనని ప్రధాన ప్రతిపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెసు పార్టీలు మండిపడుతున్నాయి. రాష్ట్రానికి చెందిన సుందరగఢ్, ఝూర్సుగుడ, బాలాసోర్, మయూర్‌భంజ్ ప్రాంతాలు ఆగ్నేయ, ఆగ్నేయ మధ్య రైల్వే జోన్ల అధీనంలో విలీనమై కొనసాగుతున్నాయి. ఈ జోన్ల ప్రధాన కార్యాలయాలు ఇతర రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో మొదటి కంపార్ట్‌మెంట్ నిండిపోయింది. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,284 మంది స్వామి వారిని దర్శించుకోగా 19,064 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.27 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి ఆడపడుచులకు ఆరాధన

తిరుమల : తిరుమల మొదటి కనుమ రహదారిలోని అక్కదేవతల గుడిలో ఏడుగురు అక్కదేవతలకు 13వ తేదీ ఉదయం టీటీడీ ఆధ్వర్యంలో కార్తీకమాస పూజలు నిర్వహించనున్నారు. అక్కదేవతలకు ఏటా కార్తీకమాస పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా టీటీడీ డ్రైవర్లు, స్థానికులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించనున్నారు. తిరుమల మొదటి కనుమ రహదారిలోని చిన్న మందిరంలో శక్తి స్వరూపిణులైన అక్కదేవతలు కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు. పురాణాల్లో ప్రస్తావించిన బ్రాహ్మి, ఇంద్రాణి, కౌమారి, వైష్ణవి, వారాహి, మాహేశ్వరి, చాముండి దేవతలు సప్త మాతృకలుగా ఆలయంలో పూజలందుకుంటున్నారు. తన భక్తులకు అభయప్రదాతగా తిరుమల క్షేత్రంలో కొలువుదీరి ఏడుకొండలవాడికే ఆడపడుచులుగా పేరొందిన అక్కదేవతలు తిరుమల క్షేత్రానికి నలువైపులా రక్షణ కవచంగా కొలువు దీరి ఉన్నారని పురాణగాథ.

రేపు తిరువణ్ణామలైలో ఆంక్షలు

చిత్తూరు అర్బన్: తమిళ కార్తీక దీపాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై ఆలయం వద్ద ఆంక్షలు పెట్టినట్లు చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నుంచి తిరువణ్ణామలై వెళ్లే భక్తులు కార్లను ఊరి బయట కేటాయించిన 13 ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని, గిరివలయంలో నిబంధనలు పాటించాలని కోరారు. అక్కడ సహాయం కోసం తిరువణ్ణామలై పోలీసులు ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ – 9363622330, 9498100431 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నెల్లూరులో నాగమ్మ ఆలయం కూల్చివేత

నెల్లూరు: రహదారి విస్తరణ పేరుతో హిందువుల ఆలయాన్ని కూల్చి, దేవతామూర్తుల విగ్రహాలను తొలగించారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు డైకస్‌రోడ్డు సెంటర్‌లో బుధవారం రోడ్డు వెడల్పు పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు నాగమ్మ ఆలయాన్ని కూల్చివేశారు.

విద్యా సమాచారం

ఎస్వీయూలో ఓఆర్ఐ జర్నల్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ ప్రచురిస్తున్న అంతర్జాతీయ జర్నల్‌ను వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు బుధవారం వీసీ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి తలమానికంగా నిలిచిన ప్రాచ్య పరిశోధన సంస్థ (ఓఆర్ఐ) మన ప్రాచీన వారసత్వ సంపదైన తాళపత్ర గ్రంథాల సంరక్షణకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎన్నో అపురూపమైన గ్రంథాలు ముద్రించిందని, ప్రస్తుతం జర్నల్ 64వ వాల్యూమ్‌ను ప్రచురించడం సంతోషకరమన్నారు.

ఆహార భద్రతే లక్ష్యంగా పరిశోధనలు



తిరుపతి సిటీ : ఆహార భద్రతే లక్ష్యంగా పరిశోధనల వైపు యువత దృష్టి సారించాలని చెన్నైకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రకాష్ ఫీడ్స్ మిల్స్ అధినేత డాక్టర్ ప్రకాష్‌రావు పిలుపు నిచ్చారు. బుధవారం ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల కోసం మైల్‌స్టోన్స్ ఇన్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఇంప్రూమెంట్ ఆఫ్ అనిమల్ హెల్త్ అండ్ ప్రొడక్షన్ అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు ఆహార కొరత లేకుండా నేటి యువత పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉచిత శిక్షణ

గన్నవరంరూరల్: వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాల్లో రాణించాలని ఆశించే యువతీ యువకులకు అగ్రి క్లినిక్‌లు ఏర్పాటు చేసుకునేందుకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎలీప్ సీఈడీ (మహిళా పారిశ్రామికవాడ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్) అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్ సెంటర్ స్కీమ్ నోడల్ ఆఫీసర్ పోలవరపు శోభారాణి చెప్పారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఎలీప్, జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం సంయుక్త భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మండలంలోని సూరంపల్లిలో నిర్వహిస్తున్నామన్నారు. అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరి కల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయో టెక్నాలజీ, అగ్రి ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రీషన్, బీజెడ్‌సీ హోం సైన్స్, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, ఈ కోర్సుల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా చదివిన పట్టభద్రులు దరఖాస్తు చేసేందుకు అర్హులని చెప్పారు.

సాక్షి ప్లస్
గురువారం । 12 । 12 । 2024

నిక్కర్ నుంచి టెక్ పోలీస్..!

ఒకప్పుడు నిక్కర్ తొడిగి, సైకిల్ మీద పోలీసుల సవారీ | ఇప్పుడు అధునాతన వాహనాలు, చేతిలో ట్యాబ్‌లు | సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని కేసుల శోధన | నేరస్తులను సులువుగా పట్టుకొంటున్న ఖాకీలు | కాలనుగుణంగా పోలీసు వ్యవస్థలో ఎన్నో మార్పులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: పోలీస్ వ్యవస్థ నిత్యనూతనమవుతోంది. కరుడుగట్టిన నేరస్తులను కూడా నేరం జరిగిన గంటల వ్యవధిలోనే తేలిగ్గా పట్టుకొంటున్నారు. భయపెట్టడమే పోలీస్ లక్షణం అన్న కాలం నుంచి ప్రజలకు మంచి స్నేహితులు అనే స్థాయికి మార్పులు వచ్చాయి. ఒకప్పుడు పోలీసును చూస్తే చాలు జనం పరుగులు పెట్టేవారు. ఠాణా మెట్లెక్కాలన్నా వణికేవారు. ఫ్రెండ్లీ పోలీసు విధానం అమల్లోకి వచ్చిన తరువాత బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ గోడును చెప్పుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం చేసినా, తమకు న్యాయం జరగదని అర్థం అయినా ఉన్నతాధికారుల వద్దకూ వెళుతున్నారు. అప్పట్లో పోలీసు అంటేనే కరుకు మాటలు గుర్తుకొచ్చేవి. ఇప్పుడు పోలీసుల ప్రవర్తనలోనే కాదు అన్ని విషయాల్లోనూ చాలా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా నేర పరిశోధనలో పోలీసులు అప్పట్లో డాగ్ స్క్వాడ్‌ల మీద ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు టెక్నాలజీని వాడుకుంటున్నారు. ఎంత తెలివైన నేరస్తులను కూడా సులువుగా పట్టుకోగలుగుతున్నారు. పట్టణాల్లో అయితే పోలీసు స్టేషన్లో కూర్చుని కంట్రోల్ సిస్టం ద్వారా ఎక్కడ ఏం జరుగుతుందోనని సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్షంగా చూడగలిగే అవకాశం ఏర్పడింది. అయితే పోలీసు శాఖలో ఇప్పుడు రాజకీయ జోక్యం మాత్రం పెరిగింది. పోస్టింగులన్నీ అధికార పార్టీ నేతలు చెప్పినట్టే నడుస్తున్నాయి. దీంతో మంచి చోట్ల పోస్టింగుల కోసం పోలీసు అధికారులు పైరవీలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.





నాడు సైకిల్.. నేడు ఇన్నోవాలు



నాలుగైదు దశాబ్దాల క్రితం పోలీసులు నిక్కర్ తొడుక్కుని, జబ్బకు లాఠీ తగిలించుకుని సైకిల్‌పై సవారీ చేసేవారు. గ్రామాలే కాదు పట్టణాల్లోనూ సైకిళ్ల మీదే తిరిగేది. తరువాతి కాలంలో నిక్కర్ల స్థానంలో ప్యాంట్లు వచ్చాయి. సైకిళ్ల స్థానంలో సైకిల్ మోటార్లే కాదు ఇన్నోవాలు, బొలేరో వాహనాలు వచ్చి చేరాయి. జిల్లా స్థాయి అధికారులకైతే ఫార్చ్యునర్లు కూడా సమకూర్చారు. నక్సలైట్ల కార్యకలాపాలు కొనసాగిన సమయంలో పోలీసులకు ప్రత్యేక నిధులు ఇచ్చేవారు. వాటితో ఇన్‌ఫార్మర్లను తయారు చేసుకుని నక్సలైట్లను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేసేవారు. వాహనాల్లో వెళితే నక్సలైట్లు మెరుపుదాడులు చేస్తారని, మారుమూల గ్రామాలకు కాలినడకనే వెళ్లేవారు. సివిల్ దుస్తుల్లో, నంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలు, అలాగే ప్రయాణికులతో కలిసి బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో తిరిగేవారు. నక్సలైట్ల ప్రాబల్యం తగ్గిపోయిన తరువాత పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఏ గ్రామానికైనా దర్జాగా వెళుతున్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీవో) విధానం అమల్లోకి వచ్చిన తరువాత ఊరికొక పోలీసు ఉండేవారు. వారు వారానికోసారైనా ఆ ఊరికి వెళ్లాల్సిందే. అక్కడి ప్రజలతో మమేకం అయి, వాళ్ల సమస్యలను తెలుసుకుని అధికారులకు నివేదించేవారు.

నేర పరిశోధనలో టెక్నాలజీ వాడకం

గతంలో హత్య జరిగితే ఘటనా స్థలానికి పోలీసు జాగిలాలను వెంట బెట్టుకుని వెళ్లేవాళ్లు. అవి ఎంత దూరం పరుగు పెడితే అంతదూరం వెళ్లడం, అక్కడ నుంచి అనుమానితులను పట్టుకుని వారిని రోజుల తరబడి కుళ్లబొడిచేవాళ్లు. అసలు నేరస్తుడో కాదో కానీ, అనుమానంతోనే పట్టుకుని చిత్రహింసలు పెట్టేవారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరువాత నేరస్తులను పట్టుకోవడం పోలీసులకు సులువైంది. చిన్న క్లూతో నేరస్తులను ఇట్టే పట్టేస్తున్నారు. ఊరూరా, వాడవాడలా సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయి. సీసీ ఫుటేజీలను తీసుకుని, అందులోని అనుమానితుల వివరాలు సేకరించడం, అలాగే సెల్‌ఫోన్ నెట్వర్క్ ట్రాకింగ్ ద్వారా నేరం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో సంచరించిన వ్యక్తుల ఫోన్ నంబర్లను గుర్తించడం, వేలి ముద్రల ఆధారంగా నేరస్తులు ఎవరో తెలుసుకోవడం... ఇలా అనేక టెక్నాలజీలు నేరపరిశోధనలో కీలకంగా మారాయి.

నాడు చేతిలో తుపాకులు.. నేడు ట్యాబ్‌లు

నక్సలైట్ల కాలంలో పోలీసులు తుపాకీ లేకుండా బయట తిరిగే పరిస్థితి ఉండేది కాదు. వాళ్ల సొంత వాహనాలకు కూడా నంబర్ ప్లేట్లు ఉండేవి కాదు. ఇప్పుడు పోలీసు వాహనాలు, సొంత వాహనాలకు సైతం పోలీస్ అని రాసుకుని దర్జాగా తిరుగగలుగుతున్నారు. తుపాకులు పోలీసు కార్యాలయాల్లో భద్రపరిచారు. ఏదైన పెద్ద ఘటన జరిగినపుడే బయటకు తీస్తున్నారు. ఇప్పుడు ఏ పోలీసు చేతిలో చూసినా ట్యాబ్‌లు కనిపిస్తున్నాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఉల్లంఘనదారులను ఆపి ట్యాబ్‌లో వారి వాహన నంబర్ నమోదు చేసి ఫైన్‌లు వేస్తున్నారు. ఫైన్లు పెండింగ్ ఉన్న వాహనాలను కూడా ట్యాబ్‌ల ద్వారా ట్రాఫిక్ పోలీస్ వెబ్‌సైట్లలో క్షణాల్లో చెక్ చేసి పట్టుకొంటున్నారు.



అప్పుడు చేతిరాత...ఇప్పుడు కంప్యూటర్

గతంలో కేసుల నమోదుకు సంబంధించి ఎఫ్ఐఆర్ రాయడం, అరెస్టు, రిమాండ్ డైరీ రాయడం ఆఖరుకు చార్జిషీట్ రాయడానికి గంటల కొద్దీ సమయం పట్టేది. ఏ పోలీసు స్టేషన్‌కు వెళ్లినా స్టేషనరీ సమస్య కనిపించేది. బాధితులు లేదా నిందితుల తరఫు వారికి చెప్పి స్టేషన్‌కు కావలసిన పేపర్ బండిల్స్, కార్బన్ పేపర్లు...ఇలా అన్ని తెప్పించుకునేవారు. తరువాతి కాలంలో ప్రభుత్వాలు పోలీసు స్టేషన్లకు నిర్వహణ ఖర్చులు ఇవ్వడం ద్వారా వసూళ్లకు కొంతమేర అడ్డుకట్ట పడింది. కంప్యూటర్లు రావడంతో ఈ విధానమంతా మారిపోయింది. ప్రతి విషయాన్ని కంప్యూటర్‌లో కంపోజ్ చేయడమే. కంపోజింగ్ తరువాత తప్పు ఒప్పులు చెక్ చేసి ప్రింట్స్ తీసి ఫైల్ తయారు చేయడమే తరువాయి.



కమాండ్ కంట్రోల్ రూంలు

జిల్లా కేంద్రాల్లోని పోలీసు కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలన్నింటికీ అనుసంధానం చేయడంతో కూర్చున్న చోటు నుంచే పర్యవేక్షించే వెసులుబాటు కలిగింది. రిజొల్యూషన్ ఎక్కువ ఉన్న కెమెరాలు బిగించడంతో ప్రతీది చూసుకునే అవకాశం ఏర్పడింది. వాహనదారులు గానీ, మరెవరైనా సరే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే జిల్లా పోలీసు కార్యాలయం నుంచే వారి ఫొటోలు తీసి జరిమానాలు విధిస్తున్నారు.



ఫ్రెండ్లీ పోలీసింగ్

అప్పట్లో పోలీసు అంటేనే ఒక రకమైన భయం. వాళ్ల దగ్గరకి వెళితే ఎలా ప్రవర్తిస్తారో తెలియదు. ఆపద వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా సరే వెళ్లడానికి జంకేవారు. తరువాతి కాలంలో పోలీసు మ్యాన్యువల్‌లో అనేక మార్పులు తీసుకొచ్చారు. ప్రభుత్వాలు మారినపుడల్లా కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం, అందులో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజలు కొంత ధైర్యంగా వెళ్లగలుగుతున్నారు. ఇప్పుడు కూడా అక్కడక్కడా కొన్ని ఇబ్బందులు ఉన్నా, చాలా వరకు మార్పయితే కనబడుతోంది. స్టేషన్‌లో రిసెప్షనిస్టుగా మహిళా కానిస్టేబుల్ ఉండడం, ఫిర్యాదు చేయటానికి వచ్చినవారిని కూర్చోబెట్టి వారి సమస్య ఏమిటో తెలుసుకుని అధికారిని కలిపించే ప్రయత్నం చేస్తున్నారు.



శ్రవణ్ ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడి పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయం




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నిందితుడు (ఏ–6) ఎ.శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. అక్టోబర్‌లో పాస్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అతని పాస్‌పోర్టును రద్దు చేసింది. శ్రవణ్ ఏ విమానాశ్రయంలో దిగినా హైదరాబాద్ పోలీసులకు సమాచారం వచ్చేలా చర్యలు చేపట్టారు. అలాగే ట్రయల్ కోర్టు కూడా ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో శ్రవణ్ కుమార్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై తొలుత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి విచారణ చేపట్టి గత నెల 28న తీర్పు రిజర్వు చేశారు. తీర్పు వెలువరించాల్సిన నేపథ్యంలో బెయిల్ పిటిషన్ల రోస్టర్ మారింది. దీంతో ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు.


ఈత చెట్టు మధ్యలో రావి చెట్టు, పక్కన తాటి చెట్టు

ఎంత పెద్ద ఈత చెట్టో..

మామూలుగా ఈత చెట్లు 30 ఫీట్ల ఎత్తు వరకు కనిపిస్తుంటాయి. కానీ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం గ్రామ శివారులోని గంగబండ ఈత వనంలో తాడిచెట్టును తలదన్నేలా పెరిగింది. ఇది వనంలో బాహుబలిలా కనిపిస్తుంటుంది. 70 నుంచి 80 అడుగుల ఎత్తు వరకు ఎదిగిన ఈత చెట్టును గీతకార్మికులు అపురూపంగా చూసుకుంటున్నారు. ఇదే ఈత చెట్టు కింద పూర్వకాలం నుంచి మైసమ్మ దేవతను పూజిస్తున్నారు. ఈ చెట్టుకు వందేళ్లకు పైగా వయసు ఉంటుందని గ్రామానికి చెందిన గీతకార్మికులు తెలిపారు. తాతల కాలంనాటి నుంచి ఉన్న ఈ ఈత చెట్టును కల్లు గీయకుండా దేవుడిలా ఉంచారు. -కురవి


పెద్ద ఈత చెట్టు

ఏడాది ఉత్సవాలపై శ్వేతపత్రం ప్రకటించాలి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన విజయోత్సవాల కోసం చేసిన వ్యయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేవలం ఆడంబరాలతో కాలం వెళ్లదీస్తోందని, అధికారిక వ్యవస్థలపై పట్టు కోల్పోయిందని విమర్శించారు. బుధవారం ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్‌తో కలిసి వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ విజయోత్సవాలు ముగిసిన తెల్లవారే తాండూరు గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 16 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలును విస్మరించి కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడంతో అన్నివర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొందని వెంకటేశ్వర్లు తెలిపారు.



కబడ్డీ.. కబడ్డీ..
ములుగు జిల్లా జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీఎం కప్ క్రీడలను బుధవారం మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలికలతో కలిసి కాసేపు కబడ్డీ ఆడారు. - ములుగు రూరల్



హైదరాబాద్‌లోని ఓ మాల్‌లో ఏర్పాటుచేసిన శాంతాక్లాజా బొమ్మ వద్ద చిన్నారుల సందడి


ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో వివిధ మొక్కలు, చెట్లతో ఇలా కుండీలు ఏర్పాటు చేశారు



ఇల వైకుంఠం శ్రీరంగం

శ్రీరంగనాథుని దేవాలయానికి సంబంధించి మరే దివ్యదేశానికి లేని ప్రత్యేకతలు కొన్ని ఉన్నాయి. ఈ దివ్యక్షేత్రం 156 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఇక్కడ ఉన్నన్ని ప్రాకారాలు, గోపురాలు, మండపాలు, సన్నిధానాలూ మరే దేవాలయంలోనూ లేవు. దేశంలోని అతి పెద్ద దేవాలయాలలో ఒకటిగా దీనిని పేర్కొనవచ్చు. శ్రీరంగనాథుని దేవాలయానికి సంబంధించిన చాలా విషయాలు 'పెరియ' అనే విశేషణంతో కూడుకుని ఉన్నాయి. 'పెరియ' అంటే పెద్ద అని అర్థం. ఉదాహరణకు ఈ దేవాలయాన్ని 'పెరియకోయిల్' అని, స్వామివారిని 'పెరియపిరాట్టి' అని, శ్రీరంగాన్ని 'పెరియ అరంగం' అని, దేవాలయంలో వాయించే మంగళ వాద్యాలను 'పెరియ మేళమ్' అని, స్వామివారికి నివేదించే వంటకాలను 'పెరియ అవసరం' అని, నివేదనకు తయారు చేసిన పిండి వంటలను 'పెరియ పణ్యారం' అనీ వ్యవహరిస్తారు. స్వామివారి వాహనమైన గరుత్మంతుని 'పెరియ తిరువడి' అని అంటారు. స్వామివారికి పిల్లనిచ్చిన విష్ణుచిత్తుల వారిని 'పెరియాళ్వారు' అన్న పేరుతో పిలుస్తున్నారు.

ఆళ్వార్లు కీర్తించిన నూట ఎనిమిది దివ్య దేశాలలో శ్రీరంగం ప్రధానమైనది. శ్రీరంగమే భూలోక వైకుంఠమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సర్వేశ్వరుడు స్వయంగా వ్యక్తమైన ఎనిమిది క్షేత్రాలలో ప్రధానమైనది శ్రీరంగం. వైష్ణవ పుణ్యక్షేత్రాలుగా వినుతికెక్కిన 'నాల్గు మండపాల'లో శ్రీరంగం ఒకటి.

ఉభయ కావేరుల మధ్య అమరిన సుందర ద్వీపం శ్రీరంగం. కావేరి, కొళ్లడం అనే రెండు నదులు శ్రీరంగానికి పూలదండలా ఇరువైపులా కొంతదూరం ప్రవహించి తిరిగి ఒకటిగా కలుస్తున్నాయి. తిరుచిరాపల్లికి ఎనిమిది కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ క్షేత్రానికి చేరుకోవడానికి రైలు, రోడ్డు సదుపాయాలున్నాయి.

శ్రీరంగనాథుని దేవాలయం చాలా ప్రాచీనమయింది. ఈనాడు మనం చూసే ఆలయానికి అంకురార్పణ 7వ శతాబ్దంలో జరిగింది. చోళ, పాండ్య, నాయక రాజులు దేవాలయానికి మరమ్మతులు, విస్తరణలు జరిపారు. పదమూడు అంతస్తులు గల ఈ రాజగోపురం 236 అడుగుల ఎత్తులో ఆసియాఖండంలోనే అత్యంత ఎత్తయిన గోపురంగా గుర్తించబడింది. ఈ నూతన రాజగోపురం ఆలయానికి దక్షిణ ద్వారంగా అమరి ఉంది.

ఈ ఆలయంలో ఉన్న పుష్కరిణులలో ప్రధానమైనది చంద్ర పుష్కరిణి. ఆలయ ప్రాకార ఆవరణలలో నున్న గోపురాలు జీవకళ ఉట్టిపడే శిల్పాలతో ఆలయానికి అలంకారాలై ఉన్నాయి. దేవాలయానికి ఉన్న సప్త ప్రాకారాలు సప్తలోకాలకు సంకేతాలుగా ఉన్నాయి.

ప్రణవాకార విమానం కింద ఉన్న గర్భాలయంలో శ్రీరంగనాథుడు ఐదు తలలతో పడగెత్తి ఉన్న ఆదిశేషుని పాన్పుపై శయనించి కుడి చేత్తో తన శిరస్సు చూపిస్తూ అన్ని లోకాలకూ తనే నాథుడునని చెప్తున్నట్టున్నారు. ఎడమ చేతితో పాదాలను చూపుతూ శరణన్న వారిని రక్షిస్తానని అభయమిస్తున్నారు. మూలమూర్తికి కొంచెం దిగువన ఉన్న ఒక పీఠంపై ఉత్సవమూర్తి చతుర్భుజుడై ఉన్నారు. వారిని 'నంబెరుమాళ్ళు' అని అంటారు.

ఉత్సవమూర్తి పై కుడి చేతితో ప్రయోగ చక్రాన్ని ధరించి ఉండగా కింది కుడిహస్తం అభయ ముద్రలో ఉంది. శంఖాన్ని పైఎడమ చేతిలోను, కింది చేతితో గదను ధరించి అందమైన చిరునవ్వు మోముతో శోభాయమానంగా దర్శనమిస్తున్నారు.

గర్భాలయానికున్న ప్రదక్షిణ మార్గాన్ని 'తిరువాణ్ణాళి' అని, దానికి ముందున్న మంటపాన్ని రంగ మంటపమనీ, గాయత్రీ మంటపమని వ్యవహరిస్తారు. ఈ మంటపంలోనున్న 24 బంగారు స్తంభాలూ, గాయత్రీ మంత్రంలో ఉన్న 24 అక్షరాలకు సంకేతాలని పెద్దలు చెప్తారు. వీటిని 'తిరుమణ్ణాత్తూణ్' అని అంటారు. స్వామివారు ప్రసాదాలు ఆరగించే మంటపానికి చందన మంటపమని పేరు. గర్భాలయానికి బయట ఉన్న ప్రాకారంలో ద్వారపాలకులు, యాగశాల, సేన మొదలియార్ల సన్నిధి, పగల్ పత్తు మంటపం, చిలుకల మంటపం, కణ్ణన్ సన్నిధి ఉన్నాయి.

మూడవ ప్రాకారంలో స్వర్ణమయంగా ఉన్న ధ్వజ స్తంభం, డోలోత్సవ మంటపం, వైకుంఠ ద్వారం చూడవచ్చును. నాల్గవ ప్రాకారంలో బ్రహ్మాండమైన గరుడ సన్నిధి ఉంది. 12 అడుగుల ఎత్తులో మూలస్థానానికి దూరంగా స్వామి వారి పిలుపు కోసం వేచి ఉన్నట్లు అయిదు అడుగుల ఎత్తయిన పీఠంపై గరుడాళ్వారు కూర్చుని ఉన్నారు. ఈ ప్రాకారంలో ఆళ్వార్ల సన్నిధానాలు చాలా ఉన్నాయి. ధన్వంతరికి ప్రత్యేక సన్నిధానం ఉండడం ఇక్కడ ఒక విశేషం. అయిదవ ప్రాకారంలో ఆండాళ్ళ సన్నిధి, శ్రీరంగనాచ్చియార్ల సన్నిధానం, దానికి ఎదురుగా కంబర్ మండపం, ఉన్నాయి. ఈ ప్రాకారంలో ముఖ్యమైన కట్టడం వేయికాళ్ళ మండపం.

ఈ ఆలయానికి సంబంధించిన మరో విశేషం, ఆలయ విమానగోడలపై చిత్రితమై ఉన్న విష్ణుపురాణం, 108 దివ్యదేశాలకు సంబంధించిన దృశ్యాల వివరణ తెలుగు లిపిలో ఉండడం గమనార్హం. ఉగాది మొదలయిన పండుగలను చాంద్రమానం ప్రకారంగా జరుపుకుంటున్నారు.

ఈ క్షేత్రంలో మరో ప్రత్యేకత స్వామి వారికి జరిగే సుప్రభాత సేవలో పాల్గొనేవారు తరతరాలుగా ఒకే కుటుంబానికి చెందిన వారై ఉండడం ఒక విశేషం. వీరిని 'శ్రీపాదం వోర్' అని అంటారు.

శ్రీరంగక్షేత్రంలో సంవత్సరంలో నాలుగు బ్రహ్మోత్సవాలు జరుపుతున్నారు. శ్రీరంగంలో నిత్యమూ ఉత్సవ సంరంభమే. ఉత్సవాల సమయంలో శ్రీరంగం అల వైకుంఠపురాన్ని తలపింపజేస్తుంది.

శ్రీరంగనాచ్చియార్లకు స్వామివారి ఉత్సవాలైన తర్వాత సంబరాలు జరుపుతారు. భక్తులు స్వామివారి ఉత్సవాల వైభవాన్ని తిలకించి శ్రీరంగేశ పాదార్చనతో పులకించిపోతారు. శ్రీరంగాన్ని ఒక్కసారి దర్శిస్తే 108 దివ్యక్షేత్రాలను దర్శించినంత పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం.

- స్వాతీ భాస్కర్

ఊదీ ఏం బోధిస్తోంది..?



బాబా తన దర్శనార్థం వచ్చే భక్తుల నుంచి దక్షిణ తీసుకుంటారనే విషయం అందరికీ తెలిసిందే. కొందరి దగ్గర అయితే అడిగి మరీ తీసుకునేవారు. అలా వసూలు చేసిన మొత్తాన్ని సర్వసంగ పరిత్యాగి అయిన సాయి ఏం చేసుకుంటారనే కదా అందరి సందేహం... సాయిబాబా తన భక్తుల నుంచి శ్రద్ధను, భక్తి విశ్వాసాలను దక్షిణగా కోరారు. ఎందుకంటే శ్రద్ధ, భక్తి విశ్వాసాలే ఏ పనిని చేయడానికైనా అత్యంత ఆవశ్యకాలు. అందుకే ఆయన భక్తుల నుంచి శ్రద్ధ, సబూరి రూపంలో దక్షిణను అడిగి మరీ తీసుకునేవారు.

వాటిని తనకిస్తే వారి జీవితాలను తీయబరుస్తానని చెబుతూ... ''శ్రద్ధ, సబూరి అనే రెండు కాసులను ఎవరు దక్షిణగా సమర్పిస్తారో వారిని పరిపూర్ణంగా అనుగ్రహిస్తాను. భక్తులలోని ఉన్నతమైన శ్రద్ధాభక్తులే వారిని ఆధ్యాత్మికంగా సౌశీల్యవంతులుగా తీర్చిదిద్దుతాయి. నా పలుకులను విశ్వసించే వారు ధన్యులు'' అని ఆయన పదే పదే బోధించేవారు. ఆయన బోధలను ఆచరించిన వారికి ఆయన అనుగ్రహంతో సకలైశ్వర్యాలు చేకూరతాయనటంలో సందేహం లేదు.

తన వద్ద పోగుపడిన ధనంలో ఎక్కువభాగం దానం చేసి, మిగతా దానితో వంట చెరుకును కొనేవారు. ఈ కట్టెలను బాబానే స్వయంగా ధునిలో వేసి మండించేవారు. మసీదులో బాబా నిత్యం ధునిని వెలిగిస్తూనే ఉండేవారు. అది ఇప్పటికీ అలా మండుతూనే ఉంది. అందులో నుంచి ఉద్భవించే బూడిదనే ఊదీ అంటారు. బాబా ఆ ఊదీనే తీసి భక్తులకు ఇళ్లకు తిరిగి వెళ్లేముందు ఆశీర్వదించి వారికి అందించేవారు. ఒక్కోసారి దానితోనే వైద్యం చేసేవారు. చిటికెడు ఊదీని బాబా తన భక్తుల నుదుటిపై పెట్టారంటే వారికి సర్వ రోగాలూ నయమయేవి.

ఊదీ ద్వారా భక్తులకు బాబా ఏం బోధించారంటే... ప్రపంచంలో కనిపించే వస్తువులన్నీ అశాశ్వతాలు. పంచభూతాలచే రూపొందిన మన శరీరాలన్నీ సౌఖ్యాలు అనుభవించిన తరువాత పతనమైపోయి శిథిలమై బూడిదవుతాయి. ఈ విషయాన్నే నిరంతరం గుర్తు చేసేందుకే బాబా భక్తులకు ఊదీ ప్రసాదాన్ని అందించేవారు. ఈ ఊదీ వల్లనే బ్రహ్మము నిత్యమని, ఈ జగత్తు అశాశ్వతమని, ప్రపంచంలో గల మన బంధువులు, కొడుకుగాని, తండ్రిగాని, తల్లిగాని, మనవారు కారని బాబా బోధించారు. మనం ఎందరితో ఎన్ని రకాలుగా ఎంతగా ఎన్ని బంధాలు, అనుబంధాలు పెనవేసుకున్నా, అవేవీ శాశ్వతం కావని, ఈ ప్రపంచంలోకి మనం ఒంటరిగానే వచ్చాము, తిరిగి ఒంటరిగానే వెళ్తామన్న సత్యాన్ని బోధించేవారు.

ఊదీకి ఆధ్యాత్మిక విశేషమే కాదు, భౌతిక ప్రాముఖ్యం కూడా ఉంది. ఊదీ అనేక విధాలుగా శారీరక మానసిక రోగాలకు ఔషధంగా పనిచేసేది. రోగులకు, బాధార్తులకు స్వస్థత కలిగించేది. తాము ధరించిన ఊదీ ద్వారా భక్తుల చెవిలో నిత్యానిత్యాలకు గల తారతమ్యం, అనిత్యమైన దానిపై అభిమాన రాహిత్యం గంట మోతవలె వినిపించి, చెడుపనులు, చెడు తలంపుల నుంచి దూరం చేస్తాయి. అలాగే ఊదీ ధరించిన వారికి ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే బాబా భక్తులు తప్పనిసరిగా నుదుట విభూది ధరిస్తారు.

● పరిహారం


మానసికంగా కుంగిపోతున్నారా?

అవరోధాలు, అపజయాలు, ఆశాభంగాలు, ఆర్థిక నష్టాలు, ఆరోగ్య సమస్యలు ఎలాంటి వారినైనా మానసికంగా కుంగదీస్తాయి. ఎలాంటి సమస్యలూ లేకుండా జీవితం సాఫీగా సాగిపోవాలనే ఎవరైనా కోరుకుంటారు. జాతకంలోని గ్రహాల బలాబలాల మేరకు కొన్ని కొన్ని దశలలో, కొన్ని కొన్ని గోచార పరిస్థితుల్లో సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. ఇలాంటి సమస్యలు బాధించకుండా ఉండాలంటే...

- ప్రతిరోజూ ఉదయాన్నే పక్షులకు తృణధాన్యాలను ఆహారంగా వేయండి. ఆర్థిక సమస్యలు శీఘ్రంగా తొలగిపోతాయి.



- రోజువారీ విధి నిర్వహణ కోసమే కావచ్చు లేదా ఏదైనా ప్రత్యేకమైన పని మీదనే కావచ్చు... ఇంటి నుంచి బయటకు వెళ్లినవారు ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఖాళీ చేతులతో రావద్దు. ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు పండ్లు లేదా పూలు లేదా మిఠాయిలు వంటివి తీసుకురావడం మంచిది.
- చిన్న రాగినాణేన్ని ఎర్రని వస్త్రంలో చుట్టి, దానిని వీధిగుమ్మం దగ్గర తోరణానికి వేలాడదీయండి. ప్రతికూల శక్తుల నుంచి రక్షణగా ఉంటుంది.
- గురువారం రోజున ఇష్టదైవానికి చెందిన గుడికి వెళ్లడం మాత్రమే కాదు, ఆ రోజున గురువులను, గురు సమానులను కలుసుకొని వారికి మీ శక్తి మేరకు దక్షిణ తాంబూలాదులను సమర్పించి, వారి ఆశీస్సులు తీసుకోండి.



- పూజ కోసం వినియోగించే అగరొత్తులు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలను శుక్రవారం లేదా ఆదివారం రోజుల్లో కొనుగోలు చేయండి.

- సాంఖ్యాయన



● సువార్త

విధేయతే క్రిస్మస్‌కు పునాది



ఏదైనా భవనాన్ని గానీ మందిరాన్ని గానీ నిర్మాణం చేసేముందు ఒక ప్రణాళిక (ప్లాన్) వుంటుంది. ఆ నిర్మాణానికి కొంతమంది వ్యక్తులు కావాలి. నిపుణత కలిగిన వ్యక్తులు, పనివారు కష్టపడటం వల్లనే నిర్మాణాలు జరుగుతాయి. అలాగే మానవజాతి రక్షణార్థం దేవుడికి ఒక ప్రణాళిక వుంది. ఆ ప్రణాళికను అమలు పరచటానికి కొందరు వ్యక్తుల అవసరం వుంటుంది, కావాలి. అట్టివారు అవమానాలను శ్రమను భరించే వారుగా విధేయత కలిగినవారై వుండాలి. ఆ ప్రణాళికలో కొంతమంది విధేయత కలిగిన వ్యక్తులను ఎన్నిక చేసుకున్నాడు దేవుడు. వారే ప్రభువైన యేసు తల్లియైన మరియ ఆమె భర్త అయిన యేసేపు, తూర్పు దేశపు జ్ఞానులు. వారు దేవుని మాటకు విధేయత చూపటమే 'క్రిస్మస్'. వారిని గూర్చి, వారి విధేయతను గూర్చి ఈ కింద తెలుసుకుందాం.

ప్రభువైన యేసు తల్లి గలిలయలోని నజరేతను ఊరికి చెందినవారు. మరియ కన్యకగా వున్నప్పుడు అదే ఊరికి చెందిన యోసేపను పురుషునితో ప్రదానం చేయబడింది. కానీ యూదు మత ఆచారం ప్రకారం ప్రదానమైన తర్వాత ఒక సంవత్సరం తర్వాత వివాహం జరుగుతుంది. ఇది కన్యత్వానికి పరీక్షాకాలం. ఆ సంవత్సర కాలంలో కన్యత్వంలో జరగరానిది జరిగింది. అంటే ఆ మధ్యకాలంలో ఆమె కన్యత్వం గర్భం ధరించింది. ఏలయనగా ఆమె ఇంటిలో వుండగా దేవదూత దేవునిచేత పంపబడి ఆమెను చూసి ''దయాప్రాప్తురాలా! నీకు శుభము. నీకు ప్రభువు తోడై వున్నాడు. దేవుని వలన కృప పొందావు. భయపడకుము. ఇదిగో నీవు గర్భం ధరించుదువు. ఒక కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు, ఆయన సర్వోన్నతుని కుమారుడు'' అని చెప్పాడు. అప్పుడామె ఆ మాటలకు భయపడి-నేను పురుషుని ఎరుగని దాననే, అదెలాగు జరుగునని దూతతో అనగా దూత 'పరిశుద్ధాత్మ నీ మీదకు వచ్చును, సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును' అనగా అందుకు మరియ 'ఇదిగో ప్రభువు దాసురాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక' అన్నది, ఆమె దేవుని మాటకు విధేయత చూపినది. అందుచేత క్రిస్మస్‌కు ప్రధానం విధేయత (లూకా 1: 26-38).

మరియ భర్త అయిన యేసేపు నీతిమంతుడైనందున ఆ విషయం బహిర్గతం చేయక రహస్యంగా ఆమెను అతడు విడనాడదలచాడు. కానీ ఆ విషయాన్ని గూర్చి అతడు ఆలోచిస్తుండగా మరలా ప్రభువు దూత కలలో అతనికి కూడా ప్రత్యక్షమై 'యేసేపూ! నీ భార్య అయిన మరియను చేర్చుకొనుటకు సందేహింపకుము, ఆమె గర్భం పరిశుద్ధాత్మ మహిమ వలన కలిగినది. ఆమె ఒక కుమారుని కనును. అతను తన ప్రజలను వారి పాపాలనుండి విమోచించును. ఆయనకు యేసు అను పేరు పెట్టుదురని దేవదూత చెప్పిన మాట ప్రకారం యేసేపు కూడా దేవుని మాటకు విధేయత చూపాడు. యేసేపుకు ఈ విషయంలో అనేకసార్లు దేవదూత ప్రత్యక్షపడ్డాడు. ఆ విధేయతే క్రిస్మస్కు కారణం. (మత్తయి 1:18-25).

తూర్పుదేశపు జ్ఞానులు యెరుషలేముకు వచ్చి వారు ఆ నక్షత్రం కాలం తెలుసుకుని, ఆ నక్షత్రం ఆ శిశువు ఉండే చోటికి వచ్చినప్పుడు ఆ శిశువుకు సాగిలపడి, పూజించి, పెట్టెలు విప్పి అందులోని బంగారాన్ని సాంబ్రాణిని, బోళమును కానుకలుగా సమర్పించి, దేవదూత ఆజ్ఞానుసారం హేరోదు రాజుకు ఈ విషయం తెలుపక వేరే మార్గమున వారు వారి దేశానికి వెళ్ళారు. ఆ విధంగా వారు కూడా దేవుని మాటకు విధేయత చూపారు. (లూకా 1:18,1-15).

- కోట బిపిన్ చంద్రపాల్

● ఇస్లాం వెలుగు

మారిన మనిషి



హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం గొప్ప దైవప్రవక్త. ఏక దైవారాధకుడు. దైవగృహ మైన కాబా నిర్మాణకర్త. ఆ మహనీయుడు ప్రతిరోజూ ఎవరో ఒక నిరుపేదకో, బాటసారికో భోజనం పెట్టకుండా తను తినేవారుకాదు. యథాప్రకారం ఒకరోజు భోజన సమయానికి ఒక నిరుపేదను వెదికి తీసుకువచ్చారు. అతణ్ణి తనతో పాటు భోజనానికి కూర్చోబెట్టుకున్నారు. దస్తర్ ఖాన్ పై భోజన పదార్థాలు సిద్ధం అయ్యాయి. హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం రెండు పళ్ళాల్లోకీ అన్నం, ఇతర పదార్థాలూ వడ్డించారు. 'మిత్రమా ... దేవుని శుభనామంతో ప్రారంభించు' అన్నారు. వెంటనే అతిథి 'నేనలా చేయను. ఎందుకంటే నేను మీ దైవాన్ని నమ్మను.' అన్నాడు. 'అదేమిటీ.. నీదైవం నా దైవం అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. మనందరి దైవం ఒక్కడే.. మనల్నిద్దరినీ, మిగతా అందరినీ పుట్టించిన దైవం ఒక్కడే. అదేకదా మనమధ్య సంబంధానికి పునాది. నువ్వు ఆదైవాన్నే నిరాకరిస్తే మనిద్దరి మధ్య ఇంకేం మిగిలింది.? అల్లా పేరుతో తినడమే మనం ఆయనకు చెల్లించే కృతజ్ఞత' అన్నారు ఇబ్రాహీం.

'లేదు లేదు.. నాదైవం వేరు... నీ దైవం వేరు. రెండు ముద్దలు కడుపు నింపుకోవడం కోసం నేను నా ఇష్టదైవాలకు ద్రోహం చెయ్యలేను.' అన్నాడు అతిథి ఖరాఖండిగా... ఇబ్రాహీం అలైహిస్సలాం ఆశ్చర్యపోయారు. 'సరే అయితే, దైవం పేరుతో తప్ప, మిథ్యా దైవాలపై ఇంతటి అచంచల విశ్వాసం ప్రకటిస్తూ, అసలు దైవానికి ద్రోహం తలపెట్టేవాణ్ణి నేను కూడా అతిథిగా అంగీకరించలేను'. అన్నారు కాస్తంత బాధగా...

వెంటనే అతిథి 'మరేం పరవాలేదు సెలవు..' అంటూ ఆత్మాభిమానంతో లేచి వెళ్ళిపోయాడు.

అతిథి అలా వెళ్ళాడో లేదో దైవాజ్ఞతో వెంటనే అక్కడ హజ్రత్ జిబ్రీల్ అలైహిస్సలాం ప్రత్యక్షమయ్యారు. వేళకాని వేళ అకస్మాత్తుగా జిబ్రీల్ దూత రావడం చూసి ఇబ్రాహీం అలైహిస్సలాం ఆశ్చర్య చకితులయ్యారు. దూత వచ్చీరాగానే దైవ సందేశాన్ని వినిపించాడు.

'ఇబ్రాహీం.. ఈరోజు నువ్వు నా దాసుణ్ణి బాధ పెట్టావు.' అన్నాడు దైవం.

'దేవా.. అతను నీ దాసుడా..! కానే కాదు.. నీ తిరస్కారి. కనీసం నీ పేరు ఉచ్చరించడానికి కూడా అతను ఇష్టపడలేదు. అలాంటి వాడు నీదాసుడెలా అవుతాడు?' అన్నారు ఇబ్రాహీం.

'ఇబ్రాహీం, అతడి వయసు ఎంత ఉంటుంది.?' అన్నాడు దైవం.

'ప్రభూ..! బహుశా డెబ్బయ్, ఎనభై సంవత్సరాలు ఉండచ్చు' అన్నారు ఇబ్రాహీం.'

మరి ఇంతకాలం నుండి, ఇన్ని సంవత్సరాలనుండి నేను అతనికి తినిపిస్తున్నాను.. తాగిస్తున్నాను.. అతడి సమస్త అవసరాలూ తీరుస్తున్నాను. నువ్వు ఒక్క పూట పెట్టలేకపొయ్యావు.' అన్నాడు దైవం. వెంటనే ఇబ్రాహీం అలైహిస్సలాం అతిథిని వెతకడానికి బయలు దేరారు. కొద్దిసేపటి తరువాత ఎక్కడో ఊరి బయట అతను కనిపించాడు. 'రా మిత్రమా భోజనం చేద్దాం..' అని ఆప్యాయంగా పిలిచారు. దానికి అతను, 'భోజనానికైతే వస్తాను కాని, అల్లాహ్ పేరుతో.. అని పలకమని చెప్పకూడదు. అలా అయితేనే వస్తా' అని షరతు పెట్టాడు.

ఇబ్రాహీం అలైహిస్సలాం ఆ షరతుకు అంగీకరించి అతణ్ణి వెంట తీసుకొని వచ్చి, అతడికి కడుపునిండా భోజనం పెట్టి పంపించాడు.

- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● మంచిమాటలు

- ప్రజలందరూ ఇష్టపడే చక్కని శీలం కలవారికి నిప్పు నీరులాగా, సముద్రం పిల్లకాలువలాగా, మేరు పర్వతం చిన్న గులకరాయిలాగా, సింహం జింకపిల్లలాగా, విషసర్పం పూలమాల మాదిరిగా, విషం అమృతం లాగా అవుతాయి.
- ఐశ్వర్యానికి సౌజన్యమే అలంకారం. శౌర్యానికి మితభాషిత్వమూ, జ్ఞానానికి శాంతి, శాస్త్రజ్ఞతకు వినయమూ, ధనానికి పాత్రదానమూ, తపస్సుకు శాంతం, ప్రభువుకు సహనం, ధర్మానికి అపకీర్తి, ఆశ్రిత పక్షపాతం లేకుండటం అలంకారాలు.

● విషయం

ఋషి, ముని, యోగి.. వీరికి తేడా ఏమిటి?

ముని: మౌనంగా ఉంటూ ఆత్మ జ్ఞానాన్ని సాధించేవారు.

ఋషి: వేదాలను గ్రహించి, అనుభవజ్ఞానం కలిగి ఉన్నవారు; వేద జ్ఞానాన్ని ప్రపంచానికి అందించే పూర్వగాములు.

యోగి: యోగ సాధన ద్వారా శరీరం, మనస్సు, ఆత్మను పరమాత్మతో ఏకత్వం సాధించడమే లక్ష్యంగా పెట్టుకునే సాధకులు. మొత్తంగా వీరు ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారు అయినప్పటికీ, సాధనా పద్ధతులు, లక్ష్యాలు భిన్నంగా ఉంటాయి.

● మీకు తెలుసా?



- పరుగెత్తే వారికి, ఆవులించేవారికి, తలస్నానం చేస్తున్న వారికి, భగవంతుని సన్నిధిలో ఉన్న వారికి నమస్కరించకూడదు.
- ఉదయించే, అస్తమించే సూర్యుడిని నీళ్లలోనూ, అద్దంలోనూ చూడరాదు.

సాక్షి ప్లస్
గురువారం । 12-12-2024

బిజినెస్ రీల్

భారత్ ఫోర్జ్ నిధుల సమీకరణ

క్విప్ ద్వారా రూ. 1,650 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దిగ్గజం భారత్ ఫోర్జ్ అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 1,650 కోట్లు సమీకరించింది. నిబంధనల ప్రకారం ఇష్యూకి ఫ్లోర్ ధర రూ. 1,323.54కాగా.. షేరుకి రూ. 1,320 ధరలో క్విప్ పూర్తి చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఇష్యూకి దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించినట్లు పేర్కొంది. వెరసి ఇష్యూ పరిమాణంకంటే పదిరెట్లు అధికంగా డిమాండ్ నమోదైనట్లు తెలియజేసింది. క్విప్ నిధులను రుణ చెల్లింపులు, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వినియోగించనున్నట్లు వివరించింది.

క్విప్ నేపథ్యంలో భారత్ ఫోర్జ్ షేరు బీఎస్ఈలో 1.5% పెరిగి రూ. 1,379 వద్ద ముగిసింది.

పునరుత్పాదక విద్యుత్ కోసం రిలయన్స్ న్యూ ఎనర్జీస్ ఏర్పాటు

న్యూఢిల్లీ: పునరుత్పాదక విద్యుత్‌కు సంబంధించి అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ కొత్తగా రిలయన్స్ న్యూ ఎనర్జీస్ పేరుతో అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. మయాంక్ బన్సల్‌ను సీఈవోగా, రాకేశ్ స్వరూప్‌ను చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా నియమించింది. ఈ సంస్థ ప్రధానంగా సౌర, పవన విద్యుదుత్పత్తి.. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం మొదలైన సొల్యూషన్స్‌పై దృష్టి పెడుతుంది. పునరుత్పాదక విద్యుత్ విభాగంలో బన్సల్‌కి 25 ఏళ్ల అనుభవం ఉంది. గతంలో ఆయన రెన్యూ పవర్‌కి చెందిన ఇండియా ఆర్‌ఈ బిజినెస్‌కి గ్రూప్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ఇంధన రంగం, స్టార్టప్‌ల విభాగంలో స్వరూప్‌నకు 17 ఏళ్ల పైగా అనుభవం ఉంది. ఆయన గతంలో రెన్యూ పవర్, పీఆర్ క్లీన్ ఎనర్జీ మొదలైన సంస్థల్లో కీలక హోదాల్లో పని చేశారు.

స్టీల్ పరిశ్రమకు ప్రత్యేక విధానం

న్యూఢిల్లీ: స్టెయిన్‌లెస్ స్టీల్ పరిశ్రమ కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని ఇండియన్ స్టెయిన్‌లెస్ స్టీల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (ఐఎస్ఎస్‌డీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ప్రత్యేక పాలసీ ప్రతిపాదనపై ఉక్కు మంత్రిత్వ శాఖతో చర్చలు జరుపుతున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రాజమణి కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించామని, మంత్రిత్వ శాఖ దీనికి సానుకూలంగా మొగ్గు చూపిందని అన్నారు. భారత్‌లో స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగం 2022–23లో 4.02 మిలియన్ టన్నుల నుండి 2023–24లో 4.46 మిలియన్ టన్నులకు పెరిగిందని ఐఎస్ఎస్‌డీఏ వెల్లడించింది. ఏడాదిలో వినియోగంలో 11 శాతం వృద్ధి నమోదైందని వివరించింది. దేశంలో తలసరి స్టెయిన్‌లెస్ స్టీల్ వినియోగం 2018–19లో 2.25 కిలోలు కాగా, 2023–24లో ఇది 3.1 కిలోలకు పెరిగిందని తెలిపింది. ప్రస్తుతం దేశీయ ఉక్కు పరిశ్రమలో స్టెయిన్‌లెస్ స్టీల్ రంగం ఒక భాగంగా పరిగణిస్తున్నారు. 1989లో ప్రారంభమైన ఐఎస్ఎస్‌డీఏలో 150కిపైగా కంపెనీలు సభ్యులుగా ఉన్నాయి.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	7,050.00	2.5
BAJFINANCE	7,099.00	2.35
BRITANNIA	4,888.00	2.1
SHRIRAMFIN	3,247.00	1.9
HEROMOTOCO	4,652.00	1.39

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	998	-1.48
ADANIPORTS	1,231.95	-1.35
NTPC	365.9	-0.88
SBIN	861.8	-0.66
AXISBANK	1,147.00	-0.58

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,576
ఎన్ఎస్ఈ	9,7,653
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,31,618
ఎఫ్ఐఐ	- 1,012
డీఐఐ	+ 2008

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.92	$ 68.59
బ్రెంట్	72.53	$ 72.19

ఆరోగ్య రంగంలో అధిక నియామకాలు

- 47 శాతం సంస్థల సానుకూలత
- పరిశోధన, టెస్టింగ్ నిపుణులకు డిమాండ్
- టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక వెల్లడి



ముంబై: దేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో నియామకాలు పెరగనున్నాయని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ తెలిపింది. ఈ రంగంలో 47 శాతం సంస్థలు నియామకాల పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలిపింది. అత్యాధునిక టెలీహెల్త్ సేవల విస్తరణ, ముందస్తు వ్యాధి నివారణ సేవలకు పెరుగుతున్న ఆదరణతో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు విస్తరించనున్నట్లు పేర్కొంది. ఈ రంగంలోని కీలక పోస్టులకు ఢిల్లీ, చెన్నై నగరాల్లో ఎక్కువ డిమాండ్ ఉన్నట్లు తెలిపింది. రీసెర్చ్ అసోసియేట్ ఉద్యోగాలకు ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్ కేంద్రాలుగా అవతరించాయని, వైద్య పరిశోధన, అనుబంధ క్లినికల్ పరీక్షలు, డేటా నిర్వహణ విధులు ఇందులో కీలకమని పేర్కొంది. "వ్యాధులు వచ్చిన తర్వాత వాటికి చికిత్సలు తీసుకోవడం కంటే, అవి రాక ముందే రక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రాధాన్యం పెరిగింది. ఎన్నో అంశాల కారణంగా ఈ రంగంలో నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది" అని టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ వ్యవస్థాపకుడు, సీఈవో శంతను రూజ్ అన్నారు.

ఆన్‌లైన్ వైద్య సేవలకు డిమాండ్

"వృద్ధ జనాభా పెరుగుదల, దీర్ఘకాలిక అనారోగ్యాలు నిరంతరం వైద్య సహకారం, వినూత్నమైన చికిత్సల అవసరాన్ని తెలియజేస్తున్నాయి. అత్యాధునిక టెక్నాలజీతో దాదాపు అన్ని రంగాల్లోనూ పెద్ద ఎత్తున మార్పులు కనిపిస్తున్నాయి. కానీ, ఆరోగ్య సంరక్షణ రంగం వినూత్నంగా నిలుస్తోంది. కరోనా తర్వాత నుంచి వర్చువల్ కన్సల్టేషన్ (ఆన్‌లైన్‌లో వైద్య సలహా), రిమోట్ హెల్త్‌కేర్ సేవలు సాధారణంగా మారిపోయాయి" అని శంతను రూజ్ తెలిపారు. నర్సింగ్ అసిస్టెంట్‌లకు హైదరాబాద్, చండీగఢ్, గురుగ్రామ్‌లో ఎక్కువ డిమాండ్ నెలకొన్నట్టు టీమ్‌లీజ్ ఎడ్‌టెక్ నివేదిక తెలిపింది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించే మెడికల్ ల్యాబరేటరీ టెక్నీషియన్లకు ముంబై, హైదరాబాద్, ఇండోర్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. డయాగ్నోస్టిక్స్ సేవల విస్తరణ, ఇంటర్నెట్ సాయంతో మారుమూల ప్రాంతాల నుంచే వైద్య సహకారం పొందడం వంటివి ఈ రంగంలో ఉపాధి అవకాశాలను పెంచుతున్నట్టు రూజ్ తెలిపారు. ల్యాబ్ టెక్నిక్, డయాగ్నోస్టిక్స్ టెస్టింగ్, క్లినికల్ ట్రయల్స్, రోగుల సంరక్షణ, డేటా అనలైసిస్‌లో నైపుణ్యాలున్న వారిని నియమించుకునేందుకు కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నట్టు చెప్పారు.

500 షేర్లకు టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్

అనుమతించిన సెబీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్‌ను మరింత విస్తరించింది. లావాదేవీ చేపట్టిన రోజే సెటిల్‌మెంట్‌కు వీలు కల్పించే విధానంలోకి 500 కంపెనీల షేర్లను చేర్చింది. దీంతో మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రీత్యా 500 కంపెనీల స్టాక్స్‌కు ఆప్షనల్‌గా టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్‌ను వర్తింపచేయనుంది. నిబంధనలకు లోబడి టీప్లస్‌జీరో, టీప్లస్‌వన్ సెటిల్‌మెంట్ సైకిళ్లకు విభిన్న బ్రోకరేజీ చార్జీలకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సెబీ తొలుత 2024 మార్చిలో 25 కంపెనీల స్టాక్స్ ద్వారా టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్‌కు తెరతీసింది. నాన్‌కస్టోడియన్ క్లయింట్లకు మాత్రమే ఇది వర్తింపచేసింది. తదుపరి అభిప్రాయ సేకరణ చేపట్టి సెటిల్‌మెంట్‌ను విస్తరించింది. 2024 డిసెంబర్31కల్లా టాప్–500 కంపెనీల షేర్లు టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్ పరిధిలోకి చేర్చుతూ సర్క్యులర్‌ను జారీ చేసింది. 2025 జనవరి నుంచి అట్టడుగున ఉన్న 100 కంపెనీలు సెటిల్‌మెంట్‌లోకి రానున్నాయి. ఆపై ప్రతీ నెలా ఇదే రీతిలో 100 కంపెనీలు చొప్పున జత కానున్నాయి. వెరసి ప్రస్తుత 25 కంపెనీలతో కలిపి 525 షేర్లు టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్ పరిధిలోకి చేరనున్నాయి. వీటికి ఉదయం 8.45–9 సమయంలో ప్రత్యేక బ్లాక్ డీల్ విండోను ఏర్పాటు చేయనుంది.

ఐసీఈఎక్స్‌కు చెల్లు

సెబీ తాజాగా ఇండియన్ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఐసీఈఎక్స్) మూసివేతకు అనుమతించింది. రెండేళ్ల క్రితమే స్టాక్ ఎక్స్ఛేంజీ గుర్తింపును రద్దు చేయగా.. ప్రస్తుతం నిబంధనలకు అనుగుణంగా ఐసీఈఎక్స్ కార్యకలాపాల నిలిపివేతకు ఓకే చెప్పింది. వెరసి ఎక్స్ఛేంజీ విభాగం నుంచి ఐసీఈఎక్స్ వైదొలగనుంది. అయితే ఆదాయపన్ను నిబంధనలను అమలు చేయవలసి ఉంటుందని సెబీ స్పష్టం చేసింది. పేరు మార్పుసహా గతకాలపు లావాదేవీలను డేటాబేస్ నుంచి తొలగించవలసిందిగా ఐసీఈఎక్స్‌ను సెబీ ఆదేశించింది.

ప్రత్యేక యాప్‌గా జెప్టో కేఫ్



న్యూఢిల్లీ: జెప్టో కేఫ్‌ను ప్రత్యేక యాప్‌గా అందుబాటులోకి తీసుకు రానున్నట్టు క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో సహ వ్యవస్థాపకుడు ఆదిత్ పాలిచా బుధవారం తెలిపారు. కేఫ్ సేవలకు ఆదరణ పెరుగుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. నెలకు 100కుపైగా కేఫ్‌లను ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే రోజుకు 30,000 పైచిలుకు ఆర్డర్లను అందుకుంటున్నామని వివరించారు. జెప్టో వేదికగా 2022 ఏప్రిల్‌లో జెప్టో కేఫ్ ప్రారంభం అయింది. ముంబై, ఢిల్లీ, బెంగళూరులో ఉన్న స్టోర్లలో 120 కంటే ఎక్కువ కేఫ్‌ల ద్వారా ప్రధాన నగరాలకు తన కేఫ్ సేవను విస్తరించనున్నట్లు గత నెలలో కంపెనీ ప్రకటించింది. హైదరాబాద్, చెన్నై, పుణే సైతం విస్తరణ జాబితాలో ఉన్నాయని వివరించింది. వార్షిక ప్రాతిపదికన జెప్టో కేఫ్ వ్యాపారం ప్రస్తుతం రూ.160 కోట్ల స్థాయిలో నమోదవుతోందని వెల్లడించింది. కొత్త నగరాల్లో విస్తరణ కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల వార్షిక సగటు రేటు సాధిస్తామని కంపెనీ ధీమా వ్యక్తం చేసింది.



ఐజీఎల్ 1:1 బోనస్

- తొలి బోనస్‌కు బోర్డు గ్రీన్‌సిగ్నల్
- ప్రతీ షేరుకీ మరో షేరు ఉచితం

న్యూఢిల్లీ: సిటీ గ్యాస్ రిటైల్ పీఎస్‌యూ.. ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్(ఐజీఎల్) తొలిసారి వాటాదారులకు బోనస్ షేర్లను ప్రకటించింది. 1:1 నిష్పత్తిలో షేర్లను జారీ చేయనుంది. ఇందుకు కంపెనీ నిర్వహించిన తాజా సమావేశంలో బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వెరసి వాటాదారుల వద్దగల ప్రతీ షేరుకీ మరో షేరుని ఉచితంగా కేటాయించనుంది.

తద్వారా వాటాదారులకు రివార్డుతోపాటు.. రిటైల్ ఇన్వెస్టర్లను ఆకట్టుకోనుంది. బోనస్ షేర్ల జారీతో కంపెనీ వాటా మూలధనం రెట్టింపు కానుంది. రూ. 140 కోట్ల నుంచి రూ. 280 కోట్లకు పెరగనుంది. కంపెనీ వద్దగల రూ. 8,412 కోట్ల రిజర్వు నిధుల నుంచి బోనస్ ఈక్విటీ(రూ. 140 కోట్లు) నిధులను సమకూర్చుకోనుంది.

తదుపరి దశలో ప్రకటించనున్న రికార్డ్ డేట్ ప్రకారం రెండు నెలల్లోగా బోనస్ షేర్లను కేటాయించే వీలున్నట్లు ఐజీఎల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది.

గ్యాస్ పంపిణీ ఇలా

దేశీయంగా సిటీ గ్యాస్ పంపిణీలో అతిపెద్ద రిటైలర్‌గా నిలుస్తున్న ఐజీఎల్ ఆటోమొబైల్స్‌కు సీఎన్‌జీ, పరిశ్రమలు, గృహాలకు పైప్‌డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ)ను సరఫరా చేస్తోంది. ఢిల్లీసహా సమీప ప్రాంతాలైన నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్‌లో సిటీ గ్యాస్ పంపిణీ బిజినెస్‌ను నిర్వహిస్తోంది. వీటితోపాటు హర్యానా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలోనూ రిటైల్ గ్యాస్ సర్వీసులు అందిస్తోంది. సుమారు 882 స్టేషన్ల ద్వారా 1.7 మిలియన్ వాహనాలకు సీఎన్‌జీ సరఫరా చేస్తోంది. 2.5 మిలియన్ గృహాలకు పీఎన్‌జీ అందిస్తోంది. పీఎస్‌యూ దిగ్గజాలు గెయిల్(ఇండియా), బీపీసీఎల్‌తోపాటు ఢిల్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన భాగస్వామ్య కంపెనీ ఇది!

బోనస్ వార్తల నేపథ్యంలో ఐజీఎల్ షేరు 1.6 శాతం లాభంతో రూ. 392 వద్ద ముగిసింది.

2025లోనూ భారత్ పురోగమనం

ఎస్అండ్‌పీ అవుట్‌లుక్



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ 2025లోనూ సవాళ్లు తట్టుకుని "స్థిరమైన వృద్ధి" బాటన పయనిస్తుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అవుట్‌లుక్ పేర్కొంది. వచ్చే ఏడాది ద్రవ్యోల్బణం ఒత్తిడి తగ్గుతుందని, ఇది ఆర్‌బీఐ ద్రవ్య విధాన సడలింపునకు దారితీస్తుందని కూడా విశ్లేషించింది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి 6.8 శాతంగా నమోదవుతుందని, 2025–26లో ఈ రేటు 6.9 శాతంగా ఉంటుందని అంచనావేసింది. పటిష్ట పట్టణ వినియోగం, వేగవంతమైన సేవల రంగం వృద్ధి, మౌలిక రంగంపై ప్రస్తుతం జరుగుతున్న పెట్టుబడులు 2026లో వృద్ధికి దారితీసే అంశాలని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ఎకనమిస్ట్ విశ్రుత్ రాణా పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల పురోగతి, సాంకేతికత మెరుగుదల, గృహాల పొదుపు రేట్లలో వృద్ధి దేశంలో తగిన ఉపాధి కల్పనకు దారితీస్తాయని వివరించారు. భారత్ 2023–24లో 8.2 శాతం వృద్ధి సాధించింది.

2025లో ఏవియేషన్‌కు భారీ లాభాలు!

రూ.3.07 లక్షల కోట్లు

- ప్రయాణికుల్లో 6.7 శాతం వృద్ధి
- 520 కోట్లుగా ఉండొచ్చు
- ఐఏటీఏ అంచనాలు



జెనీవా: విమానయాన పరిశ్రమ (ఎయిర్‌లైన్స్)కు 2025 లాభాలు కురిపించనుంది. 36.6 బిలియన్ డాలర్లు (రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు రావొచ్చని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) అంచనా వేసింది. ప్రయాణికుల సంఖ్య 6.7 శాతం పెరిగి 5.2 బిలియన్లకు (520 కోట్లు) చేరుకోవచ్చని తెలిపింది. పరిశ్రమ ఆదాయం మొదటి సారి ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను (రూ.84 లక్షల కోట్లు) దాటి 1.007 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొంది. 2024తో పోల్చితే ఇది 4.4 శాతం అధికమని తెలిపింది. నిర్వహణ లాభం 67.5 బిలియన్ డాలర్లు, వ్యయాలు 940 బిలియన్ డాలర్లుగా ఉంటాయని పేర్కొంది. భారత ఎయిర్‌లైన్స్ మార్కెట్ గణనీయమైన వృద్ధిని చూస్తుందని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ఎయిర్‌లైన్స్ అనుసంధానతపైనే వృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. చైనా, భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశీ మార్కెట్లుగా పేర్కొన్నారు. "ప్రతి ప్రయాణికుడి నుంచి సగటు లాభం 7 డాలర్లుగా ఉంటుంది. 2023లో ఉన్న 7.9 డాలర్ల కంటే ఇది తక్కువ. 2024లో ఉన్న 6.4 డాలర్ల కంటే మెరుగు" అని ఐఏటీఏ 2025 అవుట్‌లుక్ రిపోర్ట్ తెలిపింది.

సానుకూలతల ప్రభావం..

అంతర్జాతీయంగా అనుబంధ విభాగాలతో కలిపి చూస్తే సగటు ఎయిర్‌ఫేర్ (చార్జీ) 2025లో 380 డాలర్లుగా ఉంటుంది. 2024 కంటే 1.8 శాతం అధికం. చమురు ధరలు కనిష్ట స్థాయిలో ఉండడం, 83 శాతం పైన లోడ్ ఫ్యాక్టర్, వ్యయాల కఠిన నియంత్రణలు ఇవన్నీ అనుకూలించే అంశాలుగా ఐఏటీఏ వివరించింది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) సగటున బ్యారెల్‌కు 87 డాలర్లుగా ఉండొచ్చని, 2024లో ఇది 99 డాలర్లుగా ఉన్న విషయాన్ని ప్రస్తావించింది. సరఫరా పరమైన సవాళ్లు, మౌలిక వసతుల కొరత, కఠిన నియంత్రణలు, పెరుగుతున్న పన్నుల భారాన్ని పరిశ్రమ ఎదుర్కొంటున్నట్టు ఈ నివేదిక తెలిపింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో బలమైన డిమాండ్ మద్దతుతో ఎయిర్‌లైన్స్ లాభాల్లో కాస్త మెరుగుదల ఉంటుందని వెల్లడించింది.

కార్పొరేట్ బాండ్ మార్కెట్ విస్తరించాలి

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి



న్యూఢిల్లీ: కార్పొరేట్ బాండ్ మార్కెట్లో మ్యూచువల్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్ చురుగ్గా పాల్గొనాలని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అన్నారు. "చాలా కార్పొరేట్ సంస్థలు బాండ్ల జారీకి సుముఖంగా ఉన్నాయి. గృహాలు, కార్పొరేట్ సంస్థల పొదుపు నిధులు ఈ విభాగంలోకి రావాలంటే, ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్‌లు సైతం కార్పొరేట్ బాండ్ మార్కెట్లో చురుగ్గా పాల్గొనాల్సిన అవసరం ఉంది" అని శెట్టి పేర్కొన్నారు. పెన్షన్/మ్యూచువల్ ఫండ్స్ ఏఏఏ మైనస్ రేటెడ్ బాండ్లలో పెట్టుబడులు పెడుతున్నాయని, కార్పొరేట్ బాండ్ మార్కెట్ మరింత విస్తరణకు ఇదేమీ దోహదపడకపోవచ్చన్నారు. మౌలిక వసతులు, కార్పొరేట్‌ల బ్యాలన్స్ షీట్ ఫండింగ్ అవసరాలను తీర్చేందుకు కార్పొరేట్ బాండ్ మార్కెట్ ముందుకు రావాలన్నారు. "కార్పొరేట్ బాండ్ మరింత విస్తరించడంపై చాలా సంవత్సరాలుగా చర్చిస్తున్నాం. కానీ, ఇప్పటికీ అనుకున్నంత పురోగతి సాధించలేదు" అని శెట్టి వ్యాఖ్యానించారు. కార్పొరేట్ బాండ్ల జారీలో ఎస్‌బీఐ పెద్ద పాత్ర పోషిస్తోందంటూ.. ఈ ఏడాది ఇప్పటికే రూ.50,000 కోట్ల విలువ చేసే బాండ్లను జారీ చేసినట్టు తెలిపారు.

శ్రీరామ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ భారీ కొనుగోలు

రూ.220 కోట్లతో టీజీపీఈఎల్ సొంతం



ముంబై: ఆటో విడిభాగాల తయారీ సంస్థ శ్రీరామ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ భారీ కొనుగోలుకు తెరతీసింది. రూ.220 కోట్లతో టీజీపీఈఎల్‌లో 100 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. నియంత్రణ సంస్థల అనుమతుల మేరకు ఈ కొనుగోలు లావాదేవీ ఈ నెలలోనే ముగుస్తుందని తెలిపింది. హై ప్రెసిషన్ ఇంజెక్షన్ మౌల్డెడ్ విడిభాగాల తయారీలో తమ స్థానాన్ని మరింత బలోపేతం, స్థిరీకరణ చేసుకునేందుకు ఈ కొనుగోలు సాయపడుతుందని పేర్కొంది. ఉత్పత్తులను వైవిధ్యం చేసుకుంటూ మరింత వృద్ధి చెందాలన్న కంపెనీ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగమని తెలిపింది. టైమెక్స్ గ్రూప్ ప్రెసిషన్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (టీజీపీఈఎల్) ఇంజెక్షన్ మౌల్డెడ్ విడిభాగాల తయారీలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

7 శాతం కాదు.. 6.5 శాతమే..!

వృద్ధి అంచనాలకు ఏడీబీ కోత



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ వృద్ధి అంచనాలకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) అర శాతం కోత పెట్టింది. ఆర్థిక వ్యవస్థ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25) 7 శాతం వృద్ధి ఉంటుందని తొలుత అంచనావేసిన ఏడీబీ, తాజాగా ఈ రేటును 6.5 శాతానికి తగ్గించింది. ప్రైవేట్ పెట్టుబడులు, గృహ డిమాండ్‌లో ఊహించిన దానికంటే తక్కువ వృద్ధి తమ తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26) వృద్ధి అంచనాలను సైతం 7.2 శాతం నుంచి 7 శాతానికి ఏడీబీ ఆసియన్ డెవలప్‌మెంట్ అవుట్‌లుక్ తగ్గించింది. అమెరికా వాణిజ్యం, ఆర్థిక, ఇమిగ్రేషన్ విధానాలలో మార్పులు ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో వృద్ధి స్పీడ్‌పై ప్రతికూల ప్రభావం చూపుతాయని, ద్రవ్యోల్బణం సమస్యలను సృష్టిస్తాయని అవుట్‌లుక్ అంచనావేసింది. ఆర్‌బీఐ గత వారం ద్రవ్య పాలసీ సమీక్షలో 2024–25లో భారత్ వృద్ధి అంచనాలను 7.2 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే.

డాబర్ ప్రమోటర్లకు గ్రీన్‌సిగ్నల్

రెలిగేర్ ఓపెన్ ఆఫర్‌కు ఆర్‌బీఐ ఓకే



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా ప్రమోటర్లు బర్మన్ కుటుంబానికి ఆర్‌బీఐ తాజాగా మద్దతిచ్చింది. దీంతో రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్(ఆర్ఈఎల్) వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించేందుకు వీలు చిక్కింది. తద్వారా 26 శాతం అదనపు వాటాను సొంతం చేసుకునే అవకాశముంది. ఆర్ఈఎల్ ప్రస్తుత బోర్డును కొనసాగించవలసిందిగా సైతం ఆర్‌బీఐ ఆదేశించింది. బర్మన్ కుటుంబానికి చెందిన ప్రస్తుత వాటాదారు సంస్థలు పురాన్ అసోసియేట్స్, వీఐసీ ఎంటర్‌ప్రైజెస్, ఎంబీ ఫిన్‌మార్ట్, మిల్కీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడింగ్ కంపెనీ ఆర్ఈఎల్‌లో వాటాను పెంచుకునేందుకు ఆర్‌బీఐ అనుమతించింది. నిజానికి ఆర్ఈఎల్ వాటాదారులకు గతేడాది బర్మన్ కుటుంబ సంస్థలు ఓపెన్ ఆఫర్ ప్రకటించాయి. అయితే ఆర్ఈఎల్ స్వతంత్ర డైరెక్టర్లు బర్మన్ కుటుంబ సభ్యులపై అవకతవకల ఆరోపణలతో ఆర్‌బీఐ, సెబీ, బీమా నియంత్రణ సంస్థ ఇరెడాకు ఫిర్యాదు చేశారు. ఫలితంగా ఓపెన్ ఆఫర్ వాయిదా పడింది. ఇప్పటికింకా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి అనుమతి రావలసి ఉంది.

బీఎస్ఈలో రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3 శాతం ఎగసి రూ. 296 వద్ద ముగిసింది.

మహీంద్రా కంపెనీకి రూ.1,448 కోట్లు



న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్‌లో భాగమైన మహీంద్రా సస్టేన్ అనుబంధంగా ఉన్న క్లీన్‌టెక్ కంపెనీ మార్వెల్ సోలెన్ తాజాగా రూ.1,448 కోట్ల టెర్మ్ లోన్ అందుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ ఈ మొత్తాన్ని సమకూరుస్తున్నాయి. క్లయింట్లతో కుదిరిన దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కింద అభివృద్ధి చేస్తున్న సోలార్ పీవీ పవర్ ప్రాజెక్టులకు రుణం సమకూర్చేందుకు ఈ మొత్తం ఉపయోగపడుతుందని మహీంద్రా సస్టేన్ తెలిపింది. గుజరాత్, రాజస్థాన్‌లలో నెలకొల్పుతున్న 560 మెగావాట్ పీక్ సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తి అయిందని వివరించింది. ఈ ప్లాంట్ పూర్తయితే ఏటా దాదాపు 9 లక్షల మెగావాట్ల సౌరశక్తిని ఉత్పత్తి చేయవచ్చని మహీంద్రా సస్టేన్ అంచనా వేస్తోంది.

ప్రభుత్వ బ్యాంకుల ఎన్‌పీఏలు రూ.3 లక్షల కోట్లు

- మొత్తం రుణాల్లో 3.09 శాతం
- పార్లమెంటులో ప్రభుత్వం వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం (సెప్టెంబర్ 30) ముగిసే నాటికి రూ.3,16,331 కోట్లుగా నమోదయినట్లు ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి రాజ్యసభకు తెలిపారు. మొత్తం రుణాల్లో ఇది 3.09 శాతమని వివరించారు. ప్రైవేటు రంగ బ్యాంకుల విషయంలో ఎన్‌పీఏలు రూ.1,34,339 కోట్లని తెలిపారు.

మొత్తం రుణాల్లో ఇది 1.86 శాతంగా వివరించారు. ఇంకా ఆయన పేర్కొన్న అంశాల్లో ముఖ్యమైనవి... 2024 మార్చి 31 నాటికి 580 మంది ప్రత్యేక రుణగ్రహీతలు (వ్యక్తులు, విదేశీ రుణగ్రహీతలు మినహా), ఒక్కొక్కరు రూ. 50 కోట్ల కంటే ఎక్కువ రుణ బకాయిలను కలిగి ఉన్నారు. వీరిని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా వర్గీకరించాయి.

ప్రస్తుత దివాలా కేసుల తీరిది...

మొత్తం 1,963 సీఐఆర్‌పీ (కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్) కేసులు కొనసాగుతున్నాయి. వాటిలో 1,388 కేసులు నిర్దేశిత (కేసుల పరిష్కారానికి) 270 రోజుల కాల పరిమితిని మించిపోయాయి. ఈ ఏడాది సెప్టెంబరు వరకు దివాలా చట్టం కింద 1,068 కేసుల పరిష్కారం అయ్యాయి. తద్వారా బ్యాంకింగ్ సుమారు రూ. 3.55 లక్షల కోట్లను రికవరీ చేసింది. బ్యాంకులతో సహా రుణదాతల మొత్తం క్లెయిమ్ రూ. 11.45 లక్షల కోట్లు కాగా, మొత్తం లిక్విడేషన్ విలువ రూ. 2.21 లక్షల కోట్లు.


రహానే

రఫ్ఫాడించిన రహానే

45 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 84

టీమిండియా సీనియర్ ప్లేయర్ అజింక్యా రహానేతో పాటు... క్రమశిక్షణ రాహిత్యంతో వార్తల్లో నిలిచిన ఓపెనర్ పృథ్వీ షా దంచికొట్టడంతో ముంబై జట్టు దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. విదర్భతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సమష్టి ప్రదర్శనతో ముంబై సత్తా చాటితే... పేస్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ ప్రతిభతో సౌరాష్ట్రపై గెలుపుతో మధ్యప్రదేశ్ ముందంజ వేసింది. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో బెంగాల్‌పై బరోడా... ఉత్తర ప్రదేశ్‌పై ఢిల్లీ గెలిచి సెమీఫైనల్లో అడుగు పెట్టాయి. శుక్రవారం జరగనున్న తొలి సెమీఫైనల్లో బరోడాతో ముంబై, రెండో సెమీఫైనల్లో మధ్యప్రదేశ్‌తో ఢిల్లీ తలపడతాయి.

- విదర్భపై 222 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి సెమీఫైనల్ చేరిన ముంబై
- పృథ్వీ షా, సూర్యాంశ్, శివమ్ దూబే మెరుపులు
- ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 టోర్నీ

ఆలూరు: ప్రతిష్టాత్మక దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. గ్రూప్ 'ఇ' టాపర్‌గా క్వార్టర్స్‌లో అడుగు పెట్టిన ముంబై అదే జోరు కొనసాగిస్తూ విదర్భను మట్టికరిపించింది. బుధవారం హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో ముంబై జట్టు 6 వికెట్ల తేడాతో విదర్భపై గెలుపొందింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన విదర్భ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 221 పరుగులు చేసింది. అథర్వ తైడె (41 బంతుల్లో 66; 10 ఫోర్లు, 1 సిక్స్), అపూర్వ్ వాంఖడె (33 బంతుల్లో 51; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకాలతో రాణించగా... శుభమ్ దూబే (19 బంతుల్లో 43 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) చివర్లో మెరుపులు మెరిపించాడు. అనంతరం లక్ష్య ఛేదనలో ముంబై 19.2 ఓవర్లలో 4 వికెట్లకు 224 పరుగులు చేసి గెలిచింది. సీనియర్ ప్లేయర్ అజింక్య రహానే (45 బంతుల్లో 84; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... పృథ్వీ షా (26 బంతుల్లో 49; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. తొలి బంతి నుంచే ఓపెనర్లు విరుచుకుపడటంతో 7 ఓవర్లు ముగిసేసరికి ముంబై జట్టు 83 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సూర్యకుమార్ యాదవ్ (9) విఫలం కాగా... ఆఖర్లో శివమ్ దూబే (37 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), సూర్యాంశ్ (36 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) ధాటిగా ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చారు. రహానేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'అవార్డు దక్కింది.

వెంకటేశ్ అయ్యర్ ఆల్‌రౌండ్ షో

ఆలూరు: పేస్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ (33 బంతుల్లో 38 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు; 2/23) ఆకట్టుకోవడంతో... సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట సౌరాష్ట్ర 20 ఓవర్లలో 7 వికెట్లకు 173 పరుగులు చేసింది. చిరాగ్ జానీ (45 బంతుల్లో 80 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మధ్యప్రదేశ్ బౌలర్లలో వెంకటేశ్ అయ్యర్, ఆవేశ్ ఖాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో మధ్యప్రదేశ్ 19.2 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. అర్పిత్ గౌడ్ (42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్‌తో పాటు కెప్టెన్ రజత్ పాటిదార్ (28; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. చివర్లో హర్‌ప్రీత్ సింగ్ (9 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడి జట్టును గెలిపించాడు.

హార్దిక్ పాండ్యా 3 వికెట్లు, 3 క్యాచ్‌లు

బెంగళూరు: బెంగాల్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో బరోడా 41 పరుగుల తేడాతో గెలిచి సెమీస్ చేరింది. బరోడాకు ఆడుతున్న భారత స్టార్ హార్దిక్ పాండ్యా 3 వికెట్లు పడగొట్టడంతోపాటు 3 క్యాచ్‌లు తీసుకున్నాడు. మొదట బరోడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. శాశ్వత్ రావత్ (40; 1 ఫోర్, 3 సిక్స్‌లు), అభిమన్యు సింగ్ (37; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. బెంగాల్ బౌలర్లలో షమీ, కనిష్క్ సేత్, ప్రదీప్తా ప్రమాణిక్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బెంగాల్ తడబడింది. 18 ఓవర్లలో 131 పరుగులకు ఆలౌటైంది. ఆల్‌రౌండర్ షహబాజ్ అహ్మద్ (36 బంతుల్లో 55; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. బరోడా బౌలర్లలో హార్దిక్ పాండ్యా, లుక్మన్ మెరివాలా, అతిత్ సేత్ తలా మూడేసి వికెట్లు పడగొట్టారు.

అనూజ్ అదుర్స్

బెంగళూరు: వికెట్ కీపర్ అనూజ్ రావత్ (33 బంతుల్లో 73 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) విధ్వంసకర అర్ధశతకంతో చెలరేగడంతో ఢిల్లీ జట్టు ముస్తాక్ అలీ టోర్నీ సెమీఫైనల్‌కు చేరింది. చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఢిల్లీ జట్టు 19 పరుగుల తేడాతో ఉత్తరప్రదేశ్ జట్టుపై నెగ్గింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 193 పరుగులు చేసింది. అనూజ్ రావత్‌తో పాటు ఓపెనర్లు యశ్ ధుల్ (42; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్రియాన్ష్ ఆర్య (44; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా రాణించారు. అనంతరం లక్ష్యఛేదనలో ఉత్తరప్రదేశ్ జట్టు 20 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. యువ ఆటగాడు ప్రియం గార్గ్ (34 బంతుల్లో 54; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో పోరాడగా... రింకూ సింగ్ (10), నితీశ్ రాణా (2) విఫలమవడంతో ఉత్తరప్రదేశ్‌కు పరాజయం తప్పలేదు. ఢిల్లీ బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3... ఆయుష్ బదోనీ, సుయాశ్ శర్మ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.




నంబర్‌వన్ హ్యారీ బ్రూక్

ఐసీసీ టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్

దుబాయ్: ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానాన్ని అందుకున్నాడు. అద్భుత ఫామ్‌తో పరుగుల వరద పారిస్తున్న అతను తాజా ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ (898 రేటింగ్ పాయింట్లు)గా నిలిచాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో బ్రూక్ వరుసగా 171, 123, 55 పరుగులు సాధించాడు. ఇప్పటి వరకు నంబర్‌వన్‌గా ఉన్న మరో ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ (898) ఒక స్థానం పడిపోయి రెండో ర్యాంక్‌కు చేరాడు. టాప్–10 బ్యాటర్ల జాబితాలో భారత్ నుంచి యశస్వి జైస్వాల్ (4వ స్థానం), రిషభ్ పంత్ (9వ స్థానం) ఉండగా...శుబ్‌మన్ గిల్ 17వ, విరాట్ కోహ్లి 20వ స్థానంలో కొనసాగుతున్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (890) తన నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. కగిసో రబాడ (856), హాజల్‌వుడ్ (851) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అశ్విన్ ర్యాంక్ 4 నుంచి 5కు పడిపోగా, జడేజా 6వ స్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు ఆల్‌రౌండర్లలో జడేజా (415) అగ్ర స్థానం, అశ్విన్ 3వ స్థానం (283) పదిలంగా ఉన్నాయి.

జింబాబ్వే చివరి బంతికి...


ముసెకివా

హరారే: అఫ్గానిస్తాన్‌తో ఉత్కంఠభరితంగా సాగిన తొలి టి20 మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో జింబాబ్వే విజయం సాధించింది. అజ్మతుల్లా వేసిన చివరి ఓవర్లో జింబాబ్వే విజయానికి 11 పరుగులు అవసరం కాగా... తొలి 5 బంతుల్లో 10 పరుగులు తీసిన తషింగ ముసెకివా (16 నాటౌట్) ఒత్తిడిని అధిగమించి చివరి బంతికి సింగిల్ రాబట్టడంలో సఫలమయ్యాడు. మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. కరీమ్ జనాత్ (49 బంతుల్లో 54 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధసెంచరీ చేయగా, మొహమ్మద్ నబీ (27 బంతుల్లో 44; 5 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడాడు. అనంతరం జింబాబ్వే 20 ఓవర్లలో 6 వికెట్లకు 145 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బ్రయన్ బెనెత్ (49 బంతుల్లో 49; 5 ఫోర్లు), డియాన్ మైయర్స్ (29 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. సిరీస్‌లో జింబాబ్వే 1–0తో ఆధిక్యంలో నిలవగా, రెండో మ్యాచ్ శుక్రవారం జరుగుతుంది. అఫ్గానిస్తాన్‌తో ఇప్పటి వరకు జింబాబ్వే 16 టి20 మ్యాచ్‌లు ఆడగా... రెండింటిలో గెలిచింది. 2019లో తొలిసారి అఫ్గానిస్తాన్‌ను ఓడించిన జింబాబ్వే ఐదేళ్ల విరామం తర్వాత మళ్లీ నెగ్గింది.

ఆ ముగ్గురిలాంటి ప్రతిభ ఉన్నా...

అల్‌కరాజ్‌పై అతిగా అంచనాలు వద్దు ● టెన్నిస్ దిగ్గజం ఆంద్రీ అగస్సీ వ్యాఖ్య


అగస్సీ, అల్‌కరాజ్ (ఫైల్)

బెంగళూరు: ప్రస్తుతం ప్రపంచ టెన్నిస్‌లో ప్రతిభావంతుడైన యువ ఆటగాళ్లలో స్పెయిన్ ప్లేయర్ కార్లోస్ అల్‌కరాజ్ ఒకడు. నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన అతను ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్నాడు. అయితే అల్‌కరాజ్ ఆట గురించి టెన్నిస్ దిగ్గజం ఆంద్రీ అగస్సీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వేర్వేరు అంశాలపరంగా ముగ్గురు స్టార్లు జొకోవిచ్, రాఫెల్ నాదల్, రోజర్ ఫెడరర్‌లాంటి ఆట అతనిలో కనిపిస్తున్నా... వారిలా గొప్ప ఘనతలు సాధించలేడని అగస్సీ అభిప్రాయపడ్డాడు. ఈ ముగ్గురు దిగ్గజాలు వరుసగా 23, 22, 20 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గారు. 'జొకోవిచ్ తరహా డిఫెన్స్, నాదల్‌లాంటి పవర్ గేమ్, ఫెడరర్‌లా చూడచక్కని ఆటను అల్‌కరాజ్ కూడా ప్రదర్శించాడు. అయితే ఈ లక్షణాలు ఉన్నంత మాత్రాన వారిలా అతను పెద్ద విజయాలు సాధించడం కష్టం. నేను జ్యోతిష్యం చెప్పేవాడిని కాదు కానీ టెన్నిస్ అలాంటి ఘనతలు అందుకోవాలంటే ఎన్నో కలిసి రావాలి. వ్యూహాలు, గాయాలు లేకపోవడంతో పాటు అదృష్టం కూడా ఉండాలి' అని అగస్సీ వ్యాఖ్యానించాడు. మరోవైపు కెరీర్ చరమాంకంలో ఉన్న 37 ఏళ్ల జొకోవిచ్ ఇకపై అదే దూకుడు కొనసాగించలేడని కూడా అతను అన్నాడు. తాను అత్యుత్తమ స్థాయికి చేరే క్రమంలో ఎదురైన ముగ్గురు అద్భుత ప్రత్యర్థులు తప్పుకున్న తర్వాత అలాంటి ఆట కనిపించదని అగస్సీ అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'జొకోవిచ్ ఇప్పటికే కెరీర్‌లో చాలా సాధించాడు. అతని శక్తియుక్తులన్నీ సహజంగానే బలహీనంగా మారిపోతాయి. నా అభిప్రాయం ప్రకారం ఎదురుగా ప్రత్యర్థిని చూస్తే చాలు ఇంకా సాధించాలనే ప్రేరణ లభిస్తే విజయాలు దక్కుతాయి. తాను చరిత్ర సృష్టించడంలో భాగమైన ఆ ముగ్గురు ఇప్పటికే తప్పుకున్నారు. పీట్ సంప్రాస్ రిటైరయ్యాక నాకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. దీని నుంచి ముందుకు సాగాలంటే మానసికంగా చాలా దృఢంగా ఉండాలి. జొకోవిచ్‌లో అలాంటిది ఉందా అనేది ఆసక్తికరం' అని అగస్సీ వివరించాడు. తనకు ప్రత్యర్థిగా ఆడిన ఆండీ ముర్రే ఇప్పుడు కోచ్‌గా మారడం జొకోవిచ్‌కు సానుకూలతే అయినా... ఫలితాలు పరస్పర నమ్మకంతోనే వస్తాయని, అది అంత సులువు కాదని ఎనిమిది గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన అగస్సీ విశ్లేషించాడు. 1980ల్లో, 1990ల్లో ప్రపంచ టెన్నిస్‌కు అమెరికా ఆటగాళ్లు శాసించిన విషయాన్ని గుర్తు చేస్తూ అగస్సీ... భవిష్యత్తులో అలాంటి మంచి రోజులు అమెరికాకు మళ్లీ వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆ సమయంలో తనతో పాటు సంప్రాస్, జిమ్ కొరియర్, మైకేల్ చాంగ్ ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగామని వెల్లడించాడు.

రష్మిక ముందంజ



సోలాపూర్ (మహారాష్ట్ర): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణులు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, హుమేరా బహార్మస్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6–4, 6–1తో ఎకతెరీనా రెన్‌గోల్డ్ (రష్యా)పై, హుమేరా 6–2, 6–4తో సోహా సాదిక్ (భారత్)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. రెన్‌గోల్డ్‌తో 81 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో రష్మిక ఐదు ఏస్‌లు సంధించి, తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. సోహాతో 91 నిమిషాలపాటు జరిగిన హుమేరా ఒక ఏస్ సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను కోల్పోని హుమేరా ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేసింది. మరో మ్యాచ్‌లో క్వాలిఫయర్ కల్లూరి లాలిత్య 6–3, 1–6, 6–0తో భారత్‌కే చెందిన సేజల్‌ను ఓడించగా... తెలంగాణకే చెందిన స్మృతి భాసిన్ 5–7, 4–6తో ఆకాంక్ష (భారత్) చేతిలో ఓడిపోయింది.

క్వార్టర్స్‌లో సహజ జోడీ

మహిళల డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో సహజ–వైష్ణవి (భారత్) ద్వయం 6–3, 6–1తో అభిలాష బిస్తా (నేపాల్)–పావని పాథక్ (భారత్) జోడీని ఓడించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హుమేరా–పూజా ఇంగాలె (భారత్) ద్వయం 6–4, 4–6, 13–11తో నాలుగో సీడ్ రియా భాటియా–జీల్ దేశాయ్ (భారత్) జంటను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.


హి జి టింగ్ పుల్లెల గాయత్రి

పుల్లెల గాయత్రికి 'బెస్ట్ డ్రెస్' అవార్డు

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) సీజన్ ముగింపు టోర్నమెంట్ 'వరల్డ్ టూర్ ఫైనల్స్' గాలా డిన్నర్‌లో ఉత్తమ డ్రెస్ ధరించిన క్రీడాకారిణిగా భారత డబుల్స్ ప్లేయర్ పుల్లెల గాయత్రికి లభించింది. చైనాలోని హాంగ్జౌ సిటీలో ఈ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. మంగళవారం రాత్రి ఈ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ గాలా డిన్నర్ ఏర్పాటు చేశారు. పురుషుల విభాగంలో ఈ అవార్డు చైనా ప్లేయర్ హి జి టింగ్‌కు లభించింది. భారత్ నుంచి ఇప్పటి వరకు శ్రీకాంత్ కిడాంబి (2017), పీవీ సింధు (2018), హెచ్‌ఎస్ ప్రణయ్ (2022) 'బెస్ట్ డ్రెస్' అవార్డు గెల్చుకున్నారు.

మిల్లర్, లిండే మెరుపులు

తొలి టి20లో పాకిస్తాన్‌పై దక్షిణాఫ్రికా విజయం


డేవిడ్ మిల్లర్

డర్బన్: జార్జి లిండే (24 బంతుల్లో 48; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు; 4/21) ఆల్‌రౌండ్ ప్రదర్శన... డేవిడ్ మిల్లర్ (40 బంతుల్లో 82; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) విధ్వంసకర బ్యాటింగ్... వెరసి పాకిస్తాన్‌తో జరిగిన తొలి టి20లో దక్షిణాఫ్రికా 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన ఈ తొలి టి20లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. మిల్లర్, లిండే అదరగొట్టగా... కెప్టెన్ క్లాసెన్ (12), హెండ్రిక్స్ (8), డసెన్ (0), బ్రీట్జ్ (8) ఫెరీరా (7) విఫలమయ్యారు. పాకిస్తాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది, అబ్రార్ అహ్మద్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 172 పరుగులకు పరిమితమైంది. కెప్టెన్ రిజ్వాన్ (74; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో పోరాడినా... జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయాడు. లిండేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం సెంచూరియన్‌లో రెండో టి20 జరుగుతుంది.

ప్లే ఆఫ్స్‌లో స్టీలర్స్



పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా హరియాణా స్టీలర్స్ నిలిచింది. బుధవారం జరిగిన పోరులో స్టీలర్స్ 37–26 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకుంది. తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 19 మ్యాచ్‌లు ఆడిన హరియాణా 15 విజయాలు, 4 పరాజయాలతో 77 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవడంతో పాటు 'ప్లే ఆఫ్స్'లో చోటు ఖాయం చేసుకుంది. బుధవారం ఏకపక్షంగా సాగిన పోరులో స్టీలర్స్ సంపూర్ణ ఆధిపత్యం కనబర్చింది. హరియాణా తరఫున వినయ్ 9 పాయింట్లు, శివమ్ 8 పాయింట్లతో సత్తా చాటగా... మొహమ్మద్ రెజా 6 పాయింట్లు సాధించాడు. బెంగళూరు బుల్స్ తరఫున జతిన్ (5 పాయింట్లు) కాస్త పోరాడాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో స్టీలర్స్ 21 రెయిడ్ పాయింట్లు సాధించగా... బెంగళూరు 14 రెయిడ్ పాయింట్లకే పరిమితమైంది. మరోవైపు ఈ సీజన్‌లో 18 మ్యాచ్‌లు ఆడి కేవలం 2 విజయాలు, 15 పరాజయాలు, ఒక 'టై'తో 19 పాయింట్లతో ఉన్న బెంగళూరు బుల్స్... పట్టిక అట్టడుగున (12వ స్థానంలో) కొనసాగుతోంది. బుధవారమే జరిగిన మరో మ్యాచ్‌లో యు ముంబా 47–31 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. లీగ్‌లో భాగంగా గురువారం దబంగ్ ఢిల్లీతో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటలకు), యూపీ యోధాస్‌తో బెంగాల్ వారియర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



రాజ్‌కపూర్ శతజయంతి ఉత్సవాలకు రావాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించిన ఆయన కుటుంబం. చిత్రంలో సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, కరిష్మా కపూర్ తదితర కుటుంబ సభ్యులు



శ్రీరంగం రంగనాథర్ ఆలయానికి ముస్లిం భక్తుడు జాకీర్ హుస్సేన్ సమర్పించిన రూ.52 లక్షల విలువైన కిరీటం.



అయ్యో.. నా వాహనం కాదే: బుధవారం లోక్‌సభ నుంచి వెలుతూ పొరపాటున మరొకరి వాహనంలో కూర్చున్న సమాజ్‌వాది ఎంపీ డింపుల్ యాదవ్.. పొరపాటును గుర్తించి చిరునవ్వులు చిందిస్తున్న దృశ్యం

ద. కొరియాలో ముదురుతున్న సంక్షోభం

సియోల్(దక్షిణకొరియా): దేశవ్యాప్తంగా అత్యయిక స్థితి(మార్షల్ లా) ప్రకటన నేపథ్యంలో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ కార్యాలయంలో సోదాలకు పోలీసులు సాహసించారు. అయితే అధ్యక్ష కార్యాలయం భద్రతా బలగాలు వెంటనే పోలీసులను అడ్డుకున్నారు. దీంతో యూన్ కార్యాలయ ప్రధాన భవనంలోకి పోలీసులు ప్రవేశించలేకపోయారు. దీంతో పౌర సేవల కార్యాలయాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆధిక్యత లేకపోవడంతో ఏ బిల్లును ప్రవేశపెట్టినా విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవడం, పదవి నుంచి వైదొలగాలన్న డిమాండ్లను ఎదుర్కొంటున్న అధ్యక్షుడు యూన్ యోల్ ఇటీవల అనూహ్యంగా 'మార్షల్ లా'ప్రకటించడం తెల్సిందే. తర్వాత విపక్షాలు పార్లమెంట్‌లో తీర్మానం చేసి ఎమర్జెన్సీని ఎత్తేయడం, అధ్యక్షుడు యూన్ సహా పలువురు దేశద్రోహం ఆరోపణలను ఎదుర్కొంటున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో బుధవారం అధ్యక్షుడికి సంబంధించిన ఆఫీస్‌లలో పోలీసులు ఆకస్మిక సోదాలు చేశారు. దాడులు జరిగిన సమయంలో అధ్యక్షుడు యూన్ కార్యాలయంలో లేరు. యోన్‌కు సన్నిహితులైన పలువురు అధికారులు రాజీనామా చేశారు.



మాజీ రక్షణ మంత్రి ఆత్మహత్యాయత్నం

'మార్షల్ లా'విధించడానికి కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నాటి రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్‌ను పోలీసులు అరెస్ట్‌చేయగా అరెస్ట్‌పై మనస్తాపంతో ఆయన మంగళవారం రాత్రి జైలు గదిలో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. మార్షల్ లా విధించాలని సిఫార్సు చేసిన కిమ్‌ను రాజధాని సియోల్‌లో ఆదివారం అదుపులోకి తీసుకున్న విషయం తెల్సిందే. మంగళవారం అర్ధరాత్రి అధికారికంగా అరెస్టు వారెంట్ జారీ కాకముందే ఆయన ఆత్మహత్యాయత్నం చేశారు. ఆయన బాత్రూమ్‌లో ఆత్మహత్యకు ప్రయత్నించగా జైలు అధికారులు ఆయనను వెంటనే అడ్డుకున్నారు. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడానే ఉందని రక్షణ శాఖ శాఖ పార్లమెంట్‌కు తెలిపింది. కిమ్‌పై నేరాభియోగాలు మోపాలా వద్దా అనే దానిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు 20 రోజుల్లోపు నిర్ణయం తీసుకోనున్నారు.

మరోసారి అభిశంసన

గత శనివారం అధ్యక్షుడిపై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో ప్రధాన విపక్ష డెమొక్రటిక్ పార్టీ మరోసారి అభిశంసన తీర్మానం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. మార్షల్ లా అమలు కోసం పనిచేసిన ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులను దర్యాప్తు అధికారులు బుధవారం అరెస్ట్‌చేశారు. రెండోసారి అభిశంసన ప్రవేశపెట్టిన కొద్దిసేపటికే ఈ ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులను అరెస్ట్‌చేయడం గమనార్హం.

ప్రజాధనమే హారతి కర్పూరం

పార్లమెంట్ సమావేశాలకు నిమిషానికి రూ.2.50 లక్షల ఖర్చు

ఉభయ సభల్లో నిర్మాణాత్మక చర్చల ఊసే లేదు

గౌతమ్ అదానీ, జార్జి సోరోస్ వ్యవహారంపై నిత్యం రగడ

ప్రజా సమస్యలను పట్టించుకోని చట్టసభ సభ్యులు

ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలకు, ప్రభుత్వ విధానాల రూపకల్పనకు, చట్టాల తయారీకి వేదిక కావాల్సిన చట్టసభలు నిష్ప్రయోజనంగా మారుతుండడం ప్రజాస్వామ్యవాదులను ఆవేదనకు గురి చేస్తోంది. పన్ను చెల్లింపుదార్ల సొమ్ముతో నడిచే పార్లమెంట్‌లో వారి బాగోగులపై మాట్లాడేవారే కనిపించకుండాపోవడం విస్మయం కలిగిస్తోంది. అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు, నినాదాలు, నిరసనలు తప్ప జనం ఎదుర్కొంటున్న ఇబ్బందుల, వారి కష్టాలకు చట్టసభల్లో స్థానం దక్కడం లేదు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పరిస్థితి మరింత దిగజారడం గమనార్హం. ఈ సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేదీన ముగియనున్నాయి. అంటే మరో 9 రోజుల సమయమే మిగిలింది.మధ్యలో రెండు రోజులు సెలవులు ఉన్నాయి. ఇప్పటిదాకా పార్లమెంట్‌లో సరైన చర్చే జరగలేదు. గౌతమ్ అదానీ, జార్జి సోరోస్ వ్యవహారంపై ఇరుపక్షాలు గొడవలు పడడంతోనే సమయమంతా వృథాగా గడిచిపోయింది. దేశంలో నానాటికీ పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వాతావరణ కాలుష్యంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతుందని, ప్రభుత్వం నుంచి ఏదైనా పరిష్కార మార్గం లభిస్తుందని వెయ్యి కళ్లతో ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగులుతోంది.



సొమ్ము వెచ్చిస్తున్నా ఫలితం సున్నా

ప్రజలు కట్టే పన్నుల సొమ్ముతోనే పార్లమెంట్ కార్యకలాపాలు జరుగుతాయి. ఎంపీల వ్యవహార శైలికి అదే ప్రజలు బాధితులుగా మారుతున్నారు. పేదల సమస్యలు ఎప్పటికీ చర్చకు రాకుండాపోతున్నాయి. ఒక్క నిమిషం పార్లమెంట్ సమావేశాలు జరగాలంటే రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంత సొమ్ము వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితం మాత్రం సున్నా. చర్చించాల్సిన బిల్లులు, తీసుకురావాల్సిన చట్టాలు ఎన్నో ఉన్నప్పటికీ ఎంపీలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ అదానీ, సోరోస్ వివాదంతో కాలం గడిపేస్తుండడం గమనార్హం. ప్రజలను ప్రజాప్రతినిధులే శిక్షిస్తున్నారని, అందుకు మరొకరు అవసరం లేదని రాజకీయ వ్యాఖ్యాత కమలేష్ సింగ్ ఆక్షేపించారు. ఎంపీల వల్ల విలువైన ప్రజాధనం, సమయం వృథా అవుతున్నాయని విమర్శించారు. పార్లమెంట్‌లో అనవసర విషయాలపై సమయం వెచ్చిస్తూ ముఖ్యమైన అంశాలను పక్కనపెడుతున్నారని తప్పుపట్టారు. కొన్నిసార్లు ఎలాంటి చర్చ జరగకుండానే బిల్లులు చట్టాలుగా మారిపోతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది మంచి పరిణామం కాదని అన్నారు.

ఇదేనా జవాబుదారీతనం?

ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన వేదిక పార్లమెంట్. ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలి. పార్లమెంట్ కార్యకలాపాలు జరగపోవడంతో ప్రజా సమస్యలపై సమాధానం చెప్పకుండా తప్పుకొనే అవకాశం పాలకులకు లభిస్తోందని, జవాబుదారీతనం ఎక్కడా కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య వివాదంతో ఇతర పార్టీల సభ్యులకు మాట్లాడే వెలుసుబాటు దక్కడం లేదు. కొత్తగా ఎన్నికైన సభ్యులు పార్లమెంట్‌లో మాట్లాడాలని ఆరాటపడుతున్నప్పటికీ వారిని పట్టించుకొనే నాథుడే ఉండడం లేదు. లోక్‌సభ, రాజ్యసభలో అదానీ అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తుతుండగా, దాని పోటీగా బీజేపీ ఎంపీలు జార్జి సోరోస్‌ను ప్రస్తావిస్తున్నారు. మరోవైపు అదానీ, సోరోస్ కాకుండా దేశ సమస్యలపై చర్చ జరగాలని కోరుకుంటున్నామని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికైనా పట్టువీడాలని సూచించారు. పార్లమెంట్‌ను కాంగ్రెస్, బీజేపీలు హైజాక్ చేస్తున్నాయని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్న సంగతే అవి మర్చిపోతున్నాయని ధ్వజమెత్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బూడిదలో పోసిన పన్నీరు

పార్లమెంట్ సమావేశాల్లో ఒక నిమిషం వృథా అయ్యిందంటే రూ.2.50 లక్షలు బూడిదలో పోసిన పన్నీరు అయినట్లేనని 2012లో అప్పటి పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పవన్ బన్సల్ చెప్పారు. 2021లో పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిష్టంభన కారణంగా రూ.133 కోట్ల ప్రజాధనం వృథా అయినట్లు అప్పట్లో నిపుణులు లెక్కగట్టారు. మరోవైపు పార్లమెంట్ భేటీలు నానాటికీ కుదించుకుపోతున్నాయి. 1952 నుంచి 1957 వరకు కొనసాగిన తొలి లోక్‌సభ కాలంలో ప్రతిఏటా సగటున 135 రోజుల చొప్పున పార్లమెంట్ సమావేశాలు జరిగాయి. 2019 నుంచి 2024 దాకా మనుగడలో ఉన్న 17వ లోక్‌సభ కాలంలో సగటున ఏటా 55 రోజులపాటే పార్లమెంట్ సమావేశాలు జరిగాయి.

వ్యక్తిగత అవసరాలకు పోలీసు రక్షణ కల్పించలేం

బాంబే హైకోర్టు

ముంబై: తన ప్రియురాలితో కలిసి సహజీవనం సాగించడానికి పోలీసులు రక్షణ కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరిన యువకుడిపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. పరస్పరం ఇష్టంతో కలిసి ఉండాలనుకుంటే ఉండొచ్చని, వారికి పోలీసు రక్షణ కల్పించడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ముంబైలో 20 ఏళ్ల ముస్లిం యువకుడు, 21 ఏళ్ల హిందూ యువతి ప్రేమించుకున్నారు. యువకుడికి ఇంకా పెళ్లి వయసు రాలేదు. దాంతో పెళ్లి చేసుకోలేదు. కలిసి ఉండడం ప్రారంభించారు. వీరి వ్యవహారం తెలిసి యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బిడ్డను అప్పగించాలని కోరాడు. పోలీసులు సదరు యువతిని ప్రభుత్వ షెల్టర్ హోమ్‌కు తరలించారు. ప్రియురాలిని తన వద్దకు చేర్చాలని, తాము కలిసి ఉంటామని, పోలీసులు రక్షణ ఇచ్చేలా, తమ ఇంటి ముందు కాపలా ఉండేలా వారికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ యువకుడు బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. భజరంగ్‌దళ్‌తోపాటు హిందూ సంఘాల ఒత్తిడితోనే యువతి తండ్రి తమపై ఫిర్యాదు చేశాడని ఆరోపించాడు. ఈ పిటిషన్‌పై జస్టిస్ భారతీ డాంగ్రే, జస్టిస్ మంజూష దేశ్‌పాండేతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. యువతి మేజర్ కాబట్టి తండ్రి వద్దకు వెళ్లాలని ఆమెను ఒత్తిడి చేయలేమని పేర్కొంది. ప్రియుడితో కలిసి ఉండొచ్చని తెలిపింది. కానీ, వ్యక్తిగత అవసరాలకు పోలీసు ప్రొటెక్షన్ ఇవ్వలేమని స్పష్టంచేసింది. మీ ఇష్టాయిష్టాలకు ప్రభుత్వ వనరులు ఖర్చు చేయాలా? అని యువకుడిని కోర్టు నిలదీసింది.


కాంగ్రెస్‌తో పొత్తుకు అవకాశాల్లేవు

- ఢిల్లీలో ఒంటరిగానే ఆప్ పోరు
- కేజ్రీవాల్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఫిబ్రవరి జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు ఎలాంటి అవకాశాల్లేవని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఇరుపార్టీలు పొత్తు పెట్టుకోవచ్చనే వార్తలను తోసిపుచ్చారు. ఢిల్లీలో ఆప్ ఒంటరిగానే పోటీచేస్తుందని 'ఎక్స్'లో తెలిపారు. 'కాంగ్రెస్‌తో పొత్తుకు ఎలాంటి అవకాశాల్లేవు'అని స్పష్టం చేశారు. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం రాహుల్ గాంధీ పాల్గొనాల్సి ఉన్న న్యాయ్ యాత్ర ముగింపు కార్యక్రమం రద్దు కావడంతో.. ఇరుపార్టీలు అసెంబ్లీ ఎన్నికలకు ఒక అవగాహనకు రావొచ్చనే వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో పొత్తుకు ఆస్కారం లేదని కేజ్రీవాల్ విస్పష్ట ప్రకటన చేశారు. ఇండియా కూటమికి బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని నాయకురాలిగా నియమించాలనే డిమాండ్లు వెలువడుతున్న నేపథ్యంలో కేజ్రీవాల్ మంగళారం ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్‌తో భేటీ అయ్యారు. పవార్‌తో ఏం చర్చించారనేది కేజ్రీవాల్, ఆప్‌లు వెల్లడించలేదు. పొత్తుకు దారులు తెరిచి ఉంచేందుకు వీలుగా కాంగ్రెస్, ఆప్‌లు ఆచితూచి వ్యవహరిస్తున్నాయని పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

హరియాణాలో విడాకుల సంబరం

చండీగఢ్: ఆధునిక కాలంలో పెళ్లికి ముందు బ్యాచిలర్ పార్టీలు చూస్తున్నాం. పెళ్లి వేడుకలు తిలకిస్తున్నాం. పెళ్లి తర్వాత రిసెప్షన్ పేరిట జరిగే విందు కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. ఇలా వివాహం చుట్టూ ఎన్నో సంబరాలు ఉంటాయి. కానీ, విడాకుల సంబరం ఎప్పుడైనా చూశారా? హరియాణాలో ఇటీవల నిజంగా ఇలాంటి ఉత్సవం జరిగింది. మంజీత్ అనే యువకుడు తన భార్య నుంచి విడిపోయినందుకు చాలా సంతోషంగా తన బంధుమిత్రులకు విందు ఇచ్చాడు. కేక్ కట్ చేశాడు. డైవోర్స్ పార్టీ ఘనంగా నిర్వహించుకున్నాడు. ఈ సందర్భంగా వేదిక వద్ద తన పెళ్లి ఫొటో, పెళ్లి జరిగిన తేదీ, విడాకులు మంజూరైన తేదీ తదితర వివరాలతో ఒక ఫ్లెక్సీ ముద్రించి అతికించాడు. అంతేకాదు తన మాజీ భార్య విగ్రహం లాంటిది అక్కడే ఏర్పాటుచేశాడు. ఆ విగ్రహం పక్కనే నిలబడి ఫొటోలకు పోజులిచ్చాడు. ఈ వ్యవహారమంతా సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి విడాకుల పార్టీలు విదేశాల్లో ఎక్కువగా జరుగుతుంటాయని సమాచారం. ఇప్పుడు మన దగ్గర కూడా ఈ పాశ్చాత్య సంస్కృతి మొదలైట్లు తెలుస్తోంది. మంజీత్ 2020లో కోమల్ అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. కానీ, వారి బంధం ఎక్కువ కాలం కొనసాగలేదు. అభిప్రాయభేదాలతో నిత్యం కీచులాడుకోవడం కంటే విడిపోవడమే మేలని నిర్ణయానికొచ్చారు. ఈ ఏడాదే వారికి కోర్టు నుంచి విడాకులు మంజూరయ్యాయి. ఇప్పుడు తనకు అసలైన స్వాతంత్య్రం వచ్చిందని మంజీత్ ఆనందంగా చెబుతున్నాడు. కానీ, ఇలాంటి విడాకుల వ్యవహారాలు, డైవోర్స్ పార్టీలు మంచి పరిణామం కాదని పెద్దలు అభిప్రాయపడుతున్నారు.



కేంద్ర కేబినెట్ సమావేశం నేటికి వాయిదా

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరగాల్సిన కేంద్ర మంత్రివర్గ సమావేశం గురువారానికి వాయిదా పడింది. అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు తెలిసింది. కేబినెట్ భేటీలో జమిలి ఎన్నికల బిల్లును ఆమోదించనున్నట్లు సమాచారం. ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తర్వాత తదుపరి పరిశీలన కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి(జేపీసీ) నివేదించనున్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ఆమోదింపజేయాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

మనీష్ సిసోడియా బెయిల్ షరతులు సడలింపు

న్యూఢిల్లీ: ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బెయిల్ షరతులను సుప్రీంకోర్టు బుధవారం సడలించింది. వారానికి రెండుసార్లు విచారణాధికారి ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలనే నిబంధన నుంచి మినహాయింపునిచ్చింది. ఢిల్లీ ఎక్సైజ్ కుంభకోణం కేసులో అరెస్టయి 17 నెలలు జైలులో గడిపిన సిసోడియాకు ఈ ఏడాది ఆగస్టు 9న సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. నిందితుడికి ఉన్న వేగవంతమైన విచారణ హక్కును నిరాకరించినట్లవుతోందని చెప్పి.. బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ, ఈడీ దాఖలు చేసిన రెండు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చింది. అయితే ప్రతి సోమవారం, గురువారాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య విచారణ అధికారి ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. దీని నుంచి మినహాయింపునివ్వాలని సిసోడియా సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. బుధవారం ఊరట లభించింది. వారానికి రెండుసార్లు హాజరుకానవసరం లేదని, కోర్టు విచారణకు క్రమం తప్పకుండా రావాలని సూచించింది.

నాకు మద్దతు ఇచ్చినందుకు రుణపడి ఉంటా

'ఇండియా'కూటమి నేతలకు మమతా బెనర్జీ కృతజ్ఞతలు

కోల్‌కతా: విపక్ష 'ఇండియా' కూటమి సారథిగా తన పేరును ప్రతిపాదించి, మద్దతు ఇచ్చినందుకు కూటమి పార్టీల సీనియర్ నేతలకు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కృతజ్ఞతలు తెలియజేశారు. వారికి రుణపడి ఉంటానని చెప్పారు. ఆమె బుధవారం పూర్వ మేదినీపూర్ జిల్లాలోని దిఘా పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనకు అండగా నిలిచిన నాయకులు బాగోగుల కోసం, తమ కూటమి కోసం దేవుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. కూటమి నేతలంతా ఆరోగ్యంగా, క్షేమంగా ఉండాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. కూటమి కూడా బాగుండాలని ఆకాంక్షించారు. ఇండియా కూటమికి మమతా బెనర్జీ నేతృత్వం వహించాలని శరద్ పవార్, లాలూ ప్రసాద్ యాదవ్ తదితర నేతలు కోరిన సంగతి తెలిసిందే. ఆమెకు ఆ సామర్థ్యం ఉందని వారు స్పష్టంచేశారు. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్‌లో దాడులకు గురవుతున్న మైనార్టీలను రక్షించాలని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. భారత్‌కు తిరిగి రావాలని కోరుకుంటున్నవారిని రప్పించడానికి సహకరించాలని కోరారు.



నాపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు తొలగించండి

స్పీకర్ బిర్లాను కలిసి కోరిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా బీజేపీ సభ్యులు తనపై చేసిన అభ్యంతరకర వ్యాఖ్యానాలను రికార్డుల నుంచి తొలగించాలని దిగువసభ స్పీకర్ ఓం బిర్లాను లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ కోరారు. ఈ మేరకు ఆయన బిర్లాతో భేటీ అయ్యారు. ''అదానీ అంశం నుంచి దృష్టిమరల్చేందుకు బీజేపీ ఎంపీలు నాపై నిరాధార ఆరోపణలు గుప్పిస్తున్నారు. అయినాసరే తప్పుడు ఆరోపణలపై నేను అనవసర ఆవేశాలకు పోదల్చుకోలేదు. సభ సజావుగా సాగడమే మాకు ముఖ్యం''అని అన్నారు. రాహుల్ చేసిన అభ్యర్థనను పరిశీలిస్తానని స్పీకర్ చెప్పారు. ''మాపై ఎలాంటి తప్పుడు ఆరోపణలు చేసినా సరే సభ సవ్యంగా కొనసాగడమే మాకు అత్యంత ప్రధానం. ముఖ్యంగా డిసెంబర్ 13వ తేదీన రాజ్యాంగంపై చర్చ జరగడం మాకు చాలా కీలకం. నాపై బీజేపీ సభ్యులు ఎలాంటి ఆరోపణలైనా చేయనివ్వండి కానీ రాజ్యాంగంపై చర్చ జరగాల్సిందే''అని రాహుల్ అన్నారు. అంతకుముందు సభలో బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే రాహుల్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని లోక్‌సభలో విపక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు.

బీజేపీ నాయకుడిని హతమార్చిన మావోయిస్టులు

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన
- పది రోజుల వ్యవధిలో ఐదుగురి హతం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు అక్కడి అధికార బీజేపీకి చెందిన ఓ నాయకుడిని హతమార్చారు. ఈ ఘటన బీజాపూర్ జిల్లాలోని పాస్నేఘడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా సోమన్‌పల్లి గ్రామంలో నివాసముంటున్న బీజేపీ నాయకుడు మండోరాం కుడియం (35) ఇంటికి మంగళవారం రాత్రి వచ్చిన మావోయిస్టులు అతడిని వెంట తీసుకెళ్లారు. ఆయన గొంతు కోసి హత్య చేశాక బుధవారం తెల్లవారుజామున మృతదేహాన్ని తోయినార్‌కు వెళ్లే దారిలో పడవేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తుండడంతో హతమార్చామని, ఇన్‌ఫార్మర్లందరికీ ఇదే శిక్ష ఉంటుందని మావోయిస్టులు అక్కడ వదిలిన లేఖలో పేర్కొన్నారు. కాగా, మృతుడు కుడియం బీజేపీ కిసాన్ మోర్చా డివిజన్ ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నాడు. బీజాపూర్‌లో మావోయిస్టులు పది రోజుల వ్యవధిలో ఐదుగురిని హత్య చేయగా వీరిలో బీజేపీకి చెందిన ఇద్దరు మాజీ ఉప సర్పంచ్‌లు, ఇద్దరు మహిళలు ఉండగా తాజాగా బీజేపీ కిసాన్ మోర్చా డివిజన్ ఉపాధ్యక్షుడు హతమయ్యారు. వరుస హత్యల నేపథ్యాన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా, దంతెవాడ, నారాయణపూర్ తదితర మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పరిస్థితులకనుగుణంగా ఏక కేంద్రంగా.. సమాఖ్యగా..

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

వివాదాలు – సమీక్షా కమిషన్లు

మదన్ మోహన్ పూంఛీ కమిషన్ (2007)

2007 నాటికి ప్రపంచవ్యాప్తంగా సంభవించిన ఆర్థిక సరళీకరణ, ఉదారవాదం కారణంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో గణనీయమైన మార్పులు సంభవించాయి. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా సమీక్షించడానికి 2007 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మదన్‌మోహన్ పూంఛీ అధ్యక్షతన, వినోద్ కుమార్ దుగ్గల్ (హోం శాఖ మాజీ కార్యదర్శి), ధీరేంద్ర సింగ్ (హోం శాఖ మాజీ కార్యదర్శి), అమరేష్ బాగ్చి (మాజీ డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్సెస్ అండ్ పాలసీ), డాక్టర్ ఎన్.ఆర్. మాధవ మీనన్ (మాజీ డైరెక్టర్, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ) నలుగురు సభ్యులుగా కేంద్ర, రాష్ట్ర సంబంధాల సమీక్షకు సంబంధించి రెండో కమిషన్‌ను ఏర్పాటు చేశారు. పూంఛీ కమిషన్ తన నివేదికను 2010 ఏప్రిల్‌లో ప్రభుత్వానికి సమర్పించింది.



పూంఛీ కమిషన్ ముఖ్య సిఫార్సులు

+ కొన్ని ప్రత్యేకమైన తీవ్ర ఇబ్బందులు కలిగిన ప్రదేశాలను పరిమిత కాలం పాటు కేంద్ర పాలనలోకి తీసుకురావడానికి ప్రకరణ 355, 356లలో ఒక సవరణ చేయాలి.
+ ప్రకరణలు 355, 356ల కింద 'అత్యవసర నిబంధనల స్థానికీకరణ'ను చేయాలని కమిషన్ ప్రతిపాదించింది. దీని ప్రకారం రాష్ట్రం మొత్తం మీద గవర్నర్ పాలన విధించకుండా సమస్యాత్మకమైన జిల్లా లేదా జిల్లాలోని కొన్ని భాగాలను మాత్రమే గవర్నర్ పాలన కిందకి తేవాలి. అలాంటి అత్యవసర స్థితిని 3 నెలల కంటే ఎక్కువకాలం పాటు కొనసాగించకూడదు.
+ మత కల్లోలాలు చెలరేగినప్పుడు, రాష్ట్రాల అభిప్రాయంతో సంబంధం లేకుండా కేంద్రం కొంతకాలం పాటు కేంద్ర బలగాలను రాష్ట్రంలో దింపడానికి వీలు కల్పించేలా మత కల్లోలాలకు సంబంధించిన బిల్లులో సవరణ చేయాలి.
+ మత కల్లోలాల సమయంలో కేంద్ర బలగాలను రంగంలోకి దింపడానికి రాష్ట్ర ప్రభుత్వ అంగీకారం అడ్డంకి కాకూడదని కమిషన్ ప్రతిపాదించింది.
+ కేంద్ర బలగాల మోహరింపు వారం పాటు మాత్రమే ఉండాలి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ అంగీకారం మేరకు కొనసాగించవచ్చు లేదా వెనక్కి పంపవచ్చు.
+ రాష్ట్ర మంత్రి మండలి సలహాకు వ్యతిరేకంగా మంత్రులను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించే హక్కు గవర్నర్లకు ఉండాలి. గవర్నర్లను విశ్వవిద్యాలయ చాన్స్‌లర్లుగా వ్యవహరించే సంప్రదాయాన్ని ఆపేయాలని కమిషన్ సూచించింది.
+ గవర్నర్‌గా నియమితులయ్యేవారు ఆ నియామకం జరిగే కనీసం రెండేళ్ల ముందు నుంచి క్రియాశీల రాజకీయాల్లో ఉండకూడదు. గవర్నర్‌గా రాష్ట్రేతర, ప్రఖ్యాతి చెందిన వ్యక్తిని మాత్రమే నియమించాలనే సర్కారియా కమిషన్ సూచనతో పూంఛీ కమిషన్ ఏకీభవించింది.
+ గవర్నర్లను నిర్హేతుకంగా (Arbitrary) తొలగించడాన్ని కమిషన్ విమర్శించింది. 'గవర్నర్లను రాజకీయ ఫుట్‌బాల్'లా వ్యవహరించడాన్ని నిలువరించాలని అభిప్రాయపడింది. గవర్నర్‌ను కచ్చితమైన తీర్మానం ద్వారానే తొలగించేలా సవరణలు చేయాలని కమిషన్ సూచించింది. గవర్నర్‌ను నియమించేటప్పుడు ముఖ్యమంత్రి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సిఫారసు చేసింది.
+ విధి నిర్వహణలో గవర్నర్ తప్పు చేస్తే మాత్రమే తొలగించాలని, ఆ తొలగింపు కూడా రాష్ట్రపతిని పార్లమెంట్ ద్వారా తొలగించిన విధంగా రాష్ట్ర శాసనసభలో మహాభియోగ తీర్మానం ద్వారానే తొలగించాలని కమిషన్ అభిప్రాయపడింది.
+ రాజ్యాంగ సమీక్షా కమిషన్ సూచించిన విధంగా గవర్నర్ నియామకం, ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి, లోక్‌సభ స్పీకర్, రాష్ట్ర ముఖ్యమంత్రితో కూడిన ఒక కమిటీ ద్వారా జరగాలని కమిషన్ అభిప్రాయపడింది. ఇందులో ఉపరాష్ట్రపతి కూడా పాలుపంచుకోవాలని సూచించింది.
+ రాజ్యాంగంలో ప్రకరణ 163(2) ద్వారా గవర్నర్‌కు సంక్రమించిన విచక్షణాధికారాల పరిధిని రాజ్యాంగ సవరణ ద్వారా తగ్గించాలని కమిషన్ అభిప్రాయపడింది. అదేవిధంగా బిల్లును తన వద్దే అట్టిపెట్టుకునే అధికారాన్ని తగ్గించి 4 నెలల్లో కచ్చితంగా బిల్లుపై అభిప్రాయాన్ని తెలియజేయాలనే నియమాన్ని ప్రవేశపెట్టాలని కమిషన్ సూచించింది.
+ ముఖ్యమంత్రుల నియామకంలో పాటించాల్సిన మార్గదర్శకాలను కూడా ఈ కమిషన్ నిర్దేశించింది. ఎన్నికల ముందే సంకీర్ణంగా ఏర్పడిన పార్టీలను ఒక రాజకీయ పార్టీగానే పరిగణించాలనే భావనను ఈ కమిషన్ సమర్థించింది. రాష్ట్రంలో ఏ ఒక్క పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సాధారణ మెజారిటీ రాని సందర్భంలో, ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి గవర్నర్ పాటించాల్సిన విధాన క్రమాన్ని కమిషన్ తెలియజేసింది.
+ జాతీయ సమగ్రతా మండలి కనీసం ఏడాదికి ఒకసారి సమావేశం కావాలని కమిషన్ సూచించింది.
+ జాతీయ సమగ్రతా మండలికి రాజ్యాంగ హోదాను కల్పించాలనే 'లిబర్హాన్' కమిషన్ అభిప్రాయాన్ని పూంఛీ కమిషన్ వ్యతిరేకించింది.
+ జాతీయ పరిశోధనా ఏజెన్సీ లాంటి కొత్త సంస్థలను కమిషన్ అధ్యయనం చేసింది. జాతీయ పరిశోధనా ఏజెన్సీ (ఎన్.ఐ.ఎ.)కి అప్పగించిన తీవ్రవాద విచారణలకు రాష్ట్రాలు తమ వంతు సహకారాన్ని అందించాలని కమిషన్ సూచించింది.

రెండో పరిపాలనా సంస్కరణల సంఘం

కేంద్ర ప్రభుత్వంలోని పరిపాలనా సంస్కరణల ప్రజా క్లేశ పరిష్కార విభాగం, ప్రభుత్వ పాలనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి వివిధ కమిషన్లను నియమిస్తుంది. ఈ విభాగం 2005లో వీరప్ప మొయిలీ అధ్యక్షతన రెండో పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించింది. ఇందులో మొత్తం 5 మంది సభ్యులున్నారు.

+ వీరప్ప మొయిలీ (ఛైర్మన్)
+ వి.రామచంద్రన్ (సభ్యులు)
+ ఎ.హెచ్.కర (సభ్యులు)
+ డాక్టర్ జయప్రకాశ్ నారాయణ (సభ్యులు)
+ డా. వినీతా రాయ్ (మెంబర్ సెక్రటరీ)

రెండో పరిపాలనా సంస్కరణల సంఘం ప్రభుత్వ పాలనా వ్యవస్థను సమగ్రంగా పునర్ వ్యవస్థీకరించడానికి, బాధ్యతాయుత వ్యవహరణ, జవాబుదారీతనం, సమర్థమైన పాలనకు సంబంధించి మొత్తం 15 నివేదికలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది.

కేంద్ర రాష్ట్ర సంబంధాలు – వ్యాఖ్యానాలు

భారత సమాఖ్య వ్యవస్థ స్వభావంపై కొందరు ప్రముఖులు విభిన్న అభిప్రాయాలను వ్యక్తీకరించారు.

+ భారత రాజ్యాంగంలో అత్యధికంగా ఏక కేంద్ర, అతి తక్కువగా సమాఖ్య లక్షణాలు ఉన్నాయి. కాబట్టి భారత రాజ్యాంగం సమాఖ్య లక్షణాలున్న ఏక కేంద్రమే కానీ, ఏక కేంద్ర లక్షణాలున్న సమాఖ్య కాదు. ఇది అర్ధ సమాఖ్య (Quasi-Federal) – కె.సి. వేర్
+ భారతదేశం వాస్తవికంగా ఏక కేంద్రంగా పని చేసింది. కానీ, కేంద్ర రాష్ట్రాల మధ్య చట్టపరంగా, సిద్ధాంతపరంగా సమాఖ్య సంబంధాలున్నాయి. – ప్రొ.కె. సంతానం
+ భారత వ్యవస్థ తీవ్రమైన సమాఖ్య వ్యవస్థ (Extremely Federal) –పాల్ ఆపెల్‌బి
+ భారత వ్యవస్థ బేరసారాల సమాఖ్య వ్యవస్థ (Bargaining Federation) – మారిస్ జోన్స్
+ భారత సమాఖ్య కేంద్రీకృత, బలమైన సమాఖ్య. జాతి ఐక్యతను, ప్రగతిని నిలువరించే సమాఖ్య – ఐవర్ జెన్నింగ్స్
+ భారత వ్యవస్థ స్వయం ప్రేరిత, విశిష్ట సమాఖ్య వ్యవస్థ – అలెగ్జాండర్
+ భారత సమాఖ్య సహకార సమాఖ్య. ఇది ఒక నూతన తరహా సమాఖ్య – గ్రాన్‌విల్లే ఆస్టిన్
+ భారత సమాఖ్య ఒక విశిష్ట సమాఖ్య. పరిస్థితులకు అనుగుణంగా ఏక కేంద్రంగానూ, సమాఖ్యగానూ మార్చుకోగలిగే స్థితిస్థాపకత ఉన్న సమాఖ్య – అంబేద్కర్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో ఏడో షెడ్యూల్‌లోని కేంద్ర జాబితాలో ఉన్న అంశం ఏది?
   ఎ) గనులు, చమురు క్షేత్రాల్లో పనిచేసే శ్రామికులు, వారి భద్రతను క్రమబద్ధీకరించడం
   బి) వ్యవసాయం సి) మత్స్య పరిశ్రమ
   డి) ప్రజా ఆరోగ్యం
2. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
   1. దేశ ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర జాబితాలోని అంశంపై పార్లమెంటు చట్టం చేసేందుకు తీర్మానం చేసే అధికారం రాజ్యసభకు మాత్రమే ఉంది.
   2. అత్యవసర పరిస్థితి విధించడానికి సంబంధించిన తీర్మానాలను లోక్‌సభ మాత్రమే ఆమోదిస్తుంది.
   ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
   సి) రెండూ సరైనవి డి) ఏదీకాదు
3. భారత రాజ్యాంగం ప్రకారం కిందివాటిలో సరికాని జత ఏది?
   ఎ) అడవులు – ఉమ్మడి జాబితా
   బి) స్టాక్ ఎక్స్ఛేంజ్ – ఉమ్మడి జాబితా
   సి) పోస్టాఫీస్ సేవింగ్స్ – కేంద్ర జాబితా
   డి) ప్రజా ఆరోగ్యం – రాష్ట్ర జాబితా
4. కిందివాటిలో సరైన వ్యాఖ్య ఏది?
   1. భారత ప్రణాళికలను నిర్ణయించే ఉన్నత సంస్థ – భారత ప్రణాళిక సంఘం
   2. ప్రణాళిక సంఘం కార్యదర్శి జాతీయాభివృద్ధి మండలి కార్యదర్శిగా కూడా ఉంటారు
   3. ఏడో షెడ్యూల్‌లోని ఉమ్మడి జాబితాలో 'క్రీడలు' అంశాన్ని చేర్చారు.
   ఎ) 1, 2 బి) 2, 3
   సి) 2 మాత్రమే డి) 3 మాత్రమే
5. రాష్ట్ర ప్రభుత్వాలు తమ కార్య నిర్వహణాధికారాన్ని కేంద్ర కార్య నిర్వహణాధికారికి ఎలాంటి ఆవరోధం, ప్రమాదం ఏర్పడని విధంగా మాత్రమే వినియోగించుకోవాలని తెలియజేసే అధికరణం ఏది?
   ఎ) 257 బి) 258 సి) 355 డి) 356

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) బి; 4) ఎ; 5) ఎ.

మన తెలంగాణం గ్రంథాన్ని రాసిందెవరు?

హైదరాబాద్ సంస్థానంలో ఉద్యమకారులు

అసఫ్ జాహీ వంశంలో ఏడో నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో ఎందరో వీరులు పోరాటం చేశారు. కొందరు ఉద్యోగాలు వదులుకున్నారు. మరికొందరు ప్రాణాలకు తెగించి, నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమించారు. అరెస్టులు, లాఠీ చార్జీలు వారిని అడ్డుకోలేకపోయాయి. తెలంగాణ మాగాణంలో సామాన్యులు నిజాంకు వ్యతిరేకంగా విప్లవ జ్వాలలు రగిలించారు. ఈ కాలంలో ఎన్నో విప్లవ గీతాలు పుట్టుకొచ్చాయి. కొందరు నాయకులు గాంధేయ మార్గంలో శాంతియుత ఉద్యమాలు చేపట్టారు. మరికొందరు ఆయుధాలతో విప్లవ పోరాటం చేశారు. వారు ఎంచుకున్న మార్గం ఏదైనా తెలంగాణ విముక్తే ఏకైక లక్ష్యం. ఈ క్రమంలో కొందరు ఉద్యమ వీరులుగా చిరస్మరణీయులయ్యారు.



నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణలో సామాన్యులు సైతం పోరాడారు. ఆ కాలంలో ఎన్నో విప్లవ గీతాలు పుట్టుకొచ్చాయి. ఆఖరి అసఫ్ జాహీ వంశీయుడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపిన మేటి నాయకుడు సర్దార్ జమలాపురం కేశవరావు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు ఆదిరాజు వీరభద్రరావు పంతులు. 'హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం' గ్రంథాన్ని వెల్దుర్తి మాణిక్యరావు రాశారు.

జమలాపురం కేశవరావు (1908-1953)

హైదరాబాద్ సంస్థాన చివరి పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నడిపిన గొప్ప నాయకుడు సర్దార్ జమలాపురం కేశవరావు. నిజాం రజాకార్ల దురంగతాలకు వ్యతిరేకంగా పండిట్ నరేంద్రజీతో కలిసి తెలంగాణ గ్రామాల్లోని ప్రజలను సమీకరించి పోరాటం చేసిన ధీశాలి.

'పాశ్చాత్య విద్యతో మానసిక దౌర్బల్యం, సంకుచితత్వం తద్వారా దౌర్జన్య ప్రవృత్తి మన సమాజంలో ప్రబలాయి. ప్రజల మధ్య అంతరాలు ఎక్కువయ్యాయి. వెనుకటి తరాల్లో కనిపించే సరళత్వం, కలివిడితనం, సానుభూతి, నేటి సమాజంలో లోపించాయి. స్వాతంత్ర్య ఫలితంతో గ్రామాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలి. రైతు దేశానికి వెన్నెముక. గ్రామం దేశ సౌభాగ్యానికి పునాది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించుకోవాలి'..ఇలా తన అభిప్రాయాలను తెలంగాణ గ్రామాల్లో ప్రచారం చేసిన సాహసికుడు సర్దార్ జమలాపురం కేశవరావు.

ఉన్నత ఆలోచనలున్న కేశవరావు ఒక గొంగడి భుజాన వేసుకొని, తెలంగాణ గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయడానికి విస్తృత ప్రచారం చేశారు. 'అపర సరిహద్దు గాంధీ'గా పేరు పొందారు. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు నిజాం నిరంకుశ ఉద్యోగుల అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. తెలంగాణలోని తండాలు, గూడేలు, హరిజన, గిరిజన వాడలకు వెళ్లి వారి బాగోగులు, స్థితిగతులు తెలుసుకునేవారు.

20వ శతాబ్ద పూర్వార్ధంలో తెలంగాణలో జరిగిన ప్రజాపోరాటాల్లో ప్రజలకు అతి సన్నిహితుడైన గొప్ప కార్యకర్త. 18 ఏళ్ల వయసులోనే రాజకీయ ప్రవేశం చేశారు. 1938నుంచి ఆయన ప్రజా పోరాటాలు చేసి 'సర్దార్'గా ప్రజలతో గౌరవం పొందారు. రజాకార్ల దురాగతాలను, దాడులను ఎదుర్కొగల ఆత్మస్థైర్యాన్ని నింపుతూ ప్రజలను చైతన్యం చేశారు. హైదరాబాద్ సంస్థానంలో మత సామరస్యం కోసం ఎనలేని కృషి చేశారు.

1938, 1947లో బేడీలు, నడుం పటకాతో జైలు జీవితం గడిపారు. ఆయనకు రామాయణ, మహాభారతాలంటే చాలా ఇష్టం.

కేశవరావు జీవితంలో ముఖ్య సంఘటనలు

- 1908లో ఆనాటి వరంగల్ జిల్లాలోని మధి ర తాలూకా, ఎర్రుపాలెం (ప్రస్తుతం ఖమ్మం జిల్లా)లో కేశవరావు జన్మించారు.
- ప్రాథమిక విద్య ఖమ్మం, ఉన్నత విద్య హైదరాబాద్‌లో జరిగింది.
- తల్లిదండ్రులు, వెంకటరామారావు, వెంకట నరసమ్మ
- 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పిలుపు మేరకు సత్యాగ్రహంలో పాల్గొన్నారు.
- దీంతో రెండేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించారు.
- కేశవరావు మధిర తాలూకాలోని రెండు వందల గ్రామాల్లో పాదయాత్ర చేసి ప్రజల్లో పోరాట స్ఫూర్తి నింపారు.
- 1945 ఆంధ్ర మహాసభకు మందుమల నరసింగరావు అధ్యక్షుడుగా, కేశవరావు ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.
- 1946లో మెదక్ జిల్లా కంది గ్రామంలో జరిగిన పదమూడో ఆంధ్రమహాసభకు కేశవరావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- కేశవరావును కొంతకాలం వరంగల్, నిజామాబాద్ జైల్లో నిజాం నిర్బంధించారు. ఆయనతో పాటు మహాకవి దాశరథి కృష్ణమాచారి, రామ్ హీరాలాల్ మోర్యా, కొలిపాక కిషన్‌రావు, ఊటుకూరి నారాయణరావు, గంధం మాణిక్యం తదితరులు జైలు శిక్ష అనుభవించారు.
- 1948లో హైదరాబాద్ సంస్థానంపై పోలీసు చర్య అనంతరం వీరందరూ జైలు నుంచి విడుదలయ్యారు.
- సుమారు 13 నెలలు శిక్ష అనుభవించారు.
- పోలీసు చర్య అనంతరం వెల్లోడి నాయకత్వంలో మిలటరీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పుడు కేశవరావు హైదరాబాద్ సంస్థానంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు.
- 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పాకాల నియోజకవర్గం నుంచి ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అక్కడ కమ్యూనిస్టు అభ్యర్థి విజయం సాధించారు.
- 1953 మార్చి 30న జమలాపురం కేశవరావు హైదరాబాద్‌లో మరణించారు.



టెట్/డీఎస్సీ - ప్రత్యేకం
తెలంగాణ హిస్టరీ

ఆదిరాజు వీరభద్రరావు (1890-1978)

తెలంగాణలో తెలుగు భాషకు, సంస్కృతికి ఆదరణ లేని రోజుల్లో మాతృభాషాభివృద్ధికి విశేష కృషి చేసిన నిస్వార్థ దేశ భక్తుడు ఆదిరాజు వీరభద్రరావు పంతులు. ఆ రోజుల్లో హైదరాబాద్ సంస్థానంలో అధికార భాష, పాఠశాలల్లో బోధనాభాష ఉర్దూయే. అలాంటి పరిస్థితుల్లో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి తదితరులు మాతృభాషోద్ధరణ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో తెలుగు సంస్కృతి పునరుజ్జీవనం కోసం తెలుగు చరిత్ర, పరిశోధనలకు ఆదిరాజు వీరభద్రరావు రూపకల్పన చేశారు

1890లో ఖమ్మం జిల్లా మధిర తాలూకా దెందుకూరు గ్రామంలో వీరభద్రరావు జన్మించారు. ఆయన తండ్రి ఆదిరాజు లింగయ్య, తల్లి వెంకమాంబ. ఆమె ఊటుకూరు వారి ఆడపడుచు. లింగయ్య కరోడ్గిరీ నాకా సేగేదార్‌లో ఉద్యోగి. జాగీర్దార్ రావిచెట్టు రంగారావు ఆర్థిక సాయంతో వీరభద్రరావు హైదరాబాద్ చాదర్‌ఘాట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రాథమిక విద్యనభ్యసించారు. అనంతరం సుమారు 40 ఏళ్ల ఉపాధ్యాయుడిగా పనిచేశారు.

హైదరాబాద్‌లోని 'శ్రీకృష్ణదేవరాయ– ఆంధ్ర భాషా నిలయాన్ని 1901 సెప్టెంబర్ 1న స్థాపించారు. అందులో ఉన్న తెలుగు, సంస్కృత గ్రంథాలన్నీ వీరభద్రరావు క్షుణ్నంగా అధ్యయనం చేశారు. భాషా నిలయం గ్రంథ పాలకుడిగా కొంతకాలం పనిచేశారు.

కొమర్రాజు లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు స్థాపించిన 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' కార్యాలయాన్ని 1908లో హైదరాబాద్ నుంచి మద్రాసుకు మార్చారు. అప్పటి నుంచి 1914 వరకు మద్రాసులో విజ్ఞాన చంద్రికా గ్రంథం మండలిలో పనిచేశారు. తర్వాత హైదరాబాద్ తిరిగి వచ్చారు. ఇక్కడ మహబూబ్ కాలేజీ, చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వహించారు.

మాడపాటి హనుమంతరావు స్థాపించిన నారాయణగూడలోని ఆంధ్ర బాలిక పాఠశాలలో పదహారేళ్ల పనిచేశారు. 1948లో ఉద్యోగ విరమణ పొందారు.

హైదరాబాద్ 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం' కార్యదర్శిగా ఆయన నగరంలో తెలుగు భాషావృద్ధికి కృషి చేశారు. ప్రాచీనాంధ్ర చరిత్ర, శాసన పరిశోధన, ఆంధ్రనగర చరిత్ర, సాంస్కృతిక చరిత్ర ఆదిరాజు అభిమాన అంశాలు 1921లో ఆంధ్ర జన సంఘాన్ని స్థాపించారు. దానికి అనుబంధంగా 'ఆంధ్ర పరిశోధక మండలి'ని ప్రారంభించారు. తెలంగాణ సాహితీ సాంస్కృతిక వికాసానికి ఆ సంస్థ కృషి చేసింది. ఆంధ్ర పరిశోధక మండలికి వీరభద్రరావు మూలస్తంభం లాంటి వారు. కొమర్రాజు లక్ష్మణరావు మరణానంతరం 1931లో 'ఆంధ్ర పరిశోధక మండలి'ని లక్ష్మణరాయ పరిశోధక మండలి'గా మార్చారు.

మునగాల రాజా నాయిని వెంకటరంగారావు దీనికి అధ్యక్షులుగా, వీరభద్రరావు కార్యదర్శిగా పని చేశారు. తెలంగాణలోని శిలాశాసనాలను పరిశోధించడానికి శేషాద్రి రమణ కవులను మండలి పక్షాన నియమించారు. వారు వివిధ ప్రాంతాలను సందర్శించి, శిల్పాలు, శాసనాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు సేకరించారు. ప్రసిద్ధ చరిత్రకారులతో వ్యాఖ్యానాలు రాయించి, 129 శాసనాలతో ఒక సంపుటిని 'తెలంగాణ శాసనాలు' అనే పేరుతో 1935 లో ప్రచురించారు. ఇందులో కాకతీయుల నాటి 57 శాసనాలు, చాళుక్యుల కాలంనాటివి 42, ఇతర 24 శాసనాలున్నాయి. ఈ సంపుటి రూపకల్పనలో ఆదిరాజు వీరభద్రరావు కృషి ఎనలేనిది.

- 1960లో 85 శాసనాలతో రెండో సంపుటి ప్రచురితమైంది.
- 1910లో వీరభద్రరావు 'జీవిత చరితావళి' రచించారు.
- 1912లో 'దేశ భక్తుల జీవిత చరితావళి' ప్రచురించారు.

చారిత్రక గ్రంథాలు

'షితాబుఖాన్ (లేక) సీతాపతిరాజు చరిత్ర' ను లక్ష్మణరాయ పరిశోధక మండలి తరపున వీరభద్రరావు ప్రకటించారు. లక్ష్మణరాయ పరిశోధక మండలి సేకరించిన అనేక అముద్రిత తాళపత్ర గ్రంథాలను పరిశోధించి, గోల్కొండ, సుజాత, తెలంగాణ పత్రికలకు వ్యాసాలుగా రాశారు.

వీరభద్రరావు రాసిన 'ప్రాచీనాంధ్ర నగరాలు' ప్రసిద్ధ చారిత్రక గ్రంథం. ఇందులో అలంపురం, ఆనెగొంది, భువనగిరి, రాచకొండ, ఓరుగల్లు, కొలనుపాక, కళ్యాణి, కొండాపురం, గోల్కొండ, పానగల్లు, ప్రతిష్ఠానపురం, ఖమ్మం మెట్టు, వేల్పుకొండ నగరాల ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ గ్రంథాన్ని మునగాల రాజా నాయిని వెంకటరంగారావుకు అంకితమిచ్చారు. వీరభద్రరావు రాసిన 'మన తెలంగాణం' గ్రంథాన్ని దేశోద్ధారక గ్రంథ మండలి ప్రచురించింది. ఇందులో తెలంగాణలోని 9 జిల్లాల నైసర్గిక, చారిత్రక అంశాలను వివరించారు.

ఆయన రచించిన మరో గ్రంథం 'గ్రీకు పురాణ గాథలు' ఇందులో గ్రీకు, బాబిలోనియ, రోమ్ నగరాల పురాణ గాథల్ని అభివర్ణించారు.

వీరభద్రరావు లలిత కథావళి, రత్నప్రభ, నవ్వులు– పువ్వులు, భాగ్యనగరం, మిఠాయి చెట్టు వంటి ఎన్నో కథలు రాశారు. చరిత్ర, బాలుర కోసం బాల వాఙ్మయానికి కృషి చేశారు. వీటిని ఆంధ్ర సారస్వత పరిషత్తు (హైదరాబాద్) ప్రచురించింది

1946లో జరిగిన మాడపాటి హనుమంతరావు షష్టిపూర్తి సంచికను వీరభద్రరావు సంపాదకులుగా తీర్చిదిద్దారు. 'గోల్కొండ కవుల సంచిక ప్రచురణలో సురవరం ప్రతాపరెడ్డికి వీరభద్రరావు సహాయ సహకారాలు అందించారు.

నీలగిరి, సుజాత, గోల్కొండ , తెలంగాణ పత్రిక, భాగ్యనగర్, ఆంధ్రపత్రిక, ప్రగతి, కాకతీయ, తెలుగుదేశం, మీజాన్, పద్మశాలి మొదలైన పత్రికల్లో ఆదిరాజు వీరభద్రరావు ఎన్నో వ్యాసాలు, కథలు, రాశారు. వీటితో పాటు రేడియో ప్రసంగాలు చేశారు.

1972లో ఆదిరాజు వీరభద్రరావును కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో సన్మానించారు. 1973 అక్టోబర్‌లో ఆదిరాజు వీరభద్రరావు మరణించారు.

పండితుడు, పరిశోధకుడు, బహుభాషా కోవిదుడు, నిస్వార్థపరుడు, తెలుగు భాషా వాఙ్మయానికి, చరిత్రకు, సంస్కృతికి వీరభద్రరావు అందించిన సేవలు మరువలేనివి.

వెల్దుర్తి మాణిక్యరావు

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వెల్దుర్తి మాణిక్యరావు మెదక్ జిల్లాలోని వెల్దుర్తి గ్రామంలో 1913లో జన్మించారు. 1935 నుంచి 1948 వరకు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. పలుమార్లు జైలుకు వెళ్లారు. 1935లో 'ఆంధ్ర మహాసభకు' కార్యదర్శిగా పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'గోల్కొండ' పత్రికకు సహాయ సంపాదకుడిగా, 'మద్యపాన నిరోధం' తెలుగు మాసపత్రిక, 'టర్కి ముస్కిరాత్' ఉర్దూ మాస పత్రికకు సంపాదకులుగా పనిచేశారు.

నిజాం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజకీయ సంస్కరణల విషయంలో 'అరవముద అయ్యంగార్' కమిషన్ నివేదికను సవివరంగా వ్యాఖ్యానిస్తూ ఒక పుస్తకాన్ని వెల్దుర్తి మాణిక్యరావు, కె.సి.గుప్తా ఆధ్వర్యంలో 'అణా గ్రంథమాల' ప్రచురించింది. ఈ పుస్తకానికి మాడపాటి హనుమంతరావు పీఠిక రాశారు.

రాజకీయ సంస్కరణల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించడానికి, అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధానమంత్రి 'సర్ అక్బర్ హైదరీ' 1937లో అరవముద అయ్యంగార్ కమిషన్ నియమించారు. ఆ నివేదికను ముస్లింలు, హిందువులూ వ్యతిరేకించారు. వీరు రచించిన 'రైతు' అనే పుస్తకాన్ని నిజాం నవాబు నిషేధించాడు. 'మాణిక్యవీణ' పేరుతో వీరి కవితలను సంకలనం చేశారు. 'హైదరాబాద్ రాజ్యాంగ సంస్కరణలు, 'ఖాదీ' 'మాడపాటి వారి జీవితం', 'సర్దార్ జమలాపురం కేశవరావు – జ్ఞాపకాలు' నిరంతర కృషి, తదితర గ్రంథాలు రచించారు.

హైదరాబాద్ సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం అనే గ్రంథాన్ని ఆయన ఆంగ్లంలో రాశారు. ఈ గ్రంథాన్ని తెలుగులో 'జి. సురమౌళి'తో భారత ప్రభుత్వ పబ్లికేషన్స్ డివిజన్ 1992లో ప్రచురించింది. నిజాం వ్యతిరేక పోరాట ఘట్టాలను ఈ పుస్తకంలో మాణిక్యరావు విశదీకరించారు.

జాగీర్ల రద్దు రెగ్యులేషన్‌ను ఎప్పుడు ప్రకటించారు?

స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల మధ్య భౌగోళిక, పరిపాలనా వైరుధ్యాలు ఉన్నప్పటికీ రెండు ప్రాంతాల్లోనూ జమీందారీ, జాగీర్దారీ వ్యవస్థలు ఉన్నాయి. వాణిజ్య పంటల సాగు, నీటి పారుదల సౌకర్యాలు అధికంగా ఉండటం, నూతన ఉత్పాదక వస్తువులను వినియోగించడం, రవాణా,విద్య సౌకర్యాలు ఆంధ్ర ప్రాంతంలో అధికంగా కనిపించాయి. అక్కడ పెట్టుబడిదారీ విధాన దోపిడీ ఉంటే, తెలంగాణలో ఫ్యూడల్ విధాన దోపిడీ ఉండేది. ఈ విధంగా రెండు ప్రాంతాల్లోనూ రైతాంగం దోపిడీకి గురైంది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

భూ సంస్కరణలు-చరిత్రాత్మక పరిశీలన

వ్యవస్థాపూర్వక అవరోధాల కారణంగా తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధి సన్నగిల్లింది. అనుస్థాపిత భూస్వామ్య వ్యవస్థ రెండు ప్రాంతాల్లోనూ బలపడింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజల ఆర్థిక జీవనంలో మార్పులు తీసుకురావడానికి భూస్వామ్య వ్యవస్థలో, కౌలు విధానంలో మార్పులు అవసరమయ్యాయి. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కొన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో తిరుగుబాట్లు జరిగాయి. ఈ క్రమంలో భూసంస్కరణల చట్టాల ఆవశ్యకత ఏర్పడింది.

తెలంగాణ ప్రాంతంలో జాగీర్దారీ, ఇనాంల రద్దు

తెలంగాణలో కౌలుదార్లలో ఉన్న అశాంతిని తొలగించడానికి మేజర్ జనరల్ చౌదరి పరిపాలన అధికారాలు చేపట్టిన తర్వాత 'హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ' ఏర్పాటు చేశారు. వ్యవసాయరంగ స్థితి గతులను పరిశీలించిన కమిటీ భూసంస్కరణల చట్టాలను రూపొందించడానికి అవసరమైన సూచనలను 1949లో అందించింది. తర్వాత 1949 ఆగస్టు 15న హైదరాబాద్ జాగీర్ల రద్దు రెగ్యులేషన్ 1358 ఫసలీ చట్టాన్ని ప్రకటించారు. దీని ప్రకారం మొదట జాగీరు భూములను, అనంతరం సర్ఫేఖాస్ భూములను రైత్వారీ భూములుగా ప్రకటించారు. 1949 సెప్టెంబరు 14న మరో హైదరాబాద్ జాగీర్ రద్దు నిబంధనల చట్టాన్ని రూపొందించారు. మొత్తం 7866 గ్రామాల్లో ఫ్యూడల్ దోపిడీకి కారణమైన 975 జాగీర్దార్లను తొలగించి వ్యవసాయం చేసే రైతులకు యాజమాన్య హక్కులు కల్పించారు. దీంతో పాటు జాగీర్దారీ భూముల శిస్తులో 12.5 శాతం రాయితీ ఇచ్చారు. ఇనాం భూములను సాగు చేసే రైతాంగానికి లాభం చేకూర్చేలా ఇనాంలను రద్దు చేశారు. మొదటగా 1955లో హైదరాబాద్ ఇనాం భూముల రద్దు చట్టాన్ని రూపొందించారు. మత సంబంధిత చారిటబుల్ సంస్థల ఆధీనంలో ఉన్న ఇనాం భూములు మినహా మిగిలినవి రద్దవుతాయని ఈ చట్టంలో పేర్కొన్నారు. న్యాయ సంబంధ అడ్డంకుల కారణంగా వీటి అమలు సాధ్యం కాలేదు. కానీ ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 1967లో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతం) ఇనాంల రద్దు చట్టాన్ని అన్ని రకాలైన ఇనాం భూములకు వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు.

ఆంధ్ర ప్రాంతంలో మధ్యవర్తుల తొలగింపు

స్వాతంత్ర్యానికి పూర్వం 1938లో ప్రకాశం కమి టీ రిపోర్టు ఆధారంగా రూపొందించిన బిల్లును మద్రాస్ రాష్ట్ర అసెంబ్లీ చర్చించింది. జమీందారీ రద్దు కోసం, జమీందారీ ప్రాంతాల్లో భూమి శిస్తు



క్రమబద్ధీకరణ కోసం ఉద్దేశించిన రెండు బిల్లులను 1948లో శాసన సభలో ప్రవేశపెట్టారు. మద్రాస్ ఎస్టేట్ బిల్లు 1949 ఏప్రిల్ 19న శాసనసభ, 1950లో భారత రాష్ట్రపతి ఆమోదం పొంది చట్టంగా మారింది. దీని ప్రకారం పర్మినెంట్ సెటిల్‌మెంట్ ఎస్టేట్‌లు, గ్రామీణ భూములు, అడవులు, గనులు, ఖనిజాల భూములన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయి. ఈ చట్టం ద్వారా తొలగించిన జమీందారులకు నష్టపరిహారాన్ని పొందే హక్కు కల్పించారు. 1949 సెప్టెంబరు వరకు పెద్ద జమీందారీ ప్రాంతాలైన విజయ నగరం, వేంకటగిరి, పిఠాపురం, బొబ్బిలి, శివగంగ, రామినీడు ప్రాంతాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ చట్టం ఇనాం ఎస్టేట్‌లకు కూడా వర్తించేలా ఉన్నందువల్ల రాష్ట్రంలోని 7,423 ఇనాం గ్రామాల్లో 4,157 గ్రామాలకు ఈ చట్టాన్ని వర్తింపచేసింది. అనంతరం 3,300 ఇనాం ఎస్టేట్‌లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. 1956 చట్ట ప్రకారం ఖండిక ఇనాం ఎస్టేట్‌లు రద్దయ్యాయి. మొత్తం 11,126 ఇనాం ఎస్టేట్‌లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని 20.25 లక్షల రైతులకు యాజమాన్య హక్కులు కల్పించింది.

తెలంగాణలో కౌలుదారీ చట్టాలు

- రాష్ట్ర ప్రభుత్వం 1950 జూన్ 10న హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ సూచన అనుసరించి హైదరాబాద్ (తెలంగాణ ప్రాంతం)కౌలు వ్యవసాయ భూము ల చట్టాన్ని ప్రకటించింది. మత సంబంధ ఇనాం భూములకు తప్ప మిగిలిన భూములకు ఈ చట్టం వర్తిస్తుంది.
- 1949 నుంచి ఆరేళ్ల కౌలుదార్లుగా ఉన్న వారిని రక్షిత కౌలుదార్లుగా గుర్తిస్తారు.
- భవిష్యత్తులో (కొన్ని పరిమితుల్లో, మినహాయింపులతో) ఇతరులకు భూములను కౌలుకు ఇవ్వడాన్ని చట్టం వచ్చిన మూడేళ్ల తర్వాత నిషేధించారు.
- కౌలు సమయంలో కౌలుదారుడు భాటకాన్ని సక్రమంగా చెల్లిస్తున్నప్పుడు అతడిని కౌలు నుంచి తొలగించడానికి వీలు లేదు.
- కౌలుదారుడు తన ఇష్ట ప్రకారం తన హక్కులను భూస్వామిపరం చేయాలనుకుంటే నెల రోజుల ముందు రాత పూర్వకంగా తహసీల్దారు సమక్షంలో నోటీసు ఇవ్వాలి. ఈ విషయంలో తహసీల్దారు సంతృప్తి చెందితేనే చట్టరీత్యా చెల్లుతుంది.
- కౌలుకు తీసుకున్న భూమిని ఉప విభజన చేసినా లేదా ఆ భూమిని ఇతరులకు కౌలుకు ఇచ్చినా కౌలు ఒప్పందం రద్దవుతుంది.
- కౌలుదారుడు కౌలు భూమిని దుర్వినియోగం చేసినప్పుడు, భూమికి నష్టం కలిగించినప్పుడు, వ్యవసాయేతర కార్యకలాపాలకు వినియోగించుకున్నప్పుడు భూస్వామి తన భూమి స్వాధీనం చేసుకోవచ్చు.
- కౌలు పరిమాణం భూమి శిస్తు కంటే మెట్ట భూములకు 4 నుంచి 5 రెట్లు, మాగాణి భూములకు 3 నుంచి 4 రెట్లు వరకు ఉండొచ్చు.
- రక్షిత కౌలుదారుడు తాను సేద్యం చేస్తున్న భూమిని ప్రభుత్వానికి, భూ తనఖా బ్యాం కులకు, సహకార సంఘాలకు తనఖా పెట్టుకోవచ్చు.

ఆంధ్ర ప్రాంతంలో కౌలుదారీ చట్టాలు

- ఆంధ్ర ప్రాంతంలో 1949లో మద్రాస్ ప్రభుత్వం జారీచేసిన 'ఆంధ్ర ప్రాంత కౌలుదార్ల, రైతురక్షణ చట్టం'వల్ల కొన్ని వర్గాల కౌలుదార్లకు, రైతులకు తాత్కాలిక రక్షణ కల్పించారు.
- ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూసంస్కరణల కోసం లక్కరాజు సుబ్బారావు అధ్యక్షతన ఏర్పడిన కమిటీ భూ యాజమాన్య మార్పులను నిరోధించడం, కౌలు రక్షణ, కౌలు భూములకు కనిష్ట, గరిష్ట పరిమితులను నిర్దేశించడంపై అధ్యయనం చేసి 1955 అక్టోబర్ 30న కొన్ని సూచనలతో నివేదిక అందించింది. దీనికి అనుగుణంగా 1956 జూలైలో ఆంధ్ర వ్యవసాయ కౌలుదార్ల రక్షణ ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం జారీ చేసింది.
- ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలు చట్టాన్ని 1956లో ఏర్పాటు చేశారు. దీని ప్రకారం వివిధ రకాల భూముల కౌలు పరిమాణం స్థూల ఉత్పత్తిలో 28.3శాతం నుంచి 50శాతం వరకు ఉండొచ్చు.
- హైదరాబాద్ రాష్ట్రంలో కౌలు భూములను స్వాధీనం చేసుకోవడానికి వివిధ నిబంధనలు ఉంటే, ఆంధ్ర రాష్ట్రంలో నిర్దిష్టమైన నిబంధనలేవీ లేవు. సొంత వ్యవసాయ నిర్వచనం కట్టుదిట్టంగా లేకపోవడంతో కౌలు పరిమాణాన్ని ప్రణాళిక సంఘ సూచనలకు వ్యతిరేకంగా నిర్ణయించారు.
- 'ఆంధ్రరాష్ట్రంలో కౌలు చట్టాలు కౌలుదార్లకు రాయితీ హక్కులు కల్పించలేద'ని వావిలాల గోపాలకృష్ణయ్య వ్యాఖ్యానించారు.
- ఆంధ్రరాష్ట్రంలో కౌలుదారీ బిల్లును భూస్వాముల రక్షణ బిల్లుగా గుర్తించవచ్చని వి. కుమరయ్య వ్యాఖ్యానించారు.
- 'తెలంగాణ ప్రాంతంలోని రైత్వారీ, జాగీర్దారీ ప్రాంతాల్లో వేలకొద్దీ రక్షిత కౌలు దారులను వెళ్లగొట్టారని, ఇది జాగీర్దారీ ప్రాంతంలో అధికంగా ఉంది' అని ఖుస్రో అభిప్రాయపడ్డారు.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణలో పోలీసు చర్య తర్వాత ఎవరు పరిపాలన అధికారాలు చేపట్టారు?
ఎ) కారన్ వాలీస్
బి) మేజర్ జనరల్ చౌదరి
సి) కొండా రంగారెడ్డి
డి) కొండా లక్ష్మణ్ బాపూజీ
2. హైదరాబాద్ (తెలంగాణ ప్రాంతం) కౌలువ్యవసాయ భూముల చట్టాన్ని ఎప్పుడు చేశారు?
ఎ) 1949 జూన్ 5 బి) 1949 జూన్ 8
సి) 1950 జూన్ 10 డి) 1951 జూన్ 10
3. హైదరాబాద్ (తెలంగాణ ప్రాంతం) కౌలు వ్యవసాయ భూముల చట్టం - 1950ను ఏ కమిటీ సూచనల ఆధారంగా ఏర్పాటు చేశారు?
ఎ) హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ
బి) హైదరాబాద్ కౌలుదార్ల పరిరక్షణ కమిటీ
సి) హైదరాబాద్ భూగరిష్ఠ పరిమితి కమిటీ
డి) పైవేవీ కావు
4. హైదరాబాద్ జాగీర్ల రద్దు రెగ్యులేషన్‌ను ఎప్పుడు ప్రకటించారు?
ఎ)1947 ఆగస్టు 15 బి)1948 ఆగస్టు 15
సి)1949 ఆగస్టు 15 డి)1950 ఆగస్టు 15
5. హైదరాబాద్ జాగీర్ రద్దు నిబంధన చట్టాన్ని రూపొందించినది?
ఎ) 1949 సెప్టెంబర్ 14
బి) 1949 సెప్టెంబర్ 30
సి) 1950 సెప్టెంబర్ 30
డి) 1955 సెప్టెంబర్ 30
6. మద్రాస్ ఎస్టేట్ బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది, చట్టంగా ఎప్పుడు రూపొందింది?
ఎ) 1949 బి) 1950
సి) 1951 డి) 1952
7. ఇనాంల రద్దు చట్టాన్ని అన్ని రకాలైన ఇనాం భూములకు వర్తింపజేస్తున్నట్లు ఎప్పుడు ప్రకటించారు?
ఎ) 1966 బి) 1965
సి) 1967 డి) 1957
8. ఆంధ్ర ప్రాంత కౌలుదార్ల, రైతురక్షణ చట్టాన్ని మద్రాస్ ప్రభుత్వం ఏ సంవత్సరంలో జారీ చేసింది?
ఎ) 1949 బి) 1950
సి) 1952 డి) 1953
9. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత భూసంస్కరణల కోసం ఏర్పాటైన కమిటీకి అధ్యక్షుడు ఎవరు?
ఎ) ప్రకాశం పంతులు
బి) లక్కరాజు సుబ్బారావు
సి) నీలం సంజీవరెడ్డి
డి) దామోదరం సంజీవయ్య
10. ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలు చట్టం తీసుకొచ్చిన సంవత్సరం?
ఎ) 1953 బి) 1954
సి) 1955 డి) 1956
11. హైదరాబాద్ కౌలు వ్యవసాయ భూముల చట్టం ప్రకారం మెట్ట భూములకు సంబంధించి కౌలు పరిమాణం భూమి రెవెన్యూ కంటే ఎన్ని రెట్లు ఉండొచ్చు?
ఎ) 2 రెట్లు బి) 3 రెట్లు
సి) 3.5 రెట్లు డి) 4 నుంచి 5 రెట్లు
12. ఎవరి అభిప్రాయంలో తెలంగాణ ప్రాంతంలోని రైత్వారీ ప్రాంతంతో పోల్చినపుడు జాగీర్దారీ ప్రాంతంలో అధికంగా రక్షిత కౌలుదార్లను వెళ్లగొట్టారు?
ఎ) ఖుస్రో బి) గున్నార్ మిర్డల్
సి) ఆర్థర్ కాటన్
డి) థామస్ మన్రో
13. ఆంధ్ర రాష్ట్రంలో కౌలు చట్టాలు కౌలుదారులకు రాయితీ హక్కులు కల్పించలేదని ఎవరు వ్యాఖ్యానించారు?
ఎ) గున్నార్ మిర్డల్
బి) వావిలాల గోపాలకృష్ణయ్య
సి) బెజవాడ గోపాలరెడ్డి
డి) వి. కుమరయ్య
14. ఆంధ్ర రాష్ట్రంలో కౌలుదారీ బిల్లును భూస్వాముల రక్షణ బిల్లుగా గుర్తించవచ్చని వ్యాఖ్యానించినది?
ఎ) వి. కుమరయ్య
బి) దామోదరం సంజీవయ్య
సి) ఆనం సుబ్బారెడ్డి
డి) ప్రకాశం పంతులు
15. అఖిల భారత కిసాన్ సభను 1936లో ఏ కాంగ్రెస్ మహాసభలో ఏర్పాటు చేశారు?
ఎ) కాన్పూర్ బి) లక్నో
సి) మద్రాస్ డి) హైదరాబాద్
16. 1920లో ఎవరికి వ్యతిరేకంగా ముస్లిం రైతులు పోరాటం చేశారు?
ఎ) చల్లపల్లి జమీందారు
బి) పిఠాపురం జమీందారు
సి) విసునూరు దేశ్‌ముఖ్
డి) గద్వాల దివాని
17. జాగీర్దార్లకు, దేశ్‌ముఖ్‌లకు, నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్వహించాలని 1945లో వామపక్షవాదులు ఏ మహాసభలో తీర్మానించారు?
ఎ) నల్గొండ బి) ఖమ్మం
సి) వరంగల్ డి) ఆదిలాబాద్

సమాధానాలు

1) బి; 2) సి; 3) ఎ; 4) సి; 5) ఎ; 6) బి; 7) సి; 8) ఎ; 9) బి; 10) డి; 11) డి; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) బి; 16) సి; 17) బి.

The Super Computer developed in India?

Model Questions

1. A ______ is approximately a million bytes.
a) Giga byte b) Kilo byte
c) Mega byte d) Tera byte
e) None of these
2. If you want to extend the length of the network without having the signal degrade, you would use a:
a) repeater b) router
c) gateway d) switch
e) None of these
3. What do you press to enter the current date in a cell?
a) CTRL + ; (semicolon)
b) CTRL + SHIFT + : (colon)
c) CTRL + F10
d) CTRL + F11
e) None of these
4. To make the number pad act as directional arrows, you press the ____ key.
a) Num lock b) Caps lock
c) Arrows lock d) Shift
e) Control
5. Press ____ to move the insertion point to the Address box, or to highlight the URL in the Address box.
a) ALT + D b) ALT + A
c) SHIFT + TAB
d) TAB + CTRL e) None
6. To move to the bottom of a document, press ____
a) Insert key b) Home key
c) CTRL + End key
d) End key e) None of these
7. Transmitting data in the form of light is called
a) Light Transmitter
b) Fiber glass c) LTP
d) All of the above
e) None of the Above
8. ___ is the memory card which is conceptually related to the smart card but similar to video desk?
a) Debit card b) Master card
c) Laser card d) Credit card
e) None of the Above
9. Maximum Storage capacity of a DVD is _____
a) 17 GB b) 15 GB c) 16 GB
d) 10 GB e) None of the Above
10. Which of the following operating system uses first 64 bit technology?
a) MS-DOS b) Windows XP
c) Mac OS d) Linux
e) None of the Above
11. A processing unit that coordinates networks and data communication is known as:
a) Control unitb) CPU
c) Communications Processor
d) Data Coordinator
e) None of the Above
12. Two or more computers connected to each other for sharing information form a:
a) network b) router
c) server d) tunnel
e) pipeline
13. If a computer provides database services to other, then it will be known as:
a) Web server
b) Application server
c) Database server
d) FTP server e) None of these
14. Technology used to provide internet by transmitting data over wires of telephone network is __
a) Transmitter b) Diodes
c) HHL d) DSL
e) None of these
15. Documents, Movies, Images and Photographs etc are stored at a:
a) Application Sever
b) Web Sever c) Print Server
d) File Server e) None of these
16. RAM consists of which of the following?
a) Conductor b) Semi Conductor
c) Vaccum Tubes
d) Transistor e) None of these
17. Who is the father of Internet?
a) Charles Babbage
b) Vint Cerf c) Denis Riche
d) Martin Cooper
e) None of these
18. ______is process of Verification?
a) Access b) Login c) Logout
d) Authentication
e) None of these
19. Identify the odd one from the following?
a) CD/DVD b) Floopy Disks
c) SD Disk d) BIOS
e) None of these



20. USB is which type of storage device?
a) Primay b) Secondary
c) Tertiary d) All the above
e) None of these
21. Which program is run by BIOS to check hardware components are working properly while computer is turned ON?
a) DMOS b) POS c) CMOS
d) RIP e) None of these
22. To identification particular location in storage area one have a:
a) Address b) Password
c) Logic d) Mouse
e) None of these
23. The following computer's memory is characterized by low cost per bit stored:
a) Primary b) Secondary
c) Hard disk d) All of the above
e) None of these
24. The following is true for Auxiliary Storage:
a) It has an operating speed far slower than that of the primary storage.
b) It has an operating speed faster than that of the primary storage.
c) It has an operating speed equivalent than that of the primary storage.
d) All of the above
e) None of these
25. ALGOL is the ____ language
a) High-level
b) Low level c) Machine
d) All of the above
e) None of these

BANK EXAMS

Computer Knowledge

26. Which of the following is a logic circuit capable of forming the sum of two or more quantities?
a) Adder b) Multiplier
c) Address d) Access
e) None of these
27. Which of the following will not cut information?
a) Pressing Ctrl + C
b) Selecting Edit > Cut from the menu
c) Clicking the Cut button on the standard
d) Pressing Ctrl+X
e) None of these
28. MPG is a file extension of which type of files?
a) Audio b) Image
c) Video d) Flash
e) None of these
29. What is the full form of EXIF?
a) Exchangeable Image Fine Finish
b) Exchangeable Image File Format
c) Executable Image File Format
d) Executable Image File Finish
e) None of these
30. Which of the following can't spread virus?
a) An e-mail with attachment
b) A plain text mail
c) Downloading files over the web
d) All of the above
e) None of these
31. There is a new anti-virus software update available, when it is downloaded to your computer __
a) Everyday
b) Only in the night
c) When you next switch on your computer
d) All of the above
e) None of these
32. Numbers are stored and transmitted inside a computer in ___
a) Binary form
b) ASCII code form
c) Alphabets form
d) Numerical form
e) None of these
33. CPU capacity can be measured in
a) BPS b) MIPS
c) MHz d) MPI
e) None of these
34. "Zipping" a file means:
a) Encrypting the message
b) Compressing the message
c) Transfer the message
d) All of the above
e) None of these
35. What is the Super Computer developed in India?
a) CRAY b) PARAM
c) CRAM d) Both a and b
e) None of the above
36. Difference Engine invented by:
a) Charles Babbage
b) John McCarthy
c) Pascal d) Newton
e) None of these
37. Doing research by using an online database instead of a printed set of similar information offers which of the following advantage
a) More current information
b) Easier to understand
c) Better charts
d) All of the above
e) None of these

Answers

1) c;	2) a;	3) a;	4) a;	5) a;
6) c;	7) b;	8) c;	9) a;	10) d;
11) c;	12) a;	13) c;	14) d;	15) d;
16) b;	17) b;	18) d;	19) d;	20) c;
21) b;	22) a;	23) b;	24) a;	25) a;
26) a;	27) a;	28) c;	29) b;	30) b;
31) c;	32) b;	33) b;	34) b;	35) b;
36) a;	37) a.			

విద్య, ఉద్యోగ సమాచారం

కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్)-2025 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఏదైనా విభాగంలో డిగ్రీ.
- **పరీక్ష విధానం:** మొత్తం 100 ప్రశ్నలకు 400 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు ఉంటాయి. ఒక్కో సెక్షన్ నుంచి 20 చొప్పున ఐదు విభాగాల్లో ప్రశ్నలు ఉంటాయి. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్, లాంగ్వేజ్ కాంప్రెహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగిటివ్ మార్కులు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి ఒక్కో మార్కు చొప్పున తగ్గిస్తారు. ప్రశ్నాపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు చెల్లింపుకు చివరితేది:** 14.12.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 15.12.2024 నుంచి 17.12.2024 వరకు
- **పరీక్ష కేంద్రం వివరాలు ప్రకటన తేది:** 17.01.2025.
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రారంభం:** 20.01.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.12.2024.
- **పరీక్షతేది:** 25.01.2025.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్
- » **వెబ్‌సైట్:** exams.nta.ac.in/CMAT/

